Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com Journalism first!

సంపుటి: 56 • సంచిక: 119 • బుధవారం 9 ఆగస్టు 2017 • హైదరాబాద్ ✻ పేజీలు: 12+4 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం | శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: బహుళ విదియ రా. 11.52 వరకు; అనంతరం తదియ; నక్షత్రం: శతభిషం (పూర్తి); అమృతకాలం: రా. 10.40 నుండి 12.15 వరకు; వర్జ్యం: మ. 12.42 నుండి 2.21 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11.42 నుండి 12.33 వరకు; రాహుకాలం: మ. 12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ. 7.30 నుండి 9.00 వరకు

15 టీఎంసీల నీళ్లివ్వండి

కర్ణాటక ప్రభుత్వానికి మంత్రి హరీష్ రావు లేఖ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణలో తాగునీటి అవసరాలకోసం 15టీఎంసీల కృష్ణానదీ జలాలను అందచేయాలని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు కర్నాటక ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తాగునీటి అవసరాలను వివరిస్తూ కర్ణాటక రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎం.బి.పాటిల్‌కు మంత్రి హరీష్ రావు మంగళవారం నాడు లేఖ రాశారు. రాష్ట్రంలో ప్రత్యేకించి హైదరాబాద్, సికిందరాబాద్ జంట నగరాల్లో తాగునీటి సమస్య ఏర్పడుతోందని, నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య కూడా ఉందని లేఖలో వివరించారు. పుట్లంగండి ద్వారా నాగార్జున సాగర్ నుంచి తాగునీటి అవరాలు తీర్చుకుంటున్నామని తెలిపారు. సాగర్‌లో కనిష్ట నీటిమట్టం 510 అడుగులు ఉండాలని అయితే ఇప్పటికే నీట మట్టం 500అడుగులకు తరిగిపోయి నట్టు తెలిపారు. ఈ పరిస్థితుల్లో తాగునీటి అవసరాలు తీర్చుకునేందుకు నారాయణపూర్ జలాశయం నుంచి 15 టీఎంసీల నీటిని విడుదల చేయాలని మంత్రి హరీష్ లేఖలో పేర్కొన్నారు.



3

కేసీఆర్ బాటలో మోడీ..!

ముస్లిం యువతుల కోసం షాదీ షగున్ పథకం



6=2

మొక్కలు పెంచితే పాడి గేదెలు

జనవరిలో రెవెన్యూ అధికారులు ఇంటింటికీ వచ్చి మొక్కల సర్వే చేపడతారు. 6 మొక్కలు పెంచిన వారిని గుర్తించి ఆ కుటుంబానికి రెండు పాడి గేదెలను అందిస్తాం.
- సీఎం కేసీఆర్



మూడు చింతలపల్లిలో మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్

రైతులు బాగుపడేందుకు నీరు, విద్యుత్, పెట్టుబడి అందిస్తే అన్నదాతలు లక్షాధికారులు అవుతారు.
- సీఎం కేసీఆర్

రైతులందరికీ రూ. 4వేల పెట్టుబడి పథకం

ఎకరాలతో పనిలేదు

భూ రికార్డుల క్రమబద్ధీకరణకు ప్రత్యేక డ్రైవ్

ఆర్డీవోల నుండి తహసీల్దార్‌కు మ్యుటేషన్ బాధ్యతలు

రైతు ఇంటికే నేరుగా పాస్ పుస్తకాలు

మూడుచింతలపల్లి గ్రామసభలో సీఎం కేసీఆర్

మేడ్చల్, కెఎన్ఎన్: రైతులు బాగు పడేందుకు నీరు, విద్యుత్, పెట్టుబడి అందిస్తే రైతులు లక్షాధికారులు అవుతారని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట మండలంలోని మూడుచింతలపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 90 శాతం చిన్న, సన్నకారు రైతులున్నారని, పెట్టబడి పథకం అందరికి వర్తిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం 21.7 శాతం వృద్ధి లో భారతదేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉన్నామని తెలుపుతూ, సమైఖ్యరాష్ట్రంలో దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో రైతులు పంటలు వేసుకునేందుకు పెట్టుబడి కోసం ➪ 9వ పేజీలో...

• వాళ్లు టూరిస్టులు... నేను లోకల్

నేరెళ్ల బాధితులకు అండగా ఉంటాం

దళిత కోణం లేదు... ఇసుక మాఫియా లేదు: కేటీఆర్

2 లో



వేములవాడ ఆస్పత్రిలో నేరెళ్ల బాధితులను పరామర్శిస్తున్న మంత్రి కేటీఆర్

ఎస్పీ సహా పోలీస్ అధికారులపై అట్రాసిటీ కేసు

నేరెళ్ల ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు • ఎస్సీ కమిషన్‌కూ పిటిషన్

2 లో

ఎన్నికల సంస్కరణలు అవసరం: వెంకయ్య



వెంకయ్య నాయుడు ఉపన్యాసాలు, పార్లమెంట్‌లో ప్రసంగాలు, రచనల సంకలనంతో అలుపెరగని గళం... విరామమెరుగని పయనం ఎమ్మెస్కో ప్రచురించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు. చిత్రంలో తెలంగాణ, ఏపీ స్పీకర్లు మధుసూదనాచారి, కోడెల శివప్రసాద్, బీజేపీ అధ్యక్షుడు డా॥ కె. లక్ష్మణ్ తదితరులు

2 లో



11

రాహుల్‌జీ... విదేశీ టూర్ల రహస్యమేంటి?

"గత రెండేళ్లలో రాహుల్‌గాంధీ 72 రోజుల పాటు ఆరు సార్లు విదేశీ పర్యటనలకు వెళ్లొచ్చారు. ఆయన విదేశాలకు వెళ్లినప్పుడల్లా ఎస్పీజీ సెక్యూరిటీ తీసుకోవడం లేదు. అసలు ఆయన ఎక్కడికి వెళుతున్నారు? ఎందుకని సెక్యూరిటీని వెంట తీసుకెళ్లడం లేదు..మేం తెలుసుకోవాలనుకుంటున్నాం. రాహుల్‌గాంధీ ఏదో దాస్తున్నారు? ఎందుకలా? ఎస్పీజీ సెక్యూరిటీ హోదా ఉన్నా ఎందుకని వాడుకోవడం లేదో ఆయనే చెప్పాలి."
- లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్



11

రెండురకాల నోట్లా... ఈ శతాబ్దపు స్కామ్!

"రెండు రకాల 500 రూపాయల నోట్లు ఎలా ప్రింట్ చేస్తారు? రెండు సైజులు, రెండు డిజైన్లు.. ఇది ఎలా సాధ్యం? ఇందులో ఏదో మతలబు ఉంది. ఈ శతాబ్దంలోనే ఇది అతిపెద్ద స్కాం. మేం అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ ఇలా రెండు రకాల కరెన్సీ నోట్లు ప్రింట్ చేయలేదు. ఒకటి పార్టీ కోసం..ఇంకొకటి ప్రభుత్వం కోసమా? రెండు రకాల ఐదొందల రూపాయల నోట్లు..అలాగే రెండు రకాల రెండు వేల రూపాయల నోట్లు ఆర్బీఐ ఎందుకు ప్రింట్ చేయాల్సి వచ్చింది?"
- రాజ్యసభలో కపిల్ సిబాల్, గులాం నబీ ఆజాద్

చైనాలో భూకంపం

వందమందికి పైగా మృత్యువాత

భారీగా ఆస్తి నష్టం

కొనసాగుతున్న సహాయక చర్యలు

9



డోక్లాం నుంచి సముద్రం వైపు...

చైనా కొత్త వ్యూహం!

మోడీ లక్ష్యంగా విమర్శల దాడి • సముద్రంపై ఆధిపత్యానికి తంటాలు

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

చైనా వ్యూహం మార్చిందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇప్పుడు చైనా నేరుగా భారత్‌పై యుద్ధానికి దూసుకొచ్చే పరిస్థితుల్లేవు. కానీ ప్రస్తుత పరిణామాల్ని తనకు అనుకూలంగా మలచుకుని అంతర్జాతీయంగా భారత్‌ను ఇరుకునపెట్టాలన్న వ్యూహంతో చైనా ముందుకెళ్తున్నట్లు భావిస్తున్నారు. మొన్నటి వరకు డోక్లాం వివాదానికి అజిత్ దోవల్ కారణమంటూ దుమ్మెత్తి పోసిన చైనా అధికార పత్రిక గ్లోబల్‌టైమ్స్ ఇప్పుడు మోడీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తోంది. గతంలో నెహ్రూ కూడా ఇలాగే తమ సామర్థ్యాన్ని, సైనిక పాటవాన్ని తక్కువగా అంచనాలేసి భంగపడ్డారంటూ గ్లోబల్‌టైమ్స్ పేర్కొంది. తిరిగి అలాంటి పొరపాటునే ఇప్పుడు మోడీ చేస్తున్నారంటూ మండిపడింది. తద్వారా అంతర్జాతీయ సమాజంలో భారత్ తప్పు ఎత్తిచూపే ప్రయత్నాలకు చైనా తెరదీసింది. తాము ఎంతగా శాంతిసంయమనాల్ని పాటిస్తున్నా భారత్ కలసిరావడం లేదంటూ ప్రపంచం గుర్తించాలన్న తహతహ చైనా వాదనలో వ్యక్తమౌతోంది. ఓ వైపు భూటాన్‌పై పెత్తనం సాగించేందుకు వీలుగా రోడ్డు నిర్మాణాన్ని ప్రతిపాదించిన చైనా.. భూటాన్ భారత్ సాయాన్ని కోరుతుందన్న అంచనాలకు రాలేకపోయింది. నేపాల్‌లో పరోక్షంగా ప్రభుత్వాన్ని తన అధీనంలో పెట్టుకున్న చైనా.. భూటాన్‌ను కూడా తన అదుపాజ్ఞల్లోకి తెచ్చుకుంటే ఈ



సముద్రం మధ్యలో చైనా నిర్మిస్తున్న ఐస్‌ల్యాండ్

ప్రాంతం మొత్తం చైనా గుప్పెట్లో ఉంటుంది. అసలే భూటాన్‌పై ఆ దేశం దశాబ్దాల తరబడి రగిలిపోతోంది.

ఇదిలా ఉంటే ఈ ప్రాంతంలో పట్టుకోసం చైనా చేస్తున్న ప్రయత్నాల వెనుక సముద్రంలోని అపార సంపదను తనపరం చేసుకోవాలన్న లక్ష్యం కూడా ఉన్నట్లు అమెరికా భావిస్తోంది. ఇప్పటికే ➪ 3వ పేజీలో...

నిరుద్యోగులకు శుభవార్త

వయోపరిమితి 44 ఏళ్లకు పెంపు..!

మాట నిలబెట్టుకున్న కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పరాయి పాలనలో స్వరాష్ట్రం కోసం ఉద్యమించిన నిరుద్యోగులకిచ్చిన హామీని సీఎం కేసీఆర్ ఆచరణలో నిలుపుకున్నారు. స్వరాష్ట్రంలో నిరుద్యోగులకు తీపి కబుర్లు ఉంటాయన్న హామీ మేరకు నోటిఫికేషన్లు జారీ చేస్తున్న ప్రభుత్వం అందుకు తగినట్లుగానే నిరుద్యోగులకు మరో వరాన్ని ప్రకటించింది. ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు, నిర్లక్ష్యాలకు గురై ఉద్యోగాలు దొరకబుచ్చుకోలేక నిరాశ, నిస్పృహలకు లోనైన యువతకు ఆశలను మరింత చిగురింపజేశారు ముఖ్యమంత్రి కేసీఆర్. 16ఏళ్ల సుధీర్ఘ తెలంగాణ ఉద్యమంలో చదువులు, ఉద్యోగ ప్రయత్నాలకు విరామమిచ్చి, రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన నిరుద్యోగుల త్యాగాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి నిరుద్యోగుల వయో పరిమితిని పెంచుతూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఈ కీలక నిర్ణయాన్ని ➪ 9వ పేజీలో...



గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో హైడ్రామా

అర్ధరాత్రి వరకు ఓట్ల లెక్కింపుపై ఉత్కంఠ



11

ఈసీకి కాంగ్రెస్, బీజేపీ పరస్పర ఫిర్యాదులు

ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లు చెల్లవు: ఈసీ

అమిత్ షా, స్మృతి ఇరానీ సునాయాస విజయం

గోదావరికి ప్రాణప్రతిష్ట



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నాడు మహర్షులు ఏళ్లతరబడి తపస్సుల ద్వారా సాధించిన మంత్ర శక్తులతో గంగను దివినుంచి భువికి దింపుకొచ్చారు. నేడు కేసీఆర్ ప్రభుత్వం యంత్రశక్తులద్వారా దిగువ నున్న నదీజలాలను ఎగువకు పంపు..తోంది. తెలంగాణ రాష్ట్ర ముఖద్వారంలో ఏళ్లతరబడి ఏవిధమైన నీటి ప్రవాహాలు లేకుండా నిర్జీవంగా మారుతున్న గోదావరి నదికి ప్రాణప్రతిష్టద్వారా పునర్జీవితాన్ని ఇవ్వాలని తలపెట్టారు. ఎపుడు ఒట్టిపోయి ఉత్సవ విగ్రహాన్ని తలపిస్తుండే శ్రీరాంసాగర్ బహుళార్ధసాధక ప్రాజెక్టుకు పూర్వవైభవాన్ని తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. నడుస్తున్న రాజకీయ వ్యవస్థలో మాటల మాంత్రికుడే కాదు పరిపాలనావ్యవస్థలో వ్యూహాల తాంత్రికుడుగా పిలిపించుకునే ముఖ్యమంత్రి కేసీఆర్ గోదావరి జలాల పట్ల మారాఠీలతో ఎంతో సఖ్యతను కనబరుస్తూనే అంతర్ రాష్ట్ర జలవివాల పరిష్కారంలో మరింత లౌక్యతను చాటుకుంటున్నారు. రాష్ట్రం ఏర్పడకముందు ఆంధ్రాపాలకులు తెలంగాణా ప్రాంత నీటిపారుదల రంగానికి చేసిన అన్యాయాలను సరిదిద్దే ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే రెండు వేలకోట్ల రూపాయల వ్యయంతో శ్రీరాంసాగర్ పునర్జీవన పథకానికి శ్రీకారం చుడుతున్నారు. గురువారం పోచంపాడు వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రత్యేక పథకానికి శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తోంది. పోచంపాడు ప్రాజెక్టు వచ్చిందన్న మాటె కాని ఏటేటా కుంచించుకుపోతున్న లక్ష్యాలతో ఆయకట్టు రైతులు కన్నీళ్లమాటును కష్టాలను అణచిపెట్టుకుంటూ వస్తున్నారు . టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పునర్జీవ పథకంతో ఈ ప్రాజెక్టు పరిధిలోని లక్షలాది మంది రైతుల మోడు వారిన జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసరించనున్నాయి. ఈ పథకం పనులు పూర్తయితే 15లక్షల ఎకరాలు రెండు కార్ల పంటలతో రైతుల ఇంట ధాన్యపు రాసులు కురిపించనున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల స్వరూపమే మారిపోనుంది. 1963లో నాటి తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చేతుల మీదుగా పొచంపాడు వద్ద గోదావరి నదిపై ఈ ప్రాజెక్టుకు పునాదిరాయి పడింది. మహారాష్ట్రలో పైధాన్ (జైక్వాడ్)డ్యాంకు దిగువన లభించే 200టీఎంసీల గోదావరి జలాలను ఉపయోగించుకుని 15.68లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం శ్రీరాంసాగర్ ప్రాజెక్టును నిర్మించింది. గరిష్టంగా 112టీఎంసీల నీటి నిలువ సామర్ధ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు నుంచి ఒకవైపున లక్ష్మీకెనాల్ , ఫ్లడ్‌ఫ్లో కెనాల్, కాకతీయ కెనాల్ , మరోవైపున సరస్వతి కెనాల్ ద్వారా నిజామాబాద్ ,కరీంనగర్ , అదిలాబాద్ , వరంగల్ తదితర జిల్లాల్లో 15.68లక్షల ఎకరాలకు సాగునీ రందించాల్సి ఉంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి నాలుగు దశాబ్దాలు గడిచిపోయినా ఏ ఒక్క సంవత్సరం కూడా పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరిందిన దాఖలాలు లేవు. ఎగువనుంచి వస్తున్న ఒండ్రు ఇసుకతో ప్రాజెక్టులో నీటి నిలువ సామర్ధ్యంలో 22టీ ఎంసీలకు మేరకు పూడిక పడిపోయింది. ఎగవ నుంచి గోదావరి జలాల రాకకూడా ఏటేటా తగ్గుతూ వ స్తోంది. శ్రీరాంసాగర్ కింద ఐదారు లక్షల ఎకరా లకు మించి సాగునీరు అందే పరిస్థితి లేకుండా పోయింది.

మాటతప్పిన మరాఠీలు!

గోదావరి జిలాల వినియోగంపై చేసుకున్న అంతర్‌రాష్ట్ర ఒప్పందాలపై మరాఠా సర్కారు మాట తప్పింది. బాబ్లీ మొదులుకుని ఎగువన లెక్కలేనన్ని బ్యారేజీలు , ఎత్తిపోతల పథకాలను అక్రమంగా నిర్మించుకుంది. 1976 అక్టోబర్ 6న గోదావరి నదీ జలాల వినియోగంపై అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంగళరావుకు మాహరాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్.బి.చవాన్‌కు ఒప్పందం కుదిరింది. హైదరాబాద్ వేదికగా జిరిగిన ఈ ఒప్పందాన్ని పరిశీలిస్తే గోదావరి నదిపై 262కి.మీ వద్ద ఉన్న పైధాన్‌డ్యాం, పూర్ణనదిపై సిద్దేశ్వరం డ్యాం, మంజీరా నదిపై ఉన్న నిజాంసాగర్ డ్యాం, ఈ మూడింటికి దిగువన గోదావరి నదిపై 764కి.మీ వద్ద శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరకూ ఉన్న నదీవిభాగాల, గతంలో మంజూరైన వాటికి నీటి పరివాణం కంటే 60 టీఎంసీలకు మించకుండా అదనంగా నీటిని మహారాష్ట్ర ప్రాజెక్టులకు, ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రాజెక్టులకు వినియోగించుకొవచ్చని ఆనాటి ఒప్పందంలో పేర్కొన్నారు.

ఒప్పందం ప్రాకారం అప్పటికే మహారాష్ట్రలో 11ప్రాజెక్టులు నిర్మించుకుని మారా ఠాలు 60టీఎంసీల నీటిని ఉపయోగిం చుకుం టున్నారు. ఆతరువాత బాబ్లీ ప్రాజెక్టును కూడా శ్రీరాం సాగర్ జలాశయ గర్భంలో నిర్మిచి తెలగాణ నోట మట్టి కొట్టారు. అదనంగా 60టీ ఎసీలకు ఒప్పదం అని మాటమార్చారు.2010జులై 20న చంద్రబాబు సారద్యంలో తెలుగు దేశం పార్టీ ఎమ్మె ల్యే లు ఇతర నేతల బృదం బాబ్లీ పోరుబాటలో భాగంగా మహారాష్ట్ర వెళ్లింది. మరాఠా సర్కారు మహాకిరాతకంగా వ్యవహరించి చంద్ర బాబుతో పాటు ఎర్రబెల్లి దయాకర్,గంగుల కమ లాకర్ కందు ల నారాయణరెడ్డి తదితులను లాఠీలతో చితకబాదింది.

ఈ ఘటనతో మహారాష్ట్ర వైఖరిపై తెలం గాణ , ఆంధ్రా , రాయలసీమ ప్రాంతా ల్లో పెద్ద ఎత్తున నిరశనలు వ్యక్తమయ్యాయి. చివరకూ సుప్రీ కోర్టు సైతం బాబ్లీ ప్రాజె క్టు నిర్మాణం శ్రీరాం సాగర్ జలాశయం గర్బంలోనే ఉందని నిర్ధా రించింది. ఇపుడు ఈ నిర్మాణం తొలగించాలని చెప్పలే మంటూ చేతులెత్తేసింది. మద్యే మార్గంగా ప్రతియేటా జులై1నుంచి అక్టోబర్ 28 మద్యలో బాబ్లీగేట్లు తెరిచి ఉంచాలని ఆదేశాలిచ్చింది.

కేసీఆర్ భగీరథయత్నం!

మహారాష్ట్ర దురాగతాల గతాన్ని తవ్వకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ అంతర్ రాష్ట్ర ప్రాజెక్టుల వ్యవహారంలో ఎంతో లౌక్యంగా వ్యవహరిస్తు వస్తున్నారు. లెండి, పెన్‌గంగ, ఇచ్చంపల్లి, ప్రాణహిత-చేవెళ్ల వంటి పథకాలకు మహారాష్ట్ర సర్కారు సహకారం అవసరం అని భావించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరాష్ట్రం పట్ల సఖ్యత పాటిస్తున్నారు.

ఇక ఎగువనుంచి గోదావరి నదీజలాలపై పెద్దగా ఆశలు పెట్టుకోకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకాల ద్వారా దశలవారీగా గోదావరి జలాలను శ్రీరాంసాగర్ జలాశయాలోకి ఎత్తిపోసి ఈ ప్రాజెక్టుకు పునర్జీవాన్ని ప్రసాదించ బోతున్నారు. ఉత్తర తెలంగాణ వ్యవ సాయ రంగానికి కొత్త ఊపిరులూదబోతున్నారు.

రైతుల కన్నీళ్లు తుడవడానికే ప్రాజెక్టులు



నిజామాబాద్, కెఎన్ఎన్ బ్యూరో: తెలంగాణలోని రైతుల కన్నీళ్లు తుడవడానికే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నారని రాష్ట్ర మంత్రులు ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస్ రెడ్డిలు స్పష్టం చేశారు. ఈ నెల 10న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్న ఎస్సారెస్పీ పునరుజ్జీవన కార్యక్రమాన్ని ఉద్దేశించిన మంగళవారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో పంట పొలాలకు నీరు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకోవడానికి కారణం కేవలం గత ప్రభుత్వాలేనని మంత్రులు మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ఒకవైపు కరవు, మరోవైపు వేలాది టీఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలిసిపోతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. గోదావరిపై మహారాష్ట్రంలో 400 వందలకు పైగా ప్రాజెక్టులు, బ్యారేజీలు నిర్మించారని అన్నారు. అయితే తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆగస్టు 10న పోచంపాడ్‌లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ శంఖుస్థాపన చేస్తున్నారని తెలిపారు. అందుకుగానూ 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నీరు పుష్కలంగా ఉన్న ప్రాణహిత నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వరద కాలువను ఉపయోగించుకుని 60 టీఎంసీల నీటిని ఎత్తిపోతల ద్వారా ప్రాజెక్టులోకి పంపడం జరుగుతుందన్నారు. తద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టుకు పూర్తి స్థాయిలో ప్రతి ఏడాది నీరందిస్తామని స్పష్టం చేశారు. ఒక పక్క రైతుల కన్నీళ్లు తుడవడానికి ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతుంటే మరోపక్క కాంగ్రెస్, టీడీపీ నాయకుల విమర్శలు చేయడం అర్ధరహితం అన్నారు. సీఎం కేసీఆర్‌లాగా గతంలోని ప్రభుత్వాలు ఈ ఆలోచన చేసి నిర్మించి ఉంటే రాష్ట్రంలో అసలు రైతు ఆత్మహత్యలే ఉండేవి కావన్నారు. ప్రజాస్పందన బాగుందని వాహనాలు సమకూర్చితే స్వచ్ఛందంగా తరలిరావడానికి రైతులు సిద్దంగా ఉన్నారన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తామన్నారు.

వీఓఏల గౌరవేతనాలకు రూ. 83.17 కోట్లు నిధులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్రామైఖ్య సంఘాల్లో సహాయకులుగా పనిచేస్తున్న వీఓఏల గౌరవవేతనం రూ.83.17కోట్ల నిధులకు పరిపాలన అనుమతులను రాష్ట్రప్రభుత్వం జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం ముఖ్యకార్యదర్శి వికాశ్‌రాజ్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నిధులను వీఓఏల గౌరవవేతనాలకు వినియోగించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మిషన్ భగీరథ బ్యాంకు రుణాలకు వడ్డీలు రూ. 54.03 కోట్లు విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ ప్రాజెక్టుకు బ్యాంకులు ఇచ్చిన రుణాలకు వడ్డీ రూపంలో చెల్లించేందుకు రూ.54.03కోట్ల నిధులను ప్రభుత్వం విడు దల చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధుల ను కెనరా బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులకు వడ్డీ కింద రూ.54.03కోట్లను చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హస్తకళలకు పూర్వవైభవం

- హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్



దేశాయిపేట, కెఎన్ఎన్ : తెలంగాణ ప్రభుత్వం హస్త కళల అభివృద్ధికి విశేష కృషి చేస్తోందని రాష్ట్ర హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్ అన్నారు. మంగళవారం వరంగల్ చారౌ బౌళిలోని నోబుల్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ హస్త కళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జరిగిన సమావేశంలో బొల్లం సంపత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ కళాకారులు తయారు చేస్తున్న హస్త కళా వస్తువులకు మార్కెట్‌లో సరైన ధర లేకపోవడంతో కళాకారులు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి మార్కెట్‌లో హస్త కళావస్తువులకు డిమాండ్ ఉండేలా చూస్తామన్నారు. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో మిషనరీ వినియోగం బాగా పెరిగిపోవడంతో చేతి పనులకు ఆదరణ తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు వరంగల్ హస్త కళలకు ప్రసిద్ధి చెందిందని తర్వాత కొన్ని సంవత్సరాలు ఇబ్బందులు ఎదుర్కొందని హస్త కళలకు తిరిగి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. హస్తకళల అభివృద్ధికి శైలజా రామయ్యార్ ఎంతగానో కృషి చేశారన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ కార్యలయాల్లో హస్త కళావస్తులు వినియోగించుకునే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. అనంతరం తెలంగాణ హస్తకళల ఆధ్వర్యంలో గతంలో నాలుగు నెలలు సాంకేతిక శిక్షణ పొందిన కళాకారులకు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్రీక్రాఫ్ట్ ఉప సంచాలకులు రజాక్, శ్రీనివాస్‌రావు, సూర్‌వైజర్ మల్లిఖార్జున్, చేనేత జౌళిశాఖ శాఖ అధికారులు సుమతి, సంపత్, సీఏ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నేరెళ్ల బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- ప్రతిపక్షాల తిట్లే మాకు దీవెనలు: మంత్రి కేటీఆర్



వేములవాడ, కెఎన్ఎన్: తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రాణాలే తమ ప్రభుత్వానికి ముఖ్యమని మంత్రి కేటీఆర్ అన్నారు. నేరేళ్ల బాధితులను వేములవాడ పట్టణంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నేరేళ్ల బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశాలు జారీచేశామన్నారు. చిత్రహింసలకు గురిచేసిన పోలీసుల పై విచారణకు ఆదేశించామన్నారు. డీఐజీ విచారణ అనంతరం నివేదికను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ప్రతిపక్షాలు నేరేళ్ల సంఘటనను రాజకీయ అవసరాల కోసం వాడుకుంటున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో దళిత కోణం లేదనీ... ఇసుక మాఫియా లేదని స్పష్టం చేశారు. క్షణికావేశంలో దురదృష్టవశాత్తు జరిగిన సంఘటనను ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాల తిట్లే అధికార పక్షానికి ఆశీస్సులుగా మారుతున్నాయన్నారు. ఇసుక మాఫియాను పదే పదే అంటున్న కాంగ్రెస్ నాయకులకు కేటీఆర్ ఓ సవాలు విసిరారు. 45ఏళ్ల పాలనలో ఇసుక ద్వారా రాష్ట్రానికి ఎంత ఆదాయం సమకూర్చారో వివరించాలన్నారు. నేరేళ్ల ఘటనను మానవీయ కోణంలో చూడాలని కోరారు.

ఇసుక మాఫియాను ప్రోత్స హించడం తమ ఉద్దేశం కాదని మధ్యమా నేరులో ఈ యేడు 10 టీఎంసీల నీటిని నిల్వ ఉంచేం దుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, ఇసుకను ఖాళీ చేయించాలనే ఉద్దేశంతోనే క్వారీ కొనసా గుతుం దని గుర్తు చేశారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు రమేశ్ బాబు, పుట్ట మధులతోపాటు కలెక్టర్ కృష్ణ భాస్కర్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, చైర్‌పర్సన్ నామాల ఉమలక్ష్మీ రాజం, సెస్ చైర్మన్, సెస్ డైరెక్టర్‌లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు కౌన్సిలర్‌లు, తెరాస నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌నే కోరుకుంటున్నాం...

తెలంగాణ రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థనే ప్రభుత్వం కోరుకుంటుందని మంత్రి కేటీఆర్ అన్నా రు. నేరేళ్ళ ఘటనపై విచారణకు ఆదేశాలు జారీచేశామన్నారు. నివేదికలో వచ్చిన ఆధారాలను బట్టి పోలీసుల పై చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు దళితులకు వ్యతిరేకులు కాదనీ, అక్కడ జరిగిన పరిస్థితులను పరిగణలోకి తీసుకొని విచారణ కొనసాగుతుందన్నారు. పోలీసు వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత సుపరిపాలన అందిం చేందుకు ప్రభుత్వం ముందుందన్నారు.

టూరిస్టు నాయకుల మాటలు నమ్మొద్దు

నేరేళ్ల ఘటన జరిగిన అనంతరం కొంతమంది రాజకీయ నాయకులు, ఇతర సంస్థల నాయకులు ఆయారం.. గయారం లా వ్యవహరిస్తున్నారని మంత్రి కేటీఆర్ చలోక్తులు విసిరారు. టూరిస్టు నాయకులు చెప్పిన మాటలు నమ్మి మోసపోవద్దని బాధిత కుటుంబాలకు సూచించారు. గతపక్షం రోజులుగా ఈ ప్రాంతం వారు కానీ వ్యక్తులు నేరేళ్ళ ఘటనను ఒక వేదికగా మార్చుకున్నారనీ, టూరి స్టులు వ్యవహరించే తీరుపై మండిపడ్డారు. టూరిస్టు నాయకులు ఈ రోజు వస్తారు.. తరువాత కానరారు అని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలతో మమేకమై రాష్ట్రాన్ని సాధించుకున్నామని అదేవిధానంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శక ప్రభుత్వాన్ని అందిస్తున్నామన్నారు.

హస్తినకు చేరిన నేరెళ్ల ఘటన

- జాతీయ మానవహక్కుల కమిషన్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : నేరెళ్ల ఘటన హస్తినకు చేరింది. దళితులను విచారణ పేరుతో పోలీసులు చిత్రహింసలు పెట్టిన ఈ ఘటనపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేతలు జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ (ఎస్సీ కమిషన్) దృష్టికీ ఈ విష యాన్ని తీసుకెళ్లారు. కాంగ్రెస్ ఎంపీలు రేణుకా చౌదరి, ఎం.ఏ ఖాన్, మాజీ ఎంపీలు వి. హనుమంత రావు, కాంగ్రెస్ పార్టీ తెలంగాణా రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి ఆర్సీ కుంతియా బృందంగా వెళ్లి మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యా దులో ఘటన జరిగిన క్రమాన్ని సవివరంగా పేర్కొ న్నారు.


ఫిర్యాదులోని అంశాలు ఇవే:



''ఈ ఏడాది జులై 2న సిరిసిల్ల రాజన్న జిల్లా, తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో బుద్దయ్య అనే గిరిజన యువకుడి మీదుగా ఇసుక లోడు లారీ దూసుకెళ్లింది. లారీ చక్రాల కింద నలిగి అతను అక్కడికక్కడే చనిపోయాడు. బుద్ధయ్య చనిపోవడంపై ఆగ్రహించిన గ్రామస్థులు తొలుత పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆ ఫిర్యాదును పోలీసులు అసలేమాత్రం పట్టించుకోలేదు. దీంతో తీవ్ర ఆగ్రహావేశాలకు లోనైన గ్రామస్థులు, పక్కనే ఉన్న జిల్లెల్ల, రామచంద్రాపురం గ్రామ ప్రజలతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఉద్వేగంలో ఉన్న కొందరు ఇసుక లారీలను ఆపారు. వాటిలో 3 లారీలకు నిప్పు పెట్టారు. అయితే బుద్దయ్య చనిపోయినప్పుడు కేసు నమోదు చేయడానికి ముందుకు రాని పోలీసులు, లారీలకు నిప్పు పెట్టిన కేసులో పెంటా బానయ్య, గంధం గోపాల్, చెప్యాల బాలరాజు, కోలా హరీష్, పసుల ఈశ్వర్ కుమార్, చికోటి శ్రీనివాస్, కోలుకంటి గణేష్, బత్తుల మహేష్ అనే 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ విశ్వజీత్ నేతృత్వంలో థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. మర్మాంగాలపై మెడి నీళ్లు పోశారు. ఎలక్ట్రిక్ షాక్ సహా అనేక రకాల చిత్రహింసలు పెట్టారు. 4 రోజుల తర్వాత అంటే జులై 8న స్థానిక మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. జైల్లో బాధితుల ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా పోలీసుల గురించి నోరెత్తవద్దని, తమ పేరు ఎక్కడైనా చెబితే డ్రగ్స్ కేసులు నమోదు చేసి బయటకురాకుండా చేస్తామని బెదిరించారు. ఓవైపు బుద్దయ్య మరణానికి కారణమైన వారిపై ఇప్పటికీ కేసులు పెట్టలేదు. ఎలాంటి విచారణ జరపలేదు. 8 మం దిని చిత్రహింసలు పెట్టిన ఎస్పీ సహా పోలీసు అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలన్నదే మా డిమాండ్.


ఎన్నికల సంస్కరణలు అవసరం

- చట్టసభల స్థాయి దిగజార్చకండి
- రాజకీయాలు వారసత్వం కారాదు
- మంత్రివర్గంలోకి ఎన్టీఆర్ ఆహ్వానిస్తే తిరస్కరించా
- ఉపరాష్ట్రపతిగా కూడా ప్రజల మధ్యనే ఉంటా : వెంకయ్యానాయుడు




హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశంలో ఎన్నికల సంస్కరణలు చేయాల్సిన అవ సరం ఉందని, ఈ దిశలో ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలు దృష్టి సారించాలని ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన ముప్పవరపు వెంక య్య నాయుడు పిలుపునిచ్చారు. ఎన్నికల ఖర్చు లు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతు న్నాయని, వీటిని నియంత్రించి ప్రజాభి ప్రాయం ప్రతిబింబించేలా చర్యలు తీసుకొవలసి ఉందన్నారు. పేదరిక నిర్మూలన, అక్షరాస్యత పెంపు, అవినీతిని నిరోధిం చడం, ఆర్థిక అసమానతల తొలగింపు, ప్రగతిలో ప్రజలంతా భాగస్వాములు కావా లని ఆయన కోరారు. వెంకయ్య నాయుడు ఉపన్యాసాలు, పార్లమెంట్‌లో ప్రసంగాలు, రచనల సంకలనంతో 'అలుపెరగని గళం.. విరామమెరుగని పయనం' పేరుతో ఎమె స్కో ప్రచురించిన పుస్తకాలను ఈనా డు గ్రూపు సంస్థల చైర్మన్ చెరుకూరి రామో జీరావు మంగళవారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, చట్టసభలు ప్రజాహితం కోసం వివిధ అంశాలపై చర్చలు జరిపి చట్టాలను రూపొందించే వేదికలనీ, ప్రజాసమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చే ఈ సభలు ఇటీవల కాలంలో తమ స్థాయిని కోల్పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు తమ స్థాయి, హోదా ను మరిచిపోయి వ్యక్తిగత దూషణలతో సభలో గందరగోళం సృష్టిస్తున్నారని విచా రం వ్యక్తంచేశారు. నిబద్ధత కలిగిన సభ్యులు ప్రజా సమస్యలను ఆకలింపు చేసుకుని వాటిని ప్రభుత్వ దృష్టికి తెచ్చేందుకు విశ్లేషాత్మకంగా సభలో ప్రసంగిం చినప్పటికీ వాటికి పత్రికలు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదని వెంకయ్య ఆవేదన వ్యక్తంచేశారు. సభలో మైకులు విరిచి, బల్లలు ఎక్కి గందరగోళం చేసి పరుషజాలంతో దూషించిన సభ్యులను హీరోలుగా చూపించే రీతిలో మొదటి పేజీల్లో వార్తలు ప్రచురించడం బాధాకరమని ఆయన అన్నారు. ప్రతిపక్షాలు చట్టస భల్లో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తూ ప్రభుత్వ లోపాలు ఎత్తిచూపుతూ సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉందని, కానీ అందుకు భిన్నంగా వ్యవహ రిస్తున్నాయని నాయుడు ఆరోపిం చారు. తన ఏడాది వయ సులోనే అమ్మ ను కోల్పోయానని, రాజకీ యా ల్లో పార్టీనే తన తల్లిగా భావించి ఆప్యా యత పొందా నన్నారు. ఉప రాష్ట్రపతి పదవికి ఎంపిక చేసినపుడు మళ్ళీ అమ్మ లాంటి పార్టీకి దూరమ వుతున్నానన్న బాధతో ఉద్వేగానికి లోన య్యానని, దీన్ని కొన్ని పత్రికలు మరోలా చిత్రీకరించాయని ఆయన అన్నారు. 2019లో నరేంద్ర మోడీని మరోసారి ప్రధాన మంత్రి చేశాక రాజకీయాల నుంచి తప్పు కుంటానని మోడీకి, తన భార్యకు చెప్పానని ఆయన తెలిపారు. రాజకీయాలు వారసత్వం కారాదని, తన కుటుంబ సభ్యులకు తాను అవకాశం ఇవ్వలేదని చెప్పారు. సమర్ధత, చిత్తశుద్ధి, నాయ కత్వ లక్షణాలు ఉంటే వార సత్వం అవసరం లేదన్నారు. తన విద్యాభ్యాసంలోనే రిక్షాలో ప్రచారం చేసేవాడినని, పార్టీ పోస్టర్లు అంటించేవాడినని, టెలిఫోన్ స్తంభాలు ఎక్కి జెండాలు పెట్టేవాడినని తన చిన్ననాటి జ్ఞాప కాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లో క్రమశిక్షణ, చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే ఏ స్థాయికైనా చేరుకో వచ్చు నన్నారు. తాను సామాన్య రైతు కుటుంబం నుంచి రాజకీ యాల్లోకి వచ్చి నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి నిజాయితీతో పనిచేసి సమర్థం గా వ్యవహరించానని చెప్పారు. శాసన, పార్లమెంట్ సభ్యుడిగా ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ళ స్థలాన్ని కూడా తాను తీసుకోలేదని గురు చేశారు. 1983లో ఎన్‌టి రామారావు ప్రభుత్వాన్ని కూల దోసినపుడు ప్రజా స్వామ్య పరిరక్షణ ఉద్య మంలో తాను కీలకంగా వ్యవహ రించానని, ఆ తర్వాత తనను ప్రభుత్వంలో చేరాల్సిం దిగా ఎన్టీఆర్ ఆహ్వానిస్తే తాను సున్నితంగా తిరస్కరిం చానని అన్నారు. ఈ దశలో ఈనాడు గ్రూపు అధినేత రామోజీరావు కూడా ప్రభుత్వంలో చేరాల్సిందిగా సలహా ఇచ్చారని ఆయన గుర్తు చేసుకున్నారు. అనేక సందర్భాల్లో రామో జీ తనకు సల హాలు, సూచనలు ఇచ్చేవారని, వాటిని పరిశీలించి తాను అను సరించేవాడినని వెంకయ్య చెప్పారు. ప్రజా ప్రతి నిధిగా ప్రశ్నించే తత్వం అలవర్చుకున్నానని, మీడియా సంధించే ప్రశ్న లకు అదే స్థాయిలో సమాధానంతో తిప్పికొట్టే వాడినని అన్నారు. తాను రెండు రోజుల తర్వాత అధిక ప్రసంగం చేసే అవకాశం ఉండదని, పర్యటనలు, మీడియా సమావేశాలు తగ్గిపోతా యంటూ కేంద్రమంత్రి సుష్మా స్వరాజ్ ప్రధానితోనే సరదాగా అన్నారని ఆయన గుర్తుచేశారు.

చట్టసభల తీరు బాధాకరం




చట్టసభల తీరు బాధాకరంగా ఉందని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవడంలో సభ్యులు ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించడం లేదని ఆంధ్రప్రదేశ్ శాసనసభా స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని నిల దీసి ప్రజల పక్షాన నిలవాల్సి ఉందని, కానీ రాజకీయ కోణంలోనే ఆలోచిస్తూ సభలో ప్రవర్తిస్తున్న తీరు బాధాకరమన్నారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడి రచనలు, పార్లమెంట్‌లో ప్రసంగాల సంకలనం 'అలుపెరగని గళం.. విరామ మెరుగని పయనం' అనే పుస్తకాన్ని ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు సోమవారం ఆవిష్కరించారు.

రాష్ట్రపతిగా వెంకయ్య సేవలందించాలి



నిజాయితీ, నిబద్ధత, చిత్తశుద్ధి, కృషి, పట్టుదల ఉన్న నేతగా వెంకయ్య నాయుడు ఎదిగారని, భవిష్యత్తులో రాష్ట్రపతిగా దేశానికి సేవలు అందించాలని రామోజీరావు ఆకాంక్షించారు. తెలుగుజాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ళడంలో నాయుడు కీలకంగా వ్యవహరించారని ప్రశంసించారు. ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో అలుపెరగని వెంకయ్య ప్రసంగాల్లో ఆహ్లాద కరమైన చురకలు, విషయ పరిజ్ఞానం ఉంటాయన్నారు. ప్రవాహం లా సాగే ఆయన ప్రసంగాలు దేశ ప్రజలకు అరుదైన అనుభ వాన్ని కలిగిం చాయని రామోజీ అన్నారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నిక కావడం తెలుగు ప్రజలకు గర్వకారణమని, ఆ పదవికి వెంకయ్య వన్నె తెస్తారని ధీమా వ్యక్తంచేశారు.

ఎన్నికలముందు ఒకపార్టీ..తర్వాత మరోపార్టీలో



తెలంగాణ శాసనసభ స్పీకర్ మధు సూద నాచారి మాట్లాడుతూ, ప్రస్తుత రాజకీ య పరిస్థితుల్లో ఎన్నికల ముందు ఒక పార్టీ, ఆ తర్వాత మరో పార్టీలో చేరుతు న్నారని అన్నారు. రాజకీయాల్లో ఎదుగుతూ వచ్చేవారు తగ్గిపోయి ఎగురుతూ వచ్చేవారు ఎక్కువయ్యారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. స్వీయ ప్రతిభతో ఉన్నత స్థాయికి ఎదగడం మహానుభావులకే సాధ్యమవుతుందని, ఆ కోవలో వెంకయ్య నాయుడు నిలుస్తారని కితాబిచ్చారు. కసి, కృషి కలిస్తే వెంకయ్య అవుతారని, ప్రజా సమస్యలు ఆకళింపు చేసుకుని చట్టసభల్లో స్పందించి ఆయన ఈ స్థాయికి ఎదిగారని చెప్పారు.

మళ్లీ నకిలీ పాస్‌బుక్‌ల బాగోతం!

- అందుకే సంస్కరణల పర్వం
- ఆర్డీవోల నుంచి తహసీల్దార్‌కు మ్యుటేషన్ బాధ్యతలు బదలీ
- రైతు ఇంటికే నేరుగా పాస్ పుస్తకాలు
- పాత పాస్‌పుస్తకాల రద్దు దిశగా కార్యాచరణ
- రికార్డుల ప్రక్షాళన తర్వాత కీలక చర్యలు
- ఖమ్మంలో వెలుగులోకి వచ్చిన నకిలీల వ్యవహారం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రుణమాఫీ తర్వాత నకిలీ పాస్‌పుస్తకాల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. దీంతో పాస్ పుస్తకాల వ్యవహారంపై సీఎం కేసీఆర్ దృష్టిసారించారు. పహాణీలు, పాస్ పుస్తకాల జారీలో భారీ మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటివరకు మ్యుటేషన్ బాధ్యతలు ఆర్డీవోల పరిధిలో ఉండగా వాటిని తహశీల్దార్‌లకు కట్టబెడుతూ ముఖ్య మంత్రి కీలక నిర్ణయం ప్రకటించారు. తద్వారా అక్రమాలు, అవినీతికి స్వస్తి చెప్పొచ్చని, అదేవిధంగా రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయకుండా నేరుగా రికార్డుల్లో మార్పులు జరిగి ఫౌతి జరిగి, మ్యుటేషన్ కాగానే పాస్ పుస్తకాలు కొరియర్‌లో రైతు ఇంటికే చేర్చేలా కొత్త విధానాలకు అంకురార్పణ చేశారు. గతంలో నకిలీ పాస్ పుస్తకాలతో అక్రమంగా రుణమాఫీ నిధులు సుమారు రూ. 8వేల కోట్ల రూపాయలు కాజేశారన్న ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత తాజాగా ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోనూ నకిలీ పాస్ పుస్తకాలతో రూ. 8కోట్లు కాజేసిన వైనం వెలుగులోకి వచ్చింది. సత్తుపల్లిలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో నకిలీ డాక్యుమెంట్లు, నకిలీ పాస్ పుస్తకాలు బైటపడ్డాయి. ఫోర్జరీ పాస్ పుస్తకాలు, మీ సేవ పహాణీలను కూడా ఫోర్జరీ చేసినట్లుగా ఆయా ప్రాంతాల్లో వెల్లడైంది. ఒక సర్వే నెంబర్‌ను వేసి మరో గ్రామంలోని రైతు ఖాతా నెంబర్‌తో పాస్ పుస్తకాలను సృష్టించారు. కొన్ని పాస్ పుస్తకాలపై అధికారుల సంతకాలను సైతం ఫోర్జరీ చేసినట్లు తేలింది. వీటిని తనఖా పెట్టి బ్యాంకుల్లో రుణాలను పొందారు. సర్వే నెంబర్ ఒకరిది, ఫోటో, చిరునామా మరొక రిదిగా, ఉండగా రుణం పొందింది ఒంకొకరుగా తేలింది. మరోవైపు ఒకే రైతు ఒకే పేరుతో వివిధ పత్రాలతో అనేక బ్యాంకుల్లో రుణం పొందినట్లుగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో గుర్తించారు. ఇదే తంతు రాష్ట్రం లోని అనేక ప్రాంతాల్లో జరిగినట్లుగా ప్రభుత్వం భావిస్తోంది. దీంతో జమాబందీ వివరాలను ఆరా తీస్తోంది. అక్రమాలను కట్టడి చేయాలంటే రికార్డుల ప్రక్షాళనే మేలని ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో పకడ్బందీ రికార్డుల తయారీకి పూనుకుంటోంది. రికార్డుల మార్పులతోనే అన్నింటికీ చెక్ పెట్టాలని యంత్రాంగం నిర్ణయించింది. మొత్తం భూముల లెక్కలను కంప్యూటరీకరించి వెబ్ ల్యాండ్ పోర్టల్‌లో నిక్షిప్తం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. తద్వారా వివిధ శాఖల మధ్య సమన్వయంతోపాటు పారదర్శకతకు వీలుకల్గనుందని ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో భూమి విస్తీర్ణాలు, హద్దులపై సమగ్ర సర్వేకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. 1936లో చేపట్టిన బందోబస్తు తర్వాత ఇదే అతి పెద్ద రికార్డుల సమీక్షా కార్యక్రమంగా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. దీంతో రాష్ట్రంలోని భూభాగమంతా సర్వే చేసి పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయనున్నారు. తద్వారా పాస్ పుస్తకాలు, పహాణీలను మరింత పకడ్బంధీ చేయనున్నారు. ఒక్కో గ్రామం యూనిట్‌గా జరిగే సర్వేతో వాస్తవికత వెలుగులోకి రానుంది. మొత్తం గ్రామంలోని భూమి విస్తీర్ణం, ఎంత మంది రైతులు, ఏఏ రైతుకు ఎక్కడెక్కడ భూములన్నాయి...భూమి యజమాని ఎవరు...కబ్జాలో, కాస్తులో ఎవరున్నారు... ఎవరెవరు భూములను కౌలుకి చ్చారు వంటి అన్ని అయోమయాలు తొలగనున్నాయి. పాస్ పుస్తకాలు, పహాణీల్లోని అనేకసంక్లిష్టకాలమ్స్‌ను తొలగించి భారీ సంస్కరణలకు భీజం వేయనున్నారు. ప్రతీ భూమికి ప్రత్యేక నెంబర్, హద్దులు, యూనిక్ కోడ్‌ను కేటాయించ నున్నారు. దీంతో భూముల మోసాలకు తెరపడనుందని ప్రభుత్వం భావిస్తోంది.

అన్ని పాస్ పుస్తకాల రద్దు...

అనేక అక్రమాలకు కారణంగా మారిన రాష్ట్రంలోని మొత్తం పాస్ పుస్తకాలను రద్దు చేయాలనే యోచన తెరపైకి వస్తోంది. మొత్తం రాష్ట్రంలోని అన్ని భూములకు చెందిన రికార్డుల సంస్కరణ తర్వాతే నూతన పట్టాదారు పాస్ పుస్తకాల జారీని ప్రారంభించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఇదివరకే డిజిటలైజ్డ్ ఇ పట్టాదార్ పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్‌లను అమలులోకి తేవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. వాటర్‌మార్క్డ్ మ్యాప్, లిథో పేపర్‌తో వీటిని రూపొందించే ప్రక్రియ కొంత ప్రగతిలో ఉండగానే ఈ వ్యవహారం చర్చనీయాంశం అయింది. దీంతో రైతు ఫోటోతో పాటు, ఆర్డీవో సంతకాన్ని, డిజిటల్ కీ వంటి అధునాతన సెక్యూరిటీ ఫీచర్లను జతచేయనున్నారు. పాస్ పుస్తకాలు, టైటిల్ డీడ్‌లు వేర్వేరుగా కాకుండా రెండు కలిపి ఒకటిగానే ఇవ్వాలని నిర్ణయించారు. కలర్, డిజైన్, స్లోగన్, ఎంబ్లమ్‌ను రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదార్ పాస్‌బుక్ యాక్ట్-1971 మేరకు అన్ని వివరాలను సిద్ధం చేస్తోంది. ఇందుకు రైతుల వారీగా వ్యక్తిగత డేటాబేస్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే మా భూమి వెబ్‌సైట్‌లోని ఆన్‌లైన్ రికార్డుల సాయంతో నూతన పాస్ పుస్తకాల జారీ పెద్దగా కష్టం కాదని ప్రభుత్వం యోచిస్తోంది.

ప్రస్తుతానికి చెల్లుబాటు...

నూతన పట్టాదార్ పాస్ పుస్తకాలు అందుబాటు లోకి వచ్చేందుకు మరింత సమయం పట్టనుంది. తాజాగా తెలంగాణ రాజముద్ర, డిజిటల్ సంతకం, యూనిక్ నెంబర్లతో పాటు, డిజిటల్ హోలోగ్రాంతో పాస్ పుస్తకాలను ముద్రించాలని నిర్ణయించారు. అప్పటివరకు సాధారణ రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రస్తుతం ఉన్న పట్టాదార్ పాస్‌పుస్తకాలు, టైటిల్‌డీడ్‌లను అన్ని అవసరాలకు అనుమతించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మ్యుటేషన్లు, రికార్డుల నమోదుకు అనుమతించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించింది. మా భూమి వెబ్‌సైట్ ద్వారా భూముల తాజా వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ అవుతుండటంతో ఎలక్ట్రానిక్ పాస్ పుస్తకాల రూపకల్పన పెద్దగా కష్టం కాదని రెవెన్యూ శాఖ అభిప్రాయపడుతోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ భూముల పట్టాదారు పాస్ పుస్తకాల విధానాన్ని సంస్కరించేలా అడుగులు వేస్తోంది. పాస్ పుస్తకాల జారీ ప్రహసనాన్ని మరింత పారదర్శకం, సులభతరం చేయాలన్న ప్రయత్నంలో భాగంగానే భూముల రిజిస్ట్రేషన్ సమయంలోనే విధిగా మ్యుటేషన్ రుసుములను వసూలు చేస్తున్నారు. పంట వివరాలను తెలిపే పహాణీలు ఇప్పుడు పోర్టల్ ద్వారా బ్యాంకులకు అందుబాటులోకి తెచ్చారు. భూముల రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే రికార్డుల్లో కొనుగోలుదారు పేరు చేరుతోంది. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అమలవు తున్న తీరులో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ రెండు బాధ్యతలనూ తహశీల్దార్‌లకే అప్పగిస్తే ఎలా ఉంటుందన్న తీరులో కూడా ప్రభుత్వం పరిశీలన చేస్తోంది.

చైనా కొత్త వ్యూహం!

(మొదటిపేజీ తరువాయి)

చైనా సముద్రంపై ఆధిపత్యానికి ఆ దేశం ప్రాకులాడుతోంది. ఇప్పటికే ఈ సముద్రంలో చైనా కొన్ని కృత్రిమ దీవుల్ని ఏర్పాటు చేసింది. వాటిపై భారీ నిర్మాణాలు చేపట్టింది. ఇక్కడ తన సైనిక స్థావరాల్ని నెలకొల్పాలని ప్రయత్నిస్తోంది. అయితే దక్షిణచైనాపై ఆధిపత్య సమస్య ఇప్పటికే ఐక్యరాజ్యసమితిలోని ట్రిబ్యునల్ వద్దకు చేరింది. గతేడాది ఈ సముద్రంపై ఫిలిప్పీన్స్‌కు కూడా హక్కు ఉంటుందంటూ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును గౌరవించి తీరాల్సిందేనంటూ ఐక్యరాజ్యసమితి స్పష్టం చేసింది. చైనా సముద్రం చమురు నిక్షేపాల గని. ఇక్కడ కోట్ల క్యూబిక్ మీటర్ల పరిమాణంలో గ్యాస్ నిక్షేపాలు కూడా ఉన్నట్లు అంచనాలేస్తున్నారు. పైగా ఇది అత్యంత కీలకమైన వాణిజ్య నౌకా ప్రయాణమార్గం. ఈ సముద్రంలోని అంగుళం అంగుళాన్ని అంచెల వారీగా తన హస్తగతం చేసుకుంటే ఇందులోగల అపార సంపదంతా తన సొంతమౌతుందన్నది చైనా ఆకాంక్ష. అయితే ఇదే సముద్రంపై వియత్నాం, కంబోడియా, మలేషియా, మయన్మార్, సింగపూర్, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్, లావోస్, ఇండోనేషియాలు కూడా హక్కు కోసం పోరాటం చేస్తున్నాయి. అయితే తనకున్న ఆర్థిక, సైనిక శక్తిని చూపి ఈ దేశాలేవీ సముద్ర సంపదలో వాటాకు రాకుండా చైనా అదుపులో ఉంచుతోంది. అయినప్పటికీ వియత్నాం, కంబోడియాలు తరచూ కయ్యానికి కాలుదువ్వుతున్నాయి. ఈ దశలో చైనా సముద్రంపై హక్కు అంతర్జాతీయ సమస్యగా మారింది. తాజాగా ట్రిబ్యునల్ తీర్పును చైనా గౌరవించాల్సిందేనంటూ అమెరికా, జపాన్‌లు తేల్చిచెప్పేశాయి. చైనా సముద్రం ఒకే దేశం అధీనంలో ఉంటే దీనివెంబడి సాగే నౌకా వాణిజ్యానికి ఇబ్బందికరంగా మారుతుంది. ఇది అమెరికా, జపాన్‌తో పాటు రష్యా, ఇరాన్, ఇరాక్ తదితర చమురు విక్రయ దేశాలకు నష్టదాయకంగా పరిణమిస్తుంది. ఈ దశలో చైనా వేసే ప్రతి ఎత్తుకు అమెరికా, జపాన్‌లు వ్యతిరేకంగా ఉన్నాయి. ప్రస్తుతం డొక్లాంలో భారత్‌తో నెలకొన్న వివాదానికి చైనా సముద్రంపై ఆధిపత్యానికి చైనా ముడిపెడుతోంది. సముద్ర వివాదం నేపథ్యంలో చైనా భారత్‌కు వ్యతిరేకంగా తీసుకునే ఏ చర్యకైనా అమెరికా, జపాన్‌లు ప్రత్యక్షంగా మద్దతు పలికే అవకాశాల్ని గతంలోనే అంతర్జాతీయ నిపుణులు విశ్లేషించారు. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా పూర్తిగా భారత్‌దే తప్పని ముందస్తు ప్రచారం చేయడం ద్వారా తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఇప్పుడు చైనా నానాతంటాలు పడుతోంది. అలాగని ఇప్పుడా దేశమున్న పరిస్థితుల్లో బెదిరింపులు తప్ప సైనికచర్యకు ఏమాత్రం అవకాశంలేదని నిపుణులు పేర్కొంటున్నారు. భారత్‌పై అస్త్రశస్త్రాల్ని ఎక్కుపెడితే చైనా ఆశిస్తున్న సముద్రంపై ఆధిపత్యలక్ష్యం మరుగున పడుతుంది. ఈ వివాదంలో నష్టపోతున్న దేశాలన్నీ భారత్‌కు మద్దతు పలకడం ఖాయం. ఐక్యరాజ్యసమితి కూడా ఫిలిప్పీన్స్ పట్ల చైనా వైఖరిని తీవ్రంగా తప్పుబడుతోంది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్నందునే చైనా తరచూ భారత్‌పై బెదిరింపులకు పాల్పడుతుంది తప్ప అంతకుమించి ముందుకురికే పరిస్థితి లేదని భావిస్తున్నారు.

జీఎస్టీపై ఇప్పుడు పోరాటమా?

సేవాదళ్ చైర్మన్ జనార్థన్‌రెడ్డి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : జీఎస్టీపై న్యాయపోరాటం చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడాన్ని టీపీసీసీ సేవాదళ్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ కె జనార్ధనరెడ్డి ఖండించారు. కేసీఆర్ ప్రకటన చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఉందని మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, పథకాలపై జీఎస్టీ పన్ను ఎత్తివేయాలని ఇప్పుడు మొరపెట్టుకోవడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. జీఎస్టీ అమలు వల్ల రాష్ట్రా నికి దాదాపు రూ. 3 వేల కోట్లు నష్టం వస్తుందని ఆనాడే ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ చెప్పారని, ఆయనపై విమర్శలు గుప్పించిన టీఆర్ఎస్ నాయకులు ఇప్పుడేమంటారని ప్రశ్నించారు.

సదావర్తి భూములను మళ్లీ వేలం వేయండి

హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: శ్రీసదావర్తి సత్రం భూముల వ్యవహారం మరో మలుపు తిరిగింది. గతంలో నిర్వహించిన వేలం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. సదావర్తి సత్రం భూములను మరోసారి తాజాగా వేలం వేయాలని , ఆరు వారాల్లో వేలం ప్రక్రియ మొదలు పెట్టాలని హైకోర్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంపై ఆరు వారాల్లో వివిధ జాతీయ పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలని కూడా హైకోర్టు స్పష్టం చేసింది. అలాగేవైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే రామకృష్ణా రెడ్డి చెల్లించిన రూ.27.44 కోట్ల సొమ్మును ప్రాథమిక వెల(బేస్ ప్రైస్) గా నిర్ణయించి వేలం నిర్వహించాలని హైకోర్టు సూచించింది. వేలం లో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రాకపోతే సదావర్తి భూములు పిటిషనర్ ఆళ్ల .రామకృష్ణా రెడ్డికే చెందుతాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వేలంలో పిటిషనర్ ఎమ్మెల్యే ఆళ్ల .రామకృష్ణా రెడ్డి కూడా పాల్గొన వచ్చునని హైకోర్టు తేల్చి చెప్పింది. ఇదిలా ఉండగా అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టుకు ఇచ్చిన హామీ మేరకు రూ.27.44 కోట్ల సొమ్మును ఏపీ దేవాదాయ శాఖ కమిషనర్ ఖాతాలో ఎమ్మెల్యే ఆళ్ల.రామకృష్ణారెడ్డి చెల్లించిన విషయం తెలిసిందే.

కేసీఆర్ బాటలో మోడీ!

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక పథకాలు జాతీయస్థాయికి ఆదర్శవంతంగా నిలుస్తున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ అవలంబిస్తున్న విధానాల్లో కొన్నింటిని ప్రధాని నరేంద్ర మోడీ అవలంభిస్తున్నారు. ఇక్కడ ముస్లిం యువతుల కోసం అమలు చేస్తున్న షాదీముబారక్ పథకం తరహాలోనే కేంద్రం దేశవ్యాప్తంగా ఒక కొత్త పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఆ పథకం పేరు 'షాదీ షగున్' అంటే శుభ కళ్యాణం అన్నమాట. తెలంగాణలో షాదీ ముబారక్ పథకంలో పేద ముస్లిం యువతుల పెళ్ళి ఖర్చుల కోసం రూ.51వేలు అందజేస్తున్నారు. రాష్ట్రంలో 2014 అక్టోబర్ 2న ఈ పథకం ప్రారంభమైంది. వార్షిక ఆదాయం రూ.2 లక్షలు మించని ముస్లిం కుటుంబాలకు ఈ ఆర్థికసాయం అందుతోంది. ఇదే తరహాలో ఉన్నత విద్య అభ్యసించేలా ముస్లిం యువతులను ప్రోత్సహించేందుకు మోడీ ప్రభుత్వం నజరానా ప్రకటించింది. పట్టభద్రులైన ముస్లిం యువతులకు పెళ్ళి కానుక అందించనుంది. ఇది కూడా రూ.51వేలు కావడం విశేషం. పట్టభద్రులు కావడంతో పాటు అంతకుముందు మౌలానా అజాద్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ (ఎంఏఈఎఫ్) స్కాలర్‌షిప్ అందుకుని ఉంటే కూడా ఈ నజరానా అందుతుంది. అలాగే 9, 10 తరగతులు చదివే ముస్లిం బాలికలు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున ఇవ్వాలని జాతీయ మైనారిటీ కమిషన్ నేతృత్వంలో పనిచేసే ఎంఏఈఎఫ్ నిర్ణయించింది. ట్రిపుల్ తలాక్ పద్ధతికి వ్యతిరేకంగా చేపట్టిన చర్యలతో మోడి ప్రభుత్వానికి ముస్లిం మహిళల నుంచి పెద్దఎత్తున మద్దతు లభించింది. యూపీ ఎన్నికల్లో ముస్లిం మహిళలు పెద్దఎత్తున బిజెపికి ఓటువేశారు. మరో రెండేళ్ళలో సార్వత్రిక ఎన్నికలున్న నేపథ్యం లో వారి మద్దతును మరింత కూడగట్టేందుకు షాదీ షగున్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి సుమిత్ బోస్ నేతృత్వం లో ఏర్పాటు చేసిన కమిటీ సిఫారసు మేరకు ఈ నిర్ణయం తీసుకుంది.

డిసెంబర్ కల్లా అన్ని గ్రామాలకు తాగునీరు: సీఎస్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ ప్రాజెక్టు నుంచి డిసెంబర్‌లోగా అన్ని గ్రామాలకు సురక్షిత నీటిని అందించాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్పీ సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మిషన్ భగీరథపై సీఎస్ ఎస్పీ సింగ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సింగ్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ప్రాజెక్టులో 19 ఇంటెక్‌వెల్స్‌లో 16 పూర్తయ్యాయని తెలిపారు. 50 ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిర్ణిత గడువులోగా పూర్తి చేసే విధంగా పర్యవేక్షించాలని కోరారు. కొన్ని జిల్లాల్లో ప్రైవేటు వ్యవసాయ భూముల నుంచి వెళ్తున్న 240కిలోమీటర్ల పైపులైన్ పనులు త్వరగా పూర్తి అయ్యేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో అంతర్గత పైపులైన్ ఏర్పాటుకు 18,500 పనులకుగాను, 12,248 పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడం జరిగిందన్నారు. గ్రామాల్లో 10,343 పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. జాతీయ స్థాయిలో స్వచ్ఛ్ భారత్ కార్యక్రమాన్ని ఈనెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సీఎస్ ఎస్పీ సింగ్ అధికారులను ఆదేశించారు.

వీడియో గేమ్ కొనివ్వలేదని.. బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తనకు వీడియో గేమ్ కొనివ్వాలని తల్లిదండ్రులను అడుగుతున్న ఓ బీటెక్ విద్యార్థి మంగళవారం ఉదయం తమ రెండంతస్తుల భవనం ఎక్కి దూకేసిన ఘటన హైదరా బాద్ శివారులోని కుంట్లూరులో చోటు చేసుకుంది. దీంతో ఆ బాలుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరిన్ని వివరాల్లోకి వెళితే కుంట్లూరులో నివసించే శ్రీనివాస్, పద్మ దంపతులకు అభినయ్ అనే బీటెక్ మొదటి సంవత్సరం కొడుకు ఉన్నాడు. ఇటీవలే వారు కొత్తగా రెండతస్తుల భవనం కట్టుకున్నారు. ఈ నెల 2న ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో అభినయ్ చేరాడు. వీడియో గేమ్‌లు ఆడటం అంటే ఎంతో ఇష్టం చూపించే ఆ విద్యార్థి కొన్ని రోజులుగా తనకు దాన్ని కొనివ్వాలని తండ్రిని అడుగుతున్నాడు. కానీ తమ వద్ద డబ్బులేదని తండ్రి చెప్పు కొస్తున్నాడు. తనకు వీడియో గేమ్ కొనిస్తారా? లేదా? అంటూ సోమవారం తనతో గొడవకు దిగిన ఆ విద్యార్థిని అతడి తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆ విద్యార్థి తమ భవనంపైకి వెళ్లి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

కంచె చేను మేస్తోంది

- ప్రభుత్వ భూమికి గ్రహణం
- రూ. 1000కోట్ల విలువైన ప్రభుత్వ భూమి పరాధీనం
- ప్రభుత్వ, శిఖం భూముల్లో విల్లాలు
- నిర్ధారించిన సర్వేయర్
- స్పందించని తహశీల్దార్
- సర్వేయర్‌ను బెదరిస్తున్న తహశీల్దార్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రక్షించాల్సిన వారే భక్షిస్తున్నారు...కంచె చేను మేసిందన్న చందాన ప్రభుత్వ అధికారుల తీరు తయారైంది. ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటుంటే మరోవైపు రెవెన్యూ అధికారులే ప్రభుత్వానికి పక్కలో బల్లెంలా మారుతున్నారు. విలువైన ప్రభుత్వ భూమిని పరిరక్షించకపోగా అక్రమార్కులకు వంత పాడుతున్నారు. విలువైన భూములను ప్రభుత్వానికి చేరవేద్దామని ప్రయత్నిస్తున్న కిందిస్థాయి అధికారులకు బెదిరింపులు చేస్తూ అక్రమాలను పతాక స్థాయికి చేరుస్తున్నారు. రాష్ట్ర రాజధానిలోని అత్యంత విలువైన రూ. 1000 కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమి అధికారుల నిర్లక్ష్యం, అవినీతితో పరాధీనమయింది. మియాపూర్ భూ అక్రమాల తర్వాత తాజాగా హైదరాబాద్‌లో మరో భారీ భూ కుంభకోణాన్ని కిందిస్థాయి సర్వేయర్ నిర్ధారించినా ఉన్నతాధికారులు స్పందించడం లేదు. ఉప్పల్ పరిధిలోని బోడుప్పల్ సర్వే నెంబర్ 215లోని పోరంబోకు, సర్వే నెంబర్ 216లోని శిఖం భూమిని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి విల్లాలు నిర్మించారని వెలుగులోకి వచ్చింది. సదరు భూమిని సర్వే చేసిన సర్వేయర్ ఇది ప్రభుత్వ భూమేనని నిర్ధారించినా మేడిపల్లి తహశీల్దార్ చర్యలు తీసుకోలేదు. అంతే కాకుండా అక్రమార్కులకు వంత పాడుతూ సర్వేయర్‌ను బెదిరిస్తు న్నట్లుగా ప్రభుత్వానికి ఫిర్యాదు అందింది. తహశీల్దార్ స్వయంగా సర్వే బౌండరీస్ యాక్టు 1923కు వ్యతిరేకంగా తనకు ఇష్టం వచ్చినట్లుగా, తాను చెప్పినట్లుగానే సర్వే చేయాలని భయభ్రాంతులకు గురిచేశారని సర్వేయర్ మంగళవారం ఆరోపించారు.

సర్వే నెంబర్ 215లో 36.32 ఎకరాల ప్రభుత్వ భూమి, సర్వే నెంబర్లు 216నుండి 221 వరకు 23.17 ఎకరాల శిఖం భూములను గుర్తించి హద్దులు నిర్దేశించామని చెప్పారు. అయితే నిర్దేశిత శిఖం భూమిలో 5 ఎకరాలు, 215 సర్వే నెంబర్‌లోని పోరంబోకు(ప్రభుత్వ)భూమిలో 36.32 ఎకరాల విస్తీర్ణం కబ్జాలకు గురైందని తేలింది. ఈ మేరకు సమగ్ర నివేదికను(డీటెయిల్డ్ నివేదిక) జాయింట్ కలెక్టరుకు సమర్పించగా, దీనిపై భూ ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు స్వయంగా సర్వేయర్ ఈ ఏడాది జనవరి 31న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే తహశీల్దార్ అవినీతితో కబ్జాదారులకు సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

కాగా ఇదే అంశంలో తహశీల్దార్ స్వయంగా సర్వేయర్‌ను బెదిరించి ప్రభుత్వ భూమిని వెలికి తీసిన విషయాన్ని బైట పెట్టొద్దని హెచ్చరించినట్లుగా బైటపడింది. అయితే అక్రమార్కులతో కుమ్మక్కైన తహశీల్దార్ తాజాగా పార్ట్‌లీ సర్వే నెంబర్లను డీ మార్కేషన్ చేయాలని, చిన్నచిన్న ప్లాట్లుగా డీమార్క్ చేయాలని ఒత్తిడి తెస్తున్నట్లుగా తెలిసింది. సర్వేయర్ పరిధిలో లేని విధంగా సర్వే సబ్ డివిజన్ చేయమని ఒత్తిడగి తేవడం వెనుక ప్రభుత్వ భూమిని కబ్జాదారులకు కట్టబెట్టాలనే లక్ష్యం ఉన్నట్లుగా తెలుస్తోంది. అదేవిధంగా బంజారా సేవా సదన్ నిర్మాణానికి గానూ డీమార్కేషన్ చేసిన ప్రభుత్వ భూమి 500 గజాల వివరాలను ఆయా వ్యక్తులకు తెలపవద్దని కోరినట్లుగా తెలిసింది. ఈ విషయంలో సర్వేయర్‌ను తహశీల్దార్ బెదిరించి సాంకేతిక సమస్యలు కారణాలుగా చూపుతూ బంజారా సేవా సదన్‌కు భూమిని ఇవ్వకుండా అడ్డుకునేలా చూడాలని కోరడం వెనుక ఆంతర్యం ఏమిటనే ప్రశ్నలు వస్తున్నాయి. అయితే ఇదే విషయమై బాధిత సర్వేయర్ కె కృష్ణ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ చట్ట వ్యతిరేకమైన పనులు బెదిరింపులతో చేయించాలని చూస్తున్న తహశీల్దార్ సంతోష్‌లాల్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరాడు.

ఏకకాల బదలీలు

- ఉభయ రాష్ట్రాల్లో ఉద్యోగులందరికీ వెసులుబాటు
- అంతర్‌రాష్ట్ర బదలీలలకు మార్గదర్శకాలు విడుదల
- సంయుక్త ఉత్తర్వులు జారీచేసిన ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు
- భార్యాభర్తలు ఉద్యోగులైన సందర్భాల్లో ప్రత్యేక వెసులుబాటుకు ఆదేశం
- గరిష్టంగా రెండు నెలల్లో ప్రక్రియ పూర్తిచేయాలని నిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: విభజన నేపథ్యంలో అస్తవ్యస్త పరిస్థితులకు గురవుతున్న ఉద్యోగులకు ఉపశమనం లభించింది. గత రెండేళ్ళుగా బదిలీల కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పరిస్థితుల్లో ఉభయ రాష్ట్రాలు ఏకకాలంలో స్పందించాయి. ఇందుకు సంబంధించి కేంద్రప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ చేసిన సిఫారసుల మేరకు ఇరు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు తుదినిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం సంయుక్త ఉత్తర్వులు విడుదల చేశారు.

పునర్‌వ్యవస్థీకరణ చట్టం అమల్లోకి వచ్చిన వెంటనే ఏర్పడిన రెండు రాష్ట్రాల్లో పరిపాలనా సౌలభ్యం కోసం 'వర్క్ టు సర్వ్' రూల్ ప్రకటించి ఉద్యోగులను విభజించారు. ఈ క్రమంలో తెలంగాణకు చెందిన వారు ఏపీలో, ఏపీకి చెందిన వారు తెలంగాణలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ఇదే అంశంపై ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న చిక్కుముడిని తొలగించి సామరస్యపూర్వకంగా సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర హోంశాఖ నియమించిన కమలనాథన్ కమిటీ కూడా ఇటీవల తుదినివేదికను సమర్పించింది.

రాష్ట్ర కేడర్ ఉద్యోగులతో పాటు జిల్లా, జోనల్, మల్టీ జోనల్ తదితర కేడర్లలో పనిచేసే ఉద్యోగుల విభజన, తద్వారా నెలకొనే సమస్యలపై ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. పదోన్నతులు, సర్వీసు సమస్యలు తలెత్తుతున్నాయన్న విషయాన్ని ఆయా ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్రానికి లేఖలు రాయడంతో స్పందించిన హోంశాఖ ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.

దాదాపు 9 నెలల పాటు ఇరు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి, ఉద్యోగసంఘాల నేతలతో చర్చించి, న్యాయపరమైన సమస్యలను పరిశీలించి శాశ్వత బదిలీలకు సంబంధించి నిర్దిష్టమైన సూచనలు చేసింది. వాటిని అవలంబించేందుకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు సిఫారసులు కూడా చేసింది. దీంతో రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు పరస్పరం చర్చించుకుని ఉద్యోగుల బదిలీల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ సంయుక్త ఉత్తర్వులను వెలువ రించారు.

దీంతో తీవ్రమైన ఆందోళనతో ఉన్న ఉద్యోగులందరికీ వెసులుబాటు కల్పించినట్లయింది. విభజన ముగిసి మూడేళ్ళ కాలం గడుస్తున్నా బదిలీల సమస్య ఎటూ తేలడం లేదంటూ గత కొన్ని నెలలుగా ఉద్యోగసంఘాల నాయకులు ఆయా ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతూ వచ్చారు. వాస్తవ పరిస్థితులన్నింటినీ పరిగణలోకి తీసుకుని అంతర్‌రాష్ట్ర బదిలీలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు సంయుక్తంగా ఒకే మార్గదర్శకాలను జారీచేశాయి. స్థానిక, జిల్లా, జోనల్, మల్టీ జోనల్ కేడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ తమ తమ బదిలీలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవలసిందిగా అనుమతించారు.

స్థానికత ఆధారంగా భార్యాభర్తలు ప్రభుత్వోద్యోగులుగా ఉభయ రాష్ట్రాల్లోగానీ, వేర్వేరు జిల్లాల్లోగానీ పని చేస్తున్న కేసుల్లో వారికి ప్రత్యేక అవకాశం కల్పించారు. అన్ని స్థాయిల్లో పరస్పర బదిలీలు కూడా చేయవచ్చునని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన స్టేట్ కేడర్ ఉద్యోగులకు ఇదే తుది అవకాశమని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పూర్తిగా స్టేట్ అడ్వయిజరీ కమిటీ పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు. ఒకే కేడర్‌కు చెందిన ఉద్యోగులు రాష్ట్రాలు మారాలంటే ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు వేకెన్సీని స్పష్టంగా చూపించాల్సి ఉంటుందని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.


ఉపాధ్యాయులు ప్రత్యేక సందర్భాలలో అంతర్‌రాష్ట్ర బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు అనుమతిస్తామన్నారు. అవి కూడా పరస్పరం బదిలీకి అంగీకారం తెలియజేస్తేనే అవకాశం ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన ప్రొఫార్మాను కూడా విడుదల చేశారు. గరిష్టంగా రెండు నెలల్లోగా ఈ బదిలీ ప్రక్రియను పూర్తి చేయవలసిందిగా అన్ని శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లకు ఉభయ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

అన్ని మున్సిపాలిటీల్లోనూ..

స్వచ్ఛ ఆటో టిప్పర్ల పథకం

- ఇంటింటి చెత్త సేకరణే లక్ష్యం • సీఎం ఆశయాలకు అనుగుణంగా అడుగులు వేస్తున్న మున్సిపల్‌శాఖ • 100శాతం చెత్తరహిత రాష్ట్రంగా తెలంగాణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇక అన్ని స్థానికపట్టణ సంస్థల పరిధిలో స్వచ్ఛ ఆటో టిప్పర్ల పథకాన్ని అమలు చేయాలని యోచిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ పథకాన్ని జీహెచ్ఎంసీ పరిధిలో విజయ వంతం అమలు చేస్తోంది. దీని కింద ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణను ఆటో ట్రాలీల ద్వారా సేకరిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆశించిన విధంగానే ఈ పథకం కిం ద ఫలితాలు వస్తున్న నేపథ్యంలో త్వరలోనే రాష్ట్రంలోని మిగిలి న మున్సిపాలిటీల్లోనూ ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభు త్వం నిర్ణయించింది. మున్సిపాలిటీలపై ఎలాం టి ఆర్థిక భారం పడకుండానే ఈ కార్య క్రమాన్ని అమలు చేసి వంద శాతం స్వచ్ఛ తెలంగాణ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మున్సి పల్ శాఖ అధికారులు శరవేరంగా కసరత్తు చేస్తున్నారు.



స్వచ్ఛ ఆటో టిప్పర్ డ్రైవర్ కమ్ ఓనర్ పథకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ 2015 నవంబర్‌లో జీహెచ్ఎంసీలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. దీని కింద సుమారు రెండు వేల టిప్పర్లను అర్హులైన లబ్దిదారులకు అందజేశారు. ఇంటింటికి వెళ్ళి చెత్త సేకరిస్తున్న ట్రైసైకిళ్ళ స్థానంలో ఆటో ట్రాలీలను ప్రవేశపెట్టారు. నాటి నుంచి నేటి వరకు ఈ కార్యక్రమం అమలులో ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకపోవడంతో అన్ని మున్సిపాలిటీల్లో అమలు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ టికె. శ్రీదేవి రెండు రోజుల క్రితం రూపొందించిన ముసాయిదా మార్గదర్శకాలను లెటర్ల ద్వారా మున్సిపల్, కార్పొరేషన్ల మేయర్లకు, కమిషనర్లకు పంపారు. దీనిపై తగు సూచనలు, సలహాలు పంపాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని సిఎం కేసీఆర్ చాలా పట్టుదలతో ఉన్న నేపథ్యంలో వెంటనే స్వచ్ఛ ఆటో టిప్పర్ల లబ్దిదారులను గుర్తించే ప్రక్రియను చేపట్టాలన్నారు. సుమారు 650 నుంచి 750 ఇళ్ళకు ఒక ఆటో టిప్పర్‌ను కేటాయించే విధంగా రూట్లను కూడా గుర్తించాలని శ్రీదేవి ఆదేశించారు. నిర్దిష్ట సమయంలోనే చెత్తను సేకరించి దానిని ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలించే విధంగా పాయింట్ల (చెత్త నిలువ కేంద్రాలు)ను కూడా ఎంపిక చేయాలని ఆ లేఖలో శ్రీదేవి కోరారు. రాష్ట్రంలోని అన్ని స్థానికసంస్థల పరిధిలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఇప్పటికే సిఎం కేసీఆర్ పలువార్లు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. కనీస సౌకర్యాల కల్పనలో యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పారిశుద్ధ్యం విషయంలోనూ అంతే బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను తడి,పొడి డబ్బాల ద్వారా చెత్తను సేకరించడంతో పాటు దానిని ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు వెనువెంటనే తరలించాలన్నారు. తద్వారా రహదారుల్లో చెత్త అనేది కనిపించకుండా చూడాలని స్పష్టంగా సూచించారు. పైగా 2016 ఎంఎస్‌డబ్ల్యూ నిబంధనల ఆధారంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటీ) కూడా చెత్త సేకరణలో మెరుగైన విధానం అవలంభించి తిరిగి దానిని విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగపడే విధంగా లక్ష్యాలను రూపొందించుకోవాలని సూచించింది. ఈ నేపథ్యంలో స్థానిక పట్టణ సంస్థల పరిధిలోని అర్హులైన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడం కూడా ఈ పథకంలో ఒక భాగంగా రూపొదించారు. అవసరమైతే ఆటో ట్రాలీలకు అవసర మైన రుణాలను బ్యాంకులద్వారా లబ్ధిదారులను అందించేబాధ్య తను కూడా మున్సిపల్ కార్పొరేషన్లు తీసుకోనున్నాయి. ఈ రుణాలను ఐదేళ్ళ గడువులోగా తీర్చేవిధంగా లబ్ధిదారులు, బ్యాం కులు, స్థానిక సంస్థలు కలిసి ఒక అగ్రిమెంట్‌ను కూడా కుదుర్చు కోనున్నాయి. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్నందుకుగానూ స్థానికసంస్థలు నిర్ణయించిన విధంగా ఆటో ట్రాలీ డ్రైవర్ వసూలు చేసుకుంటారు. తద్వారా ప్రతినెలా సదరు డ్రైవర్‌కు సుమారు 25వేల రూపాయల ఆదాయం లభించే విధంగా ప్రణాళికలను రూపొం దించారు. అలాగే చెత్త నుంచి తిరిగి ఉపయోగపడే వస్తువుల ను విక్రయించడం వల్ల వచ్చే ఆదాయం కూడా సదరు డ్రైవర్‌కు లభించ నుంది. తద్వారా ఆటో ట్రాలీడ్రైవర్ ప్రతినెలా బ్యాంకు రుణాన్ని సకలంలో చెల్లించడంతో పాటు తన కుటుంబ ఆర్థిక అవసరాలను కూడా తీర్చేందుకు వీలయ్యే విధంగా మార్గదర్శకాలను రూపొం దించారు. మొత్తానికి ఈ పథకం కింద నిరుద్యోగ యువతను ఆదుకోవడంతో పాటు పారిశుద్ధ్య రాష్ట్రంగా తీర్చిదిద్దనున్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

బుధవారం 9 ఆగస్టు 2017

మంచిమాట అహం, ఆశ, నిరాశలు లేకుండా నిరపేక్షగా సమస్యలను పరిశీలిస్తే అవి తప్పక పరిష్కారమవుతాయి. ● జిడ్డు కృష్ణమూర్తి

ఆదాయం పన్ను చెల్లింపు దారుల రిటర్న్‌లు పెరిగితే ఆదాయం కూడా పెరగాలి. ఆ విధంగా కూడా ప్రజలకు మేలు చేకూరాలి. ప్రభుత్వం నిర్వహించే పొదుపు, సంక్షేమ పథకాలు ప్రజలకు ఉపయోగపడినప్పుడే వాటికి సార్థకత చేకూరుతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రతినెలా చివరి ఆదివారం ఆకాశవాణి మన్‌కీబాత్ కార్యక్రమంలో పేదలు, వృద్ధులు, మహిళలు, సమాజంలో బలహీనవర్గాల కోసం సంక్షేమ పథకాలను అమలు జేస్తోందని పదే పదే చెబుతున్నారు. అసలు ఏ ఆధారం లేని వారి కోసం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను గాడిలో పెట్టేందుకు వాటి ఫలాలు లబ్ధిదారులకు నేరుగా చేరేట్టు చేయడం కోసమే ప్రతి పథకానికీ ఆధార్‌ని అనుసంధానం చేస్తున్నారు.

సేవింగ్స్ వడ్డీ రేట్ల కత్తిరింపు న్యాయమా?

పొదుపును ప్రోత్సహిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం పొదుపు పథకాలపై వడ్డీరేట్లను తగ్గించడం ఎంతవరకు సమంజసం? పెద్ద నోట్ల రద్దు వల్ల ప్రభుత్వం ఆశించినట్టే నల్లధనం అదుపులోకి వచ్చిందన్న ప్రభుత్వ వివరణ కూడా హేతుబద్ధంగా లేదు. నల్లధనాన్ని అరికట్టినట్టయితే, ఆ మేరకు సామాన్యులపై భారం తగ్గాలి, సామాన్యులకు ఊరట కలిగించే పథకాలపై వడ్డీ రేట్లు యథాతథంగా ఉండాలి. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. పెద్ద కరెన్సీ రద్దు తర్వాత ఆదాయం పన్ను చెల్లింపుదారులు 25 శాతం పెరిగారని కూడా ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఆదాయం పన్ను చెల్లింపు దారుల రిటర్న్‌లు పెరిగితే ఆదాయం కూడా పెరగాలి. ఆ విధంగా కూడా ప్రజలకు మేలు చేకూరాలి. ప్రభుత్వం నిర్వహించే పొదుపు, సంక్షేమ పథకాలు ప్రజలకు ఉపయోగపడినప్పుడే వాటికి సార్థకత చేకూరుతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రతినెలా చివరి ఆదివారం ఆకాశవాణి మన్‌కీబాత్ కార్యక్రమంలో పేదలు, వృద్ధులు, మహిళలు, సమాజంలో బలహీనవర్గాల కోసం సంక్షేమ పథకాలను అమలు జేస్తోందని పదే పదే చెబుతున్నారు. అసలు ఏ ఆధారం లేని వారి కోసం ఉద్దేశించిన సంక్షేమ పథకాలను గాడిలో పెట్టేందుకు వాటి ఫలాలు లబ్ధిదారులకు నేరుగా చేరేందుకు ప్రతి పథకానికీ ఆధార్‌ని అనుసంధానం చేస్తున్నారు. అసలైన లబ్ధిదారులకే ప్రయోజనం చేకూరాలన్న ప్రభుత్వ ఉద్దేశ్యం మంచిదే కానీ, ఆధార్ కార్డులు ఇంకా లభించని వారి సంగతిని ప్రభుత్వం ఆలోచించినట్టు లేదు. అలాగే, రిటైర్డ్ ఉద్యోగులు, చిన్న రైతులు బ్యాంకుల్లో దాచుకునే డిపాజిట్లపై వడ్డీ రేట్లను తగ్గించడం వల్ల వారికి లభించే ఆదాయానికి కత్తెర వేయడమే. మరో వంక పెద్ద వ్యాపారస్తులు, పారిశ్రామిక వేత్తలకు ఇచ్చిన రుణాలను భారీ మొత్తంలో మాఫీ చేసేందుకు ప్రభుత్వం వెనకాడటం లేదు. ప్రకృతి వైపరీత్యాలకు తీవ్రమైన కష్టనష్టాలకు గురి అయ్యే రైతులు రుణ మాఫీ కోసం ఆందోళన చేస్తే వారిపై కాల్పులు జరిపించేందుకు కూడా వెనుకాడరన్న విషయం మధ్యప్రదేశ్‌లో రుజువైంది. మోడీ పరివార్‌లో సభ్యుడైన శివరాజ్‌సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్న మధ్యప్రదేశ్‌లోని మందసార్‌లో కాల్పులు జరిగిన సంఘటనలో ముగ్గురు రైతులు మరణించిన ఘటన ఇంకా మన స్మృతి పథంలోనే ఉంది. అదే సందర్భంలో కార్పొరేట్, పారిశ్రామిక సంస్థలకు రుణాల రద్దు విషయంలో ప్రభుత్వం ఔదార్యాన్ని ప్రదర్శిస్తోంది. ఇది ప్రతిపక్షాల ఆరోపణ కాదు. రిజర్వుబ్యాంకు రూపొందించిన నివేదికను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసింది కార్పొరేట్, పారిశ్రామిక సంస్థలకు ఇచ్చిన రుణాల్లో 2.5 లక్షల కోట్ల రూపాయిలను రద్దు చేసినట్టు ఈ నివేదికలో రిజర్వు బ్యాంకు పేర్కొంది.ఇందులో ప్రభుత్వ బ్యాంకులకు రారాజు అయిన స్టేట్ బ్యాంకు రద్దు చేసిన రుణాలే ఎక్కువగా ఉన్నాయి. స్టేట్ బ్యాంకు,మరో 26 బ్యాంకులు గత సంవత్సరం 81, 683 కోట్ల రూపాయిల రుణాలను రద్దు చేశాయి. గడిచిన ఐదేళ్ళలో ఇది గరిష్ఠం. కార్పొరేట్ సంస్థలకు సబ్సిడీలు కూడా ఎక్కువే. తయారీ రంగాన్నీ, ఉత్పాదక రంగాన్నీ ప్రోత్సహించడం కోసం సబ్సిడీలు తప్పవంటూ సన్నాయి నొక్కులు నొక్కే పాలకులు రైతులకు ఎరువుల సబ్సిడీలో కత్తిరింపు వేయడానికి, పేదలకు అందించే వంటగ్యాస్, కిరోసిన్ వంటి నిత్యావసరాల సబ్సిడీలను తగ్గించడానికి ఆలోచనలు చేస్తూ ఉంటాయి. వంటగ్యాస్ సబ్సిడీ భారాన్ని వదిలించుకోవడానికి మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు. పూర్వపు యూపీఏ ప్రభుత్వం సంవత్సరానికి ఇచ్చే సిలిండర్ల సంఖ్యను పన్నెండు నుంచి తొమ్మిదికి తగ్గించి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మహిళల ఆగ్రహానికి గురి అయింది. తమకు కూడా అలాంటి పరిస్థితి వస్తుందన్న వెరుపుతో మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలకు చెందిన మహిళలు స్వచ్ఛందంగా వంటగ్యాస్ సబ్సిడీని వదులుకోమని పిలుపు ఇచ్చారు. అది బాగా పని చేసింది. దాంతో సబ్సిడీపై సరఫరా చేసే వంటగ్యాస్ ధరను నెలకు నాలుగు రూపాయిల చొప్పున పెంచాలని నిర్ణయించారు. ఇది కూడా ప్రజలపై భారం మోపడమే. ఇక బ్యాంకుల వడ్డీ రేట్లు తగ్గించడం కూడా పారిశ్రామిక, కార్పొరేట్ వర్గాలకు మేలుచేకూర్చే అంశమే. ప్రజలు దాచుకున్న సొమ్ముకు ప్రభుత్వ బ్యాంకుల్లో భద్రత ఉంటుందని మధ్యతరగతి వర్గాలు స్టేట్‌బ్యాంకుల్లో మదుపు చేస్తుంటారు.అయితే, పొదుపు పథకాలపై స్టేట్ బ్యాంకు వడ్డీ రేట్లలో 50 బేసిక్ పాయింట్లలో కోత విధించి మధ్యతరగతి వర్గాల ఆశలపై నీళ్ళు చల్లింది. మరో వంక పారిశ్రామిక,కార్పొరేట్ వర్గాలకు ఇచ్చే రుణాలపై వెసులుబాట్లు కల్పిస్తోంది. స్టేట్ బ్యాంకు బాటలోనే ఇతర బ్యాంకులు కూడా వడ్డీ రేట్లు తగ్గిస్తున్నాయి. దాంతో చిన్న మొత్తాల మదుపుదారులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులు, మనీ లెండింగ్ సంస్థల వైపు వెళ్ళక తపని పరిస్థితి ఏర్పడుతుంది. అలా వెళ్ళి చేతులు కాల్చుకుంటున్న వారి దీనగాథలను రోజూ నిరంతర వార్తా స్రవంతుల్లో చూస్తూనే ఉన్నాం, వింటూనే ఉన్నాం. చిట్‌ఫండ్, మనీలెండింగ్ సంస్థల్లో మదుపు చేసి చితికిపోయిన మధ్యతరగతి వారి గాథలు కోకొల్లలు. ప్రైవేటు బ్యాంకుల పోటీ పెరిగినప్పుడు ప్రభుత్వ బ్యాంకులు కూడా వాణిజ్యపరంగా నడపడం అనివార్యం కావచ్చు. కానీ, ప్రైవేటు బ్యాంకులు కూడా ప్రభుత్వ అజమాయిషీలో పని చేస్తున్నవేనన్న సంగతి మరిచి పోరాదు. అలాంటప్పుడు ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకోవల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రైవేటు వడ్డీ వ్యాపారులు, కాల్‌మనీ వ్యాపారులు, చిట్‌ఫండ్ వ్యాపారులపై ప్రభుత్వాలకు అదుపులేదన్న విషయం తెలుగురాష్ట్రాల్లో తరచూ బయటపడే ఉదంతాలే ప్రత్యక్ష నిదర్శనాలు. అటువంటి వారి ఉచ్చులో పడకుండామధ్యతరగతి మదుపరులకు ప్రభుత్వమే ఇతోధికమైన రీతిలో వడ్డీ రేట్లు ఇచ్చి ప్రోత్సహించాలి. అరవై ఏళ్ళ పైబడిన వృద్ధులకు పోస్టాఫీసు సేవింగ్స్‌లో వడ్డీ రేటు ఏడాది క్రితం 9.6 శాతం ఉండేది. ఇప్పుడది 8.3 శాతానికి ప్రభుత్వం తగ్గించింది. ఒక వైపుఆదాయం ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నట్టు ప్రకటనలతో హోరెత్తిస్తున్న ప్రభుత్వం పొదుపు పథకాల వడ్డీ రేట్ల కత్తిరింపులు ఎందుకన్న ప్రశ్న సహేతుకమైనదే.

అసమానతలను అణిచేయాలి

క్విట్ ఇండియాకు 75 ఏళ్ళు

స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన ఘట్టమైన క్విట్ ఇండియా ఆందోళనకు మహాత్మాగాంధీ పిలుపు ఇచ్చి సరిగ్గా నేటికి 75ఏళ్ళు.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నేటి నుంచి సెప్టెంబర్ ఒకటవ తేదీ వరకూ దేశవ్యాప్తంగా జనాన్ని జాగృతం చేసే కార్యక్రమాలను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం పిలుపు ఇచ్చింది. ప్రధానిగా నరేంద్రమోడీ అధికారాన్ని చేపట్టిన నాటి నుంచి 2017లో క్విట్ ఇండియా 75వ వార్షికోత్సవాలనూ, 2022లో స్వాతంత్ర్య సాఫల్య 75వ వార్షికోత్సవాలను జరుపుకోవాలని పిలుపు ఇస్తూనే ఉన్నారు. ముంబాయిలో గౌలియా ట్యాంక్ వద్ద ప్రస్తుతం ఆగస్టు క్రాంతి మైదానంగా పిలవబడుతున్న ప్రదేశంలో 1942లో అఖిల భారత కాంగ్రెస్ మహాసభలు (ఎఐసిసి) ఆగస్టు 8వ తేదీన ప్రారంభమయ్యాయి. రేపటినుంచి (ఆగస్టు 9వ తేదీ) క్విట్ ఇండియా ఆందోళన జరపాలని గాంధీజీ పిలుపు ఇచ్చారు. శ్వేత జాతీయుల జాత్యహం కార ధోరణులకు వ్యతిరేకంగా గాంధీజీ స్వాతంత్ర్య సమరాన్ని నడిపించారు. బ్రిటిష్ వారి పాలనలో భారత ప్రజలు ఎటువంటి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకూ, పౌరహక్కులకూ నోచుకోకుండా ద్వితీయశ్రేణి పౌరులుగా జీవించేవారు. మన సంపదను కొల్లగొట్టుకుని పోతూ మనపై ఏదో దాక్షిణ్యం చూపినట్టు బ్రిటిష్ పాలకులు మన మేధావులూ, సాంకేతిక నిపుణుల సేవలనూ వినియోగించుకునే వారు. ఉన్నత పదవులన్నీ వారికీ, వారికింద పని చేసేవారంతా భారతీయులు. ఈ మాదిరి వివక్ష ఎంత కాలం అని ఆనాటి ఎఐసిసి మహాసభలో గాంధీజీ ప్రశ్నించారు. బ్రిటిష్ వారిని పారద్రోలేందుకు చావైనా రేవైనా సంసిద్ధం కావాలని ప్రజలకు పిలుపు ఇచ్చారు. ఆనాడు గాంధీజీ మాట అంటే ప్రజలందరికీ శిరోధార్యం. ఎంతో పలుకుబడి, సంపాదన కలిగిన వారంతా తమ వృత్తులనూ, వ్యాపకాలనూ వీడి ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొన్నవారిలో తెలుగువారు కూడా ఎంతో మంది ఉన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వంటి ప్రముఖులు స్వామి రామానందతీర్థ నాయకత్వంలో ఈ ఆందోళనలో పాల్గొనగా, ఆంధ్ర ప్రాంతంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నేతృత్వంలో ఎంతో

మంది వైద్యులు,న్యాయవాదులు తమ వృత్తులను వీడి ఈ ఉద్యమంలో ప్రవేశించారు. మరో ఐదేళ్ళలో దేశానికి స్వాతంత్ర్యం వస్తుందని తెలియకపోయినా, గాంధీజీ మాటే శిరోధార్యంగా వారంతా స్వాతంత్ర్య సమరంలో ప్రవేశించారు. ఈ ఉద్యమంలో పాల్గొన్నవారి మధ్య విభేదాలను సృష్టించడానికీ, ఉద్యమాన్ని బలహీన పర్చడానికి బ్రిటిష్ పాలకులు ఎన్నో పన్నాగాలు పన్నారు. విభజించి పాలించు అనేది బ్రిటిష్ వారి విధానం.దానిని ఈ ఉద్యమం సందర్భంగా బ్రిటిష్ పాలకులు అమలు జేశారు.

ఆనాడు ముంబాయిలో ఎఐసిసి మహాసభ జరిగిన మైదానానికి ఆగస్టు క్రాంతి మైదానంగా నామకరణం చేశారు. ఆ మైదానంలో ఎఐసిసి మహాసభల సందర్భంగా అప్పటికే అరుణతారగా ప్రసిద్ధురాలైన అరుణా ఆసాఫ్‌అలీ జాతీయజెండాను ఆవిష్కరించారు.



వివక్షకు వ్యతిరేకంగా ....

ఆగస్టు 9వ తేదీన ఆగస్టు క్రాంతిదివస్‌గా నిర్వహించాలని నిర్ణయించారు. సమాజంలో మహిళలు, దళితులు, నిమ్నవర్గాలు, బలహీనవర్గాలు, సామాజికంగా, ఆర్థికంగా ఎటువంటి ఆధారం లేని వారి కోసం కృషి చేయాలనీ, అన్ని రకాల వివక్షలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని ఆ మహాసభల్లో తీర్మానించారు. ఆగస్టు క్రాంతి మైదానంలో జరిగిన మహాసభల్లో మన తెలుగు వారు అనేక మంది పాల్గొన్నారు. ముంబాయి పర్యటనకు వచ్చినప్పుడల్లా గాంధీజీ మణిభవన్‌లో బస చేసేవారు.ఆ మణిభవన్‌కి సమీపంలోనే క్రాంతి మైదాన్ ఉంది.స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో అత్యంత ప్రధానమైన ఘట్ట మైన క్విట్ ఇండియా దివస్‌ని పరిగణించడం అప్పుడే ప్రారంభమైంది. గాంధీజీ అంతకు ముందు నిర్వహించిన ఉద్యమాలు పరిమితమైన ప్రయోజనాలకు మాత్రమే ఉద్దేశించ బడినవి. ఉదాహరణకు దిండి సత్యాగ్రహంగా ప్రసిద్ధి చెందిన ఉప్పు సత్యాగ్రహం కేవలం ఉప్పు మీద పన్నును వ్యతిరేకించడానికి ఉద్దేశించిందే. అలాగే, విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమమూనూ.

అహింసే ఆయుధం

క్విట్ ఇండియా ఉద్యమానికి అంత ఖ్యాతి రావడానికి కారణం సమాజంలో వ్యాపారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలకు చెందినవారు అన్ని వర్గాలకు చెందిన వారు పాల్గొన్నారు. గాంధీజీ పిలుపునకు వీరంతా స్పందించిన తీరు బ్రిటిష్ వారిని సైతం ఆశ్చర్యపర్చింది. గాంధీజీ రూపంలో పెద్ద ఆకర్షణ లేకపోయినా, ఆయన మాటల్లో సత్యసంధత ఉంది.ఆయనపిలుపే ప్రభంజనంగా సాగింది.

ఆయనలోని నిజాయితీ, చిత్తశుద్ధి,నిబద్ధత కారణంగా ఆయన పిలుపునకు అంత శక్తినిచ్చింది.కొల్లాయి గట్టితేమి మా గాంధీ అంటూ తెలుగునాట ఆరోజుల్లో గీతాలు కూడా వచ్చాయి. ఊకదంపుడు ఉపన్యాసాలకు వారెంత మాత్రం ప్రభావితులు కారు.గాంధీజీని జనం విశ్వసించడానికి ఆయన నిజాయితీయే ప్రధాన కారణం. గాంధీజీ నిర్వహించిన సత్యాగ్రహాలన్నీ సఫలీకృతం కావడానికి ఆయన ముందు వరుసలోఉండి నడిపించడమే.తన వెంట జనాన్ని నడిపించగలిగే వాడే నాయకుడన్నానుడి గాంధీజీ నుంచే వచ్చింది.

అజాద్ హింద్ ఫౌజ్

గాంధీజీ క్విట్ ఇండియా పిలుపు ఇచ్చిన రోజునే బ్రిటిష్ వారితో సాయుధ సమరానికి అజాద్ హింద్ ఫౌజ్‌ని ఏర్పాటుచేస్తున్నట్టు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రకటించారు. బోస్ మార్గం వేరైనా ఆయనను గాంధీజీ ఎంతో గౌరవించేవారు.అలాగే, బోస్‌కి కూడా గాంధీజీ అంటే ఎనలేని గౌరవం. ఆరోజుల్లో నాయకుల మధ్య అభిప్రాయ భేదాలున్నా, అందరి గమ్యం ఒకటే కనుక, గౌరవాన్ని ఇచ్చిపుచ్చుకునే వారు. స్వార్థం ఇసుమంతైనా వారిలో ఉండేది కాదు కనుక,అపార్థాలను చేసుకోవడానికి ఆస్కారమే లేదు. నేతాజీ మాత్రమే కాకుండా, బ్రిటిష్ వారిని పారద్రోలేందుకు సాయుధ పోరాటమే శరణ్యమని ఉత్తరాదిన ఝాన్సీ లక్ష్మీబాయ్, తెలుగునాట అల్లూరి సీతారామరాజు,కొమరం భీం,తమిళనాడులో వీరపాండ్య కట్టబొమ్మన్,కన్నడసీమలో రాణి చెన్నమ్మ వంటి వారు తమ ప్రాణాలు ఒడ్డి పోరాటం సాగించారు. అయితే, అహింసా మార్గమే సరైనదని గాంధీజీ నిరూపించారు.అందుకు కఠినమైన నిబద్ధత,వజ్ర సంకల్పం అవసరమని ఆయన రుజువు చేశారు.భారత రాజ్యాంగంపై బ్రిటిష్ ప్రభుత్వం క్రిప్స్‌ని రాబాయబారానికి పంపింది.అది విఫలం కావడంతో క్విట్ ఇండియాకు గాంధీకి పిలుపు ఇచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం మినహా మరి ఏది ఇచ్చినా సమ్మతం కాదని గాంధీజీ స్పష్టం చేశారు.

అవే పరిస్థితులు

డబ్బైఐదేళ్ళ నాడు పరాయి పాలనలో ఎలాంటి పరిస్థితులు నెలకొని ఉన్నాయో,ఇప్పటికీ అలాంటివేఉన్నాయి. అన్నింటి కన్నా ప్రజల మధ్య తేడాలుండరాదన్న గాంధీజీ ప్రబోధాన్ని ఆయన వారసులే తుంగలోకి తొక్కారు. కుల,మతం,జాతి,ప్రాంతీయ వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉంది.అసహన ధోరణులు ఇప్పటికీ పెల్లుబికుతున్నాయి. దేశంలో ఏ పౌరుడైనా,ఎక్కడైనా ఉపాధి పొందే హక్కును మన రాజ్యాంగం కల్పించినప్పటికీ, ఎక్కడికక్కడ ప్రాంతీయ ధోరణులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.పరాయి పాలనే మెరుగనే స్థితికి జనాన్ని తీసుకుని వెళ్తున్నారు.

హక్కులన్నీ నీటమీద రాతలేః. విద్యాహక్కు, ఉపాధి హక్కు వంటి ప్రాథమిక హక్కులన్నీ నీటిమీద రాతలయ్యాయి.విద్యా సంస్థల్లో,ఉద్యోగాల్లో ,పబ్లిక్ ప్రదేశాల్లో మహిళలపట్ల వివక్షకొనసాగుతూనే ఉంది. మహిళలను గౌరవంగా చూస్తేనే సమాజం సుఖసౌఖ్యాలతో పరిఢవిల్లుతుందని గాంధీజీ ప్రబోధించారు. కాని,మహిళలపై ప్రతినాలుగు నిమిషాల్లో అత్యాచారం చోటు చేసుకోవడం ఏడు దశాబ్దాల స్వతంత్ర పాలనలో మనం సాధించిన ప్రగతి. ఉద్యోగాల్లో మహిళలు పోటీ పడటమే కాకుండా,కొన్నింట ముందుకు దూసుకుని పోతున్న మాట నిజమే కానీ, అందుకు తగిన భద్రత వారికి లభించడం లేదు. పాశ్చాత్య

సంస్కృతీ ప్రభావంనేటి తరంపై మిక్కుటంగా ఉంది.దళితులు,సమాజంలో అట్టడువర్గాలపై దాడులు నిత్యకృత్యాలయ్యాయి.గో రక్షకుల పేరిట హింసకు పాల్పడితే సహించేది లేదని

ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వయంగా హెచ్చరించారు.

సమాజంలో పలుకుబడి, ఆర్థిక పరమైన ఉన్నత స్థితి కలిగిన వారంతా అట్టడుగు వర్గాల పట్ల అత్యంత క్రూరంగా వ్యవహరిస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం అభివృద్ధి ఎంత జరిగినా,దాని ఫలాలు సామాన్యులకు దక్కడం లేదు.సంపద పంపిణీ జరగాలన్న మాట ప్రతిపాలకుని నోటంట వస్తోంది తప్ప అది అమలు జరగడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే పిల్లికి గంట కట్టేవారెవరనే ప్రశ్న ప్రతి సందర్భంలోన తలెత్తుతోంది.నిరసన తెలిపే హక్కుకు కూడా నేటి పౌరులు నోచుకోకపోవడం,ఏకపక్షనిర్ణయాలు, ఏకపక్ష పాలన సాగడాన్ని కళ్ళారా చూస్తున్నాం.ఆనాడు బ్రిటిష్ పాలకులను వైదొలగమని క్విట్ ఇండియా అనే పిలుపును గాంధీజీ ఇచ్చారు. సమాజంలో దురాచారాలు, అవాంఛనీయ ధోరణులను పారద్రోలాలని క్విట్ ఈవిల్స్ పిలుపును ఇవ్వాల్సిన అవసరం నేడుఎంతైనా ఉంది.

పెదనందిపాడు ఉద్యమం

గాంధీజీ పిలుపుపై 1922లో జరిగిన సహాయ నిరాకరణ ఉద్యమం తెలుగువారిని ఎంతో ప్రభావితం చేసింది. పన్నుల నిరాకరణ ఉద్యమంలో దేశం మొత్తం మీద గుంటూరు జిల్లా పెదనందిపాడు అగ్రస్థానంలో నిలిచింది.అలాగే, చీరాల,పేరాల ఉద్యమం కూడా స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ముఖ్య ఘట్టం. అహింసామూర్తి అయిన గాంధీజీ ఆగస్టు క్రాంతి మైదాన్‌లో ఇచ్చిన ఉపన్యాసం ఆ మహాసభలకు హాజరైన వారినే కాక,దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలను సహాయ నిరాకరణ వైపు మరలించింది. సహాయ నిరాకరణ అంటే బ్రిటిష్ వారికి సహాయ పడవద్దన్నది గాంధీజీ పిలుపుఆంతర్యం. అయితే, నేటి వారు కూడాస్వంత ప్రభుత్వానికే సహాయ నిరాకరణ చేస్తున్నారు.ఏడు దశాబ్దాల్లో వచ్చిన మార్పు అది.

అసహన ధోరణులు

ప్రజాస్వామ్య పాలన అమలులోకి వచ్చి ఏడుదశాబ్దాలు అయినా, ప్రజాస్వామ్య స్ఫూర్తిని పాలకులు వంటబట్టించుకోలేదు. నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరునికీఉంది.అయితే,రాజ్యాంగ పరిధిలోనే నిరసనలూ,ఆందోళనలూ సాగాలి. కానీ, ప్రజల్లో కూడా ఆ స్ఫూర్తి పాదుకొనలేదు.ఇందుకు పాలకులే బాధ్యులు.ప్రజల హక్కులను కాలరాసే ప్రయత్నాలు జరిగినప్పుడు సహజంగానే వారిలో తిరుగుబాటు స్వభావం పెల్లుబికుతుంది. అలాంటి వాతావరణం ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారు.ప్రజల్లో అభద్రతా భావాన్ని తొలగించేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి.మహిళలు,బలహీన వర్గాలు, ఎటువంటి ఆధారం లేని వారికి భరోసా కలిగించే చర్యలు తీసుకోవాలి.పథకాలు, కార్యక్రమాలు మొక్కుబడిగా కాకుండా, వాటి అమలులో సంబంధిత వర్గాలను భాగస్వామ్యం చేయాలి.జవాబుదారిని నిర్ధారించాలి. జనంలో జవాబుదారిని నిర్ధారించాలి.ఇందుకోసమే తాను కృషి చేస్తున్నట్టు ప్రధానమంత్రి నరేంద్రమోడీ పదే పదే స్పష్టం చేస్తున్నారు.అందుకే ఆయనపై దేశంలోని అన్ని ప్రాంతాల వారూ విశ్వాసాన్ని ఉంచుతున్నారు.దానిని కాపాడుకోవడానికి ఆయన ప్రయత్నించాలి.ఇంతవరకూ ఆయన తీసుకున్న చర్యలూ. ప్రవేశపెట్టిన పథకాలు,కార్యక్రమాలు పూర్తిగావిజయవంతంఅయ్యాయని ఆయన సైతం చెప్పలేరు. పథకాల అమలులో అందరినీ కలుపుకుని పోయే తత్వంఅలవడాలి,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం ఉండాలి. ప్రధానమంత్రి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మేక్ ఇన్ ఇండియా,స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలు ప్రచారానికే పరిమితం అవుతున్నాయి.ఈ ధోరణి మారాలి. పథకాలకు ప్రచారం అవసరమే కానీ, కేవలం ప్రచారం ద్వారానే పథకాలు విజయవంతం అయినట్టు ప్రజలనునమ్మింప చూస్తేఆ ప్రయత్నం బెడిసి కొడుతుంది. క్విట్ ఇండియా స్ఫూర్తితో సమాజం నుంచి వివక్షతలనూ,అసమానతలనూ, అంటరానితనాన్ని పారద్రోలేందుకు క్విట్ ఈవిల్స్ పేరిట జాతి జనులంతా కంకణ బద్ధులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-ఎ.పి. స్వామి

అభివృద్ధిని కదిలిస్తున్న అవినీతి?

పాఠకీయం

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలోని ప్రభుత్వ కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారాయి. సామాన్య ప్రజానీకం తమ పనుల నిమిత్తం మండల, డివిజన్, జిల్లా కేంద్రాలలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే పైసలివ్వనిదే ఫైలు కదలదు. చేతులు తడిపితేనే పనవుతుంది. లంచాలకు అలవాటుపడిన అధికారులు ప్రతీ పనికి ఓ రేటును నిర్ణయించి ప్రజలను జలగల్లా పీడించి అక్రమసంపాదనకు మొగ్గుచూపుతున్నారు. ఒకవైపు అవినీతి నిరోధక శాఖ అధికారులు అవినీతి అధికారుల భరతం పడుతూ, అవినీతి తిమింగలాలను పట్టుకుంటున్నా అవినీతి తగ్గుముఖం పట్టడంలేదు. గత ప్రభుత్వంలో కంటే ప్రస్తుత ప్రభుత్వంలోనే అవినీతి తారాస్థాయికి చేరిందని చర్చించుకుంటున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గ సమావేశాలలో, ఉన్నతాధికారుల సమీక్షా, సమావేశాలలో అవినీతికి దూరంగా ఉండాలని ప్రతీసారి చెబుతున్నా పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పు లేదనిపిస్తోంది. ముఖ్యంగా రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్, ఖజానా కార్యాలయం, మండల ప్రజాపరిషత్, పోలీసు ట్రాన్స్‌పోర్ట్, శాఖలలో అవినీతి పెద్దఎత్తున జరుగుతోంది. ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో పౌర సేవా పత్రాలను (సిటిజన్ ఛార్టర్) అమలు చేస్తేనే అవినీతి తగ్గుముఖం పడుతుంది. అవినీతి అధికారులను కఠినంగా శిక్షించాలి. చట్టాలలో కూడా మార్పు రావాల్సిన అవసరం వుంది.

-కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట, జయశంకర్ జిల్లా



ఆదివాసీలకూ స్వయం పాలన కల్పించాలి

నేడు ఆదివాసీ తెగల దినోత్సవం

ఆదివాసీలు అడవితల్లి ముద్దుబిడ్డలు ఈ సమాజానికి మూలవారసులు. భారతదేశానికి అసలు వారసులు నీతీ నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం ఈ ఆదివాసీలు. నేడు ఈ ఆదివాసేతర (అ)నాగరిక సమాజంలో 40 సంవత్సరాల భారతావనిలో తమ అస్థిత్వం కోసం, మనుగడకోసం అల్లాడిపోతున్నారు. సంస్కృతి సాంప్రదాయాలకూ, ప్రాచీన చరిత్రకూ నీతీ నిజాయితీకి నిలువుటద్దం ఈ ఆదివాసీలు. క్రీ.శ. 1240 - 1750 మధ్యకాలంలో స్వేచ్ఛగా, స్వతంత్ర్యంగా విలసిల్లినా గోండ్వానా రాజ్యాలనూ ఏలినా ఆదివాసీలు నేడు ఈ దోపిడీ నాగరిక సమాజ పరిణామ క్రమంలో తమ అస్థిత్వం, మనుగడ కోల్పోతూ, జీవన విధానం విధ్వంసం అవుతూ అంతరించిపోతున్నారు. నేడు రాష్ట్రంలో, దేశంలో ప్రపంచంలో ఎక్కడైనా కూడా అస్థిత్వపు అంచుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఆదివాసీల సంప్రదాయక పోరాటాలనూ గుర్తించిన ఐక్యరాజ్య సమితి ఆదివాసీల వారసత్వపు హక్కులు, అటవీ వనరులు, హక్కులకూ సంబంధించి తదితర సమస్యలపై 1982 ఆగస్టు 9న జెనీవాలో 26 మంది స్వతంత్ర్య మానవ హక్కుల మేధావులతో వర్కింగ్ గ్రూప్‌ల సమావేశాన్ని నిర్వహించింది. 1992 నుండి పది సంవత్సరాల పాటు ప్రపంచవ్యాప్తంగా తిరిగి ఆదివాసీల సమస్యలనూ సమగ్రంగా అధ్యయనం చేసి, 1994 నుండి 2014 వరకు ఆ మధ్యకాలాన్ని ఆదివాసీల అభివృద్ధి కాలంగా ప్రకటించి, ఆగస్టు 9న ఆదివాసీల తెగల దినోత్సవంగా ప్రకటించింది. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో 100 దేశాలలో 5 వేల తెగలకు చెందిన 50 కోట్ల ఆదివాసీలు 6700 భాషలనూ మాట్లాడుతున్నారు. మనదేశంలో 461 ఆదివాసీల తెగలుండగా 92 శాతం మంది నేటికి అడవి పైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఐక్యరాజ్య సమితి ఆదివాసీల కోసం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం నాడు తీర్మానించిన విధానాలనూ, ప్రజాస్వామిక, ప్రభుత్వాల విధానంతో పోల్చిచూస్తే ఐక్యరాజ్య సమితినే తలదన్నేలా అత్యంత అమానుష విధ్వంసకాండ ఆదివాసీల విషయంలో పాలకవర్గాలు చేస్తున్న కుట్రలు కుతంత్రాలు మనకు కనిపిస్తాయి. ఐక్యరాజ్యసమితి తీర్మానించిన విధానాలు లక్ష్యాలు, ప్రధానంగా అందులో ఆరు ముఖ్యాంశాలు ఉన్నాయి. అవి: 1. స్వయం ఆదివాసీల స్వయం పాలన హక్కు. 2) ఆదివాసీల స్వేచ్ఛ హక్కు, 3) ఆదివాసీల మానవ హక్కుల సంరక్షణ హక్కు, 4) ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాల జీవన విధానం, భాషా వేషధారణనూ రక్షించే హక్కు, 5) ఆదివాసీల కోసం స్వయం పాలన వ్యవస్థలు ఏర్పాటు చేసే హక్కు, 6) ఆదివాసీల విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనా చర్యలకూ జీవనం పోసే హక్కుగా తీర్మానించింది. కాని వాస్తవంగా నేడు జరుగుతున్న దేమిటి? ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి ముసుగులో విధ్వంసం కాబడుతున్నది ఎవరు? అంటే ఆదివాసీ అడవి బిడ్డలే. ఆఫ్రికాలో ఆదివాసీలు ఏనాడు స్వేచ్ఛాయుతంగా బతికినా సందర్భాలు లేవు. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో, ఆస్ట్రేలియాలో, అక్కడ వాళ్ళ ఖనిజ వనరులనూ, ముడిసరుకులనూ కొల్లగొట్టడానికి అమెరికా సామ్రాజ్యవాదులు, బహుళజాతి సంస్థలు కుట్రలు పన్నుతున్నారు. ఒకప్పుడు పూర్తిగా ఆదివాసీలతో నిండిన, అమెరికా తన సామ్రాజ్యవాద పంథాలో రెడ్ ఇండియన్స్ అనే ఆదివాసీలనూ చంపి వారి సహజ వనరులనూ దోచుకొని అగ్రరాజ్యంగా అవతరించింది.

మన దేశంలో అయితే ఒక ప్రభుత్వం రాజ్యాంగ చట్టాలకూ విరుద్ధంగా ఆదివాసీలనూ నిర్వాసితులు చేస్తుంటే వ్యతిరేకించాల్సిన, ప్రజాస్వామ్య విలువలనూ చక్కబెట్టాల్సినా రాజకీయ ప్రతిపక్ష పార్టీలు ఆదివాసీలనూ ముంచటంలో మేము సైతం అనే విచిత్ర విన్యాసాలు చేస్తున్నాయి. మొదట భారతదేశంలోకి వ్యాపార వర్తకం కోసం వచ్చిన ఆర్యుల సామ్రాజ్యవాద విధానాన్ని వ్యతిరేకించటం మొదలుకొని, బ్రిటిష్ సామ్రాజ్యవాద విధానంపై విల్లు ఎక్కుపెట్టిన బిర్సాముండా, గూండాదర్‌కాను, సిద్ధా, కొమరం భీం,రాంజీగోండుల చరిత్ర నాడు రాజ్యాంగంలో 5, 6వ షెడ్యూలులో ఏర్పాటుకూ కారణమైంది. ఈ వనరులపై ఎందుకు నోరుమెదపటం లేదు. తెలంగాణాలో 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేయటం కోసం గిరిజనేతర దోపిడీని కొనసాగించటం కోసం సాదా బైనామా సృష్టించారు. ఏజెన్సీలో గిరిజనేతరులకూ అన్నిరకాల హక్కులు కల్పించి ఆదివాసీలనూ అన్ని రంగాల్లో అణగతొక్కుతున్నారు. మరోవైపు భారతదేశంలో ఆదివాసీ ప్రాంతాలలో ఉన్న గిరిజనేతర్లు ఏజెన్సీ ఆదివాసీల చట్టాలనూ, ప్రభుత్వ జీవోలనూ, ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలనూ రద్దు చేయాలని కుట్రలు పన్నుతున్నారు. ఉద్యమాలు చేస్తున్నారు. ఈ ఉద్యమాలకూ రాజకీయ పార్టీలు, ఎర్రజెండా పార్టీలు మద్దతు ఇస్తున్నారు. ఏజెన్సీలో చాలా మండలాల్లో ఎంపిపి, జడ్‌పిటిసి లుగా గిరిజనేతరులు కొనసాగుతున్నారు. నేడు ఆదివాసీల హక్కులనూ హరించే విధంగా గిరిజనేతరులు ప్రయత్నిస్తున్నారు. నేడు ఏజెన్సీలో ఎస్‌టి సర్టిఫికెట్ కావాలని, ఎస్‌టి జాబితాలో చేర్చాలని మరి కొన్ని అగ్రకులాలు ఉద్యమాలు చేయటం దానికి అన్ని రాజకీయ పార్టీలు, ఎర్రజెండా పార్టీలు మద్దతు ఇచ్చి పాల్గొనడం చూస్తే ఆదివాసీలపై ఈ పార్టీలు సవతితల్లి ప్రేమను చూపిస్తున్నాయి. వాస్తవంగా చెప్పాలంటే ఏజెన్సీ ఆదివాసుల చట్టాలనూ అన్ని పార్టీలు రద్దు చేయాలనే ఉద్దేశంతోనే ఉన్నారు. ఏ పార్టీకి ఆదివాసీ చట్టాల పైనా అవగాహన లేదు. అందుకే నేడు ఆదివాసీ సంఘాలు అన్ని కలిసి ఏజెన్సీలో గిరిజనేతరులనూ ఓటుహక్కు రద్దు చేయాలని కోరుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కూడా తెలంగాణ రాష్ట్రం ఆదివాసీలకూ శాపంగా మారింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసీలకూ ఘోరమైన అన్యాయం జరిగింది. ఆదివాసీ అడవి బిడ్డలపైనా ఇంత ఘోరమైన అన్యాయం జరుగుతుంటే నాగరిక సమాజపు మేధావులు నోరు మెదపటంలేదు. ఇకనైనా ఆదివాసీ సంఘాలు విభేదాలు పక్కన పెట్టి ఐక్యంగా ఆదివాసీ హక్కుల కోసం పనిచేయాల్సిన అవసరం ఉంది. ప్రియమైన ఆదివాసులారా, ఆదివాసీ మేధావులారా. ఆదివాసీ హక్కులకోసం పోరాడకపోతే మన జాతి అంతరించే స్థితికి చేరుతుంది. రాళ్ళకు ప్రాణం పోసి రాముని పేరుతో రాజ్యం ఏలుతున్న అగ్రవర్ణ హిందూ మతోన్మాద ఫ్యూడల్ రాబందుల రాజ్యాన్ని కూల్చివేద్దాం. ఆదివాసీ హక్కులకోసం ఆదివాసీల స్వయం పాలన కోసం ఉద్యమించి కాకతీయులపై కత్తులు దూసినా అమరులైన సమ్మక్క సారలమ్మ వారసత్వాన్ని నిలబెట్టుకుందాం. జల్ జంగిల్ జమీన్ కోసం పోరాడిన ఆదివాసీ విప్లవ పోరాట జ్వాలలు కొమరం భీం, బిర్సాముండా, సోయం గంగులు, రాంజీ గోండ్ వారసత్వాన్ని, పుణికిపుచ్చుకుందాం. ఆదివాసీల స్వయం పాలన కోసం సాయుధ పోరుకు సమరశంఖం పూరిద్దాం. ఆదివాసీల హక్కుల కోసం అంకితభావంతో పనిచేద్దాం. ఏజెన్సీలో గిరిజనేతరుల ఆధిపత్యాన్ని అంతం చేద్దాం. ఎస్‌టి జాబితా నుండి లంబాడీలనూ తొలగిద్దాం. అపుడే ఆదివాసీలకు రక్షణ ఉంటుంది.

--పూకె రామకృష్ణదొర
ఆదివాసీ రచయితల సంఘం
రాష్ట్ర అధ్యక్షులు - తెలంగాణ
9866073866

వ్యవసాయానికి పెద్దపీట



బోధన్, కెఎన్ఎన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తుందని ఖరీఫ్ సీజన్‌లో నాటిన పంటలను ఎట్టి పరిస్థితిలోనూ ఎండిపోనివ్వమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. మంగళవారం బోధన్ తెరాస కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగు చేసిన భూములకు నీరందించడానికి ఏర్పాట్లు చేస్తామని గుంట భూమి కూడా ఎండనివ్వమని హామీ ఇచ్చారు. నిజాం నవాబు నిర్మించిన ప్రాజెక్టులను తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని తెలిపారు. 50 సంవత్సరాల పాలనలో ప్రభుత్వాలు ఖర్చు చేసిన దానికంటే ఎక్కువ మొత్తంలో తెలంగాణలో ఈ మూడు సంవత్సరాలలో తాము ఖర్చుచేసినట్లు వివరించారు. సాగు నీటికోసమే ఎక్కువ నిధులు కేటాయించామని, మరో సంవత్సరంలో పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మిషన్ కాకతీయ ద్వారా సాగునీరు అందిస్తామన్నారు.

చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించేలా పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టేందుకు కృషి చేస్తామని కేంద్ర మంత్రులు బండారు దత్తాత్రేయ, రాందాసు అత్వాలే తమ హామి ఇచ్చారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య తెలిపారు. ఢిల్లీలోని ఏపి భవన్‌లో జరిగిన బీసీల సమావేశానికి కేంద్ర మంత్రులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుజ్జ కృష్ణ, శంకరరావు, గొరిగే మల్లేష్ యాదవ్, వరప్రసాద్ యాదవ్, శారదా గౌడ్, ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేష్, కర్రి వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు పెట్టవలసిన అవసరం ఉందని కేంద్ర మంత్రులు చెప్పారని ఆర్ కృష్ణయ్య తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని బీసీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుంటే ప్రతిపక్షాలు అడ్డుతగులుతున్నాయని కేంద్ర మంత్రులు విమర్శించారు. జాతీయ బీసీ కమిషన్ కు చట్టబద్ధత కల్పించే బిల్లును రాజ్యసభలో కాంగ్రెస్ అడ్డుకుందని దత్తాత్రేయ విమర్శించారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడం వలన అన్యాయం జరుగుతోందని కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే అన్నారు. ప్రజా స్వామ్యానికి అర్థం లేకుండా పోయిందన్నారు. బీసీల్లో అత్యంత వెనుకబడిన కులాలు చాలా ఉన్నాయని వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించకపోతే వారు అభివృద్ధి కాలేరని అన్నారు.


ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ 60 ఏళ్ల పెంచాలి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సును 58ఏళ్ల నుంచి 60ఏళ్లకు పెంచాలని తెలంగాణ పంచాయతీరాజ్ సివిల్ ఇంజనీర్ల ఫోరమ్ అధ్యక్షుడు కోదాటి శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో శ్యాంసుందర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర చాలా కీలకంగా ఉందని గుర్తు చేశారు. 42రోజుల పాటు సకల జనుల సమ్మెను విజయవంతం చేసి కేంద్రప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రసాధనలో ఉద్యోగుల పాత్రను గుర్తించి ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సును పెంచాలని కోరారు. పక్కనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యోగులకు ఆ ప్రభుత్వం 60ఏళ్లకు రిటైర్మెంట్ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో మూడేళ్లుగా పదవీవిరమణ వయస్సు పెంపుపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులను వెంటనే పంపించాలని డిమాండ్ చేశారు.

మహబూబ్‌నగర్ ఫారెస్టు కన్జర్వేటర్ బదలీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మహబూబ్‌నగర్ అటవీ కన్జర్వేటర్‌గా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారి బి శ్రీనివాస్‌ను హెచ్ఎండీఏ పరిధిలోని అర్బన్ ఫారెస్ట్‌కు డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌నుంచి తప్పించి ఆయనను హెచ్ఎండీఏకు డెప్యుటేషన్‌పై నియమించింది. ఈ మేరకు అవసరమైన విధివిధానాలను ఉత్తర్వులతో పాటే వెల్లడించింది.

కేంద్ర గురుద్వారా సాహెబ్ అధ్యక్షుడిగా ఇందర్‌సింగ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: గౌలిగూడలోని కేంద్ర గురుద్వారా సాహెబ్ అధ్యక్షుడిగా ఎస్. ఇందర్‌సింగ్ ఎన్నికయ్యారు. ఈ అధ్యక్ష పదవి కోసం జరిగిన ఎన్నికల్లో ఆయనకు 975 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి త్రిలోక్‌సింగ్‌కు 571 ఓట్లు వచ్చాయి. మరో అభ్యర్థి కుల్‌దీప్ సింగ్‌కు 231 ఓట్లు లభించాయి. రాష్టంలోని 20 గురుద్వారాలకు చెందిన వారు ఎన్నికల పోలింగ్‌లో పాల్గొన్నారు.

ట్రీ గార్డులు దొంగిలిస్తే జైలే..!

- హరితహారం అమలులో కలెక్టర్లు, ఉద్యోగులే ఛాంపియన్లు
- కలెక్టర్లతో ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ వీడియో కాన్ఫరెన్స్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హరితహారంలో భాగంగా నాటిన మొక్కల రక్షణ కోసం ఏర్పాటు చేసే ట్రీ గార్డులను దొంగిలించే వారిపై కేసులు పెట్టి జైలులో వేయండని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ పోలీసులను ఆదేశించారు. ట్రీ గార్డులు పలు ప్రాంతాల్లో చోరీకి గురి కావడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను అరికట్టి మొక్కలను పరిరక్షించవలసి ఉందన్నారు. ట్రీ గార్డులను దొంగిలించేవారి పట్ల అత్యంత కఠినంగా ఉండాలి, కేసులు పెట్టి జైలులో వేస్తే మరో సారి ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కావు అని అన్నారు. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేదీని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. మూడవ విడత హరితహారంపై ఎస్.పి.సింగ్ జిల్లా కలెక్టర్లతో సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి రజత్ కుమార్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేదీ, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అశోక్ కుమార్, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్.కె. సుల్తానియా, ఎక్సైజ్ కమీషనర్ చంద్రవదన్, గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ నీతూ ప్రసాద్, జౌళి, చేనేత కమీషనర్ శైలజా రామయ్యర్, గిరి జన సంక్షేమ శాఖ కార్య దర్శి ఎం.డి. ఎక్కా, అదనపు అటవీ సంరక్షణాధికారి ఆర్.బి. డోబ్రియాల్, సింగరేణి, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హరితహారం పురోగతి పై సమీక్షించారు. మూడవ విడతలో ఇప్పటి వరకు నాటిన మొక్కలు, వాటి పరిస్థితి, జియో ట్యాగింగ్, గ్రీన్ బ్రిగేడ్‌ల ఏర్పాటు పై జిల్లాల వారిగా పురోగతిని ఎస్.సి.సింగ్ కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు లేని సమయంలో మొక్కలు నాటాలనే లక్ష్యాలను పూర్తి చేయలేకపోయామనే ఆందోళన అవసరం లేదని, నాటిన మొక్కలను ఏ మేరకు రక్షించుకుంటున్నామనే దాని పై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. శాఖల వారిగా హరితహారం పురోగతిపైన ఉన్నతాధికారులు ప్రధాన కార్యదర్శికి నివేదికలను అందచేశారు. రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునిల్ శర్మ మాట్లాడుతూ, ఆర్టీఏ, ఆర్టీసీ, రోడ్లు - భవనాల శాఖల పరిధిలోని సిబ్బంది హరితహారంలో పాల్గొనేందుకు, అర్బన్ పార్కులను అభివృద్ధి పరిచేందుకు సిద్ధంగా ఉన్నారని, అవసరం మేరకు సిబ్బందిని, ఆర్టీసీ బస్సులను వాడుకోవాలని కోరారు. హైదరాబాద్ - వరంగల్, హైదరాబాద్ - పూణే, హైదరాబాద్ - అమన గల్ - అచ్చంపేట రోడ్ల వెంట గ్రీనరీ పనులను అటవీ శాఖ సహకారంతో చేపడుతున్నామని సునిల్ శర్మ తెలిపారు. ఇటీవల కాళేశ్వరం వెళ్లిన ఐఏఎస్ అధికారులు రాజీవ్ రహదారి వెంట పర్యటించి ఎవెన్యూ ప్లాంటేషన్ అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారని గుర్తు చేశారు. మొక్కలు నాటడం, నాటిన ప్రాంతాలను జియో ట్యాగింగ్ చేయడం, వీలైనన్ని గ్రీన్ బ్రిగేడ్‌లను ఏర్పాటు చేయడం అనే మూడు ప్రాధాన్యతా అంశాలుగా అందరూ గుర్తించి పని చేయాలని ఎస్.పి. సింగ్ సూచించారు.

పద్రాగస్టు ఏర్పాట్లపై కలెక్టర్లతో సమీక్ష

స్వాతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లాల్లో ఘనంగా నిర్వహించడానికి తగు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి. సింగ్ కలెక్టర్లను ఆదేశించారు. పద్రాగస్టు ఏర్పాట్లు, మిషన్ భగీరథ, హరితహారం, బతుకమ్మ చీరల పంపిణీ, రెవెన్యూ భూమి రికార్డుల ప్రక్షాళన తదితర అంశాల పైన జిల్లా కలెక్టర్లతో ఎస్.పి. సింగ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 90 లక్షల చీరలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. చీరల పంపిణీ కోసం గ్రామాల వారిగా కార్యాచరణ రూపొందించుకోవాలని కలెక్టర్లను కోరారు. చీరల పంపిణీ కోసం జిల్లా, మండల, గ్రామ స్థాయి నోడల్ అధికారులను గుర్తించి, బృందాలుగా ఏర్పాటు చేసి అర్హులైన మహిళలకు చీరలు పంపిణీ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే నెల 20 నుండి బతుకమ్మ పండుగ ప్రారంభమవుతుందని, చీరల పంపిణీకి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలపై జిల్లాల వారిగా సమీక్షలు నిర్వహించి, వచ్చిన దరఖాస్తులను పరిశీలించి చెక్కులు అందచేయవలసి ఉంటుందన్నారు.

ఎమ్మెల్యే వర్సెస్ మాజీ ఎంపీ

- నినాదాలతో మొదలైన వివాదం
- ఎమ్మెల్యే రేఖానాయక్, మాజీ ఎంపీ రాథోడ్‌ల మధ్య వాగ్వివాదం
- మంత్రి సమక్షంలోనే ముదిరిన గొడవ



ఖానాపూర్ టౌన్, కెఎన్ఎన్ : ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌ల మధ్య నువ్వెంత అంటే నువ్వెంత అనే రీతిలో చోటు చేసుకున్న వాగ్వాదం అధికార టీఆర్ఎస్ పార్టీలోనే కాకుండా రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలోనే వీరిద్దరు అమీతుమీకి సిద్ధమవడం కలకలం రేపింది. ఈనెల 10న పోచంపాడ్‌లో జరిగే సీఎం సభకు జన సమీకరణ కోసం మంగళవారం ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన సన్నాహక సదస్సు ఈ రాద్ధాంతానికి వేదికైంది. మంత్రి ఐకే రెడ్డి కూడా ఖానాపూర్‌కు చేరుకున్నారు. మొదట ఎమ్మెల్యే రేఖానాయక్ విశ్రాంతి భవనానికి చేరుకున్న కొద్దిసేపట్లోనే మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ కూడా అక్కడికి తన అనుచరులతో వచ్చారు. అయితే వీరిద్దరు అక్కడకు చేరుకోగానే వారి వారి అనుచరులు అనుకూల నినాదాలు చేశారు. నినాదాల నుంచి వివాదం మొదలైంది. అనంతరం ఐబీలోపల మంత్రితో పాటు ఎమ్మెల్యే రేఖానాయక్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, రాష్ట్రనాయకులు రవీందర్‌రావు, సత్యనారాయణగౌడ్, ఎంపీపీ ఆకుల శోభారాణి, ఏఎంసీ చైర్మన్ నల్ల శ్రీనివాస్‌తో పాటు సీనియర్ నాయకులు జనసమీకరణ విషయమై చర్చించారు. ఇంతలోనే ఎమ్మెల్యే, మాజీఎంపీల మధ్య మాటామాటా పెరిగింది. దీంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. ఎమ్మెల్యేతో మాజీ ఎంపీ రమేశ్ దురుసుగా మాట్లాడినట్లు చెబుతున్నారు. ఆగ్రహించిన రేఖానాయక్ తనతో దురుసుగా ప్రవర్తిస్తున్నారంటూ పార్టీ సమక్షంలోనే ఆరోపించినట్లు సమాచారం.

సమాచార కమిషనర్లను ఆరు వారాల్లో నియమించండి

రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న సమాచార శాఖ ప్రధాన కమిషనర్ మరియు సమాచార కమిషనర్లను, సభ్యులను ఆరు వారాల్లో నియమించాలని హైకోర్టు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను ఆదేశించింది. అలాగే అమలు నివేదికను సమర్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది. ఈ సందర్భంగా తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. సమాచార శాఖ ప్రధాన కమిషనర్ మరియు కమిషనర్ల నియామకాన్ని ఆరు వారాల్లో పూర్తి చేస్తామని నివేదించారు. ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి. శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ ..సమాచార శాఖ కమిషనర్లు, సభ్యుల నియామకం కోసం మరి కొంత గడువు కావాలని అభ్యర్థించారు. కానీ ధర్మాసనం మాత్రం ఆరు వారాల వ్యవధిలోనే పూర్తి చేయాలని స్పష్టం చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో గత రెండు నెలలుగా ఖాళీగా ఉన్న సమాచారశాఖ ప్రధాన కమిషనర్, మరియు సమాచార కమిషనర్ల నియామకం ప్రక్రియను చేపట్టేలా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను ఆదేశించాలని అభ్యర్థిస్తూ ఉమ్మడి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఎం.పద్మనాభ రెడ్డి దాఖలు చేశారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం జాబితా రద్దు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రంగారెడ్డి జిల్లాకు చెందిన 13 కోర్టుల్లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకానికి సంబంధించిన 15 మందితో కూడిన జాబితాను హైకోర్టు సస్పెండ్ చేసింది. మరో రెండు వారాల పాటు ఎలాంటి నియామకాలు చేపట్టరాదని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ జాబితాలో ఒక్క మైనారిటీ వర్గానికి చెందిన న్యాయవాది పేరు లేకపోవడం పట్ల హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది రవిచంద్రన్ వాదనలు వినిపిస్తూ ..రంగా రెడ్డి జిల్లాకు చెందిన 13 కోర్టుల్లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం కోసం ప్రభుత్వానికి పంపిన జాబితాలో కనీసం ఒక్క ఎస్టీ వర్గానికి చెందిన న్యాయవాది పేరును పంపలేదన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున హోంశాఖ న్యాయవాది వేణు గోపాల్ వాదనలు వినిపిస్తూ పీపీల ఎంపిక గురించి తగిన పబ్లిసిటీ చేసినట్లు, వివిధ బార్ అసోసియేషన్లకు సమాచారం అందించినట్లు తెలిపారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ..ప్రభుత్వానికి సమర్పించిన 15 మంది న్యాయవాదులతో కూడిన జాబితాను సస్పెండ్ చేసింది. మరో రెండు వారాలపాటు ఎలాంటి నియామకాలు చేపట్టరాదని ఆదేశించింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. ప్రభుత్వానికి సమర్పించిన రికార్డులను ధర్మాసనం పరిశీలించింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం కోసం ప్రభుత్వం అనుసరించిన విధానమేమిటో చెప్పాలని హైకోర్టు గత విచారణ సందర్భంగా తెలంగాణ హోంశాఖను ఆదేశించింది. అలాగే వారి నియామకానికి సంబంధించిన రికార్డులను తమ ముందుంచాలని కూడా హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించిన విషయం తెలిసిందే..

తండాల తారు రోడ్లకు

రూ.250 కోట్లు

- జిల్లాల నుంచి వివరాల సేకరణ
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు
- ఈనెలాఖరులోగా ప్రభుత్వానికి నివేదిక?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన తండాలకు రహదారులను వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు గత వారం జరిగిన సమీక్షా సమావేశంలో తండాలకు రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో తండాలకు తారు రోడ్లను వేసేందుకు సూమారు రూ.250కోట్లు ప్రభుత్వం వెచ్చించే అవకాశాలున్నాయి. దీంతో ఈ మేరకు రాష్ట్రంలోని అయా జిల్లాల నుంచి రహదారుల నిర్మాణం కోసం వివరాలను అధికారులు సేకరిస్తున్నట్లు తెలిసింది. దీని ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా గిరిజన తండాల్లో రోడ్ల నిర్మాణం ప్రక్రియను చేపట్టనున్నారు. దీని కోసం పంచాయతీరాజ్ ఇంజనీరింగు విభాగం ప్రతిపాదనలను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈనెలాఖరులోగా తండాలకు సంబంధించిన తారురోడ్ల ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులు యోచిస్తున్నారు. దీని తర్వాత తండాల్లో రోడ్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియను ప్రారంభించనున్నట్లు అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన తండాలు, ఎస్సీ ఆవాసా ప్రాంతాలకు రోడ్లు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌ను వెచ్చించాలని యోచిస్తుంది. అవసరమైతే సబ్‌ప్లాన్ నిధులను కూడా ఖర్చు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. దీంతో గిరిజన తండాలకు రోడ్ల సమస్యను పూర్తిగా నిర్మూలించే అవకాశముంటుందని ప్రభుత్వం యోచిస్తుంది. గత కొన్ని సంవత్సరాల నుంచి తండాలను కనీసం కంకరరోడ్డు సౌకర్యం కూడా లేదు. గతేడాది దళిత, గిరిజన తండాల్లో రోడ్లను వేసేందుకు రాష్ట్రప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి రూ.800కోట్లు కేటాయించింది. ఎస్సీ సబ్‌ప్లాన్ నుంచి రూ.125కోట్లు, గిరిజన తండాలకు రూ. 110కోట్లు వెచ్చించి చేతులు దులుపుకున్నది. కానీ ఈనిధులను పూర్తిస్థాయిలో వినియోగించు కోలేదు. దీంతో ఈ నిధులు వృధా అయినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అయా జిల్లాల్లో చేపట్టిన ఎంఆర్ఆర్, సీఆర్ఆర్ రోడ్లల్లో 30శాతం వరకూ గిరిజన, ఎస్సీ కాలనీల్లోనే గ్రామీణ రోడ్లను వేసినట్లు తెలిసింది. మిగతా ఆవాసాల్లో తారు రోడ్లు వేసేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా ఎమ్ఆర్ఆర్ కింద 4600 కిలోమీటర్ల మేరకు పనులను పూర్తి చేసింది. దీని కోసం రూ.1989కోట్లు వెచ్చించింది. సీఆర్ఆర్ కింద 29 ప్యాకేజీల్లో పనులు పూర్తయినట్లు అధికారులు ఇచ్చిన లెక్కల ప్రకారం తెలుస్తోంది. మిగతా ప్యాకేజీల్లో 3787కిలోమీటర్ల పనులు జరిగాయి. ఈ ఏడాది కూడా గిరిజన తండాల్లో చేపడుతున్న రోడ్ల నిర్మాణం పనులను చిత్తశుద్ధితో ప్రభుత్వం నిర్వహిస్తే గిరిజనులకు ఇబ్బందులు తొలగుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

లబ్దిదారుల నుంచి డిపాజిట్ తీసుకోవద్దు

- బ్యాంకర్లకు సూచించిన ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ
- ఆలస్యమైతే కార్పొరేషన్ నిధులకు వడ్డీ చెల్లించాలి
- గత మూడేళ్లలో ఎంపికైన వారికి రుణాలు ఇవ్వాలని నిర్ణయం

హైదరాబాద్,ఆంధ్రప్రభ : స్వయం ఉపాధి పథకం కింద షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగులకు విడుదల చేసే రుణాల విషయంలో ఇబ్బందులకు కలిగించొద్దని బ్యాంకర్లకు ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ సూచించింది. లబ్దిదారుల నుంచి డిపాజిట్ సేకరణ చేయకుండానే రుణం ఇవ్వాలని ఆదేశించింది. లబ్దిదారులను గుర్తించిన వెంటనే రుణాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, బ్యాంకుల చుట్టు లబ్దిదారులను తిప్పుకోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ గుర్తించింది. ఒక ఎస్సీ లబ్దిదారుడికి కార్పోరేషన్ నుంచి రూ. 1 లక్ష రుణం ఇస్తే.. అందులో బ్యాంకు వాటా 20 శాతం అంటే రూ. 20 వేలు కలిపి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రంలోని చాలా బ్యాంకులు మాత్రం లబ్దిదారుల నుంచి రూ. 20 వేలు డిపాజిట్ చేసుకున్న తర్వాతనే రుణం ఇస్తున్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న పేదవారు బ్యాంకులకు ముందస్తుగా లబ్దిదారులు రూ. 20 చెల్లించకపోవడం, ఒక వేళ అప్పులు చేసి డిపాజిట్ చేసినా సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల వడ్డీ భారం పడి రెండు రకాలుగా నష్టపోతున్నారనే విషయాన్ని ఎస్సీ కార్పోరేషన్ అధికారులు గుర్తించారు. వీటిని తగ్గించేందుకు గాను మంగళవారం సంక్షేమ భవన్‌లో ఎస్సీ కార్పోరేషన్ ఎండీ లచ్చిరాం భూక్యా రాష్టంలోని వివిధ బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మరో అంశంపై కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది. కార్పోరేషన్ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేసి.. వాటి జాబితాను పంపిన వెంటనే రుణాలు విడుదల చేయాలని, ఒక వేళ బ్యాంకులు ఆలస్యం చేస్తే కార్పోరేషన్ విడుదల చేసిన నిధులకు వడ్డీలు చెల్లించాలని బ్యాంకులకు కార్పోరేషన్ అధికారులు సూచించినట్లు సమాచారం. గత మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న వారికి ఈ నెల చివరి వరకు రుణాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాతనే 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఎంపిక చేసిన ఎస్సీ నిరుద్యోగ లబ్దిదారులకు జనవరిలో విడుదల చేయాలని కార్పోరేషన్ అధికారులు భావిస్తున్నారు.

బ్యాంకర్లు సానుకూలంగా స్పందించారు లచ్చిరాం భూక్యా

స్వయం ఉపాధి పథకం కింద ఎస్సీ నిరుద్యోగులకు ఇచ్చే రుణాల విషయంలో బ్యాంకులు సహకరించాలని కోరగా.. సానుకూలంగా స్పందించారని ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ ఎండీ లచ్చిరాం భూక్యా తెలిపారు. మంగళవారం తనను కలిసి మీడియాతో మాట్లాడారు. జిల్లాల వారిగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు, ఇప్పటి వరకు 13 జిల్లాలలో పర్యటించి క్షేత్రస్థాయిలోని సమస్యలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి ఎస్సారెస్పీకి నీరివ్వండి

జీవన్‌రెడ్డి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : గోదావరి జలాల వినియోగంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం కలిగే విధంగా ప్రాజెక్టులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సీఎల్పీ ఉప నేత టీ జీవన్ రెడ్డి విజ్ఞప్తిచేశారు. గోదావరి నదిపై రిజర్వాయర్ నిర్మించి ఎల్లంపల్లి నుంచి ఎస్ఆర్ఎస్పీకీ నదీ నీరందించాలని సూచించారు. కోర్టులకు వెళ్లటమే తప్పనే విధంగా సీఎం కేసీఆర్ మాట్లాడడం సరికాదని అభిప్రాయ పడ్డారు. మంగళవారం శాసనసభ మీడియా హాలులో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ వి హనుమంతరావు గతంలోచేసిన సూచన మేరకు ఎస్ఆర్ ఎస్పికి నీరందించాలని కోరారు.



ఎన్‌సీసీ లాభం రూ.63 కోట్లు

హైదరాబాద్ : హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న ఎన్‌సీసీ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభం 63.43 కోట్లు ఆర్జించింది. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.52.34 కోట్లు నమోదు చేసింది. రెవెన్యూ విషయానికి వస్తే రూ.2,034.60 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.1929.76 కోట్లని తెలిపింది. అయితే మార్చి 31,2017 త్రైమాసికంలో కంపెనీ నికరలాభం రూ.225.5 కోట్లు ఆర్జించింది. ఆదాయం రూ.8032.15 కోట్లను నమోదు చేసింది. ఇదిలా ఉండగా ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోకంపెనీకి గరిష్ఠంగా రూ.6,051 కోట్ల ఆర్డరు దక్కాయి. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ ఆర్డర్ పుస్తకం రూ.22,009గా ఉంది. మొదటి త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ ఆర్డర్ పుస్తకం 22 శాతం పెరిగిందని ఎన్‌సీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎ రంగరాజు చెప్పారు. కాగా బీఎస్‌లో దీని షేరు రూ.89.75 వద్ద ట్రేడ్ అయ్యింది.



పొదుపు ఖాతా వడ్డీరేట్లపై
యాక్సిస్ బ్యాంక్ కోత

• 0.50 శాతం వరకు తగ్గింపు • మంగళవారంనుంచి అమల్లోకి

ముంబై : ప్రైవేట్ బ్యాంకు యాక్సిస్ బ్యాంకు పొదుపు ఖాతాలపై 0.50 శాతం వడ్డీరేట్లను తగ్గించింది. రూ.50 లక్షల కంటే ఖాతాలో తక్కువ డిపాజిట్ ఉంటే 3.5 శాతం వడ్డీరేటు లభిస్తుంది. ఖాతాలో రూ.50 లక్షల కంటే ఎక్కువ మొత్తం ఉంచితే మాత్రం యధావిధిగా 4 నాలుగు శాతం గిట్టుబాటు అవతుంది. పొదుపు ఖాతాలపై వడ్డీ రేట్లను స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మొదలుపెట్టిన తర్వాత మిగిలిన బ్యాంకులు ఒకదాని తర్వాత మరోటి కోత విధిస్తూపోతున్నాయి. సవరించిన వడ్డీరేట్లు మంగళవారం నుంచి అమల్లోకి వస్తాయని యాక్సిస్ బ్యాంకు బీఎస్ఈకి సమాచారం అందించింది. ఎస్‌బీఐ, బ్యాంకు ఆఫ్ బరోడా, కర్నాటక బ్యాంకులు ఇప్పటికే వడ్డీరేట్లు తగ్గించాయి. తాజాగా వాటి సరసన యాక్సిస్ బ్యాంకు కూడా చేరింది. బీఎస్ఈలో దీని షేరు 1.32 శాతం క్షీణించి రూ.499.30 వద్ద ముగిసింది.

టీఏఏఐ ఏపీ, టీఎస్ చాప్టర్
కొత్త బాడీ

అజయ్ కె రామిడి,నగేశ్ పంపాటి తిరిగి ఎంపిక

హైదరాబాద్ : ది ట్రావెల్ ఏజెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టీఏఏఐ) ఏపీ, టీఎస్ చాప్టర్ ఇటీవల జరిగిన ఏజీఎంలో కొత్త బాడీని ఎన్నుకుంది. లార్విన్ టూర్స్ అండ్ ట్రావెల్‌కు చెందిన అజయ్ కె రామిడిని చైర్మన్‌గా ఎన్నుకోగా.. ఏరోవరల్డ్ హాలీడేస్‌కు చెందిన నగేశ్ పంపాటిని గౌరవ కార్యదర్శిగా తిరిగి ఎన్నుకున్నారు. విట్జ ట్రావెల్ లింక్స్‌కు చెందిన శ్రీనివాస్‌కుమార్, గౌరవ కార్య దర్శిగా 2017-2019 వరకు ఎంపిక కాగా అజయ్ కె రామిడి వరుసగా మూడో సారి ఎంపికయ్యారు. వీరి పదవి కాలం రెండేళ్లు ఉంటుంది. కాగా స్థానిక చాప్టర్ గత మూడు సంవత్సరాల నుంచి కొనసాగుతోంది. సుమారు 110 మంది సభ్యులున్నారు.

331 డొల్ల కంపెనీలు

జాబితాలో బోలెడన్ని బడా సంస్థలు

• ఎలాంటి మోసాలకు పాల్పడలేదు: కంపెనీలు
• జాబితాలో పార్శ్వనాథ్ డెవలపర్స్, ప్రకాశ్ ఇండస్ట్రీస్, జెకుమార్ ఇన్‌ఫ్రా, ఎస్‌క్యూఎస్ ఇండియాలు



న్యూఢిల్లీ : వరుసగా గత కొన్ని వారాల నుంచి స్టాక్ మార్కెట్లు బుల్‌రన్‌లో దూసుకుపోతున్నాయి. రోజుకో రికార్డు ను బద్దలు కొడుతూ మదుపరులకు సంపద పంచిపెడుతు న్నాయి. నిఫ్టీ ఏకంగా 10వేల మార్కును దాటిపోవడం ఒకరికార్డే! ఇవన్నీ బాగానే ఉన్నా.. మంగళవారం నాడు స్టాక్‌మా ర్కెట్లు కుప్ప కూలాయి. ఎందుకంటే మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి దృష్టికి సుమారు 331 డొల్ల కంపెనీలు (బోగస్ కంపెనీలు) స్టాక్ మార్కెట్లో లిస్టు అవుతు న్నట్లు గుర్తించింది. ఈ కంపెనీల షేర్ల ట్రేడింగ్‌ను నిలిపివేయాలని స్టాక్ ఎక్స్ఛేంజీలకు సెబీ ఆదేశాలు జారీ చేయడం జరిగిపోయింది.

అయితే ఈ డొల్ల కంపెనీలతో దేశంలోని బడా బడా పారిశ్రామికవేత్తలకు సంబంధం ఉందని గుర్తించింది. డొల్ల కంపెనీల జాబితాలో పార్శ్వనాథ్ డెవలపర్స్, ఎస్‌క్యూఎస్ ఇండియా, జెకుమార్‌ఇన్‌ఫ్రా, ప్రకాశ్ ఇండస్ట్రీల పేర్లు బహిర్గ తం అయ్యాయి. ప్రభుత్వం ఇప్పటికే సెబికి ఈ కంపెనీలపై దర్యాప్తు చేయాలని కోరింది. ఈ కంపెనీలు ఇప్పటికే పన్ను ఎగ్గొట్టడంతో పాటు ఇతర మోసాలకు పాల్పడ్డాయని ప్రభు త్వం గుర్తించింది. అయితే ఈ కంపెనీలు మాత్రం తాము ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని చెబుతున్నాయి.

తాజాగా మంగళవారం నాడు మొత్తం 331 కంపెనీల ట్రేడింగ్‌ను నిలిపివేయాలని సెబి స్టాక్ ఎక్స్ఛేంజీలను కోరింది. కొన్ని కంపెనీల్లో పలువురు బాగా పేరున్న దేశీయ, విదేశీ ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టారని వార్తలు రావడం.. వీరిపై చర్యలు తప్పవన్న వార్తలు రావడంతో మార్కెట్లు వణికిపోయాయి. సెంటిమెంట్ దెబ్బతిని స్టాక్ మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. బీఎస్ఈ ఏకంగా 260 పాయింట్లు కుంగింది.

ఇప్పటికే 331 కంపెనీ జాబితాలో 162 కంపెనీ ట్రేడింగ్‌పై సెబి ఆంక్షలు విధించింది. ఈ కంపెనీలను నెలకు ఒకసారి ప్రతి నెల మొదటిసోమవారం నాడు మాత్రమే ట్రేడింగ్‌కు అనుమతిస్తాయి.. ఇవే నిబంధనలు మరిన్ని కంపెనీలపై విధించే అవకాశాలున్నాయని సెబితో పాటు మార్కెట్ అధికారులు చెబుతున్నారు.ఈ కంపెనీల ట్రేడింగ్‌పై సెబితో పాటు స్టాక్ ఎక్స్ఛేంజీ ఆంక్షలు విధించడంతో పాటు దర్యాప్తు ఏజెన్సీలు ఉదాహరణకు ఆదాయపు పన్ను శాఖ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ)లతో పాటు ఇతర దర్యాప్తు సంస్థల విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

గత నెల ప్రధానమంత్రి నరేంద్రమోడీ పన్ను ఎగ్గొట్టిన 37వేల డొల్ల కంపెనీలను గుర్తించామని, అలాగే మూడు లక్షల కంటే ఎక్కువ కంపెనీలు దర్యాప్తు సంస్థల దృష్టికి వచ్చిందని ఆయన నవంబర్ 8న పెద్దనోట్ల రద్దు తర్వాత చెప్పుకొచ్చారు.

మొత్తం 331 బోగస్ కంపెనీల్లో సింహభాగం పశ్చిమ బెంగాల్‌ది సుమారు 127 కంపెనీలు ఈ రాష్ట్రం నుంచి వచ్చినవే. కార్పొరేట్ మంత్రిత్వశాఖ చిట్టాను సెబికి అందజేసి వీటిపై దృష్టి పెట్టాలని కోరింది. బోగస్ కంపెనీల జాబితాలో గుజరాత్‌తో పాటు ఢిల్లీ కంపెనీలు ఎక్కువగా ఉన్నాయి. ఈ కంపెనీలపై ట్రేడింగ్‌ను సెబి నిషేధించింది. ఈ కంపెనీల్లో సుమారు 124 కంపెనీలు ఇప్పటికే ఆదాయపు పన్ను ఎగ్గొట్టినందకు ఐటీశాఖ నిఘా కిందికి వచ్చాయి. మిగిలిన 175 కంపెనీపై ఎస్ఎఫ్ఐవో దర్యాప్తు చేస్తోంది.

బోగస్ కంపెనీల జాబితాలో తమ కంపెనీల పేర్లను చూసి షాక్‌కు గురయ్యామని రియల్టీ కంపెనీ పార్శ్వనాథ్, ఎస్‌క్యూఎస్ ఇండియా, బీఎఫ్ఎస్ఐ లిమిటెడ్ తెలిపాయి. ఈ జాబితాలో పేర్లున్న కంపెనీలు కూడా తాము ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని ప్రకటనలు జారీ చేశాయి. తమ కంపెనీల పేర్లు అనుమానిత డొల్ల కంపెనీల జాబితాలో చూసి షాక్‌కు గురయ్యామని, దీంతో తమ ఈక్విటీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలు సీఎస్ఎం -6కు తరలించాయి. దీంతో తమ కంపెనీ సెక్యూరిటీలు లేదా షేర్లు నెలకు ఒకసారి మాత్రమే ట్రేడ్ అవుతాయి. దీంతో పాటు సెబి ఫైనాన్షియల్ ఆడిటింగ్ జరిపితే తమ కంపెనీ పరపతి పోతుందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు పార్శ్వనాథ్ డెవలపర్స్ ఫైలింగ్‌లో పేర్కొంది. ఎట్టి పరిస్థితుల్లోనూ తమది డొల్ల కంపెనీ కానే కాదని పార్శ్వనాథ్ ఘంటాపథంగా చెబుతోంది.

జె కుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ కూడా తమది డొల్ల కంపెనీ కాదని, సెబి తమపై అనవసరంగా అనుమానంగా చూస్తోందని తెలిపింది. తమ కంపెనీ ట్రాక్‌రికార్డు స్టాక్ ఎక్స్ఛేంజీతో పాటు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీ వద్ద చూసుకోవచ్చునని పేర్కొంది. తమ కంపెనీ మెజారిటి క్లయింట్లు ప్రభుత్వరంగానికి చెందినవేనని ఉదాహరణకు ఢిల్లీ మెట్రో, ముంబై మెట్రో, జెఎన్‌పీటీ పోర్టు కనెక్టివిటి లాంటి ప్రాజెక్టులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని వివరించింది.

ప్రకాశ్ ఇండస్ట్రీస్ కూడా సెబి ఆంక్షలపై ఆందోళన వ్యక్తం చేసింది. తమ కంపెనీని యోగ్యతలేనిదిగా చూపించడం తగదని పేర్కొంది. తమ కంపెనీ స్టాక్ మార్కెట్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని స్పష్టం చేసింది. అలాగే ఎస్‌క్యూఎస్, బీఎఫ్ఎస్ఐ లిమిటెడ్‌లు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. కంపెనీ చట్టంతో పాటు సెబి నిబంధనలు అమలు చేస్తున్నా తమ కంపెనీలపై నిఘాపెట్టడం పై ఆందోళన వ్యక్తం చేశాయి. సెబి లేవనెత్తిన అంశాలపై పూర్తి వివరాలు ఇస్తామని దర్యాప్తు అధికారులకు పూర్తిగా సహకరిస్తామని ప్రకటించాయి. త్వరగా వీటిని పరిష్కరించడం ఉత్తమమని పేర్కొన్నాయి. ఫిన్‌కాయిన్ స్పిరిట్ కూడా అనుమా నిత జాబితాలో ఉంది. తమ సంస్థ కంపెనీ చట్టంతో పాటు సెబి నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తున్నా మని తెలియజేసింది. దర్యాప్తు సంస్థలకు కావాల్సిన పూర్తి సమాచారం అందిస్తామని తెలిపింది. నల్లధనం జాఢ్యానికి అడ్డుకట్ట వేయడానికి కార్పొరేట్ వ్యవహారాలమంత్రిత్వశాఖ ఇప్పటికే 1.62 లక్షల కంపెనీల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. ఈ కంపెనీలు రిజిస్ట్రేషన్ చేయించుకుని దీర్ఘకాలంగా ఎలాంటి లావాదేవీలకు పాల్పడ లేదు. కాగా కార్పొరేట్ మంత్రిత్వశాఖ కంపెనీ చట్టాన్ని కఠినం గా అమలు చేస్తోంది. కంపెనీలు కూడా కంపెనీ చట్టానికి లోబడే రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. కంపెనీల చట్టంలో 'షెల్‌కంపెనీ' అనే నిర్వచనం లేదని కార్పొరేట్ వ్యవహారాల మంత్రి అరుణ్‌జైట్లీ గత నెల లోకసభలో చెప్పారు. ఇలాంటి చాలా కంపెనీలు పెద్ద ఎత్తున పన్ను ఎగ్గొడుతు న్నాయని ఆయన సభకు తెలియజేశారు.

బజాజ్ ఆటో, ట్రయంప్ జట్టు

• గ్లోబల్ మార్కెట్లో భాగస్వామ్యం



న్యూఢిల్లీ: దేశీయ ద్విచక్ర వాహన దిగ్గజం బజాజ్ ఆటో, బ్రిటన్‌కు చెందిన బైక్‌ల తయారీకంపెనీ ట్రయంప్‌లు గ్లోబల్ భాగస్వామ్యం చేపట్టాయి. మిడ్‌రేంజ్‌కు చెందిన మోటార్ సైకిళ్ల డిజైన్, డెవలప్‌మెంట్, డిస్ట్రిబ్యూషన్‌లు చేపడతాయి. భాగస్వామ్యం ఒప్పందంలో భాగంగా ఈ రెండు కంపెనీలు కలిసి నాణ్యమైన బైక్‌లను, తక్కువ ధరలకు ప్రపంచవ్యాప్తంగా పంపిణి చేస్తాయి. దీంతో పాటు బ్రాండ్‌ను మరింత పైకి తేవడానికి ప్రయత్నిస్తామని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది.

కాగా బజాజ్ ఆటో మేనేజింగ్ డైరెక్టర్ రవి బజాజ్, ట్రయంప్ మోటార్ సైకిల్స్ సీఈవో నిక్ బ్లోర్‌లు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో తమ ముఖ్య ఉద్దేశం.. నాన్ ఈక్విటీ భాగస్వామ్యంలో మిడ్‌రేంజి మోటార్‌సైకిళ్లను వినూత్నంగా తీర్చిదిద్ది గ్లోబల్ మార్కెట్లో విడుదల చేయడమని, దీని ద్వారా ఈ రెండు కంపెనీలకు లబ్ది చేకూరుతుందని వారు పేర్కొన్నారు. తాజాగా గ్లోబల్ భాగస్వామ్యం ద్వారా ట్రయంప్ గ్లోబల్ మార్కెట్లో మరితం దూసుకుపోయేందుకు అవకాశాలుంటాయి. కొత్త మార్కెట్లో.. ప్రధానంగా అభివృద్ధి చెందిన మార్కెట్లో ట్రయంప్ బోలెడన్నీ అవకాశాలు లభిస్తాయి. ఇక బజాజ్ విషయానికి వస్తే ట్రయంప్ బ్రాండ్‌తో పాటు మోటార్‌సైకిల్స్ అందుబాటులోకి వస్తాయి. దేశీయ మార్కెట్లతో పాటు ఇతర అంతర్జాతీయ మార్కెట్లో వివిధ రకాల మోటార్‌సైకిల్స్‌ను విక్రయించుకోడానికి అవకాశాలుంటాయని కంపెనీ వివరించింది. వేర్వేరుగా గ్లోబల్ మార్కెట్లో ప్రవేశించడం కంటే సంయుక్తంగా రావడం వల్ల నాణ్యతతో పాటు ఖర్చులను కూడా తగ్గించుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా బైక్‌లను పంపిణి చేసుకోవచ్చునని తెలిపాయి. కానీ పూర్తి వివరాలు వాటాల నిష్పత్తి గురించి ప్రస్తావించలేదు.

ప్రస్తుతం బజాజ్ ఆటో విషయానికి వస్తే ఎంట్రీ లెవెల్ బైక్‌లు 110 సీసీ నుంచి సీటీ 100 నుంచి 373 సీసీ బైక్‌లు డొమినార్‌ను ఉత్పత్తి చేస్తోంది. వీటితో పాటు ఆస్ట్రేలియాకు చెందిన బైక్ తయారీ కంపెనీ కెటీఎంలను కూడా భాగస్వామ్యంలో విక్రయిస్తోంది.

ఇక ట్రయంప్ విషయానికి వస్తే శక్తిమంతమైన బైక్‌లు ఉదాహరణకు రాకెట్ -3, స్పీడ్ ట్రిపల్, డేటోనా 200, సూపర్‌స్పోర్ట్స్ డేటోనా 675ఆర్, టైగర్ 800తో పాటు బాగా ప్రసిద్ది చెందిన ట్రయంప్ బోన్నేవిల్లే ఫ్యామలీ బైక్‌లతో పాటు ఇతర బైక్‌లను విక్రయిస్తోంది. రెండు కంపెనీలు ఒక ప్రకటనలో కొత్త మార్కెట్లవైపు దృష్టిపెడుతున్నట్లు తెలిపాయి.


మైలాన్‌నుంచి కొత్త హెచ్‌ఐవీ ఔషధం



హైదరాబాద్ : మైలాన్ ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్.. మైలాన్ ఎన్‌వీ అనుబంధ సంస్థ.. డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) నుంచి యాంటీరిట్రోవైరల్ (ఎఆర్‌వీ) ఔషధం అవోంజా మార్కెట్ చేసుకోవడానికి అనుమతులు దక్కించుకుంది. ఇక అవోంజా (టీఎల్ఈ400) విషయానికి వస్తే ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్‌లో ఇఫావెరింజ్, లామివుడైన్, టెనోఫోవిర్, డిసోప్రోక్సిల్ ఫ్యూమారేట్ టాబ్లెట్‌గా తయారచేశారు. దీనికి ప్రపంచ ఆరోగ్యంసంస్థ (డబ్ల్యుహెచ్ఓ) కూడా సిఫారసుచేసింది. హెచ్‌ఐవీ/ ఎయిడ్స్ రోగులకు ప్రత్యామ్నయంగా కొత్త ఔషధం అవెంజా వినియోగించుకోవచ్చు. కొత్త ఔషధం విడుదల చేసిన తర్వాత మైలాన్ ప్రెసిడెంట్ రాజీవ్ మాలిక్ మాట్లాడుతూ.. అవెంజా ఔషధం ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న ఇతర ఔషధాలతో పోల్చుకుంటే చాలా వరకు చౌక అని చెప్పారు. భారత్‌లో మొట్ట మొదటిసారి ఈ కాంబినేషన్ ఔషధాన్ని మైలాన్ అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆరోగ్యమంత్రిత్వశాఖ హెచ్‌ఐవీకి టెస్ట్ అండ్ ట్రీట్ (పరీక్షించి.. చికిత్స) విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎవరైనా హెచ్‌ఐవీ సోకిందని నిర్ధారణ అయ్యిందటే తక్షణమే యాంటీరెట్రోవైరల్ థెరపి సీడీ4 కౌంట్ లేదా క్రిటికల్ స్టేజ్‌లో ఉన్న వారు వినియోగించుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా మైలాన్ హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌తో బాధపడుతున్న 50 శాతం రోగులకు ఈ ఔషధాలను సుమారు 100 అభివృద్ధి చెందిన దేశాలకు సరఫరా చేస్తోంది. ఏఆర్‌వీ పోర్లపోలియో విషయానికి వస్తే వాటిలో 14 యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్, 50 ఫినిష్ట్ డోసేజీలను ఫస్ట్‌లైన్ వారి కోసం, సెకెండ్ లైన్, పెడియాట్రిక్ ఫార్ములేషన్ ద్వారా కూడా అందుబాటులో ఉంచినట్లు కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది.

భారతి ఇన్‌ఫ్రాటెల్ షేర్లు
విక్రయించిన ఎయిర్‌టెల్

• విలువ రూ.2.570 కోట్లు



న్యూఢిల్లీ : భారతి ఎయిర్‌టెల్ అనుబంధ సంస్థ భారతి ఇన్‌ఫ్రా టెల్‌కు చెందిన 6.7 కోట్ల షేర్లను . ఒక్కోషేరు రూ.380.6కు విక్రయిం చింది. క్రితం రోజుతో పోల్చుకుంటే నాలుగు శాతం డిస్కౌంట్‌కు విక్రయించినట్లు లెక్క. వాటాల విక్ర యం ద్వారా రూ.2,570 కోట్లు సమకూర్చుకుంది. సేకరించిన డబ్బుతో కంపెనీ అప్పులు తగ్గించ డా నికి వినియోగించుకుంటుందని ఎయిర్‌టెల్ ఒక ప్రకటనలో తెలిపింది. భారతి ఎయిర్‌టెల్‌కే చెందిన సొంత అనుబంధ సంస్థ నెట్టెల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్‌మెంట్స్ 67.53 మిలియన్ షేర్లను మరో అనుబంధ సంస్థ భారతి ఇన్‌ఫ్రాటెల్ ద్వారా సెకండరీ మార్కెట్లో విక్రయించింది. తాజాగా వాటాలు విక్ర యించిన తర్వాత భారతి ఎయిర్‌తో పాటు సబ్సిడీ కంపెనీకి కలిసి భారతి ఇన్ ఫ్రాటెల్‌లో 58 శాతం వాటా ఉంటుందని ఎయిర్‌టెల్ ఒక ప్రకటనలో వివరిం చింది. యూబీఎస్, జేపీ మోర్గాన్‌లు ఈ లావాదేవీలకు ఏజెంట్లుగా పనిచేశాయి.

టీవీఎస్ మోటార్ నుంచి కొత్త
జూపిటర్ క్లాసిక్



చెన్నై: ద్విచక్ర, త్రిచక్ర వాహనాల తయారీ కంపెనీ టీవీఎస్ మోటార్ కంపెనీ ప్రస్తుతం బాగా ప్రజాదరణ పొందిన 110 సీసీ జూపిటర్‌కు కాస్తా నగిషిలు తీర్చి దిద్ది టీవీఎస్ జూపిటర్ క్లాసిక్ ఎడిషన్ పేరుతో మార్కెట్లో విడుదల చేసింది. అదనపు ఫీచర్ల విషయానికి వస్తే .. రౌండ్‌షేప్ క్రోమ్ మిర్రర్, విండ్‌షీల్డ్, సిల్వర్ ఒక్ ప్యానెల్స్, క్రోమ్ బ్రాకెట్స్, యుఎస్‌బీ చార్జర్, డిస్క్ బ్రేక్‌లని చెన్నై ప్రధాన కార్యాలంగా పనిచేస్తున్న టీవీఎస్‌మోటార్ ఒక ప్రకటనలో వివరించింది. 110 సీసీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన ఈ స్కూటర్ ఇంధన సామర్థ్యం కూడా ఎక్కువగా ఉంటుందని భరోసాతో చెప్పింది. క్లాసిక్ ఎడిషన్ ధర రూ.55,266 (ఎక్స్‌షో రూం న్యూఢిల్లీ) దేశవ్యాప్తంగా ఉన్న కంపెనీకి చెందిన ఔట్‌లెట్లలో ఈ స్కూటర్ లభిస్తుందని తెలిపింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1.50 మిలియన్ జూపిటర్ స్కూటర్లు రోడ్లపై తిరుగుతున్నాయని కంపెనీ పేర్కొంది.

పోలారిస్ లాభంలో 24% ఆవిరి

హైదరాబాద్ : పోలారిస్ కన్సెల్టింగ్ సర్వీసెస్.. అమెరికాకు చెందిన వర్చుసాలో ఒక భాగమైన ఈ కంపెనీ జూన్‌తో మగుఇసిన త్రైమాసికంలో నికరలాభం రూ.30 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాదితో పోల్చుకుంటే 24 శాతం తగ్గింది. పెద్దమొత్తంలో ఉద్యోగులను తీసుకోవడంతో పాటు కంపెనీని వృద్ధిబాటలో పట్టించడానికి పెట్టుబడులు పెంచామని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. రెవెన్యూ మాత్రం 11 శాతం పెరిగి రూ.555 కోట్లకు ఎగబాకింది. కంపెనీలో 7493 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఎన్ఎం వైద్యనాథన్ బీఎస్ఈకి సమాచారం అందించింది.

అబ్బాట్ ఇండియా లాభం
రూ. 48 కోట్లు

• క్యూ1లో 35% క్షీణత

న్యూఢిల్లీ : ఫార్మాస్యూటికల్స్ కంపెనీ అబ్బాట్ ఇండియా జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికర లాభంలో 34.8 శాతం క్షీణించి రూ.48.25కోట్లు ఆర్జించింది. కొత్తగా జీఎస్టి అమల్లోకి వస్తున్న నేపథ్యంలో సరకు నిల్వలు తగ్గించుకున్నట్లు తెలిపింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.74.01 కోట్లు ఆర్జించిందని అబ్బాట్ ఇండియా బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ విషయానికి వస్తే 714.3 కోట్లకు దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.738.12 కోట్లని.. రెవెన్యూ 3.17 శాతం తగ్గిందని కంపెనీ ఒక ప్రకటనలో వివరించింది. కాగా బీఎస్ఈలో దీని షేరు 1.87శాతం క్షీణించి రూ.4369.75 వద్ద ముగిసింది.

స్టాక్ మార్కెట్లకు సెబి సెగ


• సెబి కొరడా...మార్కెట్లు డీలా • బీఎస్ఈ 60 పాయింట్లు పతనం

ముంబై: స్టాక్ మార్కెట్లు మంగళవారం డీలా పడ్డాయి. బీఎస్ఈ ఏకంగా 260 పాయింట్లు కుంగింది. నిఫ్టీ కీలకమైన 10వేల పాయింట్లకంటే కిందికి దిగివచ్చింది. మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి స్టాక్ మార్కెట్లో 331 డొల్ల కంపెనీలు లిస్ట్ అవుతున్నట్లు గుర్తించింది. దీంతో ఇన్వెస్టర్లలో వణుకు పుట్టింది. ఇదిలా ఉండగా సెబి గత రాత్రి బీఎస్ఈని ఈ డొల్ల కంపెనీలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ డొల్ల కంపెనీలు ఈ నెల ట్రేడింగ్‌లో అందుబాటులో ఉండవు. బ్రోకర్లు చెప్పేదేమిటంటే .. సెబి ఆర్డర్‌తో మార్కెట్లో ఆందోళన నెలకొందని దీనిపై బీఎస్ఈ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. మెజారిటీ కంపెనీలపై ఇప్పటికే విచారణ జరుగుతోందని.. ముఖ్యంగా ఈ కంపెనీలపై పన్ను ఎగ్గొట్టడం, కార్పొరేట్ మోసాలకు పాల్పడ్డం తదితర అంశాలున్నాయి. వీటిని ఇప్పటికే ఆదాయపు పన్ను శాఖతో పాటుకార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ కింద పనిచేస్తున్న ఎస్ఎఫ్ఐఓకు చర్యలు తీసుకోమని సమాచారం ఇవ్వడం జరిగింది. దీంతో పాటు సెబికి కూడా ఈ డొల్ల కంపెనీలపై చర్యలు తీసుకోవాలని గతంలో పలు ఫిర్యాదులు వచ్చాయి. అయితే డొల్ల కంపెనీల్లో ఎక్కువగా పశ్చిమ బెంగాల్‌కు చెందినవే ఉన్నాయి.

తాజా పరిణామాలతో బీఎస్ఈలో స్టాక్ మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి పెరిగిపోయింది. దీంతో బీఎస్ఈసూచి కీలకమైన 32 వేల మార్కు కంటే కాస్తా కిందికి దిగివచ్చి మార్కెట్ ముగిసే నాటికి కాస్తాకోలుకొని 32,014.198 వద్ద ముగిసింది. మొత్తానికి 259.48 పాయింట్లు నష్టపోయింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ నిఫ్టీకూడా కీలకమైన 10 వేల మార్కు కంటే కిందికి వచ్చింది. 78.55 పాయింట్లు నష్టపోయి 9978.55 వద్ద స్థిరపడింది.

సెబి ఆర్డర్ పరిశ్రమతో పాటు ఇన్వెస్టర్లను ఆశ్చర్యానికి గురిచేసింది. షెల్ కంపెనీ లేదా డొల్లకంపెనీ కాకపోయిన ప్రస్తుతం కొన్ని కంపెనీల సంపద కరిగిపోతుంది. కొన్న కంపెనీలకు చావు దెబ్బేఅని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

ఇదిలా ఉండగా విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు సోమవారం నాడు రూ.199.21 కోట్ల షేర్లు విక్రయించగా.. దేశీయ ఇన్వెస్టర్లు రూ.308.15 కోట్ల షేర్లను కొనుగోలు చేశారని స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. బీఎస్ఈలో అత్యధికంగా నష్టపోయిన షేర్ల విషయానికి వస్తే డాక్టర్ రెడ్డీస్‌ను చెప్పుకోవచ్చు సుమారు 4.91 శాతం కరిగిపోయింది. నష్టపోయిన ఇతర షేర్లు ఇలా ఉన్నాయి. ఎస్‌బీఐ, ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంకు, ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంకు, ఓఎన్‌జీసీ, మారుతి సుజుకి, హీరోమోటోకార్ప్, సన్ ఫార్మా, కొటక్ మహీంద్రా బ్యాంకు, లూపిన్, రిలయన్స్‌ఇండస్ట్రీ,ఎల్అండ్‌టి,హెచ్‌డీఎఫ్‌సీబ్యాంకు, ఇన్ఫోసిస్, ఏషి యన్ పెయింట్స్, విప్రో, టీసీఎస్, హెచ్‌ఈఎఫ్‌సీలు 2.33 శాతం వరకు నష్టపోయాయి. బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన షేర్ల విషయానికి వస్తే టాటాస్టీల్ 2.63 శాతంతో దూసుకుపోయింది. క్యూ1 ఫలితాలు ఆకర్షణీయంగా ప్రకటించడమే కారణం. లోహ రంగానికి వస్తే హిందుస్తాన్ అల్యూమినియం, నాల్కో, వేదాంత, సెయిల్, ఎంఎండీసీలు లాభాపడ్డాయి.



బీఎస్ఈలో ఇతరసూచిల విషయానికి వస్తే అత్యధికంగా నష్టపోయింది మాత్రం రియల్టీ 4.53 శాతం కుంగింది. తర్వాతి స్థానాలు చమురు సహజవాయువు 2.16 శాతం, పీఎస్‌యు 2.08 శాతం, విద్యుత్ 1.88 శాతం, ఎఫ్ఎంసీజీ 1.50 శాతం, బ్యాంకు 1.34 శాతం, హెల్త్‌కేర్ 1.32 శాతం, క్యాపిటల్‌గూడ్స్ 0.93 శాతం, టెక్ 0.65 శాతం, ఐటీ 0.60 శాతం, ఆటో 0.39 శాతం వరకు ఉన్నాయి. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే ఆసియా మార్కెట్లు లాభాలతో ట్రేడ్ కాగా..యూరోప్ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ అయ్యాయి.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా టీజేఏసీ ర్యాలీ



హైదరాబాద్,ఆంధ్రప్రభ : డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ సూచించారు. ప్రభుత్వం కూడా డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం టీజేఏసీ ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడారు. డ్రగ్స్‌కు ఒకసారి అలవాటు పడితే మానుకోవడం సాధ్యం కాదని, దీంతో చాలా కుటుంబాలు నాశనం అవుతున్నాయన్నారు. ఉడ్తాపంజా లాంటి సినిమా చూస్తే డ్రగ్స్ తీసుకుంటే ఏం జరుగుతుందో తెలుస్తుందన్నారు. పంజాబ్ రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా విస్తరించిందని, ఇప్పుడు దాని చాయలు హైదరాబాద్‌లో కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ మాఫియాను అరికట్టే శక్తి ప్రభుత్వానికి ఉందన్నారు. ప్రచారంతో ఆగిపోదని, కేసులు పెట్టి వదిలేయడం కాకుండా మత్తును వదల కొట్టాలనేదే తమ డిమాండ్ అన్నారు. 2014 నార్కోటిక్ చట్టాన్ని అమలు చేయాలన్నారు. డ్రగ్స్ అలవాటు నుంచి యువతను కాపాడాలన్నారు.

డ్రగ్స్‌పై అబ్కారీశాఖకు అధికారం ఉందా?

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్,ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రాన్ని కుది పేసిన డ్రగ్స్ కేసులను దర్యాప్తు చేసేందుకు ఆబ్కా రీ శాఖకు అధికారం ఉందో? లేదో? వారం రోజుల్లో చెప్పాలని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇలాంటి కేసులపై ఎవరు దర్యాప్తు జరపాలో తెల్సుకొని చెప్పాలని హైకోర్టు ప్రభుత్వ న్యా యవా దిని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధా న న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ మంగ ళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వా రం రోజులు వాయిదా వేసింది...డ్రగ్స్ వ్యవహారంలో దర్యాప్తును నార్కోటిక్ నియంత్రణ బ్యూరో వంటి కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలకు అప్పగించేలా ఆదేశాలు జారీ చేయా లని అభ్యర్థిస్తూ తెలం గాణ తెదేపా కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మె ల్యే ఎ.రేవంత్ రెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖ లు చేసిన విషయం తెలిసిందే. నార్కోటిక్ నియం త్రణ బ్యూరో (ఎన్ సీబీ) మాత్రమే మాదక ద్రవ్యాల చట్టాన్ని అమలు చేసే సంస్థ అని విన్నవించారు.

మైక్ కమింగా..మజాకా..!?

హైదరాబాద్, ఆంధ్రప్రభ : డ్రగ్స్ మూలాల అన్వేషణలో కాల్విన్ కంటే ముందంజలో ఉండి డ్రగ్స్ మాఫియా డాన్ మైక్ కమింగా ఎక్సైజ్ సిట్ విచారణ సందర్భంగా విస్తుపోయే వాస్తవాలను వెల్లడి చేస్తున్నాడు. ఇటీవల సినీ నటి చార్మి విచారణ సందర్భంలోనే మైక్ కమిం గాను సిట్ అరెస్టు చేసింది. నెదర్లాండ్స్‌కు చెందిన మైక్ కమింగా భాగ్యనగరంలో ఉంటూ డ్రగ్స్ దందాను నిరంతరంగా కొనసాగించాడు. ఓ సంస్థను నెలకొల్పి వంద మందికి ఉపాధిసైతం కల్పించిన మైక్ కమింగా ఆ ముసుగులో కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కొందరు సినీ ప్రముఖులు, రాజకీయ నేతలను సైతం డ్రగ్స్ బానిసలుగా చేశాడు. ఓ చైన్ సిస్టమ్ మాదిరిగా డ్రగ్స్ సరఫరాను కమింగా కొనసాగించేవాడని తెలుస్తోంది. స్వతహాగా కమింగా డ్రగ్స్‌కు బానిస అని సిట్ అధికారుల విచారణలో వెల్లడైంది. మూ్డ్రోజుల కస్టడీలో మైక్ కమింగా తొలుత ఎక్సైజ్ సిట్ అధికారులకు వివరాలను అందించడంలో మౌనం దాల్చినప్పటికీ పోలీసులు తమదైన శైలిలో ప్రశ్నించడంతో వాస్తవాలను సిట్‌కు వివరించినట్లు సమాచారం. కాగా, మైక్ కమింగాను మూ్డ్రోజుల విచారించిన ఎక్సైజ్ సిట్ మరో మారు కమింగా కస్టడీని కోరే అవకాశం ఉంది. మైక్ కమింగా నెట్‌వర్క్ చాలా పెద్దదని ఎక్సైజ్ సిట్ భావి స్తోంది. ఆ దిశగా తదుపరి విచారణ కొనసాగించేందుకు సిట్ సమా యత్త మవు తోంది. విదేశాల నుంచి డ్రగ్స్ ఎలా తెచ్చేవాడు? విదేశాలలో డ్రగ్స్ కమింగాకు అందజేసేదేవరు? ఆ దిశగా కూడా సిట్ అధికారులు తమ దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా 8,9 తరగతి చదివే భావిభారత పౌరులైన విద్యార్థులను సైతం డ్రగ్స్ బానిసలుగా చేసిన వైనం ఇత్యాది విషయాలపై సిట్ ప్రధాన దృష్టి సారిస్తోంది. ఈ మూ్డ్రోజుల వ్యవధిలో మైక్ కమింగా ఎవరెవరికి డ్రగ్స్ సరఫరా చేశాడన్న జాబితాను సిట్ సేకరించగలిగింది. ఆ జాబితా ఆధారంగా వారిని కార్యాలయానికి పిలిపించాలని, లేకుంటే వారి వద్దకే వెళ్లి విచారించాలని సిట్ భావస్తోంది. అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియాలతో మైక్ కమింగాకు లింకులున్నాయని తెలుసుకున్న సిట్ విచారణలో ఇతర దేశాల పోలీసుల సాయం తీసుకోవాలని కూడా యోచిస్తోంది. కమింగా జాబితా పెద్దదేనని దాదాపు వెయ్యి మందికి డ్రగ్స్ విక్రయించారని సిట్ విచారణలో వెల్లడైంది. కమింగా జాబితాలో అన్ని వర్గాలు ఉండట మే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ప్రధా నంగా మైక్ కమింగా జాబితాలో పలువురు సినీ ప్రముఖులు ఉన్నట్లు తెలు స్తోంది.అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియాలతో కమింగాకు ఉన్న సంబంధాలపై మరింతగా కమింగాను ఎక్సైజ్ సిట్ విచారణ జరప నుంది. దీంతో, మరోమారు కమింగాను తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టును ఎక్సైజ్ సిట్ అభ్యర్థించనుంది. కాగా, సెకండ్ లిస్టు ఇప్పట్లో ఉంటుందా? ఉండదా? అన్న విషయం పక్కనబెడితే.. సెకండ్ లిస్టులో తమ పేరుందా? అని సినీ ప్రముఖులతో సహా అందరూ కలవరపడుతున్నట్లు తెలుస్తోంది. కొందరైతే ఇందుకోసం ఎక్సైజ్ సిట్ అధికారులను సైతం వాకబు చేస్తున్నట్లు సమాచారం. దీంతో మైక్ కమింగా..మజాకా..!? అనక తప్పదు.

రైల్లో గంజాయి స్వాధీనం




కరీమాబాద్, కెఎన్ఎన్ : కోణార్క్ ఎక్స్ ప్రెస్‌లో అక్రమంగా తరలిస్తున్న 156 కిలోల ఎండు గంజాయిని జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జీఆర్పీ, ఎస్ఐఆర్పీల ఆధ్వర్యంలో ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామని, ఈటీం అధికారి డి. శ్రీనివాస్ మంగళవారం ఉదయం విజయవాడ నుంచి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేస్తున్నారు. కొంత మంది వ్యక్తులు శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో 8మంది ప్రయాణీకులు ఎస్-12 కోచ్‌లో ఎక్కారని, ఇందులో నలుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. కోచ్‌లో 1 నుంచి 8 బెర్తులను రిజర్వ్‌చేసుకుని ముంబయికి ప్రయాణిస్తున్నారని, జీఆర్పీ ఎస్సై-2 శ్రీనివాస్ తనిఖీలు చేస్తున్న క్రమంలో కోచ్ నుంచి గంజాయి వాసన రావడం జరిగిందని, ఇంతలోనే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకోగా అనుమానస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీలు చేయగా వారి వద్ద 15 బ్యాగుల్లో 156 కిలోల ఎండు గంజాయి లభించిందని, వెంటనే వారిని అదుపులోకి తీసుకోగా, వారు ఒడిషాకు చెందిన ఏ-1 రిబేక్ నాయక్, బారీపాడ, ఆటమకోస్ట లఖ్‌పతి జిల్లాకు చెందిన వ్యక్తి.. 2. పంకజ్ విశాల్ జైపూర్ నాలా కోడాయి తంబాగూడ పీఎస్, రాయగడ జిల్లా ఒడిషా, ఏ-3 నిషితలీమా కీంపూర్ గ్రామం, హుస్సాసింగ్ నగరంలో రాయగర్ జిల్లా, ఏ-4 గౌరి పెదనోయ్ బారిపెడ గ్రామం గజపతి జిల్లా ఒడిషా, ఏ-5 కమారమణి నాయక్, దామిదన్ గ్రామం గజపతి జిల్లా ఒడిషా, ఏ-6 ప్రద్మోద్ హరీషా (19) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. బారిపెడ గ్రామం, గజపతి జిల్లా, ఒడిషా, ఏ-7 గజేంద్రబీహర (22) బారెపెడ గ్రామ గజపతి జిల్లా ఒడిషా, ఏ-8 దీప్తినిషాల్, వినికిత గ్రామం రాయదార్ జిల్లా, ఒడిషా రాష్ట్రానికి చెందినవారి అని వీరివద్ద అక్రమ నిషేధిత గంజాయి లభించిందని, వీరు ఒడిషా చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో రూ.500 కిలో చొప్పున కొనుగోలు చేస్తారని డీఎస్పీ తెలిపారు.

గంజాయికి ముంబయికి లక్షల రూపాయలు పలుకుతుందని, వరంగల్ మీదుగా కోణార్క్ ఎక్స్ ప్రెస్‌లో తరలిస్తున్నారని, గంజాయిని స్వాధీనం చేసుకని తహశీల్దార్ ఎదుట పంచనామా నిర్వహించి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ సమావేశంలో జీఆర్పీ సీఐ వెంకటరత్నం, ఎస్సైలు శ్రీనివాస్, పి. శ్రీనివాస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ బిల్లును కాంగ్రెస్ అడ్డుకుంది

ప్రైవేట్ ఉద్యోగాల రిజర్వేషన్ల అమలుకు కృషి: దత్తాత్రేయ



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించే తమ ప్రయత్నాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని కేంద్ర కార్మికశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఓబీసీ మహాధర్నాకు ఆయన హాజరై మద్దతు తెలిపారు. ఈ ధర్నాలో దత్తాత్రేయతో పాటు ఎంపీలు రాపోలు ఆనంద భాస్కర్, బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎంపీ వీ. హనుమంత రావు, కాంగ్రెస్ నేత పొన్నాల లక్ష్మయ్య తదితర నేతలు పాల్గొన్నారు. చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌తో దేశవ్యాప్తంగా పలు బీసీ సంఘాలు హస్తినలో ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో జంతర్ మంతర్ ధర్నాకు పార్టీలకు అతీతంగా నేతలు హాజరై సంఘీభావం ప్రకటించారు. అనంతరం కేంద్ర మంత్రి దత్తాత్రేయ మీడియాతో మాట్లాడుతూ నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (బీసీ కమిషన్)కు రాజ్యాంగబద్ధత కల్పించేలా తాము తీసుకొచ్చిన బిల్లును కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని ఆరోపించారు. లోక్‌సభలో తాము బిల్లును పాస్ చేసినప్పటికీ, రాజ్యసభలో సాధ్యపడని సవరణలతో ఈ బిల్లును అడ్డుకున్న పాపం కాంగ్రెస్ పార్టీదేనని ఆయన దుయ్యబట్టారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఎలాగైనా ఈ బిల్లును పాస్ చేసి తీరుతామని సామాజిక న్యాయ శాఖ మంత్రి తనకు హామీ ఇచ్చారని బండారు దత్తాత్రేయ తెలిపారు. అలాగేపలు రాష్ట్రాల్లో బీసీలకు సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు అన్యాయం జర గకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన కోరారు. త్వరలోనే తాను ప్రధా న మంత్రి నరేంద్ర మోడీని కలిసి బీసీలకు చట్టసభలతో పాటు ప్రైవేటు ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్లు అమలు చేసే అంశంపై మాట్లాడతానని దత్తాత్రేయ తెలిపారు.

కాచిగూడ-కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాచిగూడ - కాకినాడ మధ్యన ఈ నెల 24, 27 తేదీల్లో ప్రత్యేకరైళ్లను నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రత్యేక రైలు కాచిగూడ నుండి 24వ తేదీన బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో 27న కాకినాడలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం కాచిగూడకు చేరు కుంటుంది.

పెనుగొండలో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ నిలుపుదల

భువనేశ్వర్ - బెంగుళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను ఇక మీదట ప్రయాణికుల సౌకర్యార్ధం పెనుగొండలో నిలుపుదల చేయడం జరుగుతుదని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. రైల్వే మంత్రిత్వ శాఖ నుండి అందిన ఆదేశాల మేరకు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను పెనుగొండలో రెండు నిమిషాలు పాటు నిలుపుదల చేయబోతున్నామని పేర్కొన్నారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ 08.38 గంటలకు పెనుగొండ చేరుకుంటుంది. రెండు నిమిషాలు అగి 08.40 గంటలకు బయలుదేరనుంది. తిరుగు ప్రయాణంలో 16.38 గంటలకు చేరుకొని 16.40 గంటలకు బయలుదేరనుంది.

కేసీఆర్‌కు సురవరం లేఖ



హైదరాబాద్,ఆంధ్రప్రభ : తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మంగళవారం లేఖ రాశారు. తాను లేవనెత్తిన అంశాలకు సమాధానం ఇవ్వకుండా.. తాను సిల్లీగా మాట్లాడానని సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను సురవరం తీవ్రంగా తప్పుపట్టారు. 'నేను చేసిన విమర్శల్లో అవాస్తవాలు ఉంటే సరి చేసుకునేందుకు సిద్ధం. మీరు చెప్పిన బంగారు తెలంగాణ కావడం లేదు' సురవరం వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్‌పై తాను వ్యక్తిగత విమర్శలు చేయలేదని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాస్వామ్య బద్ధంగానే మాట్లాడినట్లు తెలిపారు. తాము లేవనెత్తి అంశాలపై సమాధానం చెప్పాల్సింది పోయి అసహనంతో ఉన్న కేసీఆర్ కమ్యునిష్టులపై విమర్శలు చేయడం తగదన్నారు. అవినీతి పెరిగిపోయిందన్నారు. తాము చేసిన విమర్శలకు కట్టుబడి ఉన్నామని సురవరం పేర్కొన్నారు. ఈ మూడేళ్లలో ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ప్రతి దళిత కుటుంబానికి 3 ఎకరల భూమి, డబుల్ బెడ్ రూం ఇళ్లు, కేజీ టూ పీజీ ఉచిత విద్య, యూనివర్సిటిల ప్రయివేటికరణ ఏమైందని ఆయన ప్రశ్నించారు. నూతన సచివాలయం, శాసన సభా మందిరాల నిర్మాణాలకు డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయో చెప్పాలన్నారు.

భూరికార్డుల ప్రక్షాళన అంశంపై అందరి అభిప్రాయాలు తీసుకోవాలి : చాడా

భూ రికార్డుల ప్రక్షాళన, ప్రత్యేక డ్రైవ్ నిర్వహణకు ముందు రెవిన్యూ అధికారులు, రైతు సంఘాలు, రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి సూచించారు. ఇదే అంశంపై సీఎం చంద్రశేఖర్‌రావు ఎన్నో చెప్పారని అయినా ఆచరణలోకి రాలేదని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. మూడు గ్రామాలకు ఒక రెవిన్యూ అధికారిని నియమిస్తే పనులు వేగవంతం కావన్నారు.

కూరగాయల ధరను నియంత్రించాలి

హైదరాబాద్,ఆంధ్రప్రభ : **సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**

కూరగాయల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూరగాయల సాగును ప్రభుత్వం ప్రొత్సహించాలని ఆయన సూచించారు. నిత్యావసర ధరలు పెరగడం వల్ల సామన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారంతో భూములు సాగుకు నోచుకోవడం లేదన్నారు.



గెలుపు టీడీపీదే!

●ప్రభుత్వం మీద వ్యతిరేకత వల్లే మెజార్టీ రాదు: ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి వ్యాఖ్య



అమరావతి, ఆంధ్రప్రభ : నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుస్తుందని ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం మీద వ్యతిరేకత వల్ల మెజార్టీ రాదని ఆయన అన్నారు. బీజేపీ ఎప్పటికి జగన్‌తో కలవదని, మోడీకి కొన్ని విలువలు ఉన్నాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ కలిసే పోటీ చేస్తాయని ఆయన జోస్యం చెప్పారు. ఆశించిన మెజార్టీని రోజమ్మ, జగనయ్య కలిసి నాశనం చేశారన్నారు. నంద్యాల సభలో చేసి వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. జగన్ సభ తర్వాత వైసీపీ గబ్బు పట్టిందని విమర్శించారు. రాయలసీమలో చంపు, నరుకు అంటే చప్పట్లు కొట్టే వాళ్లు ఉంటారు. కానీ అది మంచి పద్ధతి కాదన్నారు. ముందు భాష మార్చుకోవాలని జగన్‌కు సూచించారు. రాష్ట్రంలో తన కంటే ఆవేశపరులు లేరన్నారు. ఎందుకో చెప్పాగలనని మెజార్టీ మీద విశ్లేషణ అవసరం లేదని ఆయన కొట్టిపారేశారు. ఎన్నికల ప్రచారంపై ప్రస్తావిస్తూ ఇంట్లో మహిళలతో ప్రచారం చెప్పిస్తే ఓట్లు పడతాయా అని ప్రశ్నించారు. బజార్లో పోతుంటే దొంగని దొంగనే అంటారని, వేల కోట్లు తిన్న జగన్ కూడా ప్రజలు అలాగే చూస్తారని అన్నారు.


ప్రజాస్వామ్యం నవ్వులపాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నంద్యాల ఉప ఎన్నికల్లో గెలవకపోతే బతుకుండదన్న భయంతో ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతి, అరాచకాలకు పాల్పడుతోందని వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తమ్మినేని సీతారం అన్నారు. మంగళవారం మీడియా సమావేశంలో సీతారాం మాట్లాడుతూ కుట్రలు, కుతంత్రాలతో అధికారపార్టీ ప్రజాస్వామ్యాన్ని నవ్వుల పాలు చేస్తోందని ఆరోపించారు. మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు నంద్యాలలో తిష్టవేసి పోలీస్ పహారాలో డబ్బులు, మద్యం ఏరులై పారించటం దారుణం అన్నారు. రాత్రికిరాత్రే శిలాఫలకాలు లేకుండా టెంకాయలు కొడుతు దేవాలయాలు ప్రార్థనామందిరాలని చెప్పి డబ్బులు పంచుతున్నారన్నారు. చంద్రబాబు నాయుడు అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించారన్నారు. నాపెన్షన్లు, నారోడ్లు అంటున్న చంద్రబాబు తనఖాతాలోనుంచి లేదా తన తండ్రి ఖర్జూర నాయుడు ఖాతాలోనుంచి డబ్బు ఇచ్చారా అని నిలదీశారు. ప్రజలు నీళ్లు , విద్యుత్ వంటి వాటిని అడిగితే కేసులు పెట్టి తాట తీస్తానని చంద్రబాబు బెదిరిచటంచూస్తే ఆయనకు పైశాచికత్వం తలకెక్కి అధికారమదంతో కొట్టుకుంటున్న ఉన్మాదిని తలపిస్తున్నారన్నారు. కోడలు బ్రాహ్మణి నిర్వహించిన సర్వేలో టీడీపీకి 16నుంచి21సీట్ల మాత్రమే వస్తాయని చెప్పిన విషయం గుర్తులేదా అని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం కేసీఆర్‌తో సహా అన్ని సర్వేలు వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీకే అనుకూలంగా ఉన్నట్టు తెలిపారు. నంద్యాల ఉప ఎన్నికల్లో అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పతున్న టీడీపీపై తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి , గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్టు తమ్మినేని సీతారం తెలిపారు.

డ్రగ్స్‌పై పిచ్చిపిచ్చిగా అడగొద్దు..

యాంకర్‌పై రాణా ఫైర్..వీడియో వైరల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : టాలీవుడ్‌ని కొన్ని రోజులుగా డ్రగ్స్ కేసు కుదిపేస్తోంది. చాలా వరకూ డ్రగ్స్ విదేశాల నుండి పార్సిల్స్ రూపంలో వస్తున్నాయని గ్రహించిన అధికారులు నిఘా పెంచాడు. ఇటీవల రామానాయుడు స్టూడి యోకి విదేశాల నుండి హీరో రానా పేరు మీద పార్సిల్ రావడంతో ఎక్సైజ్ శాఖ సీఐ పరిశీలిం చేందుకు వెల్లడం చర్చ నీయాంశమైంది. ప్రస్తుతం నేనే రాజు నేనే మంత్రి సినిమా ప్రమోష న్లలో భాగంగా ఓ టీవీ ఇంటర్వ్యూలో పాల్గొన్న రానాకు డ్రగ్స్ కేసు రామానా యుడు స్టూడియోకు వచ్చిన పార్సిల్‌కు సంబంధించిన ప్రశ్నలు ఎదురయ్యాయి. ఆ ప్రశ్నలు సదరు యాంకర్ నుంచి ఎదురవ్వగానే రానా ఆగ్రహంతో ఊగిపోయారు. పిచ్చి పిచ్చి ప్రశ్నలు వేయొద్దంటూ యాంకర్ మీద అరిచాడు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే రానా ఆగ్రహంతో అరవడం పబ్లిసిటీ స్టంటస్తే అని స్పష్టమవుతోంది. తాను అరిచిన వీడి యో సెన్సేషన్ కావాలనే ఉద్దేశంతో రానా.. లేని కోపాన్ని తెచ్చుకుని అలా అరిచినట్లు అతడి మొహంలో ఎక్స్‌ప్రెషన్స్ చూస్తే స్పష్టమవుతోంది. ఆ పార్సిల్ ఓపెన్ చేసి చూపించాను. ఆ పార్సిల్ ఓపెన్ చేసి చూపించాను. అందులో విదేశాల నుండి వెన్ను నొప్పి తగ్గించుకోవడానికి తెప్పించుకున్న పరికరం ఉంది. ఈ విషయాన్ని ఫోటో తీసి అందరికీ షేర్ చేశానని రానా తెలిపారు. తాను సినిమాలు, టీవీ షోలు డబ్బు కోసం చేయడం లేదు. నా గత మూడు సినిమాలకు డబ్బులే తీసుకోలేదు. బయటి నుండి డబ్బులు తీసుకొచ్చి నేను చేసే సినిమాల్లో పెడుతుంటానని రానా తెలిపారు. నేను హీరోను అని ఎప్పుడూ చెప్పుకోలేదు. నేను సినిమాల్లో పనిచేస్తుంటాను. అందులో చాలా అంశాలు ఉంటాయి. అందులో ఏసే ఒక భాగం హీరో. ఎవరైనా ఏమైనా అనుకుంటే సంబంధం లేదు అని రానా తెలిపారు. పాలిటిక్స్‌లోకి వెళ్లే ఉద్దేశం అస్సలు లేదు. నాకు డ్రామా అంటే ఇష్టం. సినిమా అంటే ఇష్టం. కథలు చెపడం ఇష్టం. పాలిటిక్స్‌లో డ్రామా ఉంటుంది కాబట్టి ఆ కాన్సెప్టుతో సినిమా చేస్తున్నా అని రానా తెలిపారు.

ప్రజల మనిషి భూమా

●జగన్ కోసం కష్టపడ్డ భూమా కుటుంబంపై విమర్శలు బాధాకరం ● నంద్యాలను అభివృద్ధి చేస్తున్నందుకు ముఖ్యమంత్రిని కాల్చాలా? ● మంత్రులు అమరనాథ్‌రెడ్డి, అఖిలప్రియ



ప్రసంగిస్తున్న మంత్రి భూమా అఖిలప్రియ

నంద్యాల అర్బన్, కెఎన్ఎన్ : నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలను దివంగత భూమా నాగిరెడ్డి దైవాలుగా భావించి సాధ్యమైనంత సేవలు అందించారని మంత్రి అఖిలప్రియ అన్నారు. అనునిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల కోసమే తుది శ్వాస విడిచారని కన్నీటి పర్యంతమయ్యారు. తన తల్లిదండ్రుల ఆశయాలే చిన్న వయస్సులో రాజకీయాల్లోకి వచ్చిన ఆటు పోట్లను తట్టుకుంటూ నడిపిస్తున్నాయన్నారు. వైసీపీ అధినేత పార్టీని నెలకొల్పినప్పుడు ప్రత్యేకంగా రాయలసీమలో పార్టీ అభివృద్ధి కోసం తన తల్లిదండ్రు లు భూమా, శోభానాగిరెడ్డిలు జగన్ వెంటే ఉంటూ ఆయనకు ఎంతో సేవలు అందించారని వారి సేవలను విస్మరించి భూమా కుటుంబంపై ఆ పార్టీ అధినేతే విమర్శలు చేయడం బాధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ళుగా అభి వృద్ధికి నోచుకోని నంద్యాల నియోజక వర్గాన్ని రూ. వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రిని నడిరోడ్డుపై కాల్చాలా అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి అమరనాథ్‌రెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, రామచంద్రాపురం ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు, ఆర్‌ఐసి మాజీ చైర్మెన్ ఏవి సుబ్బారెడ్డిలతో కలసి హాజరయ్యారు. అఖిలప్రియ మాట్లాడుతూ భూమా నాగిరెడ్డి ప్రజల కోసం అనుక్షణం తపన పడేవారని, ఆయన నంద్యాలను అభివృద్ధి కోసం పార్టీ మారారని అన్నారు. భూమా కుటుంబం అంటే ప్రజలు అని జగన్ తెలుసుకోలేక పోయారని, ఆ కుటుంబ మంటే వచ్చే ఎన్నికల్లో చూపిస్తారన్నారు. మంత్రి అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ 13 వేల ఇళ్ళు నంద్యాలకు మంజూరు చేసిన ఘనత చంద్రబాబుదే అన్నారు. 10 సంవత్సరాలు ఎమ్మెల్యేగా శిల్పా మోహన్‌రెడ్డి ఉండి నంద్యాలకు ఏ అభి వృద్ధి కార్యక్రమాలను చేయలేదన్నారు. 30 సంవత్సరాల నుంచి రోడ్డు వెడల్పు చేయలేని పని టీడీపీ ఈ రోజు చేసిందన్నారు. జగన్ బహిరంగ సభలో ముఖ్యమంత్రిని రోడ్డు మీద కాల్చేయాలనడం అతనిలోని ఫ్యాక్షనిజాన్ని బయటపెట్టింద న్నారు. 13 వేల ఇళ్ళు నంద్యాలకు ఇచ్చినందుకు కాల్చే యాలా? రూ.130 కోట్లతో వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నంద్యాలకు తాగునీరు తెచ్చినందుకు కాల్చేయాలా? 1వ తేదీ రాగానే పింఛన్లు ఇంటి వద్దకు వెళ్లి ఇస్తున్నందుకు కాల్చేయాలా? ఎందుకు కాల్చాలో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు, ఏరాసులు మాట్లాడుతూ నంద్యాలకు ఉప ఎన్నికలు భూమా చనిపోవడం వల్ల రావడం దురదృష్టకరమని, ఒక విధంగా నంద్యాల ప్రజలు అదృష్టం చేసుకున్నారని, పట్టణం ఇంత త్వరగా అభివృద్ధి చెంద డం భూమా కుటుంబం వల్లే సాధ్యమైందన్నారు. ఆర్‌ఐసి మాజీ చైర్మెన్ ఏవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ భూమా బ్రతికి ఉన్నప్పుడు రోడ్డు వెడల్పు కార్యక్రమం చేసి వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని ప్రజలకు చెప్పడం గుర్తు చేశారు. అభివృద్ధిని చూసి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిని 50 వేలకు పైగా మెజార్టీతో గెలిపించబోతున్నారన్నారు.

ఆదరించండి అన్ననవుతా: భూమా బ్రహ్మానందరెడ్డి



నంద్యాల నియోజకవర్గ ప్రజలు ఆదరించాలని ప్రతి ఒక్కరికీ అన్ననవుతానని టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మా నందరెడ్డి అన్నారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన తాను తాజాగా తనకు పెద్ద దిక్కులైన చిన్నమ్మ, చిన్నాన్నలు దూరం అయ్యారని, ప్రస్తుతం నంద్యాల ప్రజలే తనకు తల్లి దండ్రులుగా భావిస్తున్నానన్నారు. ఆయన మంగళ వారం గోస్పాడు మండలం యాళ్ళూరుతోపాటు నంద్యాలలో మూడవ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. ఆయా ప్రాంతాల్లో ఆయనకు ప్రజలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గోస్పాడు మండలంతో తనకు ఎంతో అనుబంధం ఉందని, గతంలో ఆళ్ళగడ్డ నియోజకవర్గంలో కలసి ఉన్నప్పుడు ఇక్కడి పెద్దలు తనను ఎంతో బాగా చూసుకున్నా రన్నారు. ఇప్పుడు ఆ మండలం భాగమైన నంద్యాల నియోజక వర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. పెద్దలు కొడుకుగా, తమ్ముడుగా భావించి తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని కోరారు. రాబోయే రోజుల్లో నంద్యాల నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేం దుకు ముఖ్యమంత్రి పట్టుదలతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇక పోటెత్తనున్న

ప్రచారం

●నేటి నుంచి వైఎస్ జగన్ రోడ్ షోలు



అమరావతి, ఆంధ్రప్రభ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేటి నుంచి నంద్యాల నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా విస్తృతంగా పర్యటిం చనున్నారు. బుధవారం నంద్యాల పట్టణంలో జరిగే రోడ్‌షోలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంటకు నంద్యాలలోనే రైతు నగరం నుంచి ప్రారంభమయ్యే రోడ్ షో రాత్రి 8:30 గంటల దాకా కొనసాగుతోంది. రామకృష్ణా నగర్, కానాల, హెచ్ఎస్‌కోటాల, బాబా నగర్, ఎం.చింత కుంట్ల, జూలెపల్లి, పసురపాడు, శ్రీరాం నగర్, దేల్లపురి, రాయపాడు, ఎస్‌కుళ్లూరులలో మొదటి రోజు రోడ్‌షో కొనసాగుతోంది. మొత్తం 20.5 కిలోమీటర్ల పాటు రోడ్ షో ఉంటుంది. అదే విధంగా 10న గురువారం రెండవ రోజు ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 30 కిలోమీటర్ల పాటు రోడ్ షో ఉంటుంది. నంద్యాల పట్టణంలోనే నూనెపల్లి క్రాస్, చబోలు టెక్క, గోస్పాడు పరిధిలోని సాంబవరం, జీల్వగుండ్ల, కానాలపల్లె, నాగులవరం, నెహ్రూనగర్, సత్యనారాయణపురం, జిల్లెల, అయ్యలూరుమెట్ట, అయ్యలూరు, పెద్ద కొట్టాల, అబంధం తండ, జిల్లాల పురంలో రోడ్ షో ఉంటుంది.

అదే విధంగా 3వ రోజు ఆగస్టు 11వ తేదీన ఉదయం 8:30 నుంచి రాత్రి 8 గంటల దాకా నంద్యాల మున్సిపాలిటీలో రోడ్‌షో ఉంటుంది. నంద్యాలలోని చాపిరేవుల, సుబ్బారెడ్డిపాలెం, బాపూజీనగర్, పాండురంగపురం, పసులూరు, బ్రాహ్మణపల్లి, మిట్టనాల, శివరాంపురం, గుంటనాల, పాండురంగాపురం మిట్ట, తొగరుచేడు, ఉడుములపురం, ఆటోనగర్, తోలూరు, మునగాల, రాయమల్‌పురం, పులిమద్ధి, నందమూరినగర్, వైఎస్సార్ నగర్‌లలో 37.5 కిలోమీటర్లు పాదయాత్ర కొనసాగుతుంది. అదే విధంగా ఈ నెల 13న గోస్‌పాడ్ మండలంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు రోడ్ షో నిర్వహించనున్నారు. మొత్తం 9 కిలోమీటర్ల పాటు రోడ్‌షో కొనసాగుతోంది. యల్లూరారు, ఎం.కృష్ణాపురం, బివినగర్ శ్రీనివాసపురం, గోస్‌పాడు, వంటివెలిగలలో రోడ్‌షో నిర్వహిస్తారు.

నేటితో గడువు పూర్తి

కర్నూలు, కెఎన్ఎన్ బ్యూరో: నంద్యాల ఉప ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు నేటితో పరిసమాప్తం కానుంది. ఆ తర్వాత ఎవరెవరు బరిలో ఉంటారనదే స్పష్టం కానుంది. తరువాయి బాగం ఇక దంగల్ (యుద్ధం) జరగనుంది. ప్రదానంగా టీడీపీ, వైసీపీ మధ్యనే సమరం రసవత్తరం కానుంది. రెండు పార్టీలు కూడా సమజ్జీవులు కావడంతో గెలుపే ప్రధాన లక్ష్యంగా ఉప ఎన్నికల మైదానంలోకి అడుగు పెట్టనున్నాయి. ఆ తర్వాత రణరంగమే జరగనుంది. గెలుపు కోసం రెండు పార్టీలు కూడా గత కొంత కాలం నుంచే తీవ కసరత్తులు చేస్తున్న విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో నంద్యాల విజేతపై రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ఈ ఉప ఎన్నికలు ఇరు పార్టీలకు రెఫరెండం కావడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకు న్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధికార పార్టీ ఆశలు పెట్టుకోగా, ప్రభుత్వ వైఫల్యాలే తమను గట్టెకిస్తాయని వైఎస్ఆర్‌సిపి నమ్ముతోంది. ఈ నేపథ్యంలో ప్రజలు ఎవరికి పట్టం కడతారో చూడాలి. ఉప ఎన్నికల ప్రచా రాలను ఇప్పటికే పలు పార్టీల నాయకులు జోరు పెంచారు. ప్రధాన పార్టీలతో పాటు కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, బిసి యునైటెడ్ ఫ్రంట్, రాయలసీమ ప్రజా సమితి వంటి పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ప్రచారం షురూ చేశారు. ఇప్పటికే చోటా మోటా నాయ కులతో పాటు బడా నాయకులు కూడా నంద్యాల చేరుకొని ప్రచారాలను చేపడుతున్నారు. ఓటర్లను ఆకర్శిం చేందుకు నానా తంటాలు పడుతున్నారు. వార్డుల వారిగా కమిటీలు వేసు కుంటున్నారు.


బరిలో వీరే...

నంద్యాల ఉప ఎన్నికల బరిలో 30 మంది నామినేషన్లు దాఖలు చేయగా నామినేషన్ల పరిశీలనలో ఆరుమంది అభ్యర్థుల నామినేషన్లు ఎన్నికల రిటర్నింగ్‌అధికారులు తిరస్కరించారు. దీంతో అభ్యర్థుల సంఖ్య 24కు చేరుకుంది. పోటీచేసే అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. టీడీపీ నుండి భూమా బ్రహ్మ నందరెడ్డి, వైసీపీ నుండి శిల్పా మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుండి గడ్డం అబ్దుల్‌ఖాదర్, నవతరం పార్టీ నుండి రావూస్ సుబ్రమణ్యం, అన్న వైఎస్ఆర్ పార్టీ నుండి షేక్ మహబూబ్‌బాషా, బిసి యునైటెడ్ ఫ్రంట్ నుండి గాజుల అబ్దుల్ సత్తార్, రాయలసీమ పరిరక్షణ సమితి నుండి బవనాస్ పుల్లయ్య, సమాజ్‌వాది పార్టీ నుండి రాఘవేంద్ర, రాజ్యాధికార పార్టీ నుండి వల్లెపు సుబ్బరాయుడు, రెడ్డప్ప వల్లిగట్ల, శివ నవీన్‌కుమార్‌లు ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఎం నాగనవీన్, భూమా బ్రహ్మ నందరెడ్డి, ఎస్ రఘునాథ్‌రెడ్డి, శిల్పా రాజమోహన్‌రెడ్డి, నార్ల మధన్‌మోహన్ రెడ్డి, ఏరాసు శ్రీనివాసరెడ్డి, సంగ లక్ష్మికాంతరెడ్డి, భూపనపాడు నరసింహులు, వెలుగోటి రాజారెడ్డి, బాలసుబ్బయ్య, గురు వయ్య, రవిశంకర్‌రెడ్డి, కె కళ్యాణ్‌కుమార్‌లు బరిలో ఉన్నారు. బుధవారానికి నామినేషన్ల ఉప సంహరణకు గడువు ఉండటంతో కొంతమంది అభ్యర్థులు బరిలోనుండి వైదొలగే అవకాశాలు ఉన్నాయి.

జగన్‌వల్ల వైఎస్ పదవికి ముప్పు ఉందని..

రోశయ్య చెప్పారు

•నియోజకవర్గాలు పెరిగినా, పెరగకపోయినా ఇబ్బంది లేదు •వచ్చేది మా ప్రభుత్వమే •మీడియాతో ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి/హైదరాబాద్, ఆంధ్రప్రభ : నియోజకవర్గాల పునర్విభజన జరిగినా, జరగకపోయినా నష్టమేదీ లేదని తిరిగి అధికారంలోకి వచ్చేది తమ ప్రభుత్వ మేనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు స్పష్టంచేశారు. నియోజకవర్గాల పెరిగితే మరికొంత మం దికి పదవులు వస్తాయని, నియోజకవర్గాల పెంపువల్ల ప్రభు త్వం స్థిరంగా ఉంటుందని ఆయన మంగళవారం వెలగపూడి సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన ఉండదని కేంద్ర ప్రభుత్వం ఎక్కడా అధికారికంగా చెప్పలేదని ఆయన గుర్తుచేశారు.

విజయవాడ అభివృద్ధి కాకపోవడానికి భూ లభ్యత లేకపోవడమేనని దీనికితోడు ధరలు విపరీతంగా ఉండడంతో రాజధాని నగరం ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లో భూ లభ్యత బాగా ఉందని తాను ఉమ్మడి ఏపీకి ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడంవల్ల నగరం బాగా అభివృద్ధి సాధించిందని చెప్పారు. ఇప్పుడిప్పుడే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పడుతోందని అయితే తెలంగాణకు సమాన స్థాయిలో పోటీ పడలేకపోతున్నామని చంద్రబాబు చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన భూ సమీకరణ విజయవంతమైందని నవ్యాంధ్ర రాజధాని నిర్మాణానికి అడిగిందే తడవుగా రైతులు ముందు కొచ్చి 33వేల ఎకరాలను అందించారని ఆయన చెప్పారు. రాజకీయాల్లో తాను ఎదుర్కొన్న సంక్షోభాలు ఎవరూ ఎదుర్కొలేదని ప్రతి సంక్షోభాన్ని తనకు అనుకూలంగా మలుచుకుని ముందుకు సాగానని పేర్కొన్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో మీడియా సంస్థలకు స్థలాలు కేటాయిస్తామని అలాగే రాజధానిలో పనిచేస్తున్న పాత్రికేయులకు మూడు గదుల పడక గదులతో కూడిన ఫ్లాట్‌ను నిర్మించి ఇస్తామని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నంతకాలం ఆయన తనయుడు, ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఉండనివ్వకుండా చేశాడని ఆయన ఉంటే తన పదవికి ముప్పు వస్తుందన్న భయంతోనే బెంగళూరులో జగన్‌ను ఉంచారని చంద్రబాబు చెప్పారు. ఈ విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి, గవర్నర్ కొణిజేటి రోశయ్య ఓ మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ చెప్పారని పేర్కొన్నారు. చదువు కోసం జగన్‌ను అమెరికా పంపిస్తే తిరుగుటపాలో వచ్చేశాడని చెప్పారు. తాను శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు వెళుతున్న సమయంలో అలిపిరి దగ్గర మావోయిస్టులు తనపై దాడిచేశారని ఈ ఘటనలో ఉన్న తీవ్రవాదులకు స్మగ్లర్ గంగిరెడ్డి సెల్‌ఫోన్లు, డబ్బులను అందజేశాడని అటువంటి గంగిరెడ్డిని కాపాడేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో ప్రయత్నించారని చెప్పారు. తనపై జరిగిన హత్యాయత్నం ఘటనపై విచారణ జరిపేందుకు ఏకసభ్య కమీషన్‌ను నియమిస్తే ఆ కమీషన్‌పై ఒత్తిడి తెచ్చి గంగిరెడ్డిని కేసు నుంచి తప్పించేందుకు రాజశేఖరరెడ్డి ప్రయత్నించారని ఆరోపించారు. జైలులో ఉన్న గంగిరెడ్డిని కలిసేందుకు వైఎస్ ఎన్నో ప్రయత్నాలు చేశారని అయితే ఆయన అనుచరులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్యులు గంగిరెడ్డిని కలిస్తే తప్పుడు సంకేతాలు వెళతాయని హెచ్చరించడంతో వెనక్కి తగ్గారని పేర్కొన్నారు. గంగిరెడ్డితో తన స్వగ్రామంలో ఓ శుభకార్యం ఏర్పాటుచేసి ఆ కార్యక్రమానికి వైఎస్ వెళ్ళి ఆయనతో మంతనాలు జరిపారని చెప్పారు. అలిపిరి ఘటనపై జరిగిన నిరసన కార్యక్రమంలో వైఎస్ పాల్గొన్నారని ఆయన ఎందుకు పాల్గొన్నారో జగమెరిగిన సత్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనకపోతే తనపై వస్తున్న ఆరోపణలు నిజమవుతాయన్న భయంతోనే అప్పుడు వైఎస్ మావోయిస్టుల ఘటనకు నిరసనగా జరిగిన ఆందోళనలో పాలుపంచుకున్నారని గుర్తుచేశారు. తన పేరు ఎక్కడ బయటకు వస్తుందన్న భయంతోనే వైఎస్ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారని చెప్పారు. అలిపిరి సంఘటన తర్వాత తనకు నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్ఎస్‌జీ) భద్రతను కేంద్రం కల్పించిందని అయితే వారికి ఏడాది పాటు వసతి కల్పించకుండా, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయకుండా వైఎస్ ఇబ్బంది పెట్టారని తీరా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ జోక్యం చేసుకుని హెచ్చరికలు జారీ చేయడంతో విధిలేక ఎన్ఎస్‌జీకి అవసరమైన సౌకర్యాలు కల్పించారని చెప్పారు. శివారెడ్డి, పరిటాల రవి హత్యకు గురైనపుడు తానెంతో భావోద్వే గానికి గురయ్యానని చెప్పారు. సూట్‌కేసు బాంబు కేసులో తన మనవడిపై కేసులు పెట్టాలంటూ అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేశారని ఆరోపించారు.

విజయనగరంలో వంద పడకల ఆస్పత్రి

•కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ




ఢిల్లీలో భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కేంద్ర కార్మికశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ.

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరికొన్ని ఈఎస్ఐ ఆస్పత్రులు రానున్నాయి. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ తనకొచ్చిన విజ్ఞప్తులపై స్పందించారు. విశాఖలో 500 పడకల ఆస్పత్రికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 8 ఎకరాలు స్థలం కేటాయించడంతో అక్కడ త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని దత్తాత్రేయ వెల్లడించారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్లో ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో 4 చోట్ల 50 పడకల ఆస్పత్రులు ఏర్పాటు చేయాల్సిందిగా వచ్చిన విజ్ఞప్తుల గురించి వివరించారు. ఏపీ బీజేపీ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, మాజీ మంత్రి విశ్వనాథం, ఈఎస్ఐ కార్పొరేషన్ సభ్యుడు రామకోటయ్య తదితరుల బృందం దత్తాత్రేయకు వినతి పత్రం అందజేశారు. శ్రీకాకుళం జిల్లాలో జీడి పప్పు పరిశ్రమపై ప్రత్యక్షంగా ఆధారపడ్డ కార్మికులు 10,000 మంది వరకు ఉన్నారని, పరోక్షంగా మరో 15,000 మంది ఈ పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిసున్నారని వారు పేర్కొన్నారు. అలాగే విజయనగరం, శ్రీకాకుళం పట్టణాలతోపాటు పైడి భీమవరం, రాజాం ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారందరికీ ఉపయోగపడేలా ఈఎస్ఐ ఆస్పత్రులు నిర్మించాలని నేతలు విజ్ఞప్తి చేశారు.

అయితే విజయనగరంలో వెంటనే 100 పడకల ఆస్పత్రిని నెలకొల్పేందుకు దత్తాత్రేయ సానుకూలత వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని కేటాయించిన నేపథ్యంలో పార్లమెంటు సమావేశాలు ముగిసిన వెంటనే వెళ్లి అక్కడ శంఖుస్థాపన కూడా చేస్తామని దత్తాత్రేయ ప్రకటించారు. విజయనగరం జిల్లాకే చెందిన కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు సైతం శంఖుస్థాపనకు వస్తానన్నారని చెప్పారని దత్తాత్రేయ తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేయబోయే ఆస్పత్రిలో డయాలసిస్ సదుపాయాన్ని కూడా కల్పించనున్నట్టు ఆయన వెల్లడించారు. తద్వారా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కిడ్నీ బాధితులు విశాఖపట్నం వరకు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే శ్రీకాకుళంలో భవన నిర్మాణ కార్మికుల సంఖ్యపై అధ్యయనం చేసేందుకు అక్కడి లేబర్ వెల్ఫేర్ ఆఫీసర్, కమిషనర్లతో చర్చించి, ఆ తర్వాత నిర్ణయం తీసుకుంటానని అన్నారు. అలాగే పైడి భీమవరంలో మోడల్ డిస్పెన్సరీ లేదా ఆస్పత్రి ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆయన ప్రకటించారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డుతో సమావేశమై రాష్ట్రంలో కార్మిక సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహిస్తామని అన్నారు. ఏపీకి ఎక్కువ సంఖ్యలో ఈఎస్ఐ ఆస్పత్రులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన తెలిపారు. అలాగే వివిధ రకాల వృత్తులపై ఆధారపడ్డవారికి సామాజిక భద్రత కల్పించడంపై తాము దృష్టి పెట్టామని అన్నారు. కోస్తా తీరంలో లక్షలాది మంది మత్స్యకారులు ఉన్నారని, వారికి వైద్య సదుపాయాలు, సామాజిక భద్రత కల్పించడం కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు చేపట్టిన నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోనూ వాటిని మరింత సమర్థవంతంగా అమలు చేయడంపై తాను దృష్టి పెట్టానని దత్తాత్రేయ వెల్లడించారు.

రాజ్యాంగ విలువలను కాపాడుతా

సొంతూరు చవటపాలెంలో వెంకయ్యకు ఆత్మీయ సత్కారం



వెంకటాచలం (ముత్తుకూరు), కెఎన్ఎన్: పల్లెటూర్లు దేశానికి పట్టుకొమ్మలని భారత ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. భారతదేశ 15వ ఉపరాష్ట్రపతిగా ఎన్నికై తొలిసారి తన స్వగ్రామమైన చవటపాళెం గ్రామానికి మంగళవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంలో ఆత్మీయ అభినందన సభ జరిగింది. ఉప రాష్ట్రపతి పర్యటనకు ప్రభుత్వ అధికారులు, పోలీసు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం 9 గంటలకు చవటపాళానికి విచ్చేసిన ఉపరాష్ట్రపతి శ్రీరామపురంలోని సొంత ఇంటికి చేరుకున్నారు. తదుపరి కసుమూరుకు వెళ్లి మస్తాన్‌వలీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులను పేరుపేరునా పలకరించారు. కులాలు, మతాలు మనం సృష్టించుకున్నామని, చవటపాళెం పేరు భారతదేశంలో మారుమోగుతోందన్నారు. కన్నతల్లిని, సొంత ఊరును, మాతృదేశాన్ని మరిచినవాడు మనిషికాదని వెంకయ్యనాయుడు అన్నారు. అంతకుముందు కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులతో ఉపరాష్ట్రపతి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రశ్నలను ఉపరాష్ట్రపతిని అడిగారు. రాష్ట్ర విభజన సమయంలో మీ ప్రసంగం చాలా బాగుందని ప్రస్తుతం గౌరవమైన పదవిలో ఉన్నందున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏవిధంగా న్యాయం చేయగలరని ప్రశ్నించారు. రాజ్యాంగ విలువలను కాపాడతామని ఉపరాష్ట్రపతి సమాధానం ఇచ్చారు. చిన్నవయసులోనే తాను విద్యార్థి నాయకుడిగా వచ్చి భారతదేశ అభివృద్ధికి ఎంతో సేవ చేశానని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ చక్కగా చదువుకొని దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. విద్యార్థులే దేశానికి ఎంతో వెన్నెముక అని ఉపరాష్ట్రపతి తెలిపారు. ఉపరాష్ట్రపతి రాకతో స్వర్ణభారత్ ట్రస్ట్ కళకళలాడింది. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వయోపరిమితి 44 ఏళ్లకు పెంపు..!

(మొదటిపేజీ తరువాయి)

అమలులోకి తెస్తున్నట్లుగా ఉత్తర్వులు జారీ చేశారు. తాజా చర్యలద్వారా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు పదేళ్ల వయో పరిమితి నిర్ణయాన్ని పొడిగింపునిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లయింది. తద్వారా ఇప్పుడున్న ఉద్యోగ నియామక వయో పరిమితిని ఈ నిర్ణయం ద్వారా మరో రెండేళ్లకు పొడిగించింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఇతర నియామకసంస్థల నియామకాలకు అభ్యర్థుల గరిష్టవయో పరిమితిని 44 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వులు జారీ చేసింది. యూనిఫామ్ సర్వీసులు మినహా ఇతర సర్వీసులు నియామకాలకు ఈ పరిమితి వర్తించనుంది. అయితే మంగళవారంనాటి ఉత్తర్వుల ప్రకారం 2019 జూలై వరకు 44 ఏళ్ల గరిష్ట వయో పరిమితి అమలు కానుంది. అయితే రోల్ ఆఫ్ రిజర్వేషన్‌లో భాగంగా ఉన్న ఐదేళ్ల సడలింపు కూడా అదనంగా అందుబాటులో ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ, నియామక ప్రక్రియలను తెలంగాణ విద్యార్థిలోకం తీవ్రంగా అడ్డుకున్నది. 16 ఏళ్లపాటు ఉద్యమంలో మమేకమై బంద్‌లు, హర్తాళ్లు, రాస్తారోకోలతో ఉద్యమాన్ని పరుగులు పెట్టించింది. అప్పటి ప్రభుత్వ ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్లను కూడా తోసిపుచ్చి స్వరాష్ట్రంలోనే ఉద్యోగాలు సాధిస్తామని గైర్హాజరయ్యారు. ఉద్యమంపై మక్కువతో ఉద్యోగాలను సైతం ఫణంగా పెట్టారు. దీంతో నిరుద్యోగుల వయో పరిమితి ఈ 16 ఏళ్ల కాలంలో పరిమితిని మించిపోయింది. ఈ నేపథ్యంలో ఉద్యమ సమయంలోనే తమ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత వయో పరిమితిని పెంచుతామని అప్పటి ఉద్యమ నేత కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇదే హామీని ఆయన వాస్తవంలోకి తెచ్చి అమలులోకి తెచ్చారు.



ఎకరాలతో పనిలేదు

6 మొక్కలు పెంచితే 2 పాడి గేదెలు...

(మొదటిపేజీ తరువాయి)

ఎకరానికి ఏడాదికి రూ.8 వేల నగదు పెట్టుబడి ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. మొదటి విడుత మే నెలలో రెండవ విడుత అక్టోబర్ నెలలో రైతుల బ్యాంక్ ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో భూ రికార్డులను క్రమబద్ధీకరించేందుకు మూడు నెలల పాటు ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టి ప్రతి గుంటా భూమి రికార్డులోకి ఎక్కాలని, నకిలీలు లేకుండా పాస్ పుస్తకాలు తయారు చేయన్నాన్నామని తెలిపారు. కొరియర్ ద్వారా రైతుల ఇంటికి పాస్‌పుస్తకాలు అందేలా చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. మ్యూటేషన్లు, ఆర్డీఓలు కాకుండా తహసీల్దారులు జారీ చేసేలా అనుమతులు ఇవ్వ నున్నట్లు ఆయన తెలిపారు. ప్రతీ గ్రామంలో రైతు సంఘాలను ఏర్పాటు చేయనున్నామని, రైతులు, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటించిప్పుడు భూమి వివరాలను తెలియజేయాలని రైతులకు సూచించారు. శామీర్‌పేట్ మండలాన్ని ఆదర్శవంతగా తీర్చిదిద్దేందుకు రూ.120 కోట్లు ఖర్చు చేస్తమని సీఎం చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి అమరుడైన వీరారెడ్డి పేరుతో గ్రామంలో ప్రాథమిక వైద్యశాల నిర్మిస్తామ న్నారు. జిల్లాలో 374 చెరువులను గోదావరి జలాలతో నింపి, 70 నుంచి 75 వేల ఎకరాలకు నీరందిస్తామని చెప్పారు. గ్రామంలో రూ.75 లక్షలతో విలేజి కమ్యూనిటీ హాల్, రూ.30 లక్షలతో మహిళా సంఘాల కోసం మహిళా భవనం నిర్మి స్తామన్నారు. మూడుచింతలపల్లి, కేశవరం, లక్ష్మాపూర్ మరో మూడు గ్రామలకు రూ.5 కోట్ల ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. లింగాపూర్ తాండాను త్వరలోనే ప్రత్యేక గ్రామ పంచాయతీగా మారుస్తామని హామీ నిచ్చారు. మూడుచింతలపల్లి రెవెన్యూ రికార్డులన్నీ మ్యూటే షన్ జరగాలని, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌లో అనేక మార్పులు తీసుకు వస్తున్నామని చెప్పారు. గ్రామంలో సీసీ రోడ్లు, మురికి కాలువలు, దోభీఘాట్, శ్మశానవాటిక, ట్రాన్స్‌ఫార్మర్లు, నీటి ట్యాంక్‌లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు మూడు జిల్లాల్లో 24 గంటల పాటు వ్యవసాయ రంగానికి నాణ్య మైన విద్యుత్‌ను అందిస్తామన్నారు. త్వరలోనే ఇదే తరహాలో అన్ని జిల్లాలకు వ్యవసాయ రంగా నికి కరెంట్ సరఫరా చేస్తామని ఆయన చెప్పారు. హరితహారంలో భాగంగా మూడుచింతలపల్లిలో గ్రామంలో ప్రతి ఇంటికి ఆరు మొక్కల చొప్పున పెంచాలని, వాటిని మన కుటంబంలో ఒకరిగా చూసుకోవాలని చెప్పారు. జనవరి నెలలో ప్రతి ఇంటిలో రెవెన్యూ అధికారులు మొక్కలసర్వే చేపడుతారని, ఆరు మొక్కలు పెంచిన వారికి ఉచితంగా రెండు పాడి గేదెలను అందిస్తామని ఆయన పేర్కొన్నారు. మూడు చింతలపల్లిగ్రామంలో 50, లింగాపూర్ తాండాకు 50 చొప్పున డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరి చేస్తున్నట్లు సీఎం ప్రక టించారు. కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పి మహేందర్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, వివేకనంధ, కృష్ణారావు, జిల్లా కలెక్టర్ ఎంవీరెడ్డి, జేసీ ధర్మారెడ్డి స్థానిక ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటు పడండి

• ఆరు శాస్త్రాల వేద విద్యార్థులతో స్వరూపానందేంద్ర



విశాఖపట్నం, కెఎన్ఎన్ బ్యూరో : విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి గత నెల 9 నుంచి చాతుర్మాస్య దీక్షను లోకకల్యాణార్థం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఆరు శాస్త్రాలు చదువుకుంటున్న వేద విద్యార్థులకు స్వామీజీ ఆధ్వర్యంలో హితోపదేశం చేశారు. పూర్వ మీమాంస, ఉత్తర మీమాంస, సాంఖ్య దర్శనం, యోగ దర్శనం, న్యాయ దర్శనం, వైశేషిక దర్శన శాస్త్రాలను అభ్యసించడం అభినందనీయమని స్వామీజీ వేద విద్యార్థులను అభినందించారు. అనంతరం వారికి అన్నదానం, వస్త్రదానం చేయడంతోపాటు విద్యాభ్యాసానికి అవసరమైన ఖర్చును ఇక మీదట శారదా పీఠం నుంచి అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శారదా పీఠం ఉత్తర పీఠాధిపతి కిరణ్‌కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

చైనాలో భారీ భూకంపం

• వంద మందికిపైగా మృతి?



బీజింగ్: దక్షిణ చైనాలో మంగళవారం రాత్రి భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 6.5గా నమోదైంది. తొలుత ఐదుగురు మృతి చెందినట్లు వెల్లడైంది. అయితే వంద మందికి పైగా చనిపోయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. సిచువాన్ ప్రావిన్స్‌లో మంగళ వారం రాత్రి సుమారు 9.20 గంటలకు పది కిలో మీటర్ల లోతులో ఈ భూకంపం సంభవించినట్లు అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకటించింది. దీని ప్రభావంతో లక్షా 30 వేల ఇళ్లు దెబ్బతిన్నాయి. ఐదుగురు మృతి చెందగా 60 మంది గాయపడ్డారని, ఇందులో 30 మంది పరిస్థితి విషమంగా ఉందని చైనా అధికార జిన్హువా వార్తా సంస్థ తెలిపింది. అయితే మృతుల సంఖ్య వందకు పైనే ఉంటుందని ఆ దేశ జాతీయ విపత్తు నివారణ కమిషన్ అంచనా వేసింది. తీవ్ర భూప్రకంపనలతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళన చెందారు. ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు పెట్టారు. వెంటనే సహాయక బృందాలను రంగంలోకి దింపి బాధితులకు సహాయం అందజేస్తున్నారు. భూకంపం సంభవించిన ప్రాంతంలో ప్రముఖ జాతీయ పార్కులు, యునెస్కో వారసత్వ సరస్సులున్నాయి. నిత్యం సుమారు 38,000 మంది దీన్ని సందర్శిస్తుంటారు. అయితే భూకంపం ధాటికి ఓ పర్యాటకుడు చనిపోగా వంద మంది శిథిలాల కింద చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత భూకంప కేంద్రానికి సమీపంలో 2008లో సంభవించిన భూకంపంలో సుమారు 87,000 మంది మృతి చెందారు.

'కేటీఆర్ ఇలాకల్లో ఇసుకాసురుల రాజ్యం'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పేదలకు చేరాల్సిన వనరులను అధికార పార్టీ పెద్దల అనుచరులు దోచుకుంటున్నారనడానికి నేరేళ్ళ సంఘటన ప్రత్యక్ష నిదర్శనమని తెదేపా జాతీయ అధికార ప్రతినిధి అరవింద్‌కుమార్‌గౌడ్ అన్నారు. నేరేళ్ళ ప్రాంతంలో ఇసుకాసురులంతా కేటీఆర్ బంధువు లేనని ఆయన ఆరోపించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని వారు ఎన్నో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. మంగళవారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో అరవింద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, ఒక నెంబ ర్‌తోనే ఐదు లారీలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. పేదలకు చెందాల్సిన వనరులను అధికార పార్టీల పెద్దలకు దోచిపెడుతున్నారని వ్యాఖ్యానించారు.

భారత్ 45వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా



న్యూఢిల్లీ: భారత 45వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ పదవి కాలం ఈనెల27తో ముగుస్తుండటంతో తదుపరిన్యాయమూర్తిగా దీపక్ మిశ్రాను నియమిస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఖేహర్ తర్వాత సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యామూర్తిగా ఉన్న మిశ్రాను కొలిజియం ప్రధాన న్యాయమూర్తిగా ఎంపిక చేసింది. దీపక్ మిశ్రా 14 నెలల పాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించనున్నారు. అక్టోబర్ 2, 2018 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. అక్టోబర్ 03, 1953లో జన్మించిన దీపక్ మిశ్రా ఒడిషా హైకోర్టులో ప్రాక్టీస్‌ప్రారంభించారు.జనవరి 17, 1996లో ఒడిషా హైకోర్టు అడిషనల్ జడ్జిగా నియామితులైన మిశ్రా.. డిసెంబర్ 23, 2009 లో పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించారు. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన తర్వాత పదోన్నతిపై అక్టోబర్ 10,2011లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియామకమయ్యారు.

భారత హైకమిషనర్‌కు పాక్ సమన్లు

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌లో భారత్ దళాలపై కాల్పుల విరమణ ఉల్లంఘనల ఆరోపణలపై పాకిస్తాన్ మంగళవారం భారత డిప్యూటీ హై కమిషనర్‌కు సమన్లు జారీ చేసింది. భారత దళాలు ప్రాబల్యం లేని ప్రాంతాల్లో కాల్పులు జరిపి కాల్పుల విరమణ ఉల్లంఘనలకు పాల్పడిందని పాక్ విదేశాంగ కార్యాలయం తెలిపింది. ఈ కాల్పుల్లో కరీలా రంగంలో 35 ఏళ్ల మహిళ చనిపోయిందని, సోమవారం భారతీయ దళాలు కాల్పులు జరిపినట్టు ఖురట్టా సెక్టార్లో మరో మహిళ గాయపడినట్లు పాకిస్తాన్ పేర్కొంది. అంతర్జాతీయ మానవ హక్కులను ఉల్లంఘిస్తూ, మానవతా చట్టాలకు విరుద్ధంగా ఉందని విదేశీ కార్యాలయం తెలిపింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాల ప్రకారం భారత్, పాకిస్తాన్‌లో యునైటెడ్ నేషన్స్ మిలిటరీ అబ్జర్వర్ గ్రూప్‌ను అనుమతించడానికి అనుమతించాయి.



పాకిస్తాన్ : లాహోర్‌లో పేలుడు విధ్వంసాన్ని పరిశీలిస్తున్న స్థానికులు

డి ఫార్మసీలో 28 శాతం సీట్ల భర్తీ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో డి ఫార్మసీలో కేవలం 28.31 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. సీట్ల కేటాయింపు కోసం విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇవ్వగా వారికి సీట్ల కేటాయింపు మంగళవారం జరిగింది. రాష్ట్రంలో మొత్తం 830 సీట్లు ఉండగా వాటిలో 235 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఉన్న సీట్లలో 595 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో 55.83 శాతం సీట్లు భర్తీ కాగా ప్రైవేటు కాలేజీల్లో 17.11 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. సీట్లు పొందిన వారు ఆయా కాలేజీల్లో 11 లోపు చేరాలని అడ్మిషన్లప్రక్రియ కన్వీనర్ వాణి ప్రసాద్ తెలిపారు. అడ్మిషన్లప్రక్రియ కన్వీనర్ వాణి ప్రసాద్ తెలిపారు.

ఐసెట్ తుది విడత కౌన్సెలింగ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో ఎంబిఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరడానికి నిర్వహించే ఐసెట్ తుది విడత కౌన్సిలింగ్ నేటితో ముగియనుంది. వెబ్ ఆప్షన్లు ఇచ్చే విద్యార్థులకు 11న సీట్ల కేటాయింపు ఉంటుందని అడ్మిషన్లప్రక్రియ కన్వీనర్ వాణి ప్రసాద్ తెలిపారు.



గుజరాత్: అహ్మదాబాద్‌లో రాజ్యసభ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద బీజేపీ ఎమ్మెల్యేల సమావేశం

నయీం కేసులో ఎవ్వరినీ వదలం

సిట్ అధికారి అంజనీ కుమార్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో దర్యాప్తు కొనసాగుతోందని సిట్ అధికారులు పేర్కొ న్నారు. సాక్ష్యాలు దొరికితే ఎవ్వరినీ వదిలేది లేదని సిట్ స్పష్టం చేస్తోంది. సరిగ్గా ఏడాది క్రితం నయీం పోలీసు ఎన్‌కౌంటర్‌లో హతుడయ్యాడు. సెటిల్‌మెంట్లు, భూకబ్జాలు, హత్యలు, బెదిరింపులకు పాల్పడినట్లుగా పలు కేసులు నయీంపై ఉన్నా యి. నయీం కేసులో ప్రధానంగా వినిపించిన రాజకీయ నేతలపై ఎటువంటి చర్య లు లేవు. పోలీసుశాఖలో ఐదుగురిపై సస్పెన్షన్ వేటు పడింది. కొండను తవ్వి ఎలు కను పట్టిన చందంగా సిట్ వ్యవహరించిందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన నేతల ప్రమేయం ఉందనే కారణంగానే కేసును తప్పుదోవపట్టించే ప్రయత్నం చేశారని ఆరోపిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నయీం గురించి తెలియని వారు లేరు. నయీం ఎన్‌కౌంటర్ తర్వాత నయీం గురించి తెలియనివారికి, తెలి సినవారికి కూడా ఇంకా అనేక కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొందరు రాజకీయ నేతలు, పోలీసు ఉన్నతాధికారులు, జర్నలిస్టులు నయీంతో అంటకా గారని సమాచారం. అయితే ఈ కేసులో పెద్ద తల కాయలను తప్పించి చిన్న వారిని బలిచేశారని విపక్షాలు ప్రభుత్వ తీరుపై విమర్శానాస్త్రాలు సంధించాయి. ఈ కేసులో ప్రమేయం ఉన్నట్లు ఆడియో టేపులు బయటపడిన నేతలపై చర్యలు మాత్రం ఇంత వరకు తీసుకోలేదు. నయీం మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అయినప్పటికీ పోలీసు ఉన్న తాధికారులే ఆయనతో చెట్టపట్టాలేసుకుని తిరిగారు. ఈ మేరకు కొన్ని ఫోటోలు, వీడియోలు కూడా మీడియాలో ప్రసారమయ్యాయి. ఈ విషయమై సిట్ అధి కారులు కొందరిని ప్రశ్నించారు. ఆగస్టు 8, 2016న హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న షాద్‌నగర్‌లో పోలీసు ఎన్‌కౌంటర్‌లో హతుడయ్యాడు. అప్పట్నించీ గ్యాంగ్‌స్టర్ నయీంకు కుడిభుజంగా వున్న శేషన్నతో సహా మరో నలు గురు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గ్యాంగ్‌స్టర్ నయీం ఎన్‌కౌంటర్ అనంతరం పోలీసులు నయీం బంధువులు, అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. నయీం కు చెందిన పలు డెన్‌లపై, ఇళ్లపైనా దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో పెద్ద మొత్తంలో ఆయుధ డంప్‌లను సైతం సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాను పోయినా తనతో అంటకాగిన వారిని మాత్రం నయీం భూతం వెంటా డుతూనే ఉంది. గ్యాంగ్‌స్టర్ నయీం తన దందాలో తాను ఎవరినీ కలిసినా.. తనను ఎవరినీ కలిసినా పక్కాగా ఆ వివరాలను తన డైరీలో పొందుపర్చేవాడని సమాచారం. సిట్ పోలీసులకు ఆ డైరీ లభ్యమైనదని చెబుతున్నా ఇంతవరకూ ఆ డైరీని సిట్ అధికారులు బహిర్గతపర్చలేకపోవడం విశేషం. సదరు డైరీ చూసిన సిట్ అధికారులు విస్తుపోయారు. నయీం అరాచకాలకు ఆ డైరీ ప్రతిబింబంగా ఉందని తెలుస్తోంది. మావోయిస్టులతో విభేదించి పోలీసు కోవర్టుగా జీవనం ప్రారంభించిన నయీం అనతి కాలంలోనే కొందరు పెద్దల సహకారంతో గ్యాంగ్‌స్టర్ నయీంగా అవతరించాడు. తన దందాకు సహకరించిన పెద్దలకు భారీ నజరానాలను ముట్ట జెప్పినట్లు సమాచారం. తనకు రక్షణ కవచంగా బాలికలను వినియోగించుకునేవాడని, తన శారీరక సుఖానికి సైతం వారిని వాడుకునేవాడని తెలుస్తోంది. అనంతర కాలంలో సిట్ అధికారులు నయీం డెన్‌లనుంచి పలువురు బాలికలకు విముక్తి కల్పించారు. తనకు ఎదురు తిరిగిన వారిని నిర్దాక్షిణ్యంగా నయీం అంతమొందించేవాడు. అది పరాయివాడా? బంధువులా? అన్న విచక్షణ కూడా నయీం వద్ద ఉండేది కాదని తెలుస్తోంది. గ్యాంగ్‌స్టర్ నయీం అతికిరాతకంగా హత్యలు చేసే వాడని, దాదాపుగా 25 మంది నయీం అంతమొందించినట్లు సిట్ అధికారులే తెలి పారు. అయితే, ఈ సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందని తెలుస్తోంది. దాదా పుగా నయీం తన దందా ద్వారా ఆర్జించిన అక్రమ సంపాదన పదివేల కోట్లపైమాటే అని తెలుస్తోంది. తన దందాకు సహకరించని, తనకు అడ్డొచ్చిన ఎవరినైనా నయీం వదిలేవాడు కాదని తెలుస్తోంది. గ్యాంగ్‌స్టర్ నయీం గ్యాంగులో హైద రాబాద్ ప్రాంతానికి చెందిన యువకులే సభ్యులుగా ఉన్నట్లు సమాచారం. రంగారెడ్డి, యాదాద్రి, భువనగిరి తదితర ప్రాంతాల్లో నయీం తన దందాను యధేచ్ఛగా కొనసాగించాడని, ఇతర రాష్ట్రాల్లో సైతం నయీం తన దందాను వ్యాప్తి చేశాడు. పోలీసుల కంటపడకుండా మహిళా వేషంలో గ్యాంగ్‌స్టర్ నయీం ఇతర రాష్ట్రాలకు వెళ్లి అక్కడ సెటిల్‌మెంట్లు నిర్వహించేవాడని తెలిసింది. ఎన్ఆర్ఐలను సైతం బెదిరించి గ్యాంగ్‌స్టర్ నయీం తన దందాను ఖండాంతరాలకు వ్యాప్తి చేశాడనే చెప్పవచ్చు. ఒక రకంగా చెప్పాలంటే గ్యాంగ్‌స్టర్ నయీం సమాంతర ప్రభుత్వాన్ని నడిపాడనే చెబుతున్నారు. గ్యాంగ్‌స్టర్ నయీం ఎన్‌కౌంటర్‌లో హతుడై ఏడాది పూర్తయిన సందర్భంగా నయీం కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ అధినేత అంజనీకుమార్ మాట్లాడుతూ నయీం కేసు దర్యాప్తు కొనసాగుతోందని అంటున్నారు. కేసులో పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ నేతలపై చర్యల విషయమై ఆయన స్పందిస్తూ ఇప్పటివరకూ 8 మంది రాజకీయ నేతలను అరెస్ట్ చేశామని వెల్లడించారు. అదే విధంగా నయీంతో అంటకాగిన దాదాపు 25 మంది పోలీసులపై చర్యలు తీసుకుంటున్నామని, వారిలో ఐదుగురి పోలీసు అధికారులను సస్పెండ్ చేశామన్నారు. సైంటిఫిక్ ఎవిడెన్స్ ద్వారా నయీం కేసులో సాక్ష్యాలను సంపాదిస్తున్నామని.. సాక్ష్యాలు దొరికితే నయీం కేసులో ఎంతటిపెద్దవారున్నా వదిలేది లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టపర్చారు. గ్యాంగ్‌స్టర్ నయీం తర్వాత నయీం గ్యాంగ్‌ని సమర్థవంతంగా నడిపే వ్యక్తిగా పేరున్న శేషన్నతో సహా నలుగురు వ్యక్తులు పరారీలో ఉన్నారు. శేషన్న డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఇదే క్రమంలో శేషన్న జాడను సైతం పోలీసులు కనిపెట్టారన్న వార్తలు వెలువడ్డాయి. దీనిపై సిట్ అధికారులు శేషన్న కోసం గాలింపు జరుగుతోందని చెప్పడం విశేషం.

గవర్నర్‌తో ఏపీ సీఎం భేటీ


అమరావతి/హైదరాబాద్, ఆంధ్రప్రభ : విభజన సమస్యలు పరిష్కరించేందుకు త్వరలో మరోమారు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం కావాలని ఉభయ రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ నిర్ణయించారు. ఈనెల 15వ తేదీన రాజ్‌భవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే తేనేటి విందు కార్యక్రమానికి హాజరవుతున్న ఇద్దరు ముఖ్యమంత్రులతో ప్రత్యేకంగా సమావేశం కావాలని గవర్నర్ ప్రతిపాదించారు. ఈ తేనేటి విందు కార్యక్రమానికి ఖచ్చితంగా హాజరు కావాలని గవర్నర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. విజయవాడలోని రామవరంపాడు ప్రాంతంలో నిర్మించిన విద్యుత్ సౌధ భవనాన్ని ప్రారంభించేందుకు మంగళవారం వచ్చిన గవర్నర్ నరసింహన్‌తో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కేంద్ర హోం శాఖ సర్క్యులర్ జారీచేసి నెలలు గడుస్తున్నా విభజన సమస్యలు పరిష్కారం కావడం లేదని చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేసినట్టు సమాచారం. నిధుల విభజన కూడా జరగలేదని దీంతో ఆర్థికపరమైన కష్టాలు ఎదుర్కోవలసి వస్తోందని గవర్నర్‌కు చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో జోక్యం చేసుకుని త్వరితగతిన విభజన సమస్యల పరిష్కారం చూపాలని కోరారు.

అసలేం జరిగింది?

• అప్పుల ఊబినుంచి బయటపడేందుకా? • సానుభూతి కోసమా? • డ్రగ్స్ కేసులో ఉచ్చు బిగుసుకుంటుందనా..? • విక్రమ్‌గౌడ్‌పై ప్రశ్నల వర్షం కురిపించనున్న బంజారాహిల్స్ పోలీసులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ తనయుడు విక్రమ్‌గౌడ్ కాల్పుల డ్రామా వెనక ఉన్న అసలు వాస్తవాలను రాబట్టే దిశగా బుధవారం ఒక రోజు కస్టడీలో పోలీసులు విక్రమ్ గౌడ్‌పై ప్రశ్నల వర్షం కురిపించనున్నారు. తన తండ్రి మంత్రిగా ఉన్నప్పుడు విక్రమ్ గౌడ్ పలు సెటిల్‌మెంట్లు నిర్వహించినట్లు తెలుస్తోంది. విక్రమ్‌గౌడ్‌పై కొన్ని కేసులు కూడా ఉన్నాయి. కాల్పుల ఘటనలో గాయపడ్డ విక్రమ్‌గౌడ్‌ను పరామర్శిం చేందుకు ఆసుపత్రికి సినీ దర్శకుడు పూరీ జగన్నాథ్ రావడం చర్చనీయాంశమైంది. ఇటీవల తండ్రితో విభేదించి విక్రమ్‌గౌడ్ వేరు కాపురం పెట్టాడు. కొన్ని సినిమాలను సైతం విక్రమ్‌గౌడ్ తీశాడు. ఆర్థికంగా నష్టాలను చవిచూశాడు. మరోవైపు ఓ పబ్‌ని సైతం విక్రమ్‌గౌడ్ నిర్వహిస్తున్నట్లు వార్తలొచ్చాయి. డ్రగ్స్ వ్యవహారంలో నేతల పేర్లు బయటికొచ్చే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. ఆ ప్రచారం సైతం విక్రమ్ గౌడ్‌లో ఆందోళనను పెంచిందని చెబుతున్నారు. దాదాపుగా 50 కోట్ల మేర విక్రమ్‌గౌడకు అప్పులున్నట్లు తెలుస్తోంది. ఓ వైపు డ్రగ్స్ వ్యవహారంలో తన పేరు బయటికొచ్చే అవకాశం ఉందన్న ప్రచారం.. మరోవైపు అప్పుల వాళ్ల ఒత్తిడి అధిక మవ్వడం ఇత్యాది అంశాలు విక్రమ్‌గౌడ్‌ని ఉక్కిరి బిక్కిరి చేశాయని చెబుతున్నారు. ఇంకోవైపు తండ్రి ఆస్తిని తనకు దక్కకుండా కొందరు యత్నిస్తున్నారన్న మీమాంస సైతం విక్రమ్‌గౌడ్‌ను కలవరపాటుకు గురిచేసిందని చెబుతున్నారు. భార్య షిపాలితో సైతం విభేదాలున్నట్లు ప్రచారం జరిగింది. మరోవైపు 2019 ఎన్నికల్లో ప్రజల సాను భూతి కోసమే విక్రమ్‌గౌడ్ కాల్పుల డ్రామాకు తెరదీశాడని పోలీసులు తేల్చిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో విక్రమ్‌గౌడ్ నుంచి అసలు నిజాలు రాబట్టేందుకు పోలీసులు ఐదు రోజుల కస్టడీ కోరుతూ కోర్టును అభ్యర్థించారు. అయితే కోర్టు ఒక్క రోజు మాత్రమే కస్టడీకి అనుమతినిచ్చింది. ఒకానొక సందర్భంలో విక్రమ్‌గౌడ్‌కు నిజ నిర్ధారణ పరీక్షలను నిర్వహించాలని పోలీసులు భావించిన సంగతి తెలిసిందే. అత్యం త పకడ్బందీగా విక్రమ్‌గౌడ్ కాల్పుల డ్రామాకు తెరదీశాడు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శ కత్వం తానే వహించి తనపై కాల్పుల డ్రామాను రక్తికట్టించే ప్రయత్నం చేశాడు. చిట్ట చివరికి తాను తీసిన గోతిలో తానే పడి పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. కాగా ఈ కాల్పుల డ్రామా ఆసాంతం మహేష్‌బాబు సినిమా అతడును జ్ఞప్తికి తెచ్చింది. కేవలం ప్రజల సానుభూతి కోసమేనా? లేక అప్పుల బాధ నుంచి ఈ ఘటన ద్వారా కొంతకాలం ఉపశమనం కలిగేందుగా? లేక తండ్రి నుంచి డబ్బులు రాబట్టేందుకా? డ్రగ్స్ కేసులో తన పేరు వస్తుందనా? భార్యతో విభేదాలా? ఇత్యాది అంశాలపై విక్రమ్‌గౌడ్‌ని పోలీసులు ప్రశ్నించే అవకాశం ఉంది.

పోలీస్ కస్టడీకి విక్రమ్‌గౌడ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కథ,స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించి తనపై కాల్పులు జరిపించుకుని తాను తీసిన గోతిలో తానే పడ్డ మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ తనయుడు విక్రమ్‌గౌడ్‌ను విచారిం చేందుకు నాంపల్లి కోర్టు పోలీసులకు అనుమతినిచ్చింది. బుధవారం ఒక్కరోజు విక్రమ్‌గౌడ్‌ను బంజారాహిల్స్ పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారిం చనున్నారు. ఆయనతో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ముగ్గురు రయీస్,నందకుమార్, అహ్మద్‌ఖాన్‌లకు మూడు రోజుల కస్టడీకి న్యాయస్థానం అనుమతినిచ్చింది. వీరందర్నీ బుధవారం చంచల్‌గూడ జైలు నుంచి తమ కస్ట డీలోకి తీసుకోనున్నారు. గత నెల 28న జూబ్లీహిల్స్‌లో ఉన్న విక్రమ్‌గౌడ్ ఇంట్లో కాల్పుల ఘటన సంచలనం రేపిన సంగతి విదితమే. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందడంలో భాగంగా ప్రజల సానుభూతి పొందేందుకు విక్రమ్ గౌడ్ నాటకం ఆడినట్లు పోలీసులు తెలిపారు. అయితే కాల్పుల ఘటనకు కారణం ఇదొక్కటేనా..? ఇంకా ఇతరత్రా కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో విక్రమ్ గౌడ్‌ను విచారించేందుకు తమ కస్టడీలోకి తీసుకోనున్నారు.

పాత జిల్లాల ప్రకారమే డీఎస్సీ

● నెలాఖరులో నోటిఫికేషన్ ● నవంబర్‌లో పరీక్ష నిర్వహణ ● 11న పాఠశాల విద్యాశాఖ అధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష ● అప్పుడే విధి విధానాల రూపకల్పన

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ పాత(10) జిల్లాల ప్రకారమే జరగనుంది. కొత్తగా ఏర్పాటైన 31 జిల్లాలకు సంబంధించి రాష్ట్రపతి ఆమోదం లభించకపోవడంతో పాత జిల్లాల ప్రకారమే ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియ నోటిఫికేషన్ నెలాఖరులో జారీ చేయనున్నారు. పరీక్షను నవంబర్ నెలలో నిర్వహించనున్నారు. అయితే సెప్టెంబర్ 11లోపు ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను పూర్తి చేస్తామని సుప్రీంకోర్టుకు ప్రభుత్వం అఫిడవిట్ సమర్పించినప్పటికీ కొత్త జిల్లాల ప్రకారం చేపట్టాలని ప్రభుత్వం భావించినప్పటికీ కొత్త జిల్లాలకు రాష్ట్రపతి ఆమోదం లభించకపోవడంతో పాత జిల్లాల ప్రకారమే నిర్వహించాలని అందుకు సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశామని సుప్రీంకు చెప్పాలని సర్కార్ భావిస్తున్నట్టు తెలుస్తోంది.

11న అధికారులతో డిప్యూటీ సీఎం భేటీ

ఉపాధ్యాయ నియామక ప్రక్రియకు సంబంధించిన విధి విధానాలను రూపొందించడం కోసం ఈ నెల 11న పాఠశాల విద్యా శాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో ఉపాధ్యాయుల ఖాళీలు ఎన్ని ఉన్నాయి వాటి వివరాల ను తీసుకోనున్నారు. దాంతోపాటు రిజర్వేషన్ల వివరాలు, విధి విధానాలు రూపొందించనున్నారు. ఈ విధి విధానాలు రూపొందించిన అనంతరం వాటి వివరాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కి పంపించనున్నారు.

> పాఠశాల విద్యా శాఖ రూపొందించిన ఉపాధ్యాయ నియామక ప్రక్రియ విధి విధానాల ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్స్, ఉపాధ్యాయుల ఖాళీలను బట్టి టిఎస్‌పీఎస్సీ సిలబస్‌ను రూపొందించి నోటిఫికేషన్‌ను నెలాఖరులో జారీ చేయనుంది. నోటిఫికేషన్
>
> **నెలాఖరులో నోటిఫికేషన్**
>
> జారీ చేసిన అనంతరం చదువుకోవడానికి సమయం ఇచ్చి నవంబర్‌లో పరీక్షను నిర్వహించనున్నారు. నవంబర్ చివరి వారంలో గానీ, డిసెంబర్ మొదటి వారంలో గానీ పరీక్షను నిర్వహించే అవకాశం ఉంది.

పాత జిల్లాల వారీగానే నియామకాలు

పాత జిల్లాల వారీగానే ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను చేపట్టనున్నారు. కొత్త జిల్లాలకు కేంద్రం అనుమతి రాకపోవడంతో ప్రెసిడెన్షియల్ ఆర్డర్ రాకపోవడంతో కొత్త జిల్లాల వారీగా నియామక ప్రక్రియ చేపడితే న్యాయపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రభుత్వం ఆలోచిస్తోంది. కొత్త జిల్లాల ప్రకారం నోటిఫికేషన్ ఇస్తే నిరుద్యోగులు కోర్టుకు వెళ్లే అవకాశం ఉంటుందని, ఈ నేపథ్యంలో కోర్టుల చుట్టూ తిరగడం కంటే పాత జిల్లాల వారీగా నియామక ప్రక్రియను చేపట్టి అవసరం అయితే ఆ తరువాత కొత్త జిల్లాలకు ఉపాధ్యాయులను బదిలీ చేసుకోవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. కాబట్టి ఇప్పుడు కొత్త జిల్లాల వారీగా ఉపాధ్యాయ నియామక ప్రక్రియను చేపట్టకుండా పాత జిల్లాల వారీగానే చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.



ఖాళీ పోస్టులు 8972

రాష్ట్రంలో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలో కలిపి 8972 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. రాష్ట్రంలో వాస్తంగా ఇంత కంటే ఎక్కువ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఉపాధ్యాయుల ఖాళీల వివరాలు

తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో	ఉర్దూ మీడియంలో
కలిపి స్కూల్ అసిస్టెంట్ - 1754	స్కూల్ అసిస్టెంట్- 196
లాంగ్వేజ్ పండిట్స్ - 985	లాంగ్వేజ్ పండిట్స్- 26
పిఈటీ- 374	పిఈటీ- 42
ఎస్‌జిటి- 4779	ఎస్‌జిటి- 636
	మొత్తం పోస్టులు- 8792

31 నుంచి గురుకుల పోస్టులకు రాత పరీక్షలు

26 నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్ :టిఎస్‌పిఎస్సీ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని వివిధ గురుకులాల్లో సిబ్బంది భర్తీ కోసం నిర్వహించాల్సిన రాత పరీక్షలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తేదీలను ప్రకటించింది. ఆగస్టు 31 నుంచి పరీక్షలను నిర్వహించనున్నట్టు కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31న ఉదయం క్రాఫ్ట్ టీచర్, మధ్యాహ్నం ఆర్ట్ టీచర్ పరీక్షలు ఉంటాయి. సెప్టెంబర్ 1న మ్యూజిక్ టీచర్, 17న లైబ్రేరియన్లు, 17, 18న స్టాఫ్ నర్స్, పిఈటీలకు రాత పరీక్షలను నిర్వహిస్తారు. వీరు 26 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఇవి కాకుండా డిగ్రీ, జూనియర్ కాలేజ్ లెక్చరర్లు, ప్రిన్సిపాల్స్, ఇతర పోస్టులకు సెప్టెంబర్ 10న పరీక్షలు ఉంటాయి. వీరు సెప్టెంబర్ 4 నుంచి హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. ఫిజిక్స్, సోషల్ టీచర్ల పరీక్షలు ఆగస్టు 29న, సైన్స్ టీచర్లకు 30న పరీక్షలు నిర్వహిస్తారు.

మైనారిటీ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 40 శాతమే మేనేజ్‌మెంజ్ సీట్లు

పాత జీవో 130 అమలు చేయాలన్న హైకోర్టు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: పేద, మధ్యతరగతి వారికి వైద్య విద్యా భారంగా మారుతున్న తరుణంలో ఉమ్మడి హైకోర్టు తీర్పు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కొంత ఊరట నిచ్చింది. ప్రైవేటు మెడికల్ కాలేజీలతోపాటు, మైనారిటీ మెడికల్ కాలేజీల్లోనూ భర్తీ చేసే ఎంబిబిఎస్, బిడిఎస్ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల సంఖ్యలో పాత ఉత్తర్వులను అమలు చేయాలని కోర్టు తీర్పునిచ్చింది. ఈ ఏడాది కొత్తగా జారీ చేసిన జీవోలు 115, 117, 119 జీవోలను అమలు చేయవద్దని కోర్టు తీర్పునిచ్చింది. దీంతో పాత జీవో 130 ప్రకారం సీట్లను భర్తీ చేయాలని సూచించింది. జీవో 130 ప్రకారం కన్వీనర్ కోటా(ఏ) సీట్లు 60 శాతం ఉండగా, మేనేజ్‌మెంట్(బి), ఎన్ఆర్ఐ(సి) కేటగిరి సీట్లు కలిపి 40 శాతం ఉన్నాయి. బి కేటరిలో 25 శాతం సీట్లు, సీ కేటగిరిలో 15 శాతం సీట్లుగా నిర్ణయించారు. అయితే ఈ ఏడాది నీట్ ద్వారానే అన్నీ సీట్లను భర్తీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో కొత్తగా ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జీవో నంబర్ 115, 117, 119 జీవోలను తీసుకొచ్చారు. జీవో 115 ప్రకారం కన్వీనర్ కోటా సీట్లు 50 శాతం, బి, సి కోటా సీట్లు 50 శాతం ఉంటాయని తెలిపారు. జీవో 117 ప్రకారం ఎంబిబిఎస్ కోర్సు ఫీజు బి కేటగిరికి రూ. 11.55 లక్షల నుంచి రూ. 14 లక్షలకు, సీ కేటగిరికి రూ. 23.10 లక్షల నుంచి రూ. 28 లక్షలకు పెంచారు. జీవో 119 ప్రకారం బిడిఎస్ సీట్ల భర్తీలో ఫీజులు బి కేటగిరికి రూ. 4.20 లక్షల నుంచి రూ. 5.25 లక్షలకు పెంచారు. అయితే ఈ జీవోల మూలంగా పేద, మధ్యతరగతి వారు వైద్య, విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఏర్పడుతుందని కాబట్టి పాత విధానం ప్రకారం కన్వీనర్ కోటా సీట్లు 60 శాతం ఉండాలని, బి, సి కేటగిరి సీట్లు 40 శాతమే ఉండాలని కోర్టును ఆశ్రయించారు.

'కాళోజీ' అవార్డులకు ఎంపిక కమిటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో కాళోజీ నారాయణరావు అవార్డు కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంపిక కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా ఐలయ్య, వేణు, దేశపతి శ్రీనివాస్, మామిడి హరికృష్ణలు ఉన్నారు. 2017 సంవత్సరానికి గానూ కాళోజీ అవార్డు కోసం సాహితీవేత్తలను ఈ కమిటీ ఎంపిక చేయనుంది.

ఏపీకి కేంద్రం మరో షాక్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదా సహా పలు విభజన హామీల విషయంలో మొండి చేయి చూపిన కేంద్రం మరోసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి షాకిచ్చింది. విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు ఏర్పడ్డ రెవెన్యూ లోటు కేవలం రూ. 4,117.89 కోట్లు మాత్రమేనని స్పష్టం చేసింది. ఇవే తమ తుది గణాంకాలని కూడా పేర్కొంది. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్ర రావు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయంపై మరింత స్పష్టతనిచ్చింది. ఇంతకాలం పాటు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ లోటును రూ. 16,000 కోట్లు అని చెబుతూ వచ్చింది. కేంద్రం రూ. 2,303 కోట్లు మాత్రమే ఇచ్చిందని, మిగతా మొతాన్ని రాబట్టే వరకు తాము కేంద్రంపై ఒత్తిడి చేస్తామని ఆ పార్టీ నేతలు, ఎంపీలు చెబుతున్నారు. కానీ వారి వాదనను పూర్తిగా తోసిపుచ్చుతూ కేంద్రం ఇప్పుడు తుది గణాంకాలు విడుదల చేయడం రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, టీడీపీ నేతల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర విభజన సందర్భంగా ఏర్పడ్డ రెవెన్యూ లోటుపై కేవీపీ స్పష్టత కోరగా, జవాబిస్తూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్ అండ్ ఎంటైటిల్మెంట్) వేసి అంచనాల్లో తొలుత రూ. 13,775.76 కోట్లుగా తేల్చారని పేర్కొంది. అది కూడా అప్పటికే రెవెన్యూ లోటు భర్తీ కోసం కేంద్రం విడుదల చేసిన రూ. 2,303 కోట్లను పరిగణలోకి తీసుకున్న తర్వాత లెక్కించగా తేలిన మొత్తమని స్పష్టం చేసింది.

తెరాస వైఫల్యాలపై తెదేపా ఆందోళనలు

● సమస్యలపై జిల్లాల వారిగా కార్యక్రమాలు
● ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యంపై నిరసనలు
● జీఎస్టీపై సీఎం ప్రకటనలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలని నిర్ణయం
● నేరేళ్ళ ఘటనపై రేపు ఛాయాచిత్ర ప్రదర్శన



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెరాస ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలపై పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టాలని తెదేపా రాష్ట్ర శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా అధికార పార్టీని ఉక్కిరి, బిక్కురికి గురి చేస్తున్న నేరేళ్ళ ఘటనను ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్ళాలని తలపెట్టింది. అలాగే కరువు మండలాల్లో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితులు, అస్థవ్యస్థంగా మారిన ప్రజాపంపిణీతో పాటు జీఎస్టీ విధానంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రోజుకో విధంగా చేస్తున్న ప్రకటనలపై తీవ్ర స్థాయిలో నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించింది.

మంగళవారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎల్. రమణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితరుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈ నెల 10వ తేదీన సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో నేరేళ్ళ ఘటనపై ఛాయచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయాలని తలపెట్టారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రజాసంఘాల నేతలను ఆహ్వానించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో నెలకొన్న పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వర్షాభావం తీరు తదితర అంశాలపై కూడా గురువారం ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో చర్చించి జిల్లాల వారిగా ఆందోళనలకు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని సమావేశంలో నేతలు నిర్ణయించారు.ఇక ప్రజాపంపణీ వ్యవస్థను నిర్వీర్యం చేసిన రాష్ట్ర ప్రభుత్వ కుటిల యత్నాలను కూడా ప్రజలకు వివరించే విధంగా ప్రణాళికలను రూపొందించనున్నారు. ఇక జీఎస్టీపై సిఎం కేసీఆర్ రోజుకో విధంగా చేస్తున్న ప్రకటనలు కూడా ప్రజల్లోతీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు.

జీఎస్టీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సమయంలో....ఈ బిల్లు వల్ల రాష్ట్రా నికి అదనపు ఆదాయం సమకూరుతుందన్న కేసీఆర్ ఇప్పుడు మాటమార్చిన వైనాన్ని కూడా ప్రజల్లోకి తీసుకవెళ్ళేవిధంగా ప్రణాళికలను రూపొందించాలని నిర్ణయించారు. ఆయా అంశంపై తెరాస ప్రభుత్వంపై పెద్దఎత్తున ఆందోళనలు, నిరసనలకు పిలుపునివ్వాలని నిర్ణయించారు.

ఈ సమా వేశంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ జాతీయ అధికార ప్రతినిధులు పెద్దిరెడ్డి, అరవింద్‌కుమార్‌గౌడ్, జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు అరికెల నర్సారెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సీతక్క, ఈగ మల్లేశం, అమర్‌నాథ్‌బాబు, రాష్ట్ర అధికార ప్రతినిధులు వేంనరేందర్‌రెడ్డి, అట్లూరి రమాదేవి, సతీష్‌మాదిగ, సామభూపాల్‌రెడ్డి, సిలివేరు కాశీనాథ్, రాష్ట్ర కార్యక్రమాల కమిటీ కన్వీనర్ బుచ్చిలింగం, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పి. సాయిబాబాతో పాటు బిఎన్. రెడ్డి, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నాయిబ్రాహ్మణ, వడ్డెర్లకు రూ. 250 కోట్లు


● త్వరలో మొబైల్ బ్యూటీషియన్ వ్యాన్లు ప్రారంభం ● గత పాలకుల హయాంలో కులవృత్తులు ధ్వంసం: మంత్రి జోగురామన్న



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని అత్యంత వెనుకబడిన కులాల వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, దానికి రూ. 1000 కోట్లు కేటాయించామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. ఈ నిధులు కాకుండా ప్రత్యేకంగా నాయిబ్రాహ్మణ, వడ్డెర్లకు అదనంగా రూ. 250 కోట్లు కేటాయించినట్టు మంత్రి చెప్పారు. నాయిబ్రాహ్మణుల ఆధునిక హెయిర్ స్టైల్ బ్యూటీషి యన్ యంత్రాల ప్రదర్శన అవగాహన సదస్సును మంత్రి మంగళవారం బేగంపేట ప్లాజాలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అశోక్‌కుమార్‌తోపాటు నాయిబ్రాహ్మణ సంఘాల నేతలు పాల్గొన్నారు. నాయిబ్రాహ్మణ, వడ్డెర్లకు కేటాయించిన రూ. 250 కోట్లలో రూ. 20 కోట్లను స్కిల్ డెవలప్‌మెంట్‌కు కేటాయించినట్టు మంత్రి జోగు రామన్న తెలి పారు. జిల్లా, గ్రామీణ స్థాయిల్లో ఈ రెండు కులాలకు చెందిన వారు సమా వేశాలు ఏర్పాటు చేసుకుని తగిన సూచనలు, సలహాలతో ప్రభుత్వం దగ్గరకు రావాలని సూచించారు. కులాలకు చెందిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా సొసైటీలో ఉండాల న్నారు. నాయిబ్రాహ్మణులు ఆత్మగౌరవంగా బతకాలనేది ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు లక్ష్యమన్నారు. నాయిబ్రాహ్మణుల బతుకుచిత్రాన్ని మార్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళుతుందని చెప్పారు. రాష్ట్రంలోని సబ్బండ వర్ణాలు అభివృద్ధి చెందినపుడే బంగారు తెలంగాణ సాధ్యం అవుతుందని అన్నారు. గత పాలకుల హయాంలో కులవృత్తులు ధ్వంసం అయ్యాయని మండిపడ్డారు.

పొన్నం దీక్ష భగ్నం

● అరెస్టు చేసి ఆసుపత్రికి తరలించిన పోలీసులు ● జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు



కరీంనగర్, కెఎన్ఎన్ బ్యూరో: కరీంనగర్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో శనివారం తన నివాసం ఎదుట ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన పొన్నం ప్రభాకర్ దీక్షను మంగళవారం ఉదయం 4-45 గంటల ప్రాంతంలో పోలీసులు భగ్నం చేశారు. దీక్ష శిబిరానికి చేరుకొని బలవంతంగా అరెస్టు చేసి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి వాహనంలో తరలించారు. సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు షుగర్ లెవల్స్ 70కి పడిపోవడం, బీపీ లెవల్స్‌లో తరచూ మార్పులు వస్తుండటంతో ఆరోగ్యం క్షీణిస్తుందని, దీక్ష విరమించకుంటే మూత్ర పిండలాలపై, గుండెపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించడంతో దీంతో ప్రభుత్వ సూచన మేరకు కరీంనగర్ సీపీ కమలాసన్ రెడ్డి సమావేశమై మంగళవారం ఉదయం దీక్ష శిబిరానికి పోలీసులను పంపించారు. సీఐ ప్రశాంత్ రెడ్డి దీక్ష శిబిరాన్ని సందర్శించి ఆరోగ్యం క్షీణిస్తున్నందున దీక్ష విరమించాలని కోరగా ససేమేరా అనడంతో ఆయన్ను బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా దీక్ష శిబిరంవద్ద పోలీసులకు, పొన్నం అనుచరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. సుమారుగా ఐదు వందల మంది పోలీసులు దీక్ష శిబిరాన్ని చుట్టుముట్టి శాంతిభద్రతలను అదుపులోకి తెచ్చారు. దీక్షను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆసుపత్రి ఎదుట కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కటకం మృత్యుంజయం ఇచ్చిన పిలుపుమేరకు ఉమ్మడి జిల్లా పరిధిలో పలుచోట్ల అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళనలు నిర్వహించాయి. సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాచౌక్ వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కటకం మృత్యుంజయం ఎమ్మెల్యే టీ.జీవన్ రెడ్డితోపాటు పలువురు నేతలతో చర్చించి వైద్యులకు సహకరించాలని పొన్నంకు సూచించారు. మధ్యాహ్నం వైద్యులు వైద్యులు ప్రభాకర్‌కు గ్లుకోజ్‌ను ఎక్కించారు. పొన్నం మాత్రం మరే ఇతర ద్రవపదార్థాలుకాని, ఘన పదర్థాలు కాని తీసుకోకుండా ఆసుపత్రిలో దీక్షను కొనసాగించారు.

> రాజ్యాంగం కల్పించిన హక్కుల మేరకు నిరసనలు ప్రకటించ డాన్ని కూడా ప్రభుత్వం కాలరాస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. కరీంనగర్ లో మెడికల్ కళాశాల కోసం మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ చేపట్టిన నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేయడాన్నిఆయన ఖండించారు. బంగారు తెలంగాణ నిర్మిస్తామని చెబుతున్న సీఎం కేసీఆర్ అడుగడుగునా ప్రజావ్యతిరేక విధానాలను అవ లంభిస్తున్నారని,
>
> **పొన్నం అరెస్ట్ అక్రమం: ఉత్తమ్**
>
> మాట్లాడే, నిరసన హక్కులపై ఉక్కుపాదం మోపుతున్నారని మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించా రు. మిరప రైతులు మద్దతు ధర కోసం రోడ్డెక్కితే కేసీఆర్ పట్టించుకోరు ..,ధర్నాచౌక్ ఎత్తివేత తగదంటే నోరు విప్పరు.. నేరెళ్లలో దళితులుస,, బీసీలను పోలీసులు చిత్రహింసలు పెట్టి కొడితే పట్టించుకోరు...,కనీసం ప్రగతిభవన్‌కు వెళ్లి సమస్యలు చెప్పుకుందామంటే అపాయింట్‌మెంట్ ఇవ్వరని మండిప డ్డారు.సామాన్యులు, ప్రజల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తే తగిన సమయంలో బుద్ధిచెబుతారని ఉత్తమ్ హెచ్చరించారు.

అమ్మ ప్రాణం రూ . 200

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తల్లిని హతమార్చిన కొడుకు



కశింకోట, కెఎన్ఎన్: కన్న తల్లి ప్రాణం రెండు వందలు... మద్యం కోసం ఆ రెండొందలు ఇవ్వలేదని నవమాసాలు మోసి కని పెంచిన తల్లినే కడతేర్చిన సంఘటన విశాఖ జిల్లా కశింకోట మండలం త్రిపుర వానిపాలెంలో జరిగింది. ఈసంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. త్రిపురవాని పాలెంలో నివాశం ఉంటున్న అప్పికొండ రాజులమ్మ(85) ఆమె కుమారుడు సత్తిబాబుతో కలసి జీవిస్తోంది. మద్యానికి బానిసైన సత్తిబాబు నిత్యం మద్యానికి డబ్బులు ఇమ్మని తల్లిని వేధిస్తుండేవాడు. తాను ఎప్పుడైనా కూలి పనికి వెళ్లినా ఆ సొమ్ము మద్యానికే ఉపయోగించే వాడు. మంగళవారం ఉదయం ఎప్పటిలాగే రాజులమ్మ ఇంటి పనులు చేసుకుంటుండగా సత్తిబాబు మద్యం కోసం రూ.200 ఇమ్మని డిమాండ్ చేశాడు. తాగి ఏం ఉద్ధరిసావు నా దగ్గర డబ్బులు లేవని నిరాకరించడంతో కోపోద్రోక్తిక్కుడైన సత్తిబాబు పక్కనే ఉన్న కత్తి తీసుకొని తల్లిపై దాడి చేసి గొంతు కోశాడు. దీంతో రాజులమ్మ రక్తపు బడుగులో మృతి చెందింది. విషయం తెలియగానే సిఐ రామచంద్రరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఇటువంటి దారుణ సంఘటన జరగడం గ్రామంలో ఇదే ప్రథమం కావడంతో గ్రామంలో విషాధ ఛాయలు అలముకొన్నాయి. ఈ విషయం చర్చనీయాంశమైం ది. కాగా సత్తిబాబు పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్తిబాబు కోసం గాలింపు ముమ్మరం చేశారు.

12న కుంతియా రాక



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ డాక్టర్ రామచంద్రకుంతి యా ఈ నెల 12 న హైదరాబాద్ రానున్నారు. పార్టీ రాష్ట్ర ఇంచార్జీగా నియమితులైన తర్వాత హైదరాబాద్ రావడం ఇదే మొదటిసారి. మూడు రోజుల పాటు ఇక్కడే మకాం వేయనున్నారు. దిగ్విజయ్ సింగ్ రాష్ట్ర ఇంచార్జీగా ఉన్న సందర్భంగా రాష్ట్ర కార్యదర్శిగా కుంతియా సహకరించారు. దాదాపు నాలుగేళ్ల పాటు ఎఐసీసీ తరపున కార్యదర్శి బాధ్యతలు నిర్వహించినందున తెలంగాణపై పూర్తి అవగాహన ఉంది. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పరిచయాలు ఉన్నాయి. అందువల్ల ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు నాయకులు, కార్యకర్తలు సమాయత్తమవుతున్నారు. పీసీసీ తరపున కూడా ఘనస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పీసీసీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి పార్టీ నేతలకు దిశా,నిర్దేశం చేస్తారు. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడం ఎలా ? ఎస్సీ,ఎస్టీ బీసీ,మైనారిటీ వర్గాలను ఆకట్టుకోవడం ఎలా ? టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న పాత్ర ? ఇంత వరకు చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన అంశాలపై సలహాలు, సూచనలు స్వీక రిస్తారు.ఆగస్టు 15 న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో జాతీ య జెండాను ఆవిష్కరిస్తారు. ఎస్సీ,ఎస్టీలపై దాడులు, ప్రభుత్వ వైఫల్యాలపై టీపీసీ సీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క చేపట్టదల్చుకున్న పాదయాత్రకు ఏఐ సీసీ అనుమతిస్తే అదే రోజు ఖమ్మంలో పాదయాత్రకు జెండాఊపి ప్రారంభిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

● గ్రూపులను ప్రోత్సహించవద్దు
● కష్టపడ్డవారికే పార్టీ పదవులు
● 2019లో అధికారమే ధ్యేయంగా పనిచేయాలి
● ఏఐసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ డాక్టర్ ప్రసాద్, మల్లు రవి



భువనగిరి, కెఎన్ఎన్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎస్సీ సెల్ కార్యకర్తలు కృషి చేయాలని ఏఐసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ డాక్టర్ ప్రసాద్, టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవిలు అన్నారు. మంగళవారం ఉమ్మడి జిల్లాల ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గాల(నకిరేకల్, తుంగతుర్తి ,దేవరకొండ) పటిష్టత కోసం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సంకల్ప్ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మల్లురవి , టీపీసీసీ ఇంచార్జ్ ప్రసాద్ హాజరై మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు అసెంబ్లీ స్థానాల పటిష్టత కోసం పార్టీని బలోపేతం చేయాడానికి గ్రామీణ స్థాయి, బూత్ స్థాయి నుంచి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి కృషి చేయాలని తెలిపారు. సోనియాగాంధీ అదేశాల ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి ఎస్సీ, ఎస్టీ బీసీ నాయకులు కార్యకర్తలు మహిళలు యువజన విద్యార్థి విభాగం నాయకులు కలసి క్రమశిక్షణగా పనిచేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించబోతున్నరని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు బూడిద బిక్షమయ్యగౌడ్, టీపీసీసీ నాయకులు వేణుగోపాల్, రాష్ట్రకాంగ్రెస్ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు ఆరెపల్లి మోహన్, నాయకులు అద్దంకి దయాకర్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, రాష్ట్ర ఎస్టీసెల్ చైర్మన్ జగన్‌లాల్, చెవిటి వెంకన్న, చామల శ్రీనివాస్, నీలం వెంకటస్వామి, డి సిసి ఎస్సీసెల్ చైర్మన్ ఎడమ బాలక్రిష్ణ మాజీజేడ్పిటిసి గుంజ రేణుక, పట్టణ పార్టీ అధ్యక్షులు బీసు కుంట్ల సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోట పెద్ద స్వామి, నాయకులు డాకూరి నీరంజన్ డి నర్సింహ్మాచారి, క్రిష్ణారెడ్డి, దర్గాయి హరిప్రసాద్, రావుల రాజు నియోజకవర్గాల నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమావేశంలో ఘర్షణ

కాంగ్రెస్ పార్టీ సమావేశంలో నియోజకవర్గాల వారిగా సమీక్ష జరుగుతుండగా దేవరకొండ నియోజక వర్గం నాయకులు ఎస్టీసెల్ రాష్ట్ర చైర్మన్ జగన్‌లాల్, నాయకులు గుంజ వెంకటనారాయణలు ప్రొటోకాల్ విషయంలో ఒక్కరి పైఒక్కరు దాడి చేసుకోగ ఇద్దరు తలలకు గాయలు కాగ వెంటనే ఆసుప త్రికి తరిలించి చికిత్సచేయించారు. అనంతరం టిపిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి, జగన్‌లాల్ నాయక్, గుజ్జ వెంకట్‌నారాయణల మధ్య సయోధ్య కుదిర్చారు.


పసికందుకు నిండిన నూరేళ్ళు



సూర్యాపేట, కెఎన్ఎన్ : అభం శుభం తెలియని పసికందుకు తల్లి గర్భం నుంచి బయట పడకముందే నిండు నూరేళ్ళ జీవితం ముగిసింది. నవ మాసాలు మోసి బాబుకు జన్మనిచ్చి, పెంచి పోషించి, విద్యాబుద్ధులు చెప్పాల్సిన తల్లి కళ్ళు తెరవక ముందే కడతేర్చింది వైనం మాతృమూర్తికి కళంకం తెచ్చే విధంగా మారింది. ఇలాంటి పని చేసిన యువతి తల్లిదండ్రులకు అపకీర్తి తెచ్చే విధంగా ఉన్న ఈ ఉదారమైన సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డు ప్రధాన నాలాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెళ్ళి కాని యువతి గర్భం దాల్చి అబార్షన్ చేయించుకొని నాలాలో పడవేసినట్లుగా పలువురు పేర్కొంటున్నారు. బాబు మృత దేహాన్ని చూసినట్లయితే మంగళవారం మధ్యాహ్నం వేసినట్లుగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ రంగినేని ఉమలక్ష్మణ్‌రావు సంఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పసికందు మృత దేహాన్ని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన చూసేందుకు పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో హైడ్రామా





• అర్ధరాత్రి వరకు ఓట్ల లెక్కింపుపై ఉత్కంఠ • ఈసీకి కాంగ్రెస్, బీజేపీ పరస్పర ఫిర్యాదులు • ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లు చెల్లవు: ఈసీ • అమిత్ షా, స్మృతి ఇరానీ సునాయాస విజయం

అహ్మదాబాద్: గుజరాత్ లో రాజ్యసభ స్థానాల ఓట్ల లెక్కింపులో అర్ధరాత్రి వరకు హైడ్రామా నడిచింది. బ్యాలెట్ పేపర్ చూపించి ఓటువేసిన ఎమ్మెల్యేల ఓట్లు లెక్కించరాదన్న కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదును ఎన్నికల కమిషన్ పరిగణలోకి తీసుకుంది. ఇద్దరు కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేల ఓట్లను రద్దు చేస్తున్నట్లు ఈసీ ప్రకటించింది. కాంగ్రెస్ ఫిర్యాదుతో న్యాయనిపుణులతో సుదీర్ఘంగా చర్చించిన తర్వాత ఎన్నికల కమిషన్ అధికారులు తమ నిర్ణయాన్ని ప్రకటించారు.ఈసీ నిర్ణయాన్ని కాంగ్రెస్ నేతలు స్వాగతిస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈసీ నిర్ణయంతో ఒక అభ్యర్థి గెలుపుకుకావాల్సిన మేజిక్ ఫిగర్ 45 నుంచి 44కు తగ్గింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ గెలుపు నల్లేరుపై నడకే అని తెలిసిపోయినా..మూడోస్థానం కోసం బీజేపీ వేసిన వ్యూహాలు మంగళవారం అర్ధరాత్రి వరకు కాంగ్రెస్‌కు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. ఆనంద్ లోని క్యాంప్ నుంచి నేరుగా పోలింగ్ స్టేషన్ కు వచ్చి ఓటు వేసిన 44 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఎక్కువ మంది క్రాసింగ్ పాల్పడినట్లు అనుమానం రావడంతో కాంగ్రెస్‌కు భయం పట్టుకుంది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అహ్మద్ పటేల్‌పై పైచేయి సాధించేందుకు బీజేపీ వ్యూహాలు రచించినట్లు పసిగట్టిన హస్తంపార్టీ నాయకులు.. పోలింగ్ వీడియోను ఇవ్వాలని ఎన్నికల సంఘం ముందు పట్టుబట్టారు.అయితే అందుకు బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. కాంగ్రెస్,బీజేపీ పార్టీల నాయకులు ఎన్నికల సంఘం అధికారులను కలిసి తమతమ అభ్యంతరాలను తెలియజేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలనిబీజేపీ ఈసీని కోరినప్పటికీ..పోలింగ్ వీడియో కోసం కాంగ్రెస్ పట్టుబట్టడంతో లెక్కింపు ప్రకియ నిలిచిపోయింది.

గెలుపుపై పటేల్ ధీమా

గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో తన గెలుపు ఖాయమని కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్ ధీమా వ్యక్తం చేశారు. ఒక ఎమ్మెల్యే బ్యాలెట్ పత్రాన్ని అమిత్ షాకు చూపడంతో ఈసీ ఫిర్యాదు చేశామన్నారు. తమ ఫిర్యాదుపై రిటర్నింగ్ అధికారి ఎలాంటి చర్యలు తీసుకోలేదని పటేల్ ఆరోపించారు.తమ పార్టీ ఎమ్మెల్యేలే కాకుండా జేడీయూ, ఎన్సీపీ ఎమ్మెల్యేల మద్దతు తనకు లభించిందని తెలిపారు. బీజేపీ ఊహించేదేది జరగదన్న అహ్మద్ పటేల్...ఎన్నికల సంఘం అధికారులపై బీజేపీ నేతలు ఒత్తిడి పెంచడంపై విమర్శలు గుప్పించారు. ఒక్క రాజ్యసభ స్థానం కోసం బీజేపీ సీనియర్లు రంగంలోకి దిగడంపై అసహనం వ్యక్తం చేశారు.


పటేల్‌కే ఓటు వేశా: జేడీయూ ఎమ్మెల్యే వాసవ

తాను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అహ్మద్ పటేల్‌కే ఓటు వేశానని గుజరాత్ జేడీయూ ఎమ్మెల్యే చోటు వాస్తవ తెలిపారు. పేద ప్రజలను, గిరిజనులను బీజేపీ చిన్నచూపు చూస్తున్న కారణంగానే కాంగ్రెస్ కు ఓటువేసి నట్లు ప్రకటించారు. గుజరాత్‌లోని గిరిజనులకు ప్రాతినిధ్యం ఉన్న బారుచ్ నియోజక వర్గం నుంచి గెలిచిన చోటు వాసవ పార్టీ అధినాయకత్వం నిర్ణయం మేరకు అహ్మద్ పటేల్‌కు ఓటేసినట్లు తెలిపారు. మరోవైపు జేడీయూ కేంద్రనాయకత్వం గుజరాత్ జేడీయూ చీఫ్‌పై వేటువేసింది.

రంగంలోకి జైట్లీ, చిదంబరం

రాజ్యసభ ఎన్నికల రగడ ఎన్నికల కమిషన్ ముందుకు చేరడంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల హేమాహేమీలు రంగంలోకి దిగారు. బీజేపీ నుంచి ప్రస్తుత ఆర్థిక మంత్రి రంగంలోకి దిగగా..కాంగ్రెస్ నుంచి మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం రంగంలోకి దిగి ఈసీ ముందు తమ వాదనలు వినిపించారు. మొదట నఖ్వీ, రవిశంకర్ ప్రసాద్, పీయూష్ గోయల్ ఈసీని కలిసి కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టగా..రెండోసారి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని బృందం ఎన్నికల సంఘం అధికారులను కలిసింది. కాంగ్రెస్ చేస్తున్న అర్థరహిత ఆరోపణల వల్ల ఓట్ల లెక్కింపుకు ఆటంకం ఏర్పడిందని.. వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. కాంగ్రెస్ నుంచి ఆనంద్ శర్మ,రణ్ దీప్ సూర్జేవాలా రెండు సార్లు ఎన్నికల సంఘం అధికారుల ను కలిసి పోలింగ్ వీడియో ఫుటేజ్ ఇవ్వాలని కోరారు. వారికి ఈసీ నుంచి సరైన స్పందన రాకపోవడంతో కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం రంగంలోకి దిగారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల బ్యాలెట్ పత్రాలు ఎవరెవరు చూశారనేదానిపై తమవద్ద పక్కాసాక్షాలున్నాయని..అనధికార వ్యక్తులకు ఓటు ఎలా చూపిస్తారని ప్రశ్నించారు.అనధికార వ్యక్తులకు ఓటు చూపించిన వారి ఓట్లు చెల్లకుండా ఆదేశాలు జారీ చేయాలని ఈసి అధికారులను కోరారు.

షరీఫ్‌ను వెంటాడుతున్న కష్టాలు



ఇస్లామాబాద్: మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌ను కష్టాలను వెంటాడుతున్నాయి. ఇటీవల ఆయనను ప్రధాని పదవికి అనర్హుడిగా ప్రకటించిన సుప్రీం కోర్టు తాజాగా పాకిస్తాన్ ఎన్నికల సంఘం (ఈసీపీ) నోటీస్ జారీ చేసింది. పాకిస్తాన్ ముస్లిం లీగ్ నవాజ్ పార్టీకి (పీఎంఎల్ఎన్) కొత్త చీఫ్‌ను నియమించవలసినదిగా షరీఫ్‌ను ఆదేశించింది. తన ఆస్తులను బహిర్గతం చేయకపోవడంతో అతడిని అనర్హుడిగా సుప్రీంకోర్టు ప్రకటించిన తరువాత జులై 28న ప్రసంగించారు. అయితే ఆయన పార్టీ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. రాజకీయ పార్టీలు 2002 ఆర్డర్ ప్రకారం నోటీసులందుకున్నవారు పార్టీని నడిపించలేరని ఈసీపీ నోటీసులో పేర్కొంది. వారంలోగా కొత్త చీఫ్ ను ఎన్నుకొని ఈసీపీకు తెలియజేయాలని పీఎంఎల్ఎన్ పార్టీని కోరింది. పీఎంఎల్ఎన్‌కు కొత్త చీఫ్‌ను ఎన్నుకొనేందుకు ఇప్పటికే ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. షరీఫ్ సోదరుడు షెబజ్ షరీఫ్ కొత్త అధ్యక్షునిగా నియమించబడతారని ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఇతనితో పాటు మాజీ మొదటి మహిళ కుల్సోం నవాజ్ పేరును కూడా పార్టీ పరిశీలిస్తోంది.

2019లోనూ బీజేపీదే విజయం: ఒమర్




న్యూఢిల్లీ: 2019 లో జరిగే లోక్ఎన్నికల్లో మరోసారి బీజేపీ విజయం సాధిస్తుందని జమ్ము కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ప్రతిపక్షాలు కలసి కట్టుగా ఒకే మాటపై ఉండి బీజేపీని ఓడించడం కష్టతరమన్నారు. బీజేపీ ను ఎదుర్కోవడంలో ప్రతిపక్షాలు రచిస్తున్న వ్యూహాలు కేవలం మాటలకే పరిమితమవుతాని కార్య రూపం దాల్చునున్నారు. ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ విజయం సాధించిన నేపథ్యంలో 2019 లోజరిగే లోక్ సభ ఎన్నికలను ప్రతిపక్షాలు మర్చిపోవాలని ఒమర్ అబ్దుల్లా సూచించారు. కాంగ్రెస్ పార్టీ సంక్షోభంలో ఉన్న నేపథ్యంలో సీనియర్ నేత జైరాం రమేష్ వ్యాఖ్యలపై లోతుగా చర్చించుకోవాలని సూచించారు. లేదంటే ఆపార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. విపక్షాలు ఐక్యంగా ఉండటం ఒక భ్రాంతి మాత్రమేనని ఒమర్ అబ్దుల్లా అభిప్రాయపడ్డారు.

రాహుల్ గాంధీ కనిపించడం లేదు



లక్నో: కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ కనిపించడం లేదట. ఆయన నియోజకవర్గం ప్రజలు ఈమేరకు ఆందోళన చెందుతున్నారు. ఉత్తరప్రదేశ్ అమేథీలో వెలిసిన పోస్టర్లు కలకలం సృష్టించాయి. రాహుల్ ఫోటోతో కూడిన ఈ పోస్టర్లలో 'అమేథీ ఎంపీ రాహుల్ గాంధీ ఎక్కడున్నారో తెలియజేస్తే బహుమానం అందజేస్తామని' ప్రకటించారు. రాహుల్ గాంధీ తీరు అమేథీ ఓటర్లను అవమానపరిచేలా ఉందని, నియోజకవర్గ ప్రజలు ఆయన పట్ల అసంతృప్తితో ఉన్నట్లు అందులో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ కనిపించకపోవడంతో ఎంపీ లాండ్స్ కింద జరగాల్సిన అభివృద్ధి పనులు మందగించాయని ఆరోపించారు. అమేథీలోని గౌరీజంగ్ ప్రాంతంలో వెలసిన ఈ పోస్టర్ల వెనక బీజేపీ ప్రమేయం ఉందని కాంగ్రెస్ పార్టీ నేతలు అనుమానిస్తున్నారు. కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ తన సొంత నియోజకవర్గమైన అమేథీలో పర్యటించి ఆరు నెలలైంది. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా ఓడిపోయింది. దీంతో నాటి నుంచి ఆయన అమేథీలో పర్యటించడానికి ఆసక్తి చూపడం లేదని సమాచారం.

బాబ్రీ మసీదు స్థలం మా ఆస్తి



న్యూఢిల్లీ: బాబ్రీ మసీదు తమ ఆస్తి అని ఉత్తర ప్రదేశ్ షియా వక్ఫ్ బోర్డు పేర్కొంది. ఈమేరకు సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. మంగళవారం అయోధ్య కేసుపై సర్వోన్నత న్యాయస్థానంలో కీలక వాదనలు జరిగాయి. దీంతో వివాదస్పద భూమికి కొంత దూరంలో, ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాం తంలో మసీదు నిర్మించుకోవచ్చని అఫిడవిట్ ద్వారా సుప్రీం కోర్టుకు సూచించిం ది. ఈ వాదనలు విన్న సుప్రీం కోర్టు తదుపరి విచారణను ఆగస్ట్ 11కు వాయిదా వేసింది.

అయోధ్య కేసు పిటిషన్ల విచారణకు ప్రత్యేక బెంచ్

మరోవైపు అయోధ్య, బాబ్రీ మసీదు వివాదంపై 2010లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపేందుకు ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్‌ను సుప్రీం కోర్టు నియమించింది. జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలో జస్టిక్ అశోక్ భూషన్, జస్టిస్ అబ్దుల్ నజీర్‌ల బెంచ్ ఈ నెల 11 నుంచి ఈ పిటిషన్లపై విచారణ ప్రారంభిస్తుందని సుప్రీం కోర్టు పేర్కొంది.

రాహుల్‌జీ... విదేశీ టూర్ల రహస్యమేంటి?

• విదేశాల్లో ఎస్పీజీ నిరాకరణపై రాహుల్‌కు హోంమంత్రి సూటి ప్రశ్న
• రాహుల్ కాన్వాయ్ దాడిపై లోక్‌సభలో కాంగ్రెస్ ఆందోళన
• బీజేపీ నేతలు ఉగ్రవాదుల్లా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు
• కాంగ్రెస్ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర విమర్శలు






న్యూఢిల్లీ: పార్లమెంట్ ఉభయ సభలు విపక్షాల ఆందోళనలతో దద్దరిల్లాయి. కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ కాన్వాయ్ పై దాడిని నిరసిస్తూ లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యులు ప్రభుత్వంపై నిందలు మోపారు. గుజరాత్‌లో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన యువనేతపై ఆ రాష్ట్ర బీజేపీ కార్యకర్తలే రాహుల్‌పై దాడికి యత్నించారని ఆరోపిస్తూ.. కాంగ్రెస్ సభ్యుడు మల్లికార్జున ఖర్గే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాహుల్ గాంధీని హతమార్చేందుకు బీజేపీ నేతలు ఉగ్రవాదులుగా మారారని ఆరోపించారు. రాహుల్‌కు భద్రత కల్పించడంలో గుజరాత్, కేంద్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. దీంతో లోక్‌సభలో కాంగ్రెస్, బీజేపీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కాంగ్రెస్‌ను భయపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని... తాము ఎవరికీ భయపడబోమని ఖర్గే చెప్పారు.

రాహుల్ నిర్లక్ష్యమే ఘటనకు కారణం: రాజ్‌నాథ్


గుజరాత్‌లో రాహుల్ గాంధీ కాన్వాయ్‌పై దాడి ఘటనపై కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో వివరణ ఇచ్చారు. రాహుల్ గాంధీ తన భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 72 రోజుల పాటు విదేశాలకు వెళ్లినప్పుడు గానీ...స్వదేశీ పర్యటనల్లో గానీ రాహుల్ ఎస్‌పిజి సూచనలను పట్టించుకోవడం లేదని అన్నారు. భద్రత విషయంలో అప్రమత్తంగా లేకుంటే ఎలా అని ప్రశ్నించారు. గుజరాత్‌లో రాహుల్ కాన్వాయ్‌పై దాడికి సంబంధించి..విచారణ జరుపుతున్నామని... త్వరలోనే నిందితులను శిక్షిస్తామని ప్రకటించారు. రాజ్‌నాథ్ ప్రకటనపై కాంగ్రెస్ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆందోళన కొనసాగించారు. దీంతో సభ పలువార్లు వాయిదా పడింది. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా ప్రతిపక్షసభ్యుల తీరులో మార్పు రాలేదు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ కాంగ్రెస్ సభ్యులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. దీంతో స్పందించిన పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్ కుమార్ కాంగ్రెస్ తీరును తప్పుబట్టారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ సభను తప్పుదోవపట్టిస్తున్నాయని మండిపడ్డారు. రాహుల్ భద్రత విషయంలో కేంద్రం ఎన్నడూ రాజీపడలేదని...రాహుల్ గాంధీయే భద్రతను సీరియస్ గా తీసుకోవడంలేదన్నారు. రాహుల్‌కు ఎస్‌పిజి భద్రత అవసరం లేదనిపిస్తే..ప్రభుత్వంతో చెప్పాలన్నారు.

నోయిడాలో రక్షించిన పాక్ శిశువు లాహోర్‌లో మృతి



న్యూఢిల్లీ: జూన్‌లో నోయిడాలో గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న పాకిస్తాన్‌కు చెందిన నాలుగు నెలల బాలుడు రోహన్ సోమవారం లాహోర్ లో అతిసార వ్యాధితో మరణించాడు. విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ జోక్యం చేసుకున్న తరువాత వారికి వైద్యవీసా లభించింది. భారత పాకిస్తాన్ సరిహద్దుల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల కారణంగా మొదట వైద్య వీసా పొందలేకపోయారు. ట్విట్టర్ ద్వారా రోహన్ తండ్రి వీసా కోసం తన కుమారుని ఆరోగ్య స్థితిని తెలుపుతూ అభ్యర్థించారు. పాకిస్తాన్‌లోని భారత హైకమీషన్‌ను కలవాలని రోహన్ తండ్రి కన్వాల్ సాదిక్ కు సుష్మా సూచించారు. దీంతో రోహన్‌కు వైద్య వీసా త్వరగా లభించడంతో జూన్ 14న నోయిడాలోని జైపీ ఆస్పత్రిలో గుండెకు శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఆ బాలుడికి గుండెలో రంధ్రం ఉంది. దీంతో ఆయన శ్వాస తీపుకొనేందుకు ఇబ్బంది పడేవాడు. రోహన్ ఆరోగ్యం కుదుట పడిన తరువాత జులై 18 న ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేశారు.

యోగా తప్పనిసరి కాదు




న్యూఢిల్లీ: దేశంలోని అన్ని పాఠశాలల్లో యోగాను తప్పనిసరిగా అమలు చేయాలం టూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. 1 నుంచి 8వ తరగతి విద్యార్థులు ప్రతిరోజు యోగా సాధన చేసేలా స్కూళ్లలో జాతీయ యోగా విధానాన్ని అమలుచేసేలా ఆదేశాలు జారీ చేయాలన్న పిటిషన్‌పై జస్టిస్ ఎంబీ లోకూర్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపిం ది. పాఠశాలల్లో ఏం బోధించాలో చెప్పడం తమ విధి కాదని, ఈ ఆదేశాలు తాము ఎలా ఇవ్వగలమని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఇలాంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వ మే నిర్ణయం తీసుకుంటుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. పాఠశాలల్లో ఏం బోధించాలన్న అంశం ప్రాథమిక హక్కు కిందకు రాదంటూ ఆ పిటిషన్‌ను కొట్టివేసింది.

ప్రత్యేక ప్రతిపత్తిపై మీ వైఖరేంటి?

జమ్మూ కశ్మీర్ స్పెషల్ స్టేటస్‌పై కేంద్రం అభిప్రాయం కోరిన సుప్రీం కోర్టు


న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి కాల పరిమితిపై కేంద్రం అభిప్రాయాన్ని సుప్రీం కోర్టు కోరింది. భారత రాజ్యాంగం ప్రకారం జమ్మూకశ్మీర్ రాజ్యాంగం చట్టవిరుద్ధం, అక్రమం, అల్ట్రావైర్స్ అన్నది స్పష్టం చేయాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్, న్యాయమూర్తులు ఆదర్శ్ గోయల్, డి.వై.చంద్రచుడ్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఆదేశించింది. దీనిపై నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని త్రిసభ్య బెంచ్ కోరింది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి వర్తించే ఆర్టికల్ 370ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు 2014 జులైలో కొట్టివేసింది. దీనిపై హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. కాగా విజయ లక్ష్మీ ఝూ అనే మహిళ జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి తాత్కాలికమేనని, 1957లో ఆ రాష్ట్ర అసెంబ్లీ రద్దుతో దానికి కాలం చెల్లిందంటూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అయితే గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా 2017 ఏప్రిల్ 11న ఆమె పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. దీంతో విజయ లక్ష్మీ దీనిపై సుప్రీం కోర్టులో అపీల్ చేశారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ రద్దుతో ఆర్టికల్ 370కి కాలం చెల్లిందని, దాన్ని ఇంకా కొనసాగించడం రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని మోసగించడమేనని ఆమె తరుపు న్యాయవాది అనిల్ కుమార్ ఝూ వాదించారు. దీంతో జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తికి సంబంధించిన ఆర్టికల్ 370 కాల పరిమితిపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు కోరింది. దీనికి నాలుగు వారాల గడువు ఇచ్చింది.

నవంబర్‌లో ఇవాంక ట్రంప్ హైదరాబాద్ టూర్



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుని డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంక ట్రంప్ (35) నవంబరులో హైదరాబాద్‌లో పర్యటించబోతున్నారు. గ్లోబల్ ఎంటర్ ప్రెన్యూవర్‌షిప్ సమ్మిట్ లో ఆమె పాల్గొనున్నారు. ప్రధాని మోదీ ఇటీవల అమెరికాలో పర్యటించినప్పుడు ఇవాంక ట్రంప్‌ను ఈ సదస్సుకు ఆహ్వానించిన విషయం పాఠకులకు విదితమే. భారతదేశంలో జరిగే ఈ సదస్సుకు హాజరయ్యే అమెరికా ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించాలని ప్రధాని మోదీ ఇవాంక ట్రంప్‌ను కోరినందుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఇవాంకా ట్రంప్ వ్యాపారవేత్తగానూ, ప్యాషన్ మోడల్ గానూ ప్రశంసలందుకున్నారు. ప్రస్తుతం ఆమె తన తండ్రి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సహాయకురాలిగా ఉన్నారు. ఆమె భర్త జారెడ్ కుష్నర్ కూడా డొనాల్డ్ ట్రంప్‌కు సహాయకుడిగా వ్యవహరిస్తున్నారు. వీరిద్దరూ కూడా తమ సేవలకు జీతం తీసుకోవడం లేదు.


భారత్, పాక్ సరిహద్దులో.. సాంకేతిక కంచె



న్యూఢిల్లీ: పాకిస్థాన్ నుంచి ఉగ్రవాదుల చొరబాట్లను పూర్తిగా నిరోధించేందుకు భారత ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా 24 గంటలూ గస్తీ, నిఘా ఉండేలా సాంకేతిక కంచె ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసింది. సెన్సార్లు, రాడార్లు, పగలు-రాత్రి పని చేసే కెమెరాలతో కూడిన సమగ్ర ఇంటిగ్రేటెడ్ బోర్డర్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్‌ను సరిహద్దులో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం లోక్‌సభలో వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌లోని రెండు సెక్టార్లలో ఐదు నుంచి ఆరు కిలోమీటర్ల పరిధిలో దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే భారత్ పాక్ సరిహద్దు ఉన్న ఇతర రాష్ట్రాలకు దీన్ని విస్తరిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి రిజిజు లోక్‌సభకు తెలిపారు.

రెండు రకాల నోట్లా... ఈ శతాబ్దపు స్కామ్!

• రాజ్యసభలో రూ.500 నోటుపై దుమారం
• గోరంతను కొండంత చేస్తున్నారని జైట్లీ ఆగ్రహం



న్యూఢిల్లీ: ఆర్బీఐ కొత్తగా ప్రవేశపెట్టిన రూ.500 నోటుపై రాజ్యసభలో దుమారం చెలరేగింది. రెండు రకాల ఐదువందల రూపాయల నోటు ముద్రించడం ఈ శతాబ్దంలోనే అతిపెద్ద స్కాంగా కాంగ్రెస్ ఆరోపించింది.వేర్వేరు సైజులు, డిజైన్లు ఉన్న 500 రూపాయల నోట్లను చూపిస్తూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కపిల్ సిబల్ ఎన్డీఏ సర్కారుపై నిప్పులు చెరిగారు. ఒకే నోటును రెండు రకాలుగా ముద్రించడంపై సిబల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ద్వంద్వ వైఖరి నిరసిస్తూ కాంగ్రెస్ సభ్యులంతా ఆందోళనకు దిగారు. ప్రభుత్వం ఒక నోటును పార్టీ కోసం, మరోనోటును ప్రభుత్వం కోసం ముద్రించడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. రూ.500, రూ.2000 నోట్లు రెండు రకాలుగా ఉన్నాయని కాంగ్రెస్ సభ్యుడు గులాంనబీ ఆజాద్ ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యులకు తృణమూల్ కాంగ్రెస్ కూడా మద్దతు పలికింది. రెండు రకాల నోట్ల ముద్రణ చాలా సీరియస్ అంశమని..దీనిపై విచారణ జరపాలని టీఎంసీ సభ్యుడు డెరెక్ ఒబ్రైన్ డిమాండ్ చేశారు. మరోవైపు జేడీయూ నాయకుడు శరద్ యాదవ్ కూడా కరెన్సీ నోట్ల వివాదంపై కాంగ్రెస్ కు మద్దతు పలికారు. విపక్షాల అభ్యంతరాలకు ప్రభుత్వం సమాధానమివ్వాలన్నారు.


గోరంతను కొండంత చేయడం విపక్షాలకు అలవాటే: జైట్లీ

కాంగ్రెస్ వాదనను అధికార పార్టీ సభ్యులు ఖండించారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పందిస్తూ..జీరో అవర్ లో ఎన్నో కీలక అంశాలపై చర్చ జరగాల్సి ఉన్నా నోట్ల అంశాన్ని లేవనెత్తి..సభా సమయాన్ని వృథా చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షం బాధ్యతారహితంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.భారీ సంఖ్యలో నోట్లను ముద్రిస్తున్న క్రమంలో ఒకటి,రెండు నోట్లలో సైజ్,డిజైన్ లో తేడా రావడం సర్వసాధారణమన్నారు. ప్రతిపక్షం గోరంతను కొండంత చేస్తోందని మండిపడ్డారు. మరో మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ మాట్లాడుతూ తమకు తెలియకుండా కాంగ్రెస్ సభ్యులకు ఆ నోట్లు ఎలా వచ్చాయో చెప్పాలని నిలదీశారు. పెద్ద ఎత్తున నోట్లు ముద్రించే సమయంలో ఒకటి, రెండు నోట్లు తేడాగా ఉండటం మామూలేనని ఆర్బీఐ అధికారులు కూడా స్పష్టం చేశారు.

వాయిదాల పర్వం

రాజ్యసభ ప్రారంభమైనప్పటి నుంచి విపక్ష సభ్యులు కరెన్సీ నోట్ల అంశాన్ని ప్రస్తావించి ఆందోళనకు దిగడంతో సభ పలుమార్లు వాయిదా పడింది. దీంతో మంగళవారం షెడ్యూల్‌లో ఉన్న ఏ అంశం కూడా చర్చకు రాకుండా పోయింది. కాంగ్రెస్ సహా ప్రతిపక్షాల సభ్యులంతా రెండు రకాల రూ.500 నోటుపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ.. రాజ్యసభ చైర్మన్ పోడియాన్ని చుట్టుముట్టారు. డిప్యూటీ చైర్మన్ కురియన్ ఎంతగా వారించినా సభ్యులు వినకపోవడంతో సభలో వాయిదాల పర్వం కొనసాగింది. వాయిదాల తర్వాత కూడా సభ్యుల తీరులో మార్పు రాకపోవడంతో రాజ్యసభ నేటికి వాయిదా పడింది.

'నితీష్.. రాజకీయ ఆత్మహత్య చేసుకున్నారు'



పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ నేత నితీశ్ కుమార్‌పై ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ మరోసారి మండిపడ్డారు. ఆయన మహా కూటమి ప్రభుత్వాన్ని వీడి బీజేపీతో చేతులు కలిపి రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నారని విమర్శించారు. వెన్నుపోటు పొడిచి యుద్ధం నుంచి పారిపోయిన వ్యక్తిగా నితీశ్‌ను పోల్చారు. దేశంలోని ఏ పార్టీ కూడా ఇకపై నితీశ్‌ను నమ్మదని, ఆయన రాజకీయ జీవితం అంతమైనట్లేనని లాలూ అన్నారు. 2019 ఎన్నికల్లోనూ జేడీయూకు ప్రస్తుతం ఉన్న రెండు సీట్లు మాత్రమే దక్కుతాయని, బీజేపీ అంతకు మించిన సీట్లు కేటాయించదని తెలిపారు. నితీశ్ తన కన్నా మరింత పరిపక్వం ఉన్న వ్యక్తిగా తాను భావించానని, అయితే అది తప్పని ఆయన నిరూపించారని, దీనికి తాను చాలా విచారం వ్యక్తం చేస్తున్నానని లాలూ అన్నారు. ఆగస్ట్ 27న ఆర్జేడీ తలపెట్టిన భారీ ర్యాలీకి ఇసుక మాఫియా నేత నుంచి నిధులు అందాయన్న డిప్యూటీ సీఎం సుశీల్ కుమార్ మోడీ ఆరోపణలను ఆయన ఖండించారు. ఆయన నుంచి నయాపైసా అయినా తీసుకోలేదని, రాష్ట్రంలో నాటి ఎన్డీయే ప్రభుత్వమే ఆయనకు ఇసుక కాంట్రాక్ట్ ఇచ్చిందన్నారు. తమపై వచ్చిన ఆరోపణలన్నింటికీ ఆగస్ట్ 27న పాట్నాలో నిర్వహించనున్న భారీ ర్యాలీలో సమాధానమిస్తామని లాలూ స్పష్టం చేశారు.



ఎక్కడైనా గెలుస్తామా!

... మాది ప్రపంచంలో నెంబర్‌వన్ జట్టు. మేం ఎక్కడైనా గెలవడం అలవాటుగా మార్చుకున్నాం. దేశంలోనైనా, విదేశాల్లోనైనా గెలుపే మా మంత్రం. ఎలాంటి వికెట్‌పైనైనా విజయమే లక్ష్యం. మ్యాచ్‌ల్ని మ్యాచ్‌లుగానే చూస్తాం..

.. కొలంబో టెస్టులో శ్రీలంకపై ఇన్నింగ్స్, 53 పరుగుల తేడాతో భారత జట్టు విజయభేరి మోగించిన తర్వాత కెప్టెన్ విరాట్ కోహ్లి అన్న మాటలివి. నిజానికి క్రికెట్ అభిమానికి అంతకన్నా కావలసింది ఏముంటుంది? కోహ్లి సారథ్యంలో ఇప్పటికే టీమ్‌ఇండియా వరుసగా ఎనిమిది సిరీస్‌లలో విజయం సాధించింది. మూడో టెస్టులోనూ లంకను మట్టికరిపించి అరదైన వైట్‌వాష్ రికార్డును కూడా సొంతం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతోంది.

(ఆంధ్రప్రభ క్రీడావిభాగం)

కోహ్లి సారథ్యంలోనే 2015లో లంకలో ఈ అప్రతిహత విజయాలకు నాంది పడింది. నాటినుంచి వరుసగా ఎనిమిది సిరీస్‌లలో కోహ్లిసేన విజయపరంపర కొనసాగించింది. ఫలితంగా టీమ్‌ఇండియా ఐసీసీ టెస్టు టీమ్ ర్యాంకింగ్స్‌లో 123 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. తర్వాత స్థానాల్లో దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ ఉన్నాయి. 2015 నుంచి ఇప్పటివరకు జరిగిన సిరీస్‌లలో లంక, వెస్టిండీస్‌తో మినహా తక్కినవన్నీ సొంతగడ్డపై జరిగినవే. నిజానికి కోహ్లి సేన ప్రపంచ నెంబర్ వన్‌గా అవతరించిన తర్వాత ఇంతవరకు కఠినమైన సవాలు ఎదురుకాలేదనే చెప్పాలి.

ఆ సిరీస్‌లు లాభించేనా..: మహేల, సంగక్కరల రిటైర్మెంట్ తర్వాత బలహీన జట్టుగా మారిన లంకతో 2015లో టెస్టు సిరీస్ ఆడి గెలిచింది. తర్వాత భారత్ స్వదేశంలో దక్షిణాఫ్రికాతో నాలుగు టెస్టుల సిరీస్‌లో 3-0తో, న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల్లో 3-0తో, ఇంగ్లాండ్‌తో 5 టెస్టుల్లో 4-0తో, బంగ్లాదేశ్‌తో ఒకే టెస్టులో 1-0తో, ఆస్ట్రేలియాతో 4 టెస్టుల్లో 2-1తో గెలిచి సిరీస్‌లను కైవసం చేసుకుంది. ఈ కాలంలోనే వెస్టిండీస్‌లో భారత జట్టు వారిని 4 మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0తో మట్టికరిపించింది. మరి స్వదేశంలో జరిగిన.. విదేశాల్లో లంక, విండీస్ వంటి బలహీన జట్లపై సాధించిన విజయాలు ఇకపై జరగబోయే కఠినమైన విదేశీ పర్యటనల్లో జట్టు గెలుపునకు ఎంతవరకు ఉపయోగపడతాయో చూడాలి. 2005-08 మధ్య హేడెన్, పాంటింగ్, లాంగర్, మెక్‌గ్రాత్, వార్న్ వంటి మేటి ఆటగాళ్లతో కూడిన భీకర ఆసీస్ జట్టు ప్రపంచంలోని అన్ని క్రికెటింగ్ దేశాలపైనా విజయబావుటా ఎగురవేసింది. వరుసగా 9 సిరీస్ విజయాలతో నెంబర్ వన్ జట్టుకు ఎలాంటి లక్షణాలు ఉండాలో ఆసీస్ చాటింది. ఆ రికార్డుకు గురిపెట్టిన సత్తా కోహ్లి సేనకు దాన్ని సాధించే సత్తా ఉందా? గెలుపును అలవాటుగా మార్చుకున్నాం అన్న విరాట్ వచనాలు ఎంతవరకు నిలుస్తాయి.

కఠిన సిరీస్‌లుండాలి: లంకతో సిరీస్ తర్వాత భారత్‌లో పరిమిత ఓవర్ల క్రికెట్ ఆడేందుకు ఆసీస్, న్యూజిలాండ్ రాబోతున్నాయి. తదుపరి మళ్లీ లంక పూర్తిస్థాయి సిరీస్ కోసం మనదేశం రానుంది. ఇవన్నీ 2017లో జరుగుతాయి. ఇలా లంక వంటి బలహీన జట్టుతో సిరీస్‌ల వల్ల టీమ్‌ఇండియా ఏ మాత్రం రాటుదేలుతుంది? కేవలం ర్యాంకును నిలబెట్టుకోవడానికి ఉపయోగపడతాయంతే. 2018 జనవరిలో దక్షిణాఫ్రికాతో, తర్వాత ఇంగ్లాండ్‌తో జరిగే కఠినమైన సిరీస్‌లలో టీమ్‌ఇండియాకు అసలుసిసలు సవాలు ఎదురుకానుంది. ఈ లోగా విసుగెత్తించే లంక సిరీస్‌ల వల్ల 2011 మాదిరిగానే విదేశీ గడ్డపై జట్టు ఘోరంగా దెబ్బతినే ప్రమాదముంది. నాడు భారత జట్టు ఐపీఎల్ తర్వాత వెస్టిండీస్‌లో టెస్టు, వన్డే సిరీస్ ఆడింది. కొన్ని మాసాలకే విండీస్ జట్టు భారత్ వచ్చింది. తర్వాత మన ఆటగాళ్లకు వాతావరణం ఏ మాత్రం అనుకూలంగా ఉండని ఇంగ్లాండ్ వెళ్లి భారత జట్టు భంగపడింది.

ఏం చేయాలి: భారత జట్టు విదేశాల్లోనూ తిరుగులేని విజయాలు సాధించి.. అసలుసిసలు నెంబర్ వన్ జట్టు అనిపించుకోవాలంటే కఠినమైన సిరీస్‌లు ఎంచుకోవాలి. ఈ విషయంలో పాకిస్థాన్ మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ అడుగుజాడల్లో నడవాలని కోహ్లికి మాజీ టెస్టు క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ సలహా ఇచ్చాడు. ఇతని సూచన నిజంగా భారత జట్టుకు ఆచరణీయం. ఈ విషయంలో కోహ్లి ఆలోచించకుంటే జట్టుకు ఎంతో మేలు జరుగుతుంది.



యుద్ధం వద్దు.. శాంతి కావాలి

- చైనా బాక్సర్‌కు బెల్ట్‌ను తిరిగి ఇచ్చేస్తా: విజేందర్

న్యూఢిల్లీ: భారత్, చైనా మధ్య ఉద్రిక్తతల నివారణకు తన వంతు కృషి చేయాలని భారత ఏస్ బాక్సర్ విజేందర్ భావిస్తున్నాడు. అందుకు అవసరమైతే తాను ఇటీవల ఆ దేశ బాక్సర్ జుల్ఫికర్ మైమైతిలి ఓడించి వశం చేసుకున్న టైటిల్‌ను తిరిగి అతనికే ఇచ్చేస్తానని విస్పష్టంగా చెప్పాడు. విజేందర్ శనివారం ముంబయిలో జరిగిన పోటీలో జుల్ఫికర్‌ను ఓడించి డబ్ల్యుబీఓ ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్ వెయిట్ టైటిల్‌ను తిరిగి దక్కించుకున్నాడు. దీంతో పాటు చైనా బాక్సర్ నుంచి డబ్ల్యుబీఓ ఓరియంటల్ సూపర్ మిడిల్ వెయిట్ బెల్ట్‌ను కూడా వశం చేసుకున్నాడు. ఐతే రెండు దేశాల మధ్య శాంతి స్థాపన కోసం ఇపుడా బెల్ట్‌ను జుల్ఫికర్‌కే తిరిగి ఇచ్చేస్తానని విజేందర్ అంటున్నాడు. "సరిహద్దులో ఉద్రిక్తతను నేను ఇష్టపడను. ఇది నా శాంతి సందేశం. అదే నాకు ప్రధానం" అని విజేందర్ పేర్కొన్నాడు.

మళ్లీ బరిలోకి బోల్ట్



లండన్: జమైకా పరుగుల చిరుత ఉసేన్ బోల్ట్ మళ్లీ బరిలోకి దిగుతున్నాడు. ఈ సారి అతను ప్రస్తుత ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో జమైకా 4/100 మీటర్ల రిలే జట్టు తరపున శనివారం హీట్స్‌లో పోటీ పడబోతున్నాడు. 100 మీటర్ల పరుగులో బోల్ట్ కాంస్యంతో తృప్తి పడ్డ సంగతి తెలిసిందే. సాధారణంగా బోల్ట్ 200 మీటర్ల వ్యక్తిగత పరుగులో పోటీ పడాలి. కానీ తన చివరి మజిలీ అయిన ఈ ఛాంపియన్‌షిప్‌లో మాత్రం ఆ రేసుకు దూరంగా ఉండాలని భావిస్తున్నాడు. దీంతో అతనికి రిలే హీట్స్‌లో పాల్గొనే అవకాశం లభించింది. "ఈ జట్టుతో పరుగు తీసిన అనుభవం నాకు ఇంతకుముందు లేదు. కుర్రాళ్లతో ఎక్కువగా మాట్లాడింది లేదు. కాకుంటే 100 మీటర్ల సెమీ ఫైనలిస్ట్ జులియన్ ఫోర్ట్‌తో మాట్లాడా. ఐతే రిలేలో పోటీ పడాలంటే నాకు ఎంతో ఇష్టం" అని బోల్ట్ చెప్పాడు. "ఎప్పుడూ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికే ప్రయత్నిస్తా. ఇక 4/100పై దృష్టిపెడతా" అన్నాడు. రిలే జట్టులో అనుభవజ్ఞుడు ఒక్క యొహాన్ బ్లేక్ మాత్రమే.

ప్రపంచకప్ నుంచి నన్ను తప్పించమన్నా!



కోల్‌కత: ఇంగ్లాండ్‌లో జరిగిన మహిళల ప్రపంచకప్ ఫైనల్లో అద్భుత ప్రదర్శన (3-23) ఇచ్చిన భారత ఫాస్ట్ బౌలర్ జులన్ గోస్వామి.. ఒకానొక దశలో తనను తుది 11 మంది నుంచి తప్పించాలని కోచ్‌ను కోరారని వెల్లడించింది. టోర్నీ ఆరంభంలో తన ప్రదర్శన మెరుగ్గా లేకపోవడంతో తాను విధంగా కోరానని మంగళవారం ఇక్కడ బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) చేసిన సన్మాన కార్యక్రమంలో తెలిపింది. "నా సమాయత్తత నాకు నచ్చలేదు. ఆరంభంలో నేను మెరుగ్గా బౌలింగ్ చేయలేదు. ఎంతో నిరాశపడ్డా. నా కోచ్‌తో మాట్లాడాను. బాగా బౌలింగ్ చేయడం లేదు కాబట్టి తదుపరి మ్యాచ్ నుంచి తప్పించాలని కోరా. విండీస్‌తో మ్యాచ్ తర్వాత ఆయనకా మాట చెప్పాను. కానీ ఆయన 'నీవు ఉండాల్సిందే. బౌలింగ్‌కు నేతృత్వం వహించాల్సిందే' అని చెప్పారు.. అంటూ జులన్ వివరించింది. ప్రపంచ కప్‌లో 10 మ్యాచ్‌ల్లో 10 వికెట్లు తీసిన జులన్‌కు క్యాబ్ ప్రత్యేక అవార్డుతో పాటు రూ.10 లక్షలిచ్చింది.

గుజరాత్‌పై హర్యానా సంచలనం

తెలుగు టైటాన్స్, బెంగళూరు బుల్స్ మ్యాచ్ డ్రా



గుజరాత్ , హర్యానా మ్యాచ్ దృశ్యం

ప్రో కబడ్డీ లీగ్

నాగ్‌పూర్: ప్రో కబడ్డీ లీగ్‌లో హర్యానా స్టీలర్స్ మంగళవారం సంచలన విజయం సాధించింది. ఇప్పటివరకు ఓటమి ఎరుగని గుజరాత్ ఫార్చ్యూన్ జయంట్స్‌పై సంచలన విజయం సాధించింది. గుజరాత్ నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనప్పటికీ హర్యానా 32-20తో గెలిచింది. గుజరాత్ ఆటగాడు వికాశ్‌ఖండోలా మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. తొలి అర్థంలో ఆట పేలవంగా సాగడంతో హర్యానా 13, గుజరాత్ 9 పాయింట్లు మాత్రమే సంపాదించగలిగాయి. రెండో అర్థంలో మాత్రం ఆట రసవత్తరంగా సాగింది. రెండో జట్లు నువ్వానేనా అన్నట్లు పోరాడాయి. తెలుగు టైటాన్స్, బెంగళూరు బుల్స్ మధ్య జరిగిన మరో పోరు 21-21తో డ్రాగా ముగిసింది.

స్లెడ్జింగ్‌కు సిద్ధమే



కొలంబో: బౌలర్లకు సాయపడుతుందంటే తాను ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను దూషించడానికి (స్లెడ్జింగ్) సిద్ధమేనని మిస్టర్ డిపెండబుల్ చతేశ్వర పుజారా అన్నాడు. "ఫిఫా ఫుట్‌బాల్ మ్యాచ్‌లు చూస్తున్నపుడు నేను చాలా బిగ్గరగా అరుస్తాను. ఇపుడు మైదానంలో కూడా అరుస్తున్నాను. ప్రత్యేకించి ఓ బ్యాట్స్‌మన్‌ను స్లెడ్జింగ్ చేయాలనుకుంటే చేయడమే. అది బౌలర్లకు ఉపయోగపడుతుంది" అని పుజారా ఓ కార్యక్రమంలో చెప్పాడు.

బకాయిలు చెల్లించండి

- బీసీసీఐకి అజహర్ లేఖ



న్యూఢిల్లీ: తనకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని బీసీసీఐని టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహ్మద్ అజహరుద్దీన్ కోరాడు. మాజీ సారథులకు ఇచ్చిన పారితోషికంతో పాటు బకాయిలను చెల్లించాలని బోర్డు తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, కార్యదర్శి అమితాబ్ చౌదరికి రాసిన ఓ లేఖలో కోరాడు. అజహర్‌పై జీవిత కాల నిషేధం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పిచ్చి ఐదేళ్లు గడుస్తున్నా బోర్డు మాత్రం అతని విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. ఆ తీర్పుపై అప్పీలు చేయని బీసీసీఐ.. నిషేధాన్ని కూడా ఎత్తివేయలేదు.

ముక్కోణపు సిరీస్ భారత్ ఏ వశం


- శ్రేయస్ అజేయ సెంచరీ
- ఫైనల్లో ఓడిన దక్షిణాఫ్రికా ఏ

ప్రిటోరియా: దక్షిణాఫ్రికా లో జరిగిన ముక్కోణపు సిరీస్‌ను భారత్ ఏ జట్టు కైవసం చేసుకుంది. మంగళవారం ఫైనల్లో శ్రేయస్ అయ్యర్ (140 నాటౌట్, 131 బంతుల్లో, 11 ఫోర్లు, 4 సిక్స్) చెలరేగి అజేయ సెంచరీ చేయడంతో భారత్ ఏ 19 బంతులు మిగిలివుండగానే 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై జయభేరి మోగించింది.

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 7 వికెట్లకు 267 పరుగులు సాధించింది. బెహర్డీన్ (101 నాటౌట్, 114 బంతుల్లో, 4 ఫోర్లు, 3 సిక్స్) సెంచరీ చేశాడు. తర్వాత భారత్ ఏ 46.5 ఓవర్లలోనే 270 పరుగులు చేసి విజయం సాధించింది. వి.శంకర్ (72) అర్ధసెంచరీ సాధించాడు. అయ్యర్, శంకర్ కలిసి మూడో వికెట్‌కు 141 పరుగులు జోడించారు. శంకర్ ఔటైన తర్వాత క్రీజులకి వచ్చిన పాండే (32 నాటౌట్).. అయ్యర్‌తో కలిసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. భారత్ బౌలర్లలో ఠాకుర్ 52 పరుగులకు 3 వికెట్లు తీశాడు. అయ్యర్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మనీష్ పాండేకు మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అవార్డు దక్కాయి.

నెంబర్‌వన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా

- ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం



న్యూఢిల్లీ: కొలంబో టెస్టులో లంకపై ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన రవీంద్ర జడేజా.. ఐసీసీ తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ ఆల్‌రౌండర్‌గా అవతరించాడు. ఆ మ్యాచ్‌లో అతను అజేయంగా 70 పరుగులు చేసి, ఏడు వికెట్లు తీసిన సంగతి తెలిసిందే. జడేజా ఇప్పటికే నెంబర్ వన్ టెస్టు బౌలర్‌గా ర్యాంకింగ్స్‌లో స్థానం సంపాదించాడు. ఆల్‌రౌండర్‌గా కూడా అగ్రస్థానం లభించడంజడేజాకు ఎనలేని గౌరవం వంటిది. జడేజాకు తన కెరీర్‌లో తొలిసారి ఆల్‌రౌండర్‌గా టాప్ ర్యాంక్ దక్కింది. బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకిబుల్ నుంచి అతనీ స్థానాన్ని వశం చేసుకున్నాడు. కొలంబో టెస్టులో 150 వికెట్లు పూర్తి చేసుకున్న జడేజా ఐసీసీ నిషేధంతో మూడో టెస్టుకు దూరమైన సంగతి తెలిసిందే. కత్తి మాస్టర్ కు అభినందనలు అంటూ కోహ్లి సరదాగా ట్వీట్ చేసాడు.

మూడో స్థానానికి ఇంగ్లాండ్: స్వదేశంలో దక్షిణాఫ్రికాపై నాలుగు టెస్టుల సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకున్న ఇంగ్లాండ్ (105) టీమ్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానానికి ఎగబాకింది. ఆసీస్(100)ను కిందకు నెట్టి ఇంగ్లాండ్ ఆ ర్యాంకును దక్కించుకుంది. 123 పాయింట్లతో భారత్ టాప్ ర్యాంకులో కొనసాగుతుండగా.. దక్షిణాఫ్రికా (110) రెండో స్థానంలో ఉంది.



ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్‌లో సోమవారం మహిళల 1500 మీటర్ల పరుగులో స్వర్ణం గెలిచిన కెన్యా అథ్లెట్ ఫెయిత్ షేంపెటిక్ కిపిగోన్ (మధ్య) సంబరం. కాంస్యం గెలిచిన సెమెన్యా (ఎడమ- దక్షిణాఫ్రికా), రజతం గెలిచిన జెనిఫర్ సింప్సన్ (కుడి- అమెరికా)



ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్‌లో సోమవారం పురుషుల 110 మీటర్ల హర్డిల్స్ విజేత (13.04సె.) జమైకా అథ్లెట్ ఒమర్ మెక్‌లాడ్ (మధ్యలో)

*Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.*



నిప్పులపై నడిచే...సిపి!

వసాధనమ్మకాలపై పోలీస్ లాఠీ

రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్‌తో ఆంధ్రప్రభ సంభాషణ

కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్లు, శాటిలైట్ లు, అంతరిక్ష యాత్రలు, రోబోలు...ఇవన్నీ మన కళ్లముందున్న సమాజంలో.... చేతబడి, బాణామతి, మాయలు, మంత్రాలు, దయ్యాలు, భూతాలు, దిష్టి...ఇలాంటివి కూడా ప్రజలపై తమ ప్రభావాన్ని చూపుతున్నాయి. గ్రామాల్లోనే కాకుండా నగరాల్లోనూ మాయలు మంత్రాల నెపంతో జనాన్ని మోసం చేస్తున్నవారు పెరుగుతున్నారు. అయితే ఇలాంటివి ఎన్నో జరుగుతున్నా...పోలీసుల వరకు వస్తున్న బాధితులు కొంతమందే. అయినా మనిషి మారనిదే...మనిషి ఆలోచనా తీరు మారనిదే...సైన్స్ పట్ల అవగాహన పెరగనిదే...ఇలాంటివి అంతం కావు. అందుకే ఆ దిశగానే తన ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు రాచకొండ పోలీస్ కమిషనరేట్ కు కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహేష్ భగవత్. జనంలో అజ్ఞానాన్ని తొలగించేందుకు ఆయన తీవ్రమైన కృషి చేస్తున్నారు. నిప్పులపై నడవటం, వెలుగుతున్న కర్పూరాన్ని మింగటం, ట్యూబ్ లైట్లను పగులగొట్టటం....ఇలాంటివి స్వయంగా చేసి చూపించి మరీ... జనంలోని మూఢనమ్మకాలకు తుడిచేయాలని తపిస్తున్నారు. పోలీస్‌గానే కాకుండా మానవత ఉన్న మనిషిగా తనని తాను నిరూపించుకుంటున్న మహేష్ భగవత్‌తో ఆంధ్రప్రభ లైఫ్ ప్రత్యేక సంభాషణ మీకోసం-

ఓవైపు నేరాలను అరికడుతూనే.. మరోవైపు సమాజాన్ని పట్టిపీడిస్తున్న అనాగరిక చర్యలపై తనదైన శైలిలో ఉక్కుపాదం మోపుతున్నారు మహేష్ మురళీధర్ భగవత్. సమాజంలో పెరిగిపోతున్న మూఢాచారాలపై పట్టువదలని విక్రమార్కుడిలా అలుపెరుగని పోరాటం చేస్తున్నారాయన. మహారాష్ట్రలోని ఓ మారుమూల ప్రాంతానికి చెందిన మహేష్ భగవత్.. ఐపీఎస్ అధికారిగా ఏ ప్రాంతంలో విధులు నిర్వర్తించినా... మూఢనమ్మకాలను ఆసరాగా చేసుకుని అమాయకులను మోసం చేసేవారి పాలిట సింహస్వప్నంగానూ.. బాధితులకు అండగానూ నిలుస్తున్నారు. మహేష్ భగవత్ వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే-

పోలీస్ కాకముందే అవగాహన...

నేను పుట్టి పెరిగినదంతా మహారాష్ట్రలోని ఓ మారుమూల ప్రాంతం. సివిల్స్ పరీక్షలకు ప్రిపరేషన్ మొదలుపెట్టిన తర్వాత, మూడవ నెలలో ఒక ప్రైవేట్ ఉద్యోగంలో చేరాను. రూరల్ డెవలప్‌మెంట్‌పై ఓ ఎన్జీవో చేస్తున్న ప్రాజెక్టులో భాగంగా నన్ను పూణె నుంచి 70 కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రాంతానికి పంపించారు. మొదట మా ఇంటి నుంచి బైక్‌పై వెళ్లేవాడిని. ఆ తర్వాత చాలా దూరమవుతుందని భావించి, అక్కడి గ్రామ పంచాయితీలోనే ఉండి, స్థానికులకు రూరల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించేవాడిని. ఈ క్రమంలోనే ప్రతి శనివారం పూణెలో ఒక స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమాలు జరిగేవి. నేను ఆ సమావేశాలకు వెళ్లి, అన్ని విషయాలు నేర్చుకున్నాను. సహజంగానే మూఢ నమ్మకాలను ప్రజలు నమ్మడం, మోస పోవడం జరుగుతుంటుంది. వాటిని నిర్మూలించాలంటే అవగాహన అవసరం. అందుకే మూఢనమ్మ కాలు అంటే ఏమిటి? అలాంటి కార్యక లాపాల ను ఎలా చేస్తారు? నిజంగా మంత్రాలు ఉన్నాయా...ఇలాంటి విషయా లపై పరిశోధన చేశాను. నిప్పులపై నడవడం, ట్యూబ్‌లైట్లు పగలగొట్టడం, హారతి మింగటం.... ఇవన్నీ చూసి నేను కూడా అలా చేయగలననే పట్టుదలతో నేర్చుకున్నారు. ఆ తర్వాత వాటిని ఆచరించి చూపి.. ప్రజలకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించడం ప్రారంభించాను.

ప్రజల అమాయకత్వమే వారికి...అవకాశం

సాధారణంగా మన ప్రజల్లో అనేక విషయాల్లో అర్థం లేని నమ్మకాలు ఉన్నాయి. చాలా విషయాల్లో అపోహలు, అనుమానాలు వారిని వెంటాడుతున్నాయి. దయ్యాలు, భూతాలు, చేతబడి, బాణమతి, కొన్నిచోట్లకు కొన్ని సమయాల్లో వెళ్లవద్దని... అమావాస్య రోజున నియమాలు పాటించాలని...ఇలా మన పెద్దలు చాలా చెబుతుంటారు. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే...గ్రామాల్లో ఇలాంటివి మరీ ఎక్కువ. ఈ మూఢనమ్మకాలను అవకాశంగా తీసుకుని.... మాయలు, మంత్రాలు చేస్తామంటూ కొంతమంది మోసగాళ్లు అమాయక ప్రజలను ఇప్పటికీ మోసం చేస్తూనే ఉన్నారు.

ముట్టకుండా అప్పడాన్ని కూడ విరవలేం...ఇక మంత్రాలేంటి?

మాయలు, మంత్రాలు చేసి అన్నిటినీ కోరినట్టుగా మార్చేసే అద్భుత శక్తి ఎవరి దగ్గర ఉండదు. ఉదాహరణకు మనం తినే పాపడాన్ని కూడా మనం స్వయంగా చేతితో ముట్టకుండా విరవటం సాధ్యంకాదు. అలాంటిది మంత్రాలు ఉన్నాయంటే ఎలా నమ్ముతారు? మరో ఉదాహరణ.. ఒక కవర్‌లో కరెన్సీ నోటు పెట్టి, ఆ కవర్‌లో ఎంత విలువైన కరెన్సీ నోటు ఉందో చెప్పమంటే...మంత్రాలు, మాయలు తెలుసనే వాళ్లెవరూ చెప్పలేరు. అలాంటిది వారు భవిష్యత్తులో అది జరుగుతుంది...ఇది జరుగుతుంది అని భయపెడితే ....ప్రజలు ఎలా నమ్ముతున్నారో అర్థం కావటం లేదు.

అవన్నీ సైన్స్ ట్రిక్స్ మాత్రమే...

బాణామతి, చేతబడి, మాయలు, మంత్రాలు...ఇవేమీ లేవు. ఇవన్నీ కేవలం చేతులను వేగంగా లాఘవంగా కదుపుతూ చేసే మోసాలు మాత్రమే. సైన్స్‌ని ఆధారంగా చేసుకునే... ట్రిక్స్‌ని ప్రయోగించి ప్రజలను మభ్యపెడుతున్నారు. దీంతో అమాయక ప్రజలు మోసగాళ్ల బారినపడి ఆర్థికంగా నష్టపోతున్నారు. మానసికంగా కుంగిపోతున్నారు. అనారోగ్యాల బారిన పడుతున్నారు.

సమస్యలు తెలుసుకుని మంత్రాల గాలం..

మోసగాళ్లు ముందుగా అమాయకులు ఎదుర్కొంటున్న అనేకరకాల సమస్యలను గుర్తిస్తారు. వ్యాపారంలో నష్టాలు రావడం, చదువులో వెనుకబడిపోవడం, అమ్మాయిలకు సరైన సమయంలో పెళ్లికాక పోవడం... లాంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి, ఆ అమాయకులను ఎమోషనల్ బ్లాక్ మెయిలింగ్ చేస్తారు. దీంతో మాయలు చేసే వారి మాటలను బాధితులు సులభంగా నమ్మేస్తున్నారు. ఇప్పటికీ మారుమూల ప్రాంతాలతో పాటు, హైదరాబాద్‌లోని పాతబస్తీలో ఇలాంటివి ఎక్కువగా జరుగుతున్నాయి.

మనసుని కలిచివేసిన సంఘటనలు...

నేను నల్గొండ జిల్లా ఎస్పీగా పనిచేసినప్పుడు.. నాంపల్లి మండలం మహ్మదాపూర్ అనే గ్రామంలో ఒక అమ్మాయిని మంత్రాల నెపంతో బట్టలు విప్పి కొట్టి మరీ... తగలబెట్టారు. ఆమె మంత్రగత్తె అనే అనుమా నంతో ఆ అమానుషానికి ఒడిగట్టారు. గ్రామంలో అనేకమందికి ఆరోగ్యం సరిగా ఉండటం లేదని, ఊరిలో చాలామంది చనిపోతున్నారని అందుకు ఆమే కారణమని ఆరోపించారు. అప్పుడు నేను, కలెక్టర్ ఘటనా స్థలానికి వెళ్లి, నిందితులందరిపై మర్డర్ కేసు పెట్టి అరెస్ట్ చేయడం జరిగింది. ఆ తర్వాత సాంఘీక సంక్షేమ శాఖతో కలిసి కళాజాతాలను తయారు చేసి, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాము. నేను కూడా ప్రాక్టికల్‌గా ట్రిక్స్‌లాంటివి చేసి చూపించి ....మంత్రాలు, మూఢనమ్మకాలు లేవనే అవగాహన కల్పించాను.

బాధ కలిగించిన మరొక విషయం ఏమిటంటే.. ఆదిలాబాద్ జిల్లాలో ఎస్పీగా పనిచేసినప్పుడు ఇచ్చోడాలో ఒక అమ్మాయికి ఆరోగ్యం బాగాలేకపోవటంతో ఆమె తండ్రి మంత్రాలు వేసే వ్యక్తి వద్దకు తీసుకువెళ్లాడు. ఆ వ్యక్తి ఆరోగ్యం బాగాలేని అమ్మాయిని తలకిందులుగా చేసి ఒక చెట్టుకు కట్టివేశాడు.. అలా మూడు రోజులు ఆమె అలానే చెట్టుకు వేలాడింది. చివరికి మూడో రోజు చనిపోయింది. అనంతరం సిగిరెట్ కాల్చి ఆ పొగను ఆమె ముక్కు దగ్గర పెట్టి ఆమె చనిపోయిందో లేదో తెలుసుకునే ప్రయత్నంచేసాడు. ఆ తర్వాత ఆ అమ్మాయి తండ్రి మమ్మల్ని ఆశ్రయించాడు...దాంతో జిల్లా వ్యాప్తంగా 40 మంది బురిడీ బాబాలను, మంత్రాలంటూ మభ్యపెట్టే వారిని అరెస్ట్ చేశాం.

అవన్నీ శుద్ధ అబద్ధాలు...


సైన్స్, టెక్నాలజీ ఇంతగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో కూడా.. ఇంకా మంత్రాలు, మాయలు ఉన్నాయని... ప్రజలు నమ్మడం బాధాకరం. అలాంటి వారికి నేనిచ్చే సలహా ఒక్కటే.. బంగారం రెట్టింపు అవుతుంది.. మూడు లక్షలు.. మూడు కోట్లు అవుతాయి...లాంటి మాటలన్నీ శుద్ధ అబద్ధాలు. వీటిని ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకూడదు. కేవలం మన అవసరాన్ని, అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకుని, వాళ్లు మోసం చేస్తారనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. ఈ తరహా మాయమాటలతో ఎవరైనా నమ్మించాలని చూస్తే... తక్షణమే పోలీసులను ఆశ్రయించాలని సూచిస్తున్నాం.

విద్యార్థుల్లో అవగాహన పెంచుతాం

మూఢనమ్మకాలపై స్కూలు పిల్లలకు, కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం చాలా ఉంది. ఇప్పటినుంచే ఇలాంటి కార్యక్రమాలు చేపడితే భవిష్యత్తు తరాల వారికి ఈ అనాగరిక చర్యల వలన ఇబ్బందులు ఉండవు. కళాజాతాలతోనూ, ప్రాక్టికల్‌గా చేసి చూపించి... అవగాహన కల్పిస్తే మరీ మంచిది. ముఖ్యంగా తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు మంత్రాలు, చేతబడులు లేవని చెప్పాలి. త్వరలోనే రాచకొండ కమిషనరేట్ పరిధిలోని స్కూళ్లు, కళాశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. ముఖ్యంగా చేతబడులు, మంత్రాలు, మాయలతో లేనిది ఉన్నట్లు చూపే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఊపేక్షించం. అలాంటివారిపై తక్షణమే మాకు సమాచారం అందిస్తే వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.









-నవీన్ దుమాల
కెఎన్ఎన్, హైదరాబాద్

గురు కాలమ్

ఆ విషాలను తొలగించుకుంటే నిత్య యవ్వనం!

* పెద్దపేగుని శుభ్రం చేసే ఆధునిక పరికరాలతో హాని
* యోగా, ప్రాచీన విజ్ఞానాల ఆచరణే ఆరోగ్యం

రామ రావణ సంగ్రామంలో మనం ఒక విషయాన్ని గమనించవచ్చు. రాముడు ఎన్ని బాణాలు వేసినా మరణించని రావణుడు...పొట్టలో నాభి వద్ద బాణం వేయగానే ప్రాణాలు వదులుతాడు. మనిషి శరీరంలో నాభి..శరీరంలోని శక్తికి కేంద్రమైన మణిపూరక చక్రంతో అనుసంధానమై ఉంటుంది. ఇది శరీరంలోని బలహీనతలను నియంత్రించగలుగుతుంది. అలాగే జీర్ణవ్యవస్థపై కూడా దీనికి నియంత్రణ ఉంటుంది.

మరణం అనేది మనిషి పెద్దపేగు నుండే మొదలవుతుందని ఆయుర్వేదం కూడా చెబుతుంది. ఆధునిక వైద్యశాస్త్రం సైతం దీనిని అంగీకరిస్తుంది. మనం దీర్ఘకాలం ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా మన పెద్దపేగుని ఆరోగ్యంగా ఉంచుకోవాలి. ఈ విషయం అర్థమైన నేపథ్యంలో... ఇప్పుడు మార్కెట్లో ఇందుకు ఉపకరించే అనేక రకాల వైద్యపరికరాలు అందుబాటులోకి వచ్చేశాయి. వీటిలో ఒకటి హైడ్రోకొలోన్ థెరపీ. ఇందులో కొన్ని పరికరాలను వినియోగించి..పేగుల్లోకి ఉప్పునీటిని పంపుతారు. దాంతో ఈ వ్యవస్థలో ఉన్న విషాలు, వ్యర్థాలు బయటకు వచ్చేస్తాయి. అయితే ఇందులో ఉపయోగించిన పరికరాల వలన ఈ ప్రక్రియలో కొన్ని రకాల సైడ్ ఎఫెక్ట్ లు రావచ్చు. డీ హైడ్రేషన్, ఎలక్ట్రోలైట్ల (విద్యుత్ వాహక లవణాలు) అసమతౌల్యం, పొట్టలో అసౌకర్యం, నొప్పులు, ఇనఫెక్షన్లు లాంటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం



ఉంది. అందుకే అమెరికా డ్రగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ సంస్థ...వీటిని తరచుగా వాడవద్దని సూచిస్తోంది. పెద్దపేగుని శుభ్రం చేయటంకోసం ఉపయోగించే ఈ ఆధునిక వైద్య ప్రక్రియ వలన అనారోగ్యాల బారిన పడినవారిని చాలామంది చూశాను. ఆధునిక యోగ గురువులు రూపొందించిన కొన్ని రకాల యోగా విధానాలు... మోకాళ్లు వెన్ను సమస్యలను ఎలాగైతే తెస్తున్నాయో ఈ సమస్యలూ అలాగే వస్తున్నాయి. ఆధునిక పరికరాలతో చేసే కొలోన్ థెరపీలో ఇన్‌ఫెక్షన్లు, అలర్జీలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. యోగాకి, ప్రాచీన విజ్ఞానానికి ఇవి విరుద్ధం. ఇవి ప్రకృతి కే విరుద్ధమైన పద్ధతులు.

ఒక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మన వేదాల్లోనే ఉప్పునీటితో మన శరీర లోపలి భాగాలను శుభ్రం చేసే ప్రక్రియ తాలూకూ వివరణ ఉంది. 'సనాతన్ క్రియ ఏజ్‌లెస్ డైమన్షన్' అనే పుస్తకంలో అలాంటి యోగ విధానాలు. ఆయుర్వేద పద్ధతులను గురించి వివరంగా ఇవ్వటం జరిగింది. ఈ పద్ధతుల ద్వారా పేగులనే కాదు...మొత్తం జీర్ణవ్య వస్థనే శుభ్రపరచుకోవచ్చు. వీటిని క్రమం తప్పకుండా ఆచరించడంతో జీర్ణవ్యవస్థకి బలం చేకూరటంతో పాటు..శరీరంలో శక్తి స్థిరంగా ఉండి మనుషులు ఆరోగ్యంగా యవ్వనంగా తేజోవంతంగా ఉంటారు.




యోగి అశ్వినీ



మంచి జీర్ణక్రియ కోసం...

మన జీర్ణవ్యవస్థ బాగుండాలంటే ఆహారంలో ప్రోబయోటిక్స్ (మంచి బ్యాక్టీరియా వంటివి) ఉండేలా చూసు కోవాలి. సాధారణంగా మంచి బ్యాక్టీరియా మన జీర్ణవ్యవస్థలో ఉండి మనకు మేలు చేస్తుంది. వీటితో పాటు ప్రోబయోటిక్స్ ఉన్న ఆహారం కూడా తీసుకున్నపుడు శరీరం మరింత ఆరోగ్యంగా ఉంటుంది. ఈ ఆహారం... పోషకాహార లేమి వలన కలిగే సమస్యలను తగ్గిస్తుంది. అలాగే యాంటీ బయోటిక్స్ వాడకంతోనూ, ఒత్తిడి కారణంగానూ కలిగే నష్టాలను నివారిస్తుంది. ఇదే కాకుండా శరీరం పోషకాలను ఎక్కువగా పీల్చుకునేలా చేస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. పెరుగు, పులుసులు, కొన్నిరకాల పచ్చళ్లు, డార్క్ చాక్‌లెట్ ...ఇవన్నీ ప్రోబయోటిక్స్ ని శరీరానికి అందిస్తాయి.

చాణక్య వ్యావహారికం



చాణక్యుడు తన అర్థశాస్త్రంలో రాజు వ్యవహరించాల్సిన తీరు వంటి వాటితో బాటు ఎటువంటి వారితో ఎలా మాట్లాడాలో వ్యవహరించాలో తెలిపారు. వ్యవహార శైలితో, మాటలతో అసాధ్యమైన కార్యాలను సాధించవచ్చు. అలా సరిగా వ్యవహరించకపోతే, మాట్లాడకపోతే సానుకూలమయ్యే పనులూ జరగవు. అయితే అందరితో ఒకేలా మాట్లాడరాదు. అవతలివారి వ్యక్తిత్వాలను బట్టి కూడా మాటతీరు ఉండాలి. లేనిపక్షంలో ఎంత మంచిగా మాట్లాడినా దానిలో ఏదో కుట్ర ఉందని భావించేవారూ, బలహీనతగా తలచేవారూ ఉన్నారు.

చాణక్యుని గురించి తెలియని వారుండరు. తనను అవమానించిన నందవంశ నిర్మూలన కావించేదాకా ఊరుకోలేదు. ఆయన రాజనీతిలో ఆరితేరినవాడు. అర్థశాస్త్రం పేరుతో రాజకీయ ఆర్థికశాస్త్ర రచన చేశాడు. దారిలో రాజ ధర్మాలు, ధర్మ శాస్త్ర సమ్మత రాజనీతి, మరెన్నో విషయాలు పొందుపరిచారు. ఆ నాడు ఆయన రాసిన అర్థ శాస్త్ర అంశాలు ఈనాటికీ ఆచరణ యోగ్యం, అనుసరణ యోగ్యం. ఈ విషయాన్ని ఆధునికులూ అంగీకరిస్తున్నారు. రాజు వ్యవహరించాల్సిన తీరు వంటి వాటితో ఒక భాగంలో ఎటువంటి వారితో ఎలా మాట్లాడాలో వ్యవహరించాలో తెలి పారు. వ్యవహార శైలితో, మాటలతో అసాధ్యమైన కార్యాలను సాధించవచ్చు. అలా సరిగా వ్యవహరించకపోతే, మాట్లాడక పోతే సానుకూలం కావాల్సిన పనులూ జరగవు. అయితే అంద రితో ఒకేలా మాట్లాడరాదు. అవతలివారి వ్యక్తిత్వాలను బట్టి కూడా మాట తీరు ఉండాలి. లేని పక్షంలో మీరు ఎంత మంచి గా మాట్లాడినా దానిలో ఏదో కుట్ర ఉందని భావించేవారూ, బలహీనతగా తలచేవారూ ఉన్నారు. చాణక్యుడు ఏమి చెప్పాడో చూద్దాం.

ఇతరులను మనదారిలోకి తెచ్చుకోవాలంటే

ప్రపంచంలో ఏ ఇద్దరి మనుషుల మనస్తత్వాలు ఒకే రకంగా ఉండవు. ఒక్కొక్కరు ఒక్కో విధమైన లక్షణాలను, వ్యక్తిత్వాలను కలిగి ఉంటారు. ఈ క్రమంలో ఏ వ్యక్తినైనా మన దారిలోకి తెచ్చుకోవాలంటే అది చాలా కష్టంతో కూడుకున్న పనే. ఎందుకంటే వారి గురించి పూర్తిగా తెలుసుకున్నా మన దారిలోకి తేవాలంటే అందుకు చాలా శ్రమించాల్సి ఉంటుంది. అయితే ఒక నిర్దిష్టమైన వ్యక్తిత్వం ఉన్నవారిని మాత్రం ఇట్టే మనదారికి తెచ్చుకోవచ్చని ఆచార్య చాణుక్యుడు పలు విషయాలను తెలియజేశారు. అవేమిటంటే..

కోపంగా ఉన్నవారైతే

ఇలాంటి మనస్తత్వం ఉన్నవారి ఎదుట చాలా మర్యాదగా, ప్రశాంతంగా ప్రవర్తించాలి. ఎప్పుడూ కోపంగా మాట్లాడకూడదు. దీంతో వారు కొంత కూల్ అయి శాంతిస్తారు. ఆ క్రమంలో మన దారికి వస్తారు.

మూర్ఖులైతే

మూర్ఖపు స్వభావం ఉన్న వారితో ఎప్పుడూ నిజాలే మాట్లాడాలి. దీంతో వారికి మనపట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆ సమయంలో వారు ఆటోమేటిక్‌గా మన కంట్రోల్‌లోకి వస్తారు.

ప్రతిభావంతులైతే

ఇటువంటివారితోనూ ఎప్పుడూ నిజాలే మాట్లాడాలి. అందువల్ల వారికి మన పట్ల ఆసక్తి పెరుగుతుంది. నిజాలే ఎందుకు మాట్లాడాలంటే వారికి నిజమేదో తెలుసుకునే నేర్పు ఉంటుంది. కొండొకచో మనం చెప్పే విషయం గురించి వారికి స్పష్టమైన అవగాహన ఉండి ఉండవచ్చు. అలాంటప్పుడు వారు అవాస్తవాలను పసిగట్టవచ్చు. అందువల్ల వారికి మన మీద నమ్మకం ఉండక పోవచ్చు. అందువల్ల వారితో నిజాలు మాట్లాడాలి. దానితో వారు మన దారిలోకి వస్తారు.

అహం ఉన్నవారు

అహంకార మనస్తత్వం ఉన్నవారిని మన దారికి తెచ్చుకోవాలంటే వారితో ఉన్నట్లుగా ఉంటూ మర్యాద ప్రదర్శించాలి. కొంత కాలానికి వారు మన మాట వింటారు.

స్వార్థం ఉన్నవారు, అత్యాశపరులు

వీరిని సులభంగా బుట్టలో పడేయచ్చు. వీరికి కొంత ధనం ఆశచూపితే చాలు మన మాట వింటారు.

పిల్లలు

చిన్న పిల్లలను తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయతలతో లొంగదీసుకోవచ్చు. 5 సంవత్సరాల వయస్సు వరకు వారిని అమితమైన గారాబంగా, ప్రేమతో పెంచాలి. 10 ఏళ్ల లోపు వారైతే వారితో దురుసుగా ఉండకూడదు. 16 ఏళ్లలోపు వారు, ఆపై వయస్సు వారైతే తల్లిదండ్రులు స్నేహితుల్లా మెలగాలి. క్లిష్టతరమైన పరిస్థితులు వస్తే పైన చెప్పిన మనస్తత్వాలు ఉన్న వ్యక్తులతోనే కాదు, ఆయా సందర్భాల్లో ఎలా ప్రవర్తించాలో కూడా చాణక్యుడు చెప్పాడు.

ప్రధానంగా చాలా క్లిష్టతరమైన పరిస్థితులు ఉన్నప్పుడు వీలైనంత ఓర్పుతో ఉండాలి. అలవిగాని చోట అధికుల మనరాదన్న సామెత తెలిసిందే. కొన్ని చోట్ల ఓర్పు మంచి ఫలితాలు ఇస్తుంది. ఒక వ్యక్తి సహజమైన స్వభావాన్ని తెలుసుకోవాలంటే అతని మాటలు, ప్రవర్తన ఆధారంగా దాన్ని నిర్ణయించవచ్చు.


- ఆయత్తు రాజేశ్వరి

చింతన

నుదుట తిలకం ఎందుకు ధరించాలి?




పరమాత్మ మన శరీరంలో ఆరు చక్రాలు ఏర్పరచారు అవి మూలాధారం, మణిపూరం, స్వాధిష్ఠానం, అనాహతం, ఆజ్ఞాచక్రం, సహస్రారం. కనుబొమ్మల మధ్య ఉన్న ఆజ్ఞాచక్రమును కప్పుటకే తిలకధారణ. ఈ చక్రం గుండ్రంగా, నిలువుగా, అడ్డంగా మూడు రూపాలలో సంచరించును. అందుకే తిలకాన్ని నిలువు మూడు రేఖలు లేదా అడ్డంగా మూడు రేఖలు లేదా గుండ్రంగా పెద్ద బిందువుగా ధరించవలెను. ఆజ్ఞ అంటే లక్ష్మీదేవి. కనుబొమ్మల మధ్య నివసించే లక్ష్మీదేవిని కుంకుమతో పూజించాలి కావున కుంకుమ బొట్టు ధరించాలి. బొట్టు సమీపాన గంధం నారాయణుడి సూచిక. "**ఊర్ధ్వ పుండ్ర విహీనస్య స్మశాన సదృశం ముఖం**" అని శాస్త్రం. అనగా బొట్టులేని ముఖం స్మశానం వంటిది అలాగే "**పుండ్రహీన ముఖం దృష్ట్వా సచేలం స్నానమాచరేత్**" అనగా బొట్టులేని ముఖాన్ని చూస్తే అదే బట్టలతో స్నానం చేయాలి. బొట్టులేని ముఖం స్థిరత్వం లేని మనస్సుకు సూచిక కావున స్త్రీ పురుషులకి తిలకధారణ తప్పనిసరి.



- డా॥ కందాడై రామానుజాచార్య

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

మాధవుని మరణం



శ్రీ రమణాశ్రమం
12-7-46

నాలుగురోజుల క్రితం అంటే 8 లేక 9వ తేదీన ఉదయం ఏడున్నరకు భగవత్సన్నిధికి వెళ్లాను నమస్కరించి లేచేసరికే "మాధవుడు పోయినాడ"న్నారు భగవాన్. వారప్పుడప్పుడు ఆశ్రమం విడిచి ఇతర క్షేత్రాలకు పోవటం మామూలు గనుక "ఎక్కడికీ?" అన్నాను నేను. చిరునవ్వుతో "ఎక్కడకా? అక్కడికే, శరీరం విడిచి" అన్నారు భగవాన్. ఉలికిపడి. "ఎప్పుడూ?" అన్నాను. "మొన్న సాయంత్రం ఆరుగంటల కట" అని చెప్పి, కృష్ణస్వామిని చూచి ఇట్లా అన్నారు భగవాన్. "అక్కడున్న ఆచార్లస్వామి ఇక్కడకు వచ్చి సమాధి అయినారు. ఇక్కడున్న వీరికి అక్కడ సమాధి. వారి వారి ప్రాప్తానుసారం నడుస్తుంది. చాలాకాలం నుంచీ మాధువనకొక కోరిక వున్నది. పై అధికారి లేకుండా తాను స్వతంత్రంగా వుండాలని. ఆ కోర్కె తీరింది. పోనీ, మంచివాడు, నేనేదో తమాషాగా అన్నాను. కుంభకోణం మఠంలో వుండే ఆచార్లస్వామి ఇక్కడ సమాధి అయినారు. ఆ మఠంలో ఎవరూ లేరోయి పోతావా? అని. అదే పట్టుకొని వెళ్లి ఆశ తీర్చుకున్నాడు. చూడండీ చిత్రం. తెలుగు ద్విపద మొదలైనవి నేను మళయాళపు అక్షరాలలో నోటు బుక్కులో వ్రాస్తే తెలుగు వాళ్ల వలెనే చక్కగా చదివేవాడు. వాడికేదో తెలుగు సంస్కారం వున్నది. ఆ నోటుబుక్కు చూచుకుంటూ వుంటానని తీసుకు పోయాడు. ఉంటే తెమ్మని చెప్పండి. అయ్యా స్వామీ అంతే. చూచి తెస్తానని పట్టుకువెళ్లాడు నోటుబుక్కు. మనిషే తిరిగి రాలేదు. వీడిదీ అట్లాగే అయింది" అంటూ ప్రసంగం మార్చారు. పన్నెండేళ్లు భగవానులకు నీడగా వర్తించి సేవజేసిన పరమ సాధువు హఠాత్తుగా ఎక్కడో కుంభకోణంలో మరణించాడంటే కంట తడిపెట్టని ఆశ్రమవాసులు లేరు.

సమాధి చేసే నిమిత్తం ఇక్కడి నుండి వెళ్లిన కుంజుస్వామి ఈ ఉదయం ఎనిమిదింటికి వచ్చి నమస్కరించి, "మాధవుడు మనశ్చాంచల్యం వల్ల ఎక్కడెక్కడో తిరిగి, స్థిమిత పడక నేనింక జీవించనని ఎందరితోనో చెప్పి, కుంభకోణం మఠానికి వచ్చి అకస్మాత్తుగా అతిసారపు వ్యాధితో ఒకరోజే రవంత శ్రమపడి సోడా తాగుతూ ప్రాణం విడిచారనీ, ఆ వెనుకనే పడుకోపెట్టామనీ, సమాధిలో వుండే పోయారనీ, మఠంలో వున్నవారు చెప్పారు. నేను వెళ్లేవరకు శవం ఉంచారు. మూడోరోజుకైనా ఏమీ చెడలేదు. సమాధి చేసి వచ్చాను. నోటుబుక్కు దొరకలేదు" అని చెప్పి వెళ్లిపోయాడు.

వారటుపోగానే కృష్ణస్వామిని చూచి "ఏదో మంచివాడు, అయ్యో పోయాడని విచారిస్తాం. పోయాడని విచారించటం కంటె మనమెప్పుడు పోతామా అని విచారించవలసి వున్నది. జ్ఞాని యెప్పుడూ ఈ ప్రారబ్ధ క్షయం ఎట్లా అవుతుందా, ఎప్పుడీ శరీరం త్రోసిపోదామా అని చూస్తాడు. కూలికి బరువు మోసేవాడు ఎప్పుడు గమ్యస్థానం వస్తుందా అని చూస్తూ ఉంటాడు. యజమాని ఇంటి ముందర మూట దింపరా అనగానే అమ్మయ్య అని క్రింద పెడతాడు. అట్లాగే వివేకికిన్నీ ఈ శరీరం బరువుగా ఉంటుంది. వారు పోయినారు. మనమెప్పుడు పోతామా అని నేనెదురు చూస్తాను. ఏమిటో, ఆ కాస్తాపోతే, నలుగురు మోయాలి ఈ దేహాన్ని. ఆ చైతన్యం వుంటే, బరువే లేదు. అది పోతే దీనంత భారం ఏదీ లేదు. ఇలాంటి దేహం కొఱకు కాయకల్ప వ్రతాలు చేస్తారు. ఈ దేహం తోటే మోక్షం పొందాలని. ఇంతా చేసి వారూ ఎప్పుడో పోతారు. ఈదేహంతో స్థిరంగా వుండే వారొకరూ లేరు. తత్త్వం తెలిసిన పిమ్మట అస్థిరమైన దేహం ఎవరికి కావాలి? ఈ భారం త్రోసివేసి ఎప్పుడు పోదామా అని విచారించాలి" అన్నారు భగవాన్.

ఈ మాధవస్వామి మళయాళి, జన్మభూమి పాలఘాటు సమీపంలో ఒక గ్రామం. ఇరువదేండ్ల వయస్సునందే ఇక్కడకు వచ్చి దాదాపు పదిహేనేండ్లు భగవానుని పాదసేవ చేసిన బ్రహ్మచారి, దైవాద్వా క్షేత్రాటనాసక్తుడై కొన్నాళ్లుగ పోతూ వస్తూ వున్నాడు. కుంభకోణంలో ఒక మఠం కట్టించుకొని వున్న రమణ భక్తుడగు ఆచార్యస్వామి ఈ మధ్య ఇక్కడకు వచ్చి గతించుట వల్ల తానక్కడ మఠాధిపతిగ నిలిచి అచిరకాలమందే గతించిన శాంత భక్తుడు.


- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

భగవద్గీత

భగవత్సేవా తత్పరుడు కర్మఫలాతీతుడు



అధ్యాయం 4

శ్లోకం 23:

గతసంగస్య ముక్తస్య
జ్ఞానావస్థితచేతసః।
యజ్ఞాయాచరతః కర్మ
సమగ్రం ప్రవిలీయతే॥

తాత్పర్యం

ప్రకృతి త్రిగుణముల పట్ల అసంగుడై దివ్య జ్ఞానమునందు సంపూర్ణంగా స్థితుడైన మనుషుని సర్వకర్మలు దివ్యత్వమునందే పూర్తిగా లీనమవుతాయి

భాష్యం

భగవత్సేవా తత్పరుడు ద్వంద్వములకు అతీతుడగుటచేత క్రమంగా త్రిగుణాల సంపర్కం నుండి విడివడతాడు కృష్ణుని సేవే తన జీవిత శాశ్వత లక్ష్యమని ఎరుగుటచే మనస్సు స్థిరపడి ముక్తికి అర్హుడగును. అతడు ఏది చేసినా కృష్ణుని కోసమే చేస్తాడు. విష్ణువు ప్రీత్యర్థమే యజ్ఞములన్నీ ఉద్దేశించబడినా అతని కర్మలన్నీ యజ్ఞాలే అవుతున్నాయి . అట్టి యజ్ఞ రూప కర్మల ఫలములన్ని తప్పక దివ్యము నందు లీనమగుటచే వానిని చేసే వారెవరునూ కర్మ ఫలితములచే ప్రభావితులు కారు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

ఉత్తమలోక ప్రాప్తినిచ్చే పారాయణ



**గీతానాం పంచమాధ్యాయమావర్తయతి సర్వదా
తేన పుణ్యేన పూతాత్మా యయౌ బ్రహ్మ సనాతనం**

భగవద్గీతలోని ఐదవ అధ్యాయం చదివినా, విన్నా దానిని నిత్యం పారాయణ చేసే పుణ్యమూర్తులను సమీపించినా పశుపక్ష్యాదులకు గాని, మానవులకు గాని ఎంతటి పాపమైనా ప్రక్షాళనమై పవిత్రులవుతారని పద్మ పురాణాంతర్గతమైన ఈ కథ పేర్కొంటోంది.

పూర్వం మంద్ర దేశంలో పురుకుత్సం అనే పట్టణం ఉండేది. ఆ పట్టణంలో పింగళుడు అనే బ్రాహ్మణుడుండేవాడు. అతడు తనకు విహితమైన వేదాధ్యయనం, జపతపాదులు, సంధ్యావందనం, అగ్నికార్యం వంటి వాటిని వదిలేసి సంగీతాన్ని, నాట్యాన్ని బాగా నేర్చుకుని ఒక మహారాజు ఆస్థానంలో కొలువులో చేరాడు. అతడికి అరుణ అనే ఒక స్త్రీ పట్ల అనురాగం కలిగి ఆమె వేరే కులంలో జన్మించినదని తెలిసినా వివాహం చేసుకున్నాడు. అయితే ఆమెకు అంతకు ముందే మరొక వ్యక్తి పై మమకారం ఉండటం వల్ల పింగళుడంటే ఇష్టం లేక ఒక రాత్రి సమయంలో పెద్దరాతితో పింగళుడి తల పగులగొట్టి అతని మృత దేహాన్ని ఒక చోట పాతి పెట్టింది. ఆ తరువాత కొంత కాలానికి ఆమె భయంకరమైన జబ్బుతో మరణించింది. భార్య చేతిలో హతుడైన పింగళుడు ఆ తర్వాత జన్మలో గ్రద్దగా పుట్టి ఒక మహారణ్యంలో నివసించసాగాడు. అరుణ కూడా అక్కడే ఒక చిలుకగా పుట్టింది. అయితే ఆ రెండూ పూర్వ జన్మ వైరంతో నిత్యం కలహించుకుంటూ, హింసించుకుంటూ ఉండేవి. ఒక రోజు గ్రద్ద చిలుకను చంపేందుకు తరుముతుండగా అది పారిపోతూ అలసటతో నదిలో పడిపోయింది. దాని వెంటనే వెళ్లిన గ్రద్ద కూడా నీటి దగ్గరగా వెళ్లి ఆ ప్రవాహ ఉద్ధృతికి కొట్టుకుపోయింది. ఆ విధంగా ఈ రెండూ నీటి ప్రవాహంలో పడిపోయి మరణించాయి. ఆ ప్రవాహం ఎగువన ఒక మహానుభావుని పుర్రె ఉంది. ఆ పుర్రెలోని రంధ్రాల ద్వారా వచ్చిన ప్రవాహ ధారల్లోనే ఈ రెండు పక్షులూ మరణించాయి. యమదూతలు వచ్చి వాటి ఆత్మలను యమలోకానికి తీసుకువెళ్ళారు. యముడు వాటిని చూసి ఉత్తమ లోకాలకు తీసుకువెళ్ళమని అజ్ఞాపించాడు. ఆ రెండు ఆత్మలకు పూర్వ జన్మ జ్ఞానం ఉన్నందున అనేక పుణ్యకార్యాలు చేసిన తమకు పుణ్యలోక ప్రాప్తి ఎలా కలుగుతుందని ప్రశ్నించాయి. దానికి యముడు ఓయీ పుణ్యాత్ములారా! గంగా తీరంలో వటువనే ఒక గొప్ప బ్రహ్మవేత్త ఉండేవాడు. అతడు ప్రతినిత్యం భగవద్గీత ఐదవ అధ్యాయం పారాయణ చేస్తూ ఉండేవాడు. మరణానంతరం ఆ పుణ్య ఫలం వల్ల బ్రహ్మలోకం చేరాడు. అతని పుర్రెలో నుంచి ప్రవహించిన నీటిలో పడి మరణించినందున మీ పాపాలన్నీ ప్రక్షాళనమై మీరు పవిత్రులయ్యారు. కనుక మీరు మీకు ఇష్టమైన పుణ్యలోకానికి స్వేచ్ఛగా వెళ్ళవచ్చును అని చెప్పాడు. వారిద్దరూ తమ అనుమాన నివృత్తి చేసిన యమునికి నమస్కరించి దైవ విమానంలో ఎక్కి వైకుంఠం చేరారు. గీతలోని ఒక అధ్యాయం నిత్య పారాయణకే అంత శక్తి ఉంది.

- ఆదూరి హైమావతి



Sri
Amma Bhagavan

కల్కి పలుకు

మనస్సు చొరబడు విశ్వం అంటూ ఏదీ ఉండదు. మన ఆలోచనలు వెంటనే వాస్తవిక రూపం దాల్చక పోయినా ఫరవాలేదు. (ఏనుగు బొమ్మ చూడగానే అది ప్రత్యక్షమయితే అది మరీ త్వరగా వాస్తవరూపం దాల్చడం అవుతుంది)

వివరణ : కూనపురెడ్డి అరుణ్ కుమార్

సుభాషితం

ఈ సృష్టిలో అన్నిటి నుంచి ఏదో ఒకటి నేర్చుకోవాలని చెప్పే సుభాషితం ఇది

అవిశ్రామం భవేద్భారం శీతోష్ణంచ నవిందతి
ససంతోషస్తథానిత్యం త్రీని శిక్షేతి గార్ధభాత్

విశ్రాంతి లేకుండా బరువులు మోస్తూంటుంది. చలి వేడి వంటి వాటిని లెక్కచేయదు. ఎప్పుడూ ఉన్న దానితో సంతృప్తిగానే ఉంటుంది. ఈ మూడు లక్షణాలనూ గాడిద నుంచి నేర్చుకోవాలి.

ఆంధ్రప్రభ నాయిక

డేరింగ్ లేడీ



అగ్నిశిఖ హర్షిణి

నేడు మహిళలు అన్నిరంగాల్లో పురుషులకంటే ముందంజలో ఉంటున్నారు. అకుంఠితదీక్షతో, మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతూ విజయాలను అందుకుని అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆ కోవకి చెందిన వారే హర్షిణి కన్హేకర్. అప్పటివరకు పురుషులు మాత్రమే ఉన్న రంగంలో తనకంటూ ఒక స్థానం సంపాదించుకోవాలని పట్టుదలతో, నిర్భీతితో ముందడుగు వేసి విజయం సాధించిందామె. ఆమె వివరాలు మీకోసం...

- ✶ అగ్నిమాపక దళంలో చేరిన తొలి మహిళ
- ✶ ఆత్మవిశ్వాసంతో దూసుకెళ్తున్న ధీరవనిత

హర్షిణి ఈ రంగంలోకి 26సంవత్సరాల వయసులోనే వచ్చారు. అప్పటివరకు ఈ రంగంలో కేవలం పురుషులు మాత్రమే పనిచేయగలరనే అభిప్రాయాలతో కోట కట్టుకుని కూర్చున్నవారి ఆలోచనలను పటాపంచలు చేశారామె. ఆమె ఫైర్ ఫైటర్‌గా ఉద్యోగ విధి నిర్వహణలో స్థానం సంపాదించిన మొదటి మహిళ. నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్, నాగపూర్ 46సంవత్సరాల చరిత్రలో ఒక మహిళ చేరడం ఇదే ప్రథమం. నేను ఆ కాలేజీలో ప్రవేశానికి దరఖాస్తు పత్రం నింపుతున్నప్పుడు ఆ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకునే అమ్మాయిని నేనొక్కదాన్నే అని ఊహించలేదు. నేను కూడా చరిత్ర సృష్టించగలనని అనుకోలేదని హర్షిణి తెలియజేశారు. ఆమె మొదటిసారి కాలేజీలోకి అడుగుపెట్టినప్పుడు ఎక్కడ చూసినా సముద్రంలా పురుషులే కనబడ్డారు. కంటికొసకు ఒక్క మహిళైనా కనబడలేదు. ఆ పరిస్థితులను చూసి ఆమె భయపడలేదు. ధైర్యంగా నిలబడింది. అలాగే ఆమె అక్కడ ఏ అణచివేతకు గురికాలేదు. ఎందుకంటే ఆమె లక్ష్యం దృఢమైనది కాబట్టి. నేను చిన్నప్పటి నుంచి ఈ రెడ్ బిల్డింగ్‌ని చూడగలనా అని కలలుగనేదాన్ని. ఆ కల ఈవిధంగా తీరిందని ఎంతో సంతోషంగా చెపుతున్నారామె.

కాలేజీలో ప్రవేశానికి ఆమె దరఖాస్తు నింపి ఇస్తున్నప్పుడు అక్కడి ఉద్యోగి ఆమెను నిరుత్సాహపరిచాడు. మీరు ఎయిర్‌ఫోర్స్ లేదా ఆర్మీ కాలేజీలో దరఖాస్తు చేస్తే మంచిది. మీకు అక్కడ తగిన సౌకర్యాలు ఉన్నాయి. ఇక్కడ కేవలం పురుషులకు మాత్రమే సదుపాయాలు ఉన్నవని ఓ ఉచిత సలహా ఇచ్చాడు. 2002 సంవత్సరం నుంచి అక్కడికి ఫీల్డ్ మహిళగా పనిచేయడానికి ఒక్క మహిళ కూడా దరఖాస్తు చేయలేదని తెలిసి ఆమె ఆశ్చర్యపోయింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎంట్రన్స్ పరీక్షలో ఆమె పాసయ్యింది. కేవలం 30 సీట్లు మాత్రమే ఉన్నవి. మెడికల్ పరీక్షలో కూడా పాల్గొంది. అక్కడ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు ఆమెతో బేటా, ఇది కఠినమైన కోర్సు. చాలా కష్టంగా ఉంటుంది. నువ్వు ఎదుర్కొని నిలబడగలవా? అని ప్రశ్నించారు. ఆమె చివరి ఇంటర్వ్యూ కూడా భయపెట్టే పానెల్‌తో జరిగింది. అయినప్పటికీ ఇంటర్వ్యూ మొదలుపెట్టినప్పుడు అందులో ఒక వ్యక్తి మాత్రం ఆమె ఈరంగంలో కిరణ్‌బేడి అంత ధైర్యంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకుంటుందని కితాబు ఇచ్చారు. అన్నారు. ఆ మాటలు ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. ఈరంగంలో పనిచేయడానికి కొంతమంది ముందుకు తీసుకువెళ్తుంటే మరికొంత మంది వెనక్కి లాగేస్తున్నారు. ఆ ఇంటర్వ్యూ ముగించాక వేసుకున్న యూనిఫామ్ ఇప్పటికి ఆమె కళ్లముందే ఉంటుందట.

ధైర్యంగా విధి నిర్వహణ

నేనెప్పుడూ అక్కడ లేటుగా లేచేదాన్ని కాదు. నేను బలహీనురాలిని కాదు. అందుకనే ప్రతి డ్రిల్స్‌కి, పరేడ్స్‌కి వెళ్లేదాన్ని. ఒకవేళ నేను లేటుగా లేస్తే ప్రజలందరూ మహిళలు ఇలాంటివారే అని గేలి చేస్తూ మాట్లాడతారేమోనని భయంతో తప్పనిసరిగా ముందుగానే లేచి పరేడ్స్‌కి వెళ్లేదాన్ని. ధైర్యంగా ముందుకు వస్తే ఏ పనినైనా చేయగలమని మహిళలు నమ్మి ఇటువంటి రంగాల్లోకి రావడానికి ఆసక్తి చూపాలనేదే నా కోరికని ఆమె చెప్పారు.

కాంపస్‌కి ఒకే మహిళ

శిక్షణా సమయంలో భారీ వాటర్ పైపులనుండి మాక్ డ్రిల్స్ డమ్మీలతో చేయడం చాలా ఆసక్తికరంగా ఉండేది. ఇటువంటి శిక్షణ ఎవరికైనా కష్టతరమే. దీనిలో లింగ వివక్ష పనికిరాదు. నేను ఈ శిక్షణలో తక్కువ కాకూడదనుకున్నాను. అందుకని ఖాళీసమయంలో నా అంతట నేను స్టోర్‌రూమ్‌లోకి వెళ్లి ప్రాక్టీసు చేసేదాన్ని. తనను ఎవరూ డిస్టర్బ్ చేసేవారు కాదని ఆమె చెప్పారు.



ఎటుచూసినా పురుషులే!

ఐదు సంవత్సరాలు మహిళా కాలేజీలో చదివిన నాకు ఇక్కడ ఎటుచూసిన మగవాళ్లే కనబడేవారు. వాళ్ల మధ్యలో కూర్చుని చదవాల్సి వచ్చింది. ఫైర్ ఇంజనీరింగ్‌లో సెవెన్ సెమిస్టర్స్ కోర్సులు ఉంటాయి. ఆమెకోసం ప్రత్యేకంగా ప్రొవిజన్స్ తయారు చేసారు. ఆ కాలేజీలో క్లాసెస్ అయిపోయాక ఇంటికి వెళ్లిపోవడానికి తనకు ఒక్కదానికే పర్మిషన్ ఉండేదని, హోం మినిస్టర్ దగ్గర నుంచి ఆ పర్మిషన్ వచ్చిందని ఆమె చెప్పారు. నేను ఎన్‌సిసిలో ఉన్నప్పుడు మొట్టమొదటి మహిళా పైలట్ శివాని కులకర్ణి (విదర్భ ఇండియన్ ఎయిర్ ఫోర్స్) గురించి పేపర్‌లో వచ్చిన వ్యాసం నేను చదివాను. ఆ వ్యాసం నాలో ఎంతో స్ఫూర్తిని కలిగించింది. ఎన్‌సిసిలో మేమందరం ఒకే రకం యూనిఫామ్ వేసుకుని పరేడ్ చేస్తుంటే ప్రజలు ఎంతో ఆసక్తికరంగా చూసేవారు. అలా చూడటం మాకు ఎంతో హుందాగా, గర్వంగా ఉండేదని ఆమె చెప్పారు.



ఫైర్ ఫైటర్‌గా జీవితం కొనసాగించాలంటే చాలా సమస్యలను దుర్కోవాల్సిందే. కాని ఆమె ఆ సమస్యలకు అడ్డుగా నిలిచింది. 2005లో దీపావళి సెలబ్రేషన్స్‌లో ఆమె ఆరు అగ్ని ప్రమాదాల సంఘటనల్లో పాల్గొని వారిని రక్షించింది. అందులో ఒకటి ఆమెకు చాలా కష్టాన్ని కలిగించింది. అదేమిటంటే ఢిల్లీలోని శాస్త్రినగర్‌లో షూ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక రాకెట్ భవనంలోని పై అంతస్తులోకి దూసుకు వచ్చింది. ఆ రాకెట్‌లోంచి వచ్చిన నిప్పురవ్వలు అక్కడి ఉన్న మెటీరియల్‌ను, షూబాక్సులను మొత్తాన్ని నాశనం చేసింది. అగ్నిప్రమాదం చాలా భారీగా జరిగింది. నిప్పురవ్వలు ఆకాశాన్ని అంటుకుంటున్నాయి. ఆ భవనం పూర్తిగా కాలిపోతున్నది. మేము దాని ఎదురుగా ఉన్న బిల్డింగ్‌లోకి వెళ్లాము. అక్కడి నుంచి నీటిని ఆ భవనం మీదకి వదలి మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించాం. కాని అది ఫలించలేదు. అప్పుడు మేము దానికి ఆనుకుని ఉన్న గోడను పగలగొట్టేసాం. అయినా పొగ అంతా అక్కడే ఉండిపోయింది. మా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని మేము ఆ బిల్డింగ్‌లోకి వెళ్లాం. ఆరుగంటల మా పోరాటం తర్వాత తెల్లవారేసరికి మేము మంటలను అదుపులోకి తీసుకువచ్చాం. అప్పుడు మాకు ఎంతో సంతోషమేసింది అని తన అనుభవాలు పంచుకున్నారు. ఆమె శిక్షణ పూర్తి అయ్యాక 2006 గుజరాత్ లోని మేహసనా ఫైర్ స్టేషన్‌లో జాయిన్ అయ్యింది. ఆయిల్, నేషనల్ గ్యాస్ ఉత్పత్తి చేసే సంస్థ అది. దేశంలో రెండవది కావడం విశేషం. అక్కడ ఉన్న 50 ఆయిల్ సంస్థలున్నాయి. వాటిని చూసుకోవడానికి మూడు అగ్నిమాపక సంస్థలున్నాయి. ఆమె ఆ సంస్థలకి ఎప్పుడూ ఇన్‌ఛార్జ్‌గా పనిచేసేది. ఆమె పుట్టిన గ్రామంలో కూడా ఒక చిన్న అగ్నిమాపక సంస్థ కూడా లేని పరిస్థితి. అందుకని ఓఎన్‌జీసి ఆ గ్రామంలో ఎటువంటి ప్రమాదం జరిగినా భద్రత కల్పించేలా చర్యలు తీసుకుంది.

2010సంవత్సరంలో ముంబయి డ్రిల్లింగ్ సర్వీసులకి బదిలీ అయ్యింది. నన్ను నమ్మి నాకు ఈ బాధ్యతలు అప్పగించిన మేనేజ్‌మెంట్‌వారికి ఎన్నో కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఒక మహిళ ఇటువంటి డ్రిల్లింగ్ సర్వీసులను చేయగలదని నమ్మినందుకు చాలా సంతోషం. నేను ఉద్యోగంలో చేరేవరకూ ఎవరూ కూడా ఇటువైపు దృష్టి పెట్టలేదు. ఎప్పుడైతే నేను విజయం సాధించానో మిగతా వాళ్లు కూడా ఆసక్తి చూపడం మొదలుపెట్టారు. 2013లో చాలా మంది మహిళలు ఈ సర్వీసులలోకి వచ్చారని ఆమె అంటున్నారు.

ఆమె పనితీరును, ఆత్మవిశ్వాసాన్ని పరిశీలించిన వారెవరైనా ఆమెను మెచ్చుకోవాల్సిందే. ''మొదటి మహిళా ఫైర్ ఫైటర్ నేను కావడం చాలా గర్వంగా ఉంది. ఈ రంగమంటే నాకు మక్కువ కాబట్టి బాధ్యతలు కూడా పెరిగాయి' అని ఆమె చెప్పారు. ఆమెకు మోటార్ బైక్ నడిపే నైపుణ్యం కూడా ఉంది. దానితోనే ఆమె ఈ మధ్యనే కార్గిల్‌లోని ప్రపంచంలోనే ఎత్తయిన మోటారబుల్ రోడ్ లెహ్ లఢక్ ఖర్దూంగ్ లా పాస్ ఎక్కగలిగింది. అక్కడ జరిగిన ఇంటర్వ్యూలో యువతులు కలలు కనడం మానివేయకూడదు. ఏ రంగమైన లింగ వివక్ష లేకుండా మహిళలు పనిచేయగలుగుతున్నారు. కాబట్టి ఎటువంటి వివక్ష చూపించకూడదు. బైక్‌నే తీసుకోండి. దాని గురించి తెలియనిదే మహిళ అయినా, పురుషుడు అయినా నడపలేడు. అందుకని మగవాళ్లే ఈ పనిచేయగలరు, ఆడవాళ్లే ఈ వృత్తి చేయగలరని అనుకోవడం అపోహ. మీరు ఏదైనా విషయాన్ని ప్రేమిస్తే దానిపై మక్కువ పెంచుకుంటే అది మీరు చేయగలరు. అందుకని కలలు గనండి. వాటిని ఆత్మస్థైర్యంతో సాకారం చేసుకోండని నేటి యువతకు ఎంతో ఆత్మవిశ్వాసంతో పిలుపునిస్తున్నారామె.

స్ఫూర్తి



చేతులులేవని కుంగిపోలేదు...!

బొంబాయిలో జరిగిన బాంబు పేలుడు సంఘటనలో మాళవికా అయ్యర్ తన రెండు చేతులను కోల్పోయింది. ప్రమాదం జరిగేనాటికి ఆమె వయస్సు 13 సంవత్సరాలు. ఆమె ఇప్పటి వయస్సు 28సంవత్సరాలు. చేతులు పోయాయని ఆమె మనోధైర్యం పోగొట్టుకోలేదు. ఎప్పుడూ ఏదో ఒకటి చేయాలనే తపన ఆమెలో నిరంతరం కనబడుతూ ఉంటుంది. ఆవిధంగా కొత్తవాటిని చేయడంలో ప్రయత్నించి విఫలమైతే ఆమె సిగ్గుగా ఫీలయ్యేది కాదు. తిరిగి ప్రయత్నం చేసి విజయం సాధించేది. రెండు చేతులు లేకపోయినా తన చేతులతో చేసుకున్న వంట రుచి చూడాలన్న కోరికతో ఆమె కొత్తగా వంట చేయడం ప్రారంభించి తను అనుకున్న డిష్‌ను సొంతంగా చేసుకుంది.

2002 సంవత్సరం మే 26వ తేదీన మాళవిక తన సమ్మర్ హాలీడేస్ బికనీర్‌లో గడుపుతుంది. ఆమె అలా ఆడుకుంటున్న సమయంలో వాళ్ల గ్యారేజ్‌లో రహస్యంగా ఉన్న ఒక వస్తువు ఆమె కంటబడింది. అది పేలుడు మందు సామాగ్రి అని తెలియక ఆమె దానిని కాలనీలోకి తీసుకువచ్చి ఓపెన్ చేసి అందులో తనకు నచ్చిన గ్రెనేడ్‌ను తీసుకుని తన రూమ్‌కి వచ్చింది. కొంత సమయానికి బయట రోడ్డు మీద బాంబు విస్ఫోటనమై చుట్టుపక్కల ఇరుగు పొరుగువాళ్లు కూడా చాలా భయ భ్రాంతులకు గురయ్యారు. అలాగే ఆమె చేతిలో ఉన్న గ్రెనేడ్ కూడా దాని సమయానుసారంగా పేలిపోయింది. ఆ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది.

ఆ ప్రమాదం తర్వాత ఆమెకు 18నెలలు చాలా రకాల సర్జరీలు చేసి బతికించారు వైద్యులు. కాని చేతులను తీసివేయాల్సి వచ్చింది. అలాంటి పరిస్థితిలో కూడా ఆమె ధైర్యంగా క్రచెస్ సహాయంతో నడిచేది. చేతులకు బలమైన గాయాల వడం వల్ల రెండు చేతులకు కృత్రి మ చేతులు అమర్చారు వైద్యులు. ఏదైనా సరే కర్మ ప్రకారం జరిగిపో యింది. ఇక చేసేదేమీ లేదని తనను తాను సంభాలించుకుని జీవితాన్ని చూడడం మొదలు పెట్టింది. ప్రమా దం జరిగేనాటికి ఆమె పదవతరగతి పరీక్షలకు మూడు నెలల సమయం ఉంది. కాని తనకు జరిగిన ప్రమాదంతో ఆమె వెను కగా ఉండిపో కూడదని పంతంతో మూడు నెలల తర్వాత పరీక్షలు రాసింది. ఆ మూడు నెలలూ ఆమె మంచం మీదే ఉండవల్సి వచ్చింది. అటు వంటి పరిస్థితుల్లో కూడా ఆమె బాగా చదివి తన పరీక్షల్లో స్టేట్ ర్యాంక్ సాధించింది. ఆ పరిస్థితుల్లో కూడా పట్టుదలతో చదివి ర్యాంకు సాధించినందుకు అందరూ ఆమెను ప్రశంసించారు. ఆమె వివిధ రంగాల్లో అవార్డులను గెలుచుకున్నారు. వికలాంగ హక్కులు ఉద్యమ కారిణి, యుఎన్ స్పీకర్‌గా కూడా పనిచేస్తున్నారు. అంతేకాదు ఆమె ప్రయత్నాలకు, విజయాలకు అంతు అనేది లేదని చెప్పవచ్చు. ఆమె మంచి విద్యార్థి, సామాజిక కార్యకర్త, ఆమె జీవితంలో తీరని కోరిక ఏమిటంటే వంట చేయడం అది కూడా ప్రయత్నించి విజయం సాధించారు. ఆ సంతోషంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ...

''బాంబు ప్రమాదంలో చేతులు కోల్పోయినప్పుడు ఇక జీవితంలో వంట చేసుకుని తినడం సాధ్యం కాదేమోనని అనుకున్నాను. కాని నా కోరిక ఈరోజు తీర్చుకున్నాను అని ఎంతో గర్వంగా చెప్పింది. ఆమె తన అభిమాన చెఫ్ అయిన వికాస్ ఖన్నా నుండి రెసిపీని తెలుసుకుని తయారుచేసింది. ఆ ప్రయత్నం సఫలమై ఎంతో బాగా వచ్చింది. ''మనం తలచుకుంటే అరగంటలో ఎంత మంచి డిష్‌ను తయారు చేయవచ్చునో'' అని ఆమె ఎంతో ఉత్సాహంతో చెప్పారు. చేతులు లేకపోయినా చిరునవ్వుతో జీవితాన్ని కొనసాగిస్తున్న మాళవిక అయ్యర్ అందరికీ ఆదర్శనీయురాలు.

హెయిర్ కేర్

ఆయిల్ మసాజ్‌తో మృదువైన కేశాలు



మీ జుట్టు ఆరోగ్యంగా ఉండటానికి వెంట్రుకలకు నూనెను తగినంత అందించటం ఒక మంచి మార్గం. ఇది భారతదేశంలో పురాతన కాలం నుండి అనుసరిస్తున్న పద్ధతి. ఈ ఆధునిక కాలంలో కూడా వీటిని అనుసరించే వారి సంఖ్య ఇప్పటికి తగ్గలేదు. ఇంట్లో ఉండే ప్రతి స్త్రీ, కనీసం వారానికి ఒకసారైన జుట్టుకు నూనెను మర్దనా చేస్తుంటారు. స్కాల్ప్‌పై కలిగే ఒత్తిడి, హానికర బ్యాక్టీరియా ఫంగస్‌ల వలన కలిగే ఇన్ఫెక్షన్‌లను తొలగించి, జుట్టుకు బలాన్ని చేకూరుస్తుంది.

జుట్టు రకాన్ని బట్టి నూనెలను అప్లయి చేయాలి. జుట్టు పెరుగుదలకు కావలసిన పోషకాలను తలపై చర్మం సహజంగా ఉత్పత్తి చేస్తుంది. కావున, తలపై చర్మానికి అందించే నూనెలు, పరిమాణం చాలా ముఖ్యం. అధిక మొత్తంలో నూనెలను అందించటం వలన తలపై చర్మంలో ఉన్న రంధ్రాలు మూసుకుపోయి, వెంట్రుకలకు, స్కాల్ప్‌కి తీరని నష్టాన్ని కలుగచేస్తాయి. తలపై చర్మం పొడిగా ఉన్నవారి కన్నా, నూనెలను జిడ్డుగా ఉండే వారికి తక్కువ స్థాయిలో నూనెలు అందించాలి. మితిమీరిన స్థాయిలో లేదా తక్కువ స్థాయిలో నూనెలను అందించటం ఈ జుట్టుకు తలపై చర్మానికి హానికరం. వీటితో పాటుగా మీజుట్టు తలపై చర్మరకాన్ని బట్టి నూనెల ఎంపిక చాలా ముఖ్యం. జుట్టు రాలడం నివారించి జుట్టు పెరగడాన్ని ప్రోత్సహించే పది సింపుల్ టిప్స్‌పనిచేసేవారు, ఉద్యోగస్తులైతే రాత్రుల్లో జుట్టుకు నూనె అప్లయి చేసి ఉదయం తల స్నానం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. కొద్దిగా జిడ్డుగా అనిపించినా జుట్టుకు మంచి పోషణ అందుతుంది. కాబట్టి, మీ జుట్టును ఆరోగ్యంగా కాపాడుకోవడానికి కొన్ని డిఫరెంట్ ఆయిల్స్ ఈ క్రింది విధంగా ఉన్నాయి.

పామ్ ఆయిల్

జుట్టు సమస్యలు ప్రాథమిక దశలో ఉన్నప్పుడు పామాయిల్‌ను ఎంపిక చేసుకోండి. పామ్ ఆయిల్లో కెరోటినాయిడ్స్, విటమిన్ ఎ ఎక్కువగా ఉండటం వల్ల, ఇది హెయిర్ పోలిసెల్స్‌కు పోషణను అందిస్తుంది. ఇది కొత్త జుట్టు పెరగడానికి సహాయపడుతుంది. పాత జుట్టు మరింత బలంగా మారుతుంది. పామ్ ఆయిల్‌ను షాంపూతో చేర్చి తలకు అప్లయి చేయాలి. అరగంట తర్వాత తల స్నానం చేసి చూడండి. వ్యత్యాసం మీకే తెలుస్తుంది. ఇలా వారానికొకసారి చేస్తే చాలు.

ఆలివ్

ఆలివ్ ఆయిల్‌లో విటమిన్ ఈ ఎక్కువగా ఉండటం వల్ల స్కాల్ప్‌కి పోషణ అందిస్తుంది. అలాగే జుట్టుని బలంగా, హెల్తీగా మారుస్తుంది. అలాగే...వేగంగా పెరగడానికి సహాయపడుతుంది. కాబట్టి.... వారానికి కనీసం ఒకసారి...ఆలివ్ ఆయిల్ మసాజ్ చేస్తే...హెల్తీ హెయిర్ పొందుతారు. అలాగే డ్రై అండ్ డ్యామేజ్ అయిన జుట్టును రిపేర్ చేస్తుంది. తగిన మాయిశ్చరైజర్‌ను అందిస్తుంది. జుట్టు పెరుగుదలను ప్రోత్సాహిస్తుంది. జుట్టుకు కావల్సిన మాయిశ్చరైజర్‌ను అందిస్తుంది. అలాగే ఈ నూనెతో హెయిర్ ప్యాక్ వేసుకోవచ్చు. ఎగ్ వైట్‌లో ఆలివ్ ఆయిల్, తేనె కలిపి తలకు ప్యాక్ వేసుకోవాలి. అరగంట తర్వాత తలస్నానం చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

ఆముదం

ఆముదం కూడా జుట్టు పెరుగుదలకు బాగా సహాయపడుతుంది. మీ కేశాలకు ఆముదం నూనెతో మసాజ్ చేయాలి. ఆముదంతో తలకు మసాజ్ చేయడం వల్ల జుట్టు రాలడాన్ని అరికడుతుంది. జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు సంరక్షణలో ఇది బెస్ట్ ఆయిల్‌గా భావించవచ్చు. ఇది జుట్టు నాణ్యతను పెంచుతుంది. ఆముదంతో జుట్టుకు మర్దన చేయటం వల్ల జుట్టు రాలటం ఆగి, నల్లని, ఒత్తయిన జుట్టు సొంతమవుతుంది. ఆముదానికి ఆవనూనె కలిపి రాసు కుంటే చిట్లిన జుట్టు ఆరోగ్యంగా మారుతుంది.



బాదం నూనె

దీనిలో విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల హెయిర్ గ్రోత్‌కు బాగా సహాయపడుతుంది. ఇది కూడా కొబ్బరి, ఆమ్లానూనెలు మాదిరే ఉంటుంది. అతి త్వరగా జుట్టు పెరగాలనుకొనే వారు బాదం నూనెను ప్రతిరోజూ తలకు పట్టించాలి. జుట్టు వత్తుగా పెరగడానికి ఇది చక్కగా పనికొస్తుంది. వారానికి రెండుసార్లు నూనెను పట్టించుకుంటే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. ఎండకు, చలికి వెళ్లినప్పుడు ఉప్పునీటితో స్నానం చేసినప్పుడు..జుట్టు చిట్లిపోకుండా ఆల్మండ్ నూనె కాపాడుతుంది. ఇది కూడా కొబ్బరి, ఆమ్లా నూనెలు మాదిరే ఉంటుంది. అతి త్వరగా జుట్టు పెరగాలనుకొనేవారు బాదం నూనెను ప్రతిరోజూ తలకు పట్టించాలి.

కొబ్బరి నూనె

అందమైన జుట్టు పొందడానికి కొబ్బరినూనె చక్కటి ఆప్షన్. డ్యామేజ్ హెయిర్‌ని, డ్రై హెయిర్‌ని నివారించడానికి కొబ్బరి నూనెతో స్కాల్ప్‌ని, జుట్టుని మసాజ్ చేసి, రాత్రంతా అలానే వదిలేసి ఉదయాన్నే శుభ్రం చేసుకోవాలి. కొబ్బరినూనెలో ఉండే విటమిన్ కె, ఇతర ఫ్యాటీ యాసిడ్స్ తలకు అవసరమయ్యే న్యూట్రీషియన్స్‌ను అందిస్తుంది. గోరువెచ్చని కొబ్బరి నూనెను తలకు మసాజ్ చేయడం వల్ల జుట్టు సాఫ్ట్‌గా, స్ట్రాంగ్‌గా మారుతుంది. కొబ్బరినూనెలో ఉండే లూరిక్ యాసిడ్ హెల్తీ అండ్ హైడ్రేటెడ్ హెయిర్‌ను అందిస్తుంది.

ఆవనూనె

మందపాటి జుట్టు...నల్లటి జుట్టు పొందాలంటే మస్టర్డ్‌ఆయిల్‌ను ఉపయోగించవచ్చు. మస్టర్డ్‌ఆయిల్ తలలో బ్లడ్ సర్క్యులేషన్ పెంచి జుట్టు పెరగడానికి సహాయపడుతుంది. ఈ వెజిటేబుల్ ఆయిల్ ఆవాల నుండి తయారుచేస్తారు. జుట్టు రంగును నల్లగా మార్చుతుంది. తెల్లజుట్టును నివారిస్తుంది. ఆవనూనెను తలకు నేరుగా పట్టుకోవడం వల్ల అదనపు ప్రయోజనాలు పొందుతారు.

సన్‌ఫ్లవర్ ఆయిల్

దీనిని వంటలకు కూడా ఉపయోగిస్తాం. కానీ డ్యామేజ్ అయిన జుట్టుకు కూడా దీన్ని ఉపయోగిస్తాము. సన్‌ఫ్లవర్ ఆయిల్ చాలా జిడ్డుగా ఉంటుంది. కాబట్టి, మితంగా మాత్రమే ఉపయోగించాలి. సన్‌ఫ్లవర్ ఆయిల్ ఎమోలియంట్‌గా పనిచేస్తుంది. ఇది మీ జుట్టుకు కండీషనర్‌గా పనిచేస్తుంది. సన్‌ఫ్లవర్ ఆయిల్ జుట్టు పెరుగుదలను పెంచుతుంది. జుట్టు చిట్లటాన్ని నివారిస్తుంది. జుట్టు సంరక్షణలో కుకింగ్ ఆయిల్స్‌లో కొబ్బరినూనె తర్వాత అత్యంత ఎఫెక్టివ్‌గా పనిచేసే కుక్కింగ్ ఆయిల్ సన్ ఫ్లవర్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌కు కొబ్బరినూనె, ఆలివ్ ఆయిల్ మిక్స్ చేసి తలకు రాసి మసాజ్ చేయాలి.

గ్రేప్ సీడ్ ఆయిల్

దీనిని జుట్టుకు మసాజ్ చేయడం వల్ల ఇది జుట్టు రాలే సమస్యలను తగ్గిస్తుంది. హెయిర్ ఫాలీసెల్స్‌ను స్ట్రాంగ్‌గా మార్చుతుంది. జుట్టు పెరుగుదలను ప్రోత్సాహిస్తుంది. జుట్టుకు మంచి వాల్యూమ్‌ను షైనింగ్‌ను అందిస్తుంది.

ఒక టేబుల్ స్పూన్ గ్రేప్ సీడ్ ఆయిల్‌ను గోరువెచ్చగా కాచి తలకు అప్లయి చేసి మసాజ్ చేయాలి. తలకు అప్లయి చేసిన ఒక గంట తర్వాత రెగ్యులర్ షాంపూ, కండీషనర్‌తో తలస్నానం చేయాలి.

విజయదశమికి స్పైడర్


మహేష్‌బాబు

సూపర్‌స్టార్ మహేష్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం స్పైడర్. ఎ.ఆర్. మురుగదాస్ దర్శకుడు. ఎన్.వి.ఆర్. సినిమా, ఎల్.ఎల్.పి, రిలయన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి సంబంధించి ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. బుధవారం మహేష్ పుట్టినరోజు. ఈ సందర్భంగా స్పైడర్ కొత్త టీజర్ విడుదల చేస్తున్నారు.

నిర్మాత ఎన్.వి.ప్రసాద్ మాట్లాడుతూ మహేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఉదయం 9 గంటలకు టీజర్ విడుదల చేస్తున్నాం. ఈ స్పైడర్ పాట మినహా షూటింగ్ పూర్తిచేసుకుంది. ఈ పాటను ఆగస్టు 23 నుండి చిత్రీకరిస్తాం. దీంతో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ఇప్పటికే డబ్బింగ్, రీరికార్డింగ్ జరుగుతోంది. మిగతా కార్యక్రమాలు పూర్తిచేసి దసరా కానుకగా సెప్టెంబర్ 27న తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేస్తాం అని చెప్పారు.

మహేష్‌బాబు, రకుల్ ప్రీత్‌సింగ్, ఎస్.జె.సూర్య తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం హేరిస్ జైరాజ్, ఛాయాగ్రహణం సంతోష్ శివన్, ఫైట్స్ పీటర్ హెయిన్స్, సమర్పణ ఠాగూర్ మధు.

లక్నోలో మహేష్ చిత్రం షూటింగ్

మహేష్‌బాబు, కొరటాల శివ కాంబినేషన్‌లో డి.వి.వి. ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎల్‌ఎల్‌పి పతాకంపై డివివి.దానయ్య ఓ భారీ చిత్రం నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం తాజా షెడ్యూల్ ఆగస్టు 11 నుండి 22 వరకు లక్నోలో జరుగుతుంది. మహేష్, కైరా అద్వాని, ప్రకాష్‌రాజ్‌తో పాటుగా ఇతరులు పాల్గొనే కీలక సన్నివేశాలతో పాటు పీటర్ హెయిన్స్ సారథ్యంలో యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరిస్తారు. ఈ చిత్రాన్ని జనవరి 11న సంక్రాంతికి విడుదల చేస్తారు. ఈ చిత్రానికి సంగీతం దేవిశ్రీప్రసాద్, ఛాయాగ్రహణం రవి కె.చంద్రన్.

ఒకే రోజు మూడు సినిమాల ఢీ!

సంక్రాంతి, విజయదశమి సందర్భాల్లో ఎక్కువ సినిమాలు రిలీజ్ అవడం తెలిసిందే. పండగ సీజన్ ఎంజాయ్ చేయడానికి కొత్త సినిమాలు ప్రేక్షకుల ముందుకువస్తుంటాయి. అయితే ఇప్పుడు ఎలాంటి పండగ హడావుడి లేదు. సెలవుల సీజన్ కాదు. అయినప్పటికీ ఒకే రోజు మూడు భారీ చిత్రాలు విడుదలవుతున్నాయి. ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో ఇది ఆసక్తి కలిగిస్తున్న పరిణామం. శుక్రవారం (11వ తేదీ) నాడు జయ జానకి నాయక (బెల్లంకొండ శ్రీనివాస్), లై (నితిన్), నేనే రాజు - నేనే మంత్రి (రానా) చిత్రాలు రిలీజ్ అవుతున్నాయి.


నేనే రాజు - నేనే మంత్రి


జయ జానకి నాయక

నిర్మాతల మధ్య మౌళికంగా ఉన్న ఒప్పందం ప్రకారం పెద్ద సినిమాల రిలీజ్ మధ్య కనీసం మూడు నుండి నాలుగు వారాల వ్యవధి ఉండాలి. ఈ ఏడాది జనవరిలో చిరంజీవి, బాలకృష్ణ చిత్రాల మధ్య పోటీ వాతావరణం నెలకొంది. అయితే పోటీ తగదని భావించిన చిరంజీవి తన సినిమా ఖైదీ నెంబర్ 150 చిత్రాన్ని ఒక రోజు ముందు రిలీజ్ చేసేలా మార్చుకున్నారు.

శుక్రవారం రిలీజ్ అవుతున్న మూడు సినిమాల కథానాయకులకు సినీ నేపథ్యం ఉంది. వీరు ముగ్గురు బడా నిర్మాతల తనయులు కావడం విశేషం. బెల్లంకొండ శ్రీనివాస్ తండ్రి బెల్లంకొండ సురేష్, నితిన్ తండ్రి ఎన్. సుధాకరరెడ్డి, రానా తండ్రి డి.సురేష్‌బాబు. ఈ ముగ్గురు డాడీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తూ సినిమాల రిలీజ్ ప్లాన్ చేశారు. ఆయా చిత్రాలకు ప్రత్యక్షంగా వీరు నిర్మాతలు కాదు. అయినప్పటికీ తెరవెనుక ఉండి చక్రం తిప్పుతున్నారనే మాట వినిపిస్తోంది.

సినిమాల మధ్య పోటీ తగదని డి.సురేష్‌బాబు అంటున్నారు. దీనివల్ల కలెక్షన్లపై తీవ్రప్రభావం చూపుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆలోచించాల్సిందిగా బెల్లంకొండ సురేష్, ఎన్.సుధాకరరెడ్డిలకు ఆయన విజ్ఞప్తి చేశారు. నేనే రాజు - నేనే మంత్రి రిలీజ్ ఆయనే వాయిదా వేసుకోవచ్చుకదా? అంటే తెలుగు, తమిళ భాషల్లో కమిట్‌కావడం వల్ల తప్పని పరిస్థితిలో రిలీజ్ చేయాల్సి ఉందని యూనిట్ వర్గాలు అంటున్నాయి.

బోయపాటి శ్రీనుకు సెంటిమెంట్ ఎక్కువ. ఆ ప్రకారం ఆయన చాలా కాలం క్రితమే జయ జానకి నాయక రిలీజ్ డేట్ ప్రకటించి ఉన్నారు. కాబట్టి వెనక్కి వెళ్ళే ప్రసక్తి లేదని అంటున్నారు. ఈ విషయంపై బెల్లంకొండ సురేష్ సైతం పట్టుదలతో ఉన్నారు. ఆరు నెలలుగా పక్కా ప్లానింగ్‌తో, తగిన ప్రచారం చేస్తూ వస్తున్న సినిమాను వాయిదా వేసుకోవడం కుదరదని అంటున్నారు.

ఇక నితిన్ నటిస్తున్న లై సినిమా కూడా రిలీజ్ తేదీ ముందుగా ప్లాన్ చేసిందే. పైగా నితిన్ తండ్రి ఎన్.సుధాకరరెడ్డి నైజాంలో ప్రముఖ పంపిణీదారుడు. ముందుగానే థియేటర్లతో అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. కాబట్టి రిలీజ్ తేదీ విషయంలో వెనక్కి తగ్గడం లేదు. ఇలా మూడు సినిమాలకు కారణాలున్నాయి కాబట్టి ఇవన్నీ ఒకే రోజున ప్రేక్షకుల ముందుకువస్తున్నాయి.

గడచిన మూడు రోజులుగా మూడు సినిమాల రిలీజ్ విషయంలో ఉన్న పోటీని నివారించడానికి ఆయా చిత్ర నిర్మాతలతో పంపిణీదారులు చర్చలు జరిపినట్టు తెలిసింది. కనీసం ఒక సినిమాను గురువారం రిలీజ్ చేసేలా ఒప్పించే ప్రయత్నాలు జరిగినా ఫలించలేదు. లాటరీ పద్ధతిన రిలీజ్ తేదీలు నిర్ణయించే ఆలోచన వచ్చినా నిర్మాతలు అంగీకరించలేదట. శ్రావణ శుక్రవారం సెంటిమెంట్‌తో అదే రోజు రిలీజ్ చేసేందుకు నిర్మాతలు పట్టుదలతో ఉన్నారు.

మూడు పెద్ద సినిమాలకు థియేటర్ల సమస్య ఉంది. ఇప్పటికే మార్కెట్లో ఫిదా సక్సెస్ బాటలో ఉంది. కొత్త సినిమాల కోసం ఫిదాను తప్పిస్తారా? అనేది అనుమానమే. మాస్ చిత్రం గోపీచంద్ నటించిన గౌతమ్‌నందకు టాక్‌తో సంబంధం లేకుండా కలెక్షన్లు వస్తున్నాయి. ఇవి కాకుండా కొత్త సినిమాల కోసం థియేటర్లు కావాలి. పోటీ దృష్ట్యా ఎక్కువ థియేటర్లలో రిలీజ్ చేయడం సాధ్యం కాకపోవచ్చు. దీనివల్ల ఓపనింగ్స్ మిస్సయ్యే ప్రమాదం ఉంది. మరోవైపు పోటీని నివారించడానికి నిర్మాతల మండలి తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది.



లై



హీరో తర్వాత నా పాత్ర హైలైట్ కావాలి

- జగపతిబాబు

విలన్ పాత్రలలో పేరొచ్చినప్పటికీ కేవలం విలన్ పాత్రలే కాకుండా నటనకు అవకాశం ఉన్న అన్నిరకాల పాత్రలను చేయాలనుకుంటున్నాను అని ప్రముఖ నటుడు జగపతిబాబు చెప్పుకొచ్చారు. లెజెండ్ చిత్రం ఆయన మరో ఇన్నింగ్స్ మొదలైన సంగతి తెలిసిందే. కాగా విడుదలకు సిద్ధమైన జయజానకినాయకలో ఓ ముఖ్యపాత్రను పోషించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో జగపతిబాబు కొద్దిసేపు పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ వివరాలేమిటో ఆయన మాటల్లో...



పరువు అంటే ప్రాణం

జయ జానకి నాయక చిత్రంలో పరువు అంటే ప్రాణంగా భావించే పాత్రను పోషించాను. దర్శకుడు బోయపాటి శ్రీను నా పాత్రను ఎంతోబాగా డిజైన్ చేశారు. ప్రతీ సినిమాను ఛాలెంజింగ్‌గా తీసుకునే ఆయనకు ఈ చిత్రంలోని నా పాత్ర కూడా ఛాలెంజ్. ఎందుకంటే లెజెండ్‌లో నన్ను కొత్తకోణంలో చూపించిన ఆయన దర్శకత్వంలో మళ్లీ నేను నటించడంతో ఏ విధంగా చూపిస్తే బావుంటుందన్న ఛాలెంజ్ సహజంగానే ఏర్పడుతుంది.ఆయనెంతో స్పష్టతతో ఉంటారు.

పాత్రలో దమ్ము ముఖ్యం

నేను స్టార్ హీరోల చిత్రాలలో నటిస్తున్నానా? లేక వర్ధమాన హీరోల చిత్రాలలో నటిస్తున్నానా? అని చూడను. మంచికథ, మంచి పాత్ర అయితే నటించడానికి నేనెప్పుడూ సిద్ధమే. ప్రత్యేకించి విలన్ పాత్రలే చేయాలని నేనేమీ నియమం పెట్టుకోలేదు. ఎలాంటి పాత్రయినా దానికి నేను చేయదగ్గ అవసరం ఉంటే చాలు. ముఖ్యంగా చేసే పాత్రకు తగ్గట్టుగా దమ్ముండాలి. నేను నటించే సినిమాలో హీరో పాత్ర తర్వాత నాకే పేరు రావాలని ఆశిస్తాను.

హీరోగా ఫేడవుట్

హీరోగా నేను ఫేడవుట్ అయ్యాను. ఈ మాట చెప్పేందుకు నేను ఎంతమాత్రం ఆలోచించడం లేదు. ఇటీవల వచ్చిన పటేల్ సర్ చిత్రాన్ని కూడా తొలుత ఒప్పుకోకుండా తటపటాయించాను. అయినా కథపై ఉన్న నమ్మకంతో ఆ సినిమాను చేశాం. కొన్ని పొరపాట్లు వల్ల ఆ చిత్రం సరిగా ఆడలేదు. టీజర్‌ను ప్రేక్షకులు ఓ రకంగా ఊహించుకోవడం కూడా అంచనాలను తారుమారు చేసింది. హీరోగా నాతో సినిమా చేస్తామని కొందరు నిర్మాతలు ముందుకొస్తున్నా నేనే అంత సులువుగా అంగీకరించడం లేదు. పాత్ర ఎంతో నచ్చితే కానీ ఆ జోలికి వెళ్లడం లేదు. అయినా నా కెరీర్‌లో లెజెండ్‌కు ముందు, ఆ తర్వాత ఇప్పటివరకు ఎన్నో ఇన్నింగ్స్ జరిగిపోయాయి. మంచి పాత్రలు చేయాలన్న ఒకేఒక లక్ష్యంతో ముందుకు సాగుతున్నాను.

బ్యాడ్ ప్రొడ్యూసర్‌ను...బ్యాడ్ బిజినెస్‌మేన్‌ను

నేను నిర్మాణం జోలికి పోదలచుకోలేదు. ఎందుకంటే లోగడ నేను నిర్మించిన చిత్రాలు నిరాశపరిచాయి. అలాగే బిజినెస్ రంగం కూడా నాకు కరెక్ట్ కాదు. అందుకే నేను బ్యాడ్ ప్రొడ్యూసర్‌ను, బ్యాడ్ బిజినెస్‌మేన్‌ను.

బాలీవుడ్ సినిమా చర్చలు

తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళం వంటి దక్షిణాది నాలుగు భాషల చిత్రాలలో ఇంతవరకు నటించాను. బాలీవుడ్ సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి.

ట్రైలర్ చూసి అభినందించారు: తేజ

నేనే రాజు నేనే మంత్రి పొలిటికల్ థ్రిల్లర్ చిత్రం కాదు. కథలోని నేపథ్యం కోసం కేవలం పదిశాతం రాజకీయాంశాలను మాత్రమే ఇందులో చూపించాం. జోగేంద్ర అనే వ్యక్తి జీవితంలో చోటుచేసుకున్న ఆసక్తికర పరిణామాలతో ఈ చిత్రం సాగుతుంది అని దర్శకుడు తేజ చెప్పుకొచ్చారు. గతంలో కొన్ని ట్రెండ్ సెట్టర్ చిత్రాలను అందించిన ఆయన ఈ చిత్రంపై ఎంతో నమ్మకంతో ఉన్నారు. రానా, కాజల్ అగర్వాల్ నాయకానాయికలుగా సురేష్ ప్రొడక్షన్స్, బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై తెరకెక్కుతున్న ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో దర్శకుడు తేజ కొద్దిసేపు పాత్రికేయులతో ముచ్చటించారు.



జోగేంద్ర ఐదేళ్ల ప్రయాణంలో...

అహం చిత్రం కోసం తయారుచేసిన కథ తగినంత బలంగా లేదన్న ఉద్దేశ్యంతో ఆ ప్రాజెక్ట్‌ను వద్దనుకున్నాం. ఆ తర్వాత ఆ కథకు ఎన్నో మార్పులు, చేర్పులు చేయడంతో పాటు రానాకు తగ్గట్టుగా రూపకల్పన చేశాం. ఇందులో జోగేంద్ర పాత్రలో రానా, రాధ పాత్రలో కాజల్ అగర్వాల్ భార్యాభర్తలుగా కనిపిస్తారు. ట్రైలర్‌ను చూసి ఇదేదో పొలిటికల్ థ్రిల్లర్ అని కొందరు అపోహ చెందుతున్నారు. కానీ నేపథ్యం కోసమే పొలిటికల్ అంశాన్ని ఉపయోగించాం. జోగేంద్ర అనే వ్యక్తి ఐదేళ్ల జీవితకాలంలో ఏం జరిగింది? అన్న అంశాన్ని ఇందులో ఆవిష్కరించాం. అతను మంచి పనులు ఏం చేశాడు? అలాగే చెడ్డ పనులు ఏం చేశాడు? దేశానికి ఎలా ఉపయోగపడ్డాడు, ఎలా నష్టపరిచాడు అన్న అంశాలను ఆ పాత్రలో చూపించాం. ఈ పాత్రలో రానా అద్భుతమైన నటనను కనబరిచారు. తర్వాత రోజు చేయబోయే సన్నివేశాలను ముందురోజు సాయంత్రమే రానా మననం చేసుకుంటారు. నా ఇన్నేళ్ల సినీ జీవితంలో ఎంతోమంది ఆర్టిస్టులను చూశాను. ఎక్కువశాతం మంది లొకేషన్‌లో మాత్రమే చేయబోయే సన్నివేశాల గురించి ఆలోచిస్తుంటారు. కానీ రానా మాత్రం ఎంతో ప్రిపరేషన్‌తో లొకేషన్‌కు రావడం ఎంతో ముచ్చటగొలిపింది. నటుడిగా రానాను మరోమెట్టు పైకి తీసుకెళ్లే చిత్రమవుతుందన్న నమ్మకం ఉంది.

అన్ని మసాలాలు ఉంటాయి

కమర్షియల్ ఫార్మెట్‌లోనే ఈ కథను తయారుచేయడం జరిగింది. అన్ని మసాలాలు ఉంటాయి. అయితే నిజజీవితంలో చోటుచేసుకునే సంఘటనలనే ఇందులో చూపించాం. పాత్రలను చూసినపుడు ఆర్టిస్టులు కాకుండా ఆ పాత్రలే కనిపించాలనే ఉద్దేశ్యంతోనే నేను సినిమాలను రూపొందిస్తుంటాను. అలానే ఈ చిత్రంలో ఆర్టిస్టులు కాకుండా పాత్రలే కనిపిస్తాయి. చిత్రంలోఎలాంటి ట్విస్ట్‌లు లేకుండా పాత్రల మధ్య కొనసాగే మైండ్‌గేమ్ ప్రేక్షకులను ఆకట్టునేలా చేస్తుంది.

రామానాయుడుగారు ఉంటే బావుండేది

నిర్మాత రామానాయుడుగారు ఉంటే బావుండేదని అనుకుంటున్నాను. రానాను ఇలాంటి చిత్రంలో చూడటం కూడా ఆయనకెంతో సంతోషాన్ని కలిగించేదని అనుకుంటున్నాను. వాస్తవానికి నేను సక్సెస్, ఫెయిల్యూర్లు అన్నింటినీ చవిచూశాను. సక్సెస్ వస్తే పొంగిపోవడం, ఫెయిల్యూర్ వస్తే కుంగిపోవడం నా తత్వం కానే కాదు. నేను ఫెయిల్యూర్‌లో ఉన్నప్పుడు ట్రైలర్‌లను చూసి ఎక్కడ కరచాలనం చేయాల్సి వస్తుందోనని జేబుల్లోనుంచి చేతులు తీయనివాళ్లు ఈ చిత్రం ట్రైలర్ చూసి కరచాలనం చేసి మరీ అభినందిస్తుంటే ఈ సినిమా బాగా ఆడుతుందన్న భావన కలిగింది.

24 గంటల్లో మిలియన్ వ్యూస్


హెబ్బా పటేల్

సోషియో ఫాంటసీ చిత్రం ఏంజెల్ ట్రైలర్ ఇటీవల విడుదలైంది. నాగ అన్వేష్, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి బాహుబలి పళని దర్శకుడు. ట్రైలర్‌కు 24 గంటల్లో మిలియన్ వ్యూస్ వచ్చాయని నిర్మాత చెప్పారు. దాదాపు 40 నిమిషాల గ్రాఫిక్స్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. సింధూరపువ్వ కృష్ణారెడ్డి ఈ సినిమాకు స్క్రీన్‌ప్లే మరియు నిర్మాణ పర్యవేక్షకులుగా బాధ్యత వహిస్తున్నారు. అతి త్వరలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాత భువన్ సాగర్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం భీమ్స్ సెసిరోలియో, ఛాయాగ్రహణం గుణ